


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 187

శనివారం 27-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

శనివారం 27-9-2025



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 22 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 187

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్
'సూపర్' విజయం
- వివరాలు 18లో▶



బీఎస్ఎన్ఎల్
'స్వదేశీ' 4జీ నెట్‌వర్క్
- వివరాలు 18లో▶

డీజీపీగా శివధర్‌రెడ్డి

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 30న పదవీ విరమణ చేయనున్న ప్రస్తుత డీజీపీ జితేందర్
- అక్టోబర్ 1న డీజీపీగా బాధ్యతలు స్వీకరించనున్న శివధర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: నూతన డీజీపీగా బత్తుల శివధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన శివధర్ రెడ్డి ప్రస్తుతం ఇంటెలిజెన్స్ డీజీగా కీలక బాధ్యతల్లో ఉన్నారు. ప్రస్తుత డీజీపీ డా.జితేందర్ ఈ నెల 30న పదవీ విరమణ పొందనున్నారు. ఆయన స్థానంలో
మిగతా 19వ పేజీలో ▶

బీసీలకు 42% కోటా

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో నం. 9 జారీ

వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం కల్పించేలా చారిత్రక నిర్ణయం

- రాజ్యాంగ నిబంధనల మేరకు రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు వెల్లడి
- బీసీల సమగ్ర అభివృద్ధి సాధనే లక్ష్యమన్న ప్రభుత్వం
- ఉత్తర్వులకు అనుగుణంగా చర్యలకు పీఆర్, మున్సిపల్ శాఖలకు ఆదేశం
- బీసీ రిజర్వేషన్ల నిర్ధారణ కోసం గత ఏడాది డెడికేటెడ్ బీసీ కమిషన్ ఏర్పాటు చేసిన సర్కారు
- అసెంబ్లీ, మండలిలో బీసీ వర్గాల బిల్లుకు ఆమోదం



సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్ శుక్రవారం జీఓ ఎంఎస్ నంబర్ 9 జారీ చేశారు. రాజ్యాంగ నిబంధనల మేరకు బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ రిజర్వేషన్ల ద్వారా బీసీల సమగ్ర అభివృద్ధి సాధించవచ్చనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ ఉత్తర్వులకు లోబడి రాష్ట్ర పంచాయతీరాజ్, పురపాలక శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

రాజ్యాంగం కల్పించిన అధికారాలతో..

ప్రజా ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడిన రాష్ట్ర ప్రభుత్వం ..భారత రాజ్యాంగం నిర్దేశించిన సమానత్వం, సామాజిక న్యాయాన్ని అందించాలనే సంకల్పంతో ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో
మిగతా 2వ పేజీలో ▶

నేడే 'స్థానిక' షెడ్యూల్!

మండల, జెడ్పీ, పంచాయతీల్లో రిజర్వేషన్లు ఇలా..
2లో

ట్రంప్ ఫార్మా షాక్

ఔషధ దిగుమతులపై 100 శాతం సుంకం మోత

- కిచెన్ క్యాబినెట్లు, బాత్రూమ్ వ్యానిటీలపై 50 శాతం, ఫర్నిచర్‌పై 30 శాతం సుంకం
- భారీ ట్రక్కుల దిగుమతిపైనా 25 శాతం వడ్డన
- అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వస్తాయని ట్రూత్ సోషల్‌లో ప్రకటన



- మన కంపెనీలపై ప్రభావం ఉండదంటున్న కంపెనీలు
- బ్రాండెడ్, పేటెంట్ ఔషధాలకే సుంకం వర్తిస్తుందని వెల్లడి
- అమెరికా ప్రజలకు వైద్యం, ఔషధాలు మరింత భారం: నిపుణులు
- ద్రవ్యోల్బణం ఎగబాకే అవకాశం: ఆర్థికవేత్తలు

వాషింగ్టన్: టారిఫ్‌ల మోతతో ప్రపంచ దేశాలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో బాంబు పేల్చారు. ఈసారి ఫార్మా రంగంపై సుంకాలతో విరుచుకుపడ్డారు. విదేశాల నుంచి దిగుమతయ్యే ఫార్మా (బ్రాండెడ్, పేటెంటెడ్) ఉత్పత్తులపై ఏకంగా 100% సుంకాన్ని విధిస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా, కిచెన్ క్యాబినెట్లు, బాత్రూమ్ వ్యానిటీలపై 50%, సోఫాలు ఇతరత్రా ఫర్నిచర్‌పై 30% చొప్పున, భారీ ట్రక్కులపై 25 శాతం దిగుమతి సుంకాలను వడ్డించారు. తాజా సుంకాలన్నీ అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వస్తాయని గురువారం తన సోషల్ మీడియా సైట్ 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. అయితే, జనరిక్ ఔషధాలకు సుంకాలు వర్తించవని, దీని వల్ల ఫార్మా టారిఫ్‌ల ప్రభావం భారత్‌పై పెద్దగా ఉండదని మన కంపెనీలు చెబుతున్నాయి. మరోపక్క, ధరలు పెరిగిపోవడంతో అమెరికా ప్రజలకు వైద్యం, ఔషధాలు మరింత భారమవుతాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా, కిచెన్ క్యాబినెట్లు, ఫర్నిచర్‌పై
మిగతా 19వ పేజీలో ▶

మన ఫార్మాపై ప్రభావం ఉండదు..

- టారిఫ్‌లు పేటెంట్, బ్రాండెడ్ ఉత్పత్తులకే పరిమితం: నిపుణులు

18లో

3 వారాల కనిష్టానికి సూచీలు

సెన్సెక్స్ 733 పాయింట్లు క్రాష్

ఏపీలో సోషల్ మీడియా యాక్టివిస్టు సొందరరెడ్డి అక్రమ అరెస్టుపై

సీబీఐ దర్యాప్తు

ప్రాథమిక విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశం
- వివరాలు 14లో▶

సింగరేణి ఉద్యోగులకు 29న లాభాల వాటా



సింగరేణి ఉద్యోగులకు ఇటీవల లాభాల్లో వాటాగా ప్రకటించిన నగదును యాజమాన్యం ఈ నెల 29న చెల్లించనుంది. సంస్థ లాభాల్లో 34% వాటా కింద రూ.819 కోట్లను కార్మికుల ఖాతాలో జమ చేయనున్నారు.
- వివరాలు 15లో▶


మూసీ ముంచేసింది..

శుక్రవారం రాత్రి ఒక్కసారిగా పొంగిన నది

నీట మునిగిన మహాత్మాగాంధీ బస్‌స్టేషన్

- పరీవాహక ప్రాంత కాలనీలన్నీ జలమయం
- ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించిన హైడ్రా, ఎస్‌డీఆర్‌ఎఫ్
- ఎంజీబీఎస్ నుంచి ప్రయాణికుల తరలింపు

15లో



మూసీ ఉధృతికి హైదరాబాద్ చాదర్‌ఘాట్ సమీపంలో నీట మునిగిన ఇళ్లు



ఎంజీబీఎస్ నుంచి ప్రయాణికులను తరలిస్తున్న దృశ్యం

తెలంగాణకు రెడ్ అలర్ట్

వచ్చే రెండురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు

- పొంగి ప్రవహిస్తున్న కృష్ణా, గోదావరి, మూసీ
- నీట మునిగిన వరి, పత్తి, మిర్చి పంటలు
- వర్షాల కారణంగా వివిధ ప్రాంతాల్లో ముగ్గురు మృతి

15లో

పర్యాటకం.. పెట్టుబడులు.. ఉపాధి..

- పర్యాటక దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు ప్రకటించనున్న సీఎం
- రూ.15 వేల కోట్ల పెట్టుబడులు, 50 వేల మందికి ఉపాధికి సంబంధించి నేడు ఒప్పందాలు
- హైదరాబాద్–సోమశిల–శ్రీశైలం మధ్య హెలికాప్టర్ టూరిజం.. నాగార్జునసాగర్ – శ్రీశైలం, శ్రీశైలం – భద్రాచలం సీప్లేన్ విహారం
- హెల్త్ టూరిజానికి ఊతం..

-2లో▶

కొత్త పర్యాటక విధానానికి శ్రీకారం చుట్టనున్న ప్రభుత్వం

ఇదండీ సంగతి



సీఎం నిర్ణయంతో రూ.15 వేల కోట్ల భారం

మెట్రో నుంచి ఎల్‌అండ్‌టీ నిష్క్రమణ వెనుక రేవంత్ కక్షసాధింపు: కేటీఆర్

- బీఆర్ఎస్‌పై కుట్రలో భాగం కానందుకే వేధించారు.. ఎల్ అండ్ టీ సీఎఫ్‌ఓను జైలుకు పంపుతామని బెదిరించారు
- మెట్రో భూములపై సీఎం, ఆయన అనుచరుల కన్ను పడింది
- మరో సంస్థను ఎలా బ్లాక్‌మెయిల్ చేస్తున్నారో బయటపెడతానని వెల్లడి

- వివరాలు 8లో▶



కేటీఆర్‌ను కలిసిన సునీత

జూబ్లీహిల్స్ అభ్యర్థిగా మాగంటి సునీత

బీఆర్ఎస్ టికెట్‌ను ఖరారు చేసిన కేసీఆర్
8లో



'వైన్స్' రిజర్వేషన్లు ఖరారు

రాష్ట్రంలోని మద్యం షాపులకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. 2,620 దుకాణాలకు 786 షాపులను రిజర్వేషన్ కేటగిరీలో చేర్చారు. వీటికి సంబంధించిన డ్రాలను శుక్రవారం జిల్లాల కలెక్టర్ల సమక్షంలో తీసి రిజర్వేషన్లు ఖరారు చేశారు.
- వివరాలు 19లో▶

కాంగ్రెస్‌లో 'మదర్' వార్

- మదర్ డెయిరీలోని ఒక డైరెక్టర్ పదవి కోసం 'నల్లగొండ' ఎమ్మెల్యేల మధ్య విభేదాలు
- బంధుత్వాల కోసం బీఆర్ఎస్‌తో ములాఖత్ అయ్యారని ఎమ్మెల్యే శామేల్ ఆరోపణ
- ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యపై నేరుగా విమర్శలు
- వివాదంపై ఢిల్లీ నుంచి పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఆరా

8లో



మహేశ్‌గౌడ్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న తుంగతుర్తి ఎమ్మెల్యే శామేల్

పర్యాటకం.. పెట్టుబడులు.. ఉపాధి

కొత్త పర్యాటక విధానానికి శ్రీకారం చుట్టనున్న ప్రభుత్వం

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు ప్రకటించనున్న సీఎం

రూ.15 వేల కోట్ల పెట్టుబడులు, 50 వేల మందికి ఉపాధికి సంబంధించి నేడు ఒప్పందాలు

హైదరాబాద్–సోమశిల–శ్రీశైలం మధ్య హెలీకాప్టర్ టూరిజం

నాగార్జునసాగర్–శ్రీశైలం, శ్రీశైలం–భద్రాచలం సీప్లేన్ విహారం

హెల్త్ టూరిజానికి ఊతం..

మన సంప్రదాయ వంటకాలకు ప్రాచుర్యం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త పర్యాటక విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. పర్యాటక రంగాన్ని కేవలం ప్రజలకు ఆహ్లాదం కల్పించడానికి మాత్రమే పరిమితం చేయకుండా పెట్టుబడులు ఆకర్షించడం, పెద్ద సంఖ్యలో యువతకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా ముందుకెళ్లాలని భావిస్తోంది. ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)తో పాటు పూర్తిస్థాయి ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించాలని నిర్ణయించింది. ఈ మేరకు శనివారం పలు ఒప్పందాలు చేసుకోనుంది. శనివారం శిల్పకళావేదికలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించే సదస్సులో పలు పథకాలు, కార్యక్రమాలను సీఎం ప్రకటించనున్నారు.

పకడ్బందీగా హెలీ టూరిజం

హెలీకాప్టర్ టూరిజాన్ని అందుబాటులోకి తేవడానికి సిద్ధమైంది. ఇప్పటివరకు రాష్ట్రంలో హెలీ టూరిజం లేదు. కేవలం మేడారం జాతర సందర్భంగా ఒకటి రెండుసార్లు ఏర్పాటు చేసినా అంతగా ఆకట్టుకోలేకపోయింది. అయితే ఈసారి దీన్ని పకడ్బందీగా అమలు చేయడానికి ఏర్పాట్లు చేస్తోంది. పెరిగిన జీవన ప్రమాణాలు, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు పర్యాటకులు సరికొత్త అనుభూతి పొందేందుకు హెలీకాప్టర్ పర్యాటకంవైపు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తొలుత హైదరాబాద్ నుంచి సోమశిల అక్కడ నుంచి శ్రీశైలం వరకు హెలీకాప్టర్ సేవలు ప్రారంభించనుంది. పర్యాటకుల ఆదరణ ఆధారంగా దానిని మరింతగా విస్తరించాలని నిర్ణయించింది. మరోవైపు సీ ప్లేన్ అనుమతుల కోసం కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. నీటి మీద నుంచి టేకాఫ్ తీసుకోవడంతో పాటు నీళ్లలోనే ల్యాండయ్యే సీ ప్లేన్‌లను రాష్ట్రంలో అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం, శ్రీశైలం నుంచి భద్రాచలం వరకు సీప్లేన్ విహారం ఉండనుంది. ప్రస్తుతం దీని సాధ్యాసాధ్యాలపై (ఫీజబిలిటీ) ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది.

'సినిమాలకు' సింగిల్ విండో అనుమతులు

ప్రపంచ స్థాయి చిత్రాల నిర్మాణ కేంద్రంగా హైదరాబాద్‌కు పేరుందని ప్రభుత్వం పేర్కొంది. దాన్ని మరింత అభివృద్ధి పరచడం ద్వారా చిత్ర పరిశ్రమకు మరింత స్నేహపూరిత వాతావరణం కల్పించాలని, అత్యధిక చిత్రాలు హైదరాబాద్‌లోనే నిర్మించేలా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా శనివారం ఫిల్మ్ ఇన్ తెలంగాణ పోర్టల్‌ను ప్రారంభించనుంది. ఈ పోర్టల్ ద్వారా సినిమా నిర్మాణాలకు సంబంధించి సింగిల్ విండో అనుమతులు ఇవ్వడంతో పాటు ఏఐ ద్వారా వివిధ ప్రాంతాల్లో షూటింగ్‌లకు తక్షణ అనుమతి లభించనుంది. ఈ సులువైన విధానాలతో జాతీయ, అంతర్జాతీయ చిత్ర నిర్మాణాలకు హైదరాబాద్ నిలయంగా మారుతుందని భావిస్తున్నారు.

హోటళ్లు.. హాస్పిటాలిటీ ప్రాజెక్టులు

రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో హోటళ్లు, వెల్‌నెస్ సెంటర్లు, హాస్పిటాలిటీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేస్తోంది. అనంతగిరి కొండల్లో జెసోమ్ అండ్ జెన్ మేఘా సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో అత్యాధునిక వెల్‌నెస్ సెంటర్, ద్రాక్ష పంట ఆధారిత వైన్ తయారీ యూనిట్, అటవీ ప్రాంతంలో తాజ్ సఫారీ ఏర్పాటు కానున్నాయి. మహీంద్ర కంపెనీ ఆధ్వర్యంలో వాటర్ ఫ్రంట్ రిసార్టులు, ఫైవ్ స్టార్ హోటళ్లు, రాష్ట్రంలోని టైర్ 2 నగరాల్లో జింజర్ హోటళ్లు, నాగార్జునసాగర్‌లో వెల్‌నెస్ రిట్రీట్‌కు ఒప్పందాలు కుదరనున్నాయి. తైవాన్‌కు చెందిన ఫో గౌంగ్ షాన్ వెడ్డింగ్ డెస్టినేషన్ సెంటర్ బుద్ధవనాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో శనివారం ఈ సంస్థలు ఆయా పనులకు సంబంధించి ఒప్పందాలు చేసుకోనున్నాయి. ఫలితంగా రాష్ట్రానికి రూ.15 వేల కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు ప్రత్యక్షంగా సుమారు 50 వేల మందికి ఉపాధి లభించనుంది.

విదేశీ రోగుల కోసం ఎంవీటీ పోర్టల్

వివిధ దేశాల నుంచి చౌక వైద్యం కోసం హైదరాబాద్‌కు రోగులు వస్తున్న సంగతి విదితమే. కాగా మరింత పెద్ద సంఖ్యలో వారిని ఆకర్షించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇందులో భాగంగా శనివారం తెలంగాణ మెడికల్ వాల్యూ టూరిజం (ఎంవీటీ) పోర్టల్‌ను ప్రారంభించనుంది. ఈ పోర్టల్‌లో హైదరాబాద్‌లో ఏ ఏ ఆసుపత్రులున్నాయి..? ప్రముఖ వైద్యులెవరు..? ఏరకమైన సేవలు అందిస్తారు.. ఏ బీమా సౌకర్యం అందుబాటులో ఉంది.. వీసాల జారీ.. పొడిగింపు తదితర వివరాలన్నీ అందులో పొందుపర్చనున్నారు. విమానాశ్రయం నుంచి ఆ ఆసుపత్రికి ఎలా చేరుకోవాలో సూచనలు పొందుపరచడంతో పాటు, ఆయా దేశాల వారి సౌలభ్యం కోసం వారి భాషను అనువదించే ట్రాన్స్‌లేటర్ల వివరాలు కూడా పోర్టల్‌లో ఉంటాయి.

వంటలు.. రుచులకు ప్రాచుర్యం

తెలంగాణలో వంటల వైవిధ్యం ఎంతగానో ఉంది. హైదరాబాద్ బిర్యానీ, సర్వపిండి, సకినాలు, బోటీ కూర..ఇలా ప్రత్యేక వంటకాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఏ ప్రాంతంలో ఏ వంట.. ఆ వంట ప్రత్యేకతలతో కూడిన వివరాలతో మ్యాప్‌నకు రూపకల్పన చేసింది. ఈ వంటకాలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు నెదర్లాండ్స్ ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోనుంది. ఈ ఒప్పందాలతో మన వంటలకు అంతర్జాతీయంగా గిరాకీ పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

పర్యాటకులకు పటిష్ట భద్రత

రాష్ట్రాన్ని సందర్శించే పర్యాటకుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో కేవలం 15 మంది టూరిస్ట్ పోలీసులే ఉండగా ఆ సంఖ్యను 90కు పెంచాలని నిర్ణయించింది. ఇటీవలి కాలంలో ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి మహిళలు ఒంటరిగానే పర్యాటక ప్రదేశాలకు వస్తున్న నేపథ్యంలో వారికి భద్రత, భరోసా కల్పించేలా ఈ టూరిస్ట్ పోలీసులు సేవలు అందించనున్నారు.

సర్కారు భాగస్వామ్యంతో ఈవెంట్లు, ఎగ్జిబిషన్లు

రాష్ట్రంలో భారీ కార్యక్రమాల నిర్వహణకు వీలుగా 'బుక్ మై షో'తో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ ఒప్పందంతో భారీ సినిమా ఈవెంట్లు, ఎగ్జిబిషన్లు, ఇతర కార్యక్రమాలు నిర్వహించే వీలుంది. మరోవైపు పర్యాటక రంగంలోని హోటళ్లు, ఇతర సంస్థలు అందించే సేవల ఆధారంగా వాటికి అవార్డులు ప్రదానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నేడు 'ముచుకుందా' ప్రారంభం

జల విహారాలను ప్రోత్సహించడంలో భాగంగా శనివారం హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లో 120 సీట్ల సామర్థ్యమున్న డబుల్ డెక్కర్ బోట్‌ను ప్రభుత్వం ప్రారంభించనుంది. హైదరాబాద్‌కు ఒకనాడు జీవనాడిగా ఉన్న మూసీ అసలు పేరైన ముచుకుందా నది పేరును ఈ బోట్‌కు పెట్టినట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా...

బీసీ పక్షపాతిగా సీఎం జీవో తెచ్చారు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి బీసీ పక్షపాతిగా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కలిస్తూ జీవో విడుదల చేశారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఈ జీవో విడుదల చేసినందుకు బీసీ సమాజం తరపున సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల్లో బీసీలకు అనేక అవకాశాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. బీసీలకు రాజ్యాధికారం రావొద్దని బీఆర్ఎస్, బీజేపీలు ప్రయత్నాలు చేసినా.. రిజర్వేషన్లు ఇచ్చిన రేవంత్ బీసీల పెద్దన్నగా నిలిచిపోయారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చెప్పారు.

కోటా జీవో హర్షణీయం

సాక్షి, హైదరాబాద్: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 9 విడుదల చేయడం హర్షణీయమని, ఇది బీసీల పోరాట విజయంగా భావిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. బీసీ రిజర్వేషన్లను కోర్టుల ద్వారా అడ్డుకోవాలని ఎవరూ ప్రయత్నించవద్దని కోరారు. బీసీ రిజర్వేషన్లను ఎవరు అడ్డుకున్నా.. బీసీ సమాజం ఎట్టి పరిస్థితుల్లో సహించబోదని ఆయన హెచ్చరించారు.

లక్ష పదవులకు సిద్ధంకండి

సాక్షి, హైదరాబాద్: దశాబ్దాలుగా సాగిన బీసీ రాజ్యాధికార ఉద్యమాల ఫలితంగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం ప్రాతినిధ్యం లభించబోతోందని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై జీవో తెచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో బీసీ సమాజం లక్షకు పైగా రాజకీయ పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు.

నేడే 'స్థానిక' షెడ్యూల్!

దాంతోపాటే నోటిఫికేషన్ కూడా..

- బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పన జీవో జారీ చేసిన ప్రభుత్వం
- స్థానిక ఎన్నికల నిర్వహణకు ఆదేశిస్తూ ఎస్ఈసీకి లేఖ
- 15 నుంచి 18 రోజుల్లోనే ఎన్నికలు నిర్వహించాలన్న సర్కారు!
- పీఆర్ శాఖ అన్ని ఏర్పాట్లూ చేసుకోవాలన్న ముఖ్యమంత్రి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక ఎన్నికల దిశగా కీలక ముందడుగు పడింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జీవో ఆధారంగా వెంటనే స్థానిక ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం తెలియజేయడంతో పాటు వచ్చే 15 నుంచి 18 రోజుల్లో ఈ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)కు ప్రభుత్వం లేఖ (కాంకరెన్స్) పంపించినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ ఆదేశాలకు అనుగుణంగా ఎస్ఈసీ శనివారం ఒకేసారి ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది.

నేడు ఎస్ఈసీ కీలక భేటీ

శనివారం ఉదయం 11 గంటలకు ఎన్నికల ఏర్పాట్లపై ఎస్ఈసీ కార్యాలయంలో సీఎస్, డీజీపీ, పీఆర్, రెవెన్యూ, ఇతర శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో కమిషనర్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో అన్ని అంశాలపై పూర్తి స్పష్టత వచ్చాక, ఎన్ని విడతల్లో ఎన్నికలు నిర్వహించాలనే దానిపై నిర్ణయం తీసుకుని, సాయంత్రానికల్లా ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదల చేస్తారని సమాచారం. షెడ్యూల్ విడుదలైతే వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో (హైదరాబాద్, మేడ్చల్ పట్టణ జిల్లాలు మినహా) ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎలక్షన్ కోడ్) అమల్లోకి వస్తుంది. అదే జరిగితే మూడురోజుల వ్యవధిలోనే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తారని తెలుస్తోంది. గ్రామ పంచాయతీల వారీగా, వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాలు ఎస్ఈసీ వెబ్‌సైట్ 'టీ–పోల్'లో ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. ఎన్నికల విధులపై సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. బ్యాలెట్ పేపర్ల ముద్రణకు చేయాల్సిన ఏర్పాట్లతో పాటు బ్యాలెట్ బాక్సులు సమకూర్చుకోవడం వంటి ఏర్పాట్లకూ ఎస్ఈసీ గతంలోనే చర్యలు చేపట్టింది. బ్యాలెట్ బాక్స్‌లు భద్రపరచడం, కౌంటింగ్ కేంద్రాలు, పోలీసు భద్రత తదితరాలపై కసరత్తు పూర్తిచేసింది.

ఏ ఎన్నికలు ముందు?

మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు ముందు నిర్వహిస్తారా? లేక గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారా? అన్న దానిపై ప్రభుత్వ పరంగా పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నందున..వాటి ద్వారా రాజకీయంగా లబ్ధి పొందేందుకు వీలుగా తొలుత పార్టీ గుర్తులపై జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిపేందుకే మొగ్గుచూపొచ్చని సమాచారం. ఈ ఎన్నికలు ముగిశాక వారం రోజుల వ్యవధిలోనే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డితో పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, పీఆర్ఆర్‌డీ డైరెక్టర్ జి.సృజన సమావేశమయ్యారు. శాఖా పరంగా స్థానిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లూ చేసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు.

డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌లతో ఎస్ఈసీ సమావేశం

మరోవైపు ఎస్ఈసీ కార్యాలయంలో డీజీపీ జితేందర్‌తో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. అంతా సవ్యంగానే ఉందని, ఎన్నికల బందోబస్తు, ఇతర అవసరాలకు ప్రస్తుతం తమ వద్ద అందుబాటులో ఉన్న పోలీస్ ఫోర్స్ సరిపోతుందని, అదనపు బలగాలు అవసరం లేదని డీజీపీ చెప్పినట్టు సమాచారం. గతంలో మూడు దశల్లో వేర్వేరుగా గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించారంటూ..ఈసారి ఎన్ని విడతల్లో నిర్వహిస్తే మంచిదని కమిషనర్ ఆరా తీసినట్టు తెలిసింది. రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డితోనూ విడిగా భేటీ అయిన కమిషనర్..పలు అంశాలపై సమాచారాన్ని అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది. శివధర్‌రెడ్డి కొత్త డీజీపీగా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో ఆయనతోనూ ఎస్ఈసీ సమావేశమైనట్టు తెలిసింది.

తొలుత విద్య, ఉపాధి రంగాలకు సంబంధించి జీవో

ముందుగా విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42% రిజర్వేషన్లపై బీసీ సంక్షేమ శాఖ ఒక నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం జీఏడీ ద్వారా ఓ జీవో విడుదల చేయగా, దీని ఆధారంగా వెంటనే పీఆర్ శాఖ ద్వారా స్థానిక సంస్థల్లో బీసీలకు రాజకీయంగా 42% రిజర్వేషన్లు కల్పిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందుకు అనుగుణంగా ఏజిల్లాకు ఆ జిల్లాలో కలెక్టర్లు గెజిట్‌లు విడుదల చేస్తే స్థానిక ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం కానుంది.

ఏయే స్థానాలకు ఎన్నికలు

హైదరాబాద్, మేడ్చల్ అర్బన్ జిల్లాలు మినహా 31 జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పీపీలు)లకు..

565 జెడ్పీటీసీ స్థానాలకు (ములుగు జిల్లా మంగపేట మండలం జెడ్పీటీసీ స్థానంపై కోర్టు కేసు కారణంగా స్టే)

565 మండల ప్రజా పరిషత్‌లకు (మంగపేట మండలంపై కోర్టు కేసు కారణంగా ఎంపీపీ, దాని పరిధిలోని ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికపై స్టే)

ఎంపీటీసీ స్థానాలు 5,763

గ్రామపంచాయతీలు– 12,760

వార్డుల సంఖ్య 1,12,534

తెలంగాణ ఏర్పాటయ్యాక మొదటిసారిగా 2019లో పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు 570 చొప్పున, ఎంపీటీసీలు 5,817, గ్రామపంచాయతీలు 12,848గా ఉన్నాయి. దీనిని బట్టి చూస్తే ఇప్పుడు ఒక జెడ్పీ, 5 జెడ్పీటీసీ, 5 ఎంపీపీలు, 54 ఎంపీటీసీ స్థానాలు, 185 గ్రామపంచాయతీలు తగ్గాయి. మేడ్చల్–మల్కాజిగిరిలోని మెజారిటీ గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో గ్రామీణ జిల్లా ఉనికి లేకుండా పోయింది.

బీసీలకు 42% కోటా

▶ మొదటి పేజీ తరువాయి

అత్యధిక జనాభా ఉన్న వెనుకబడిన వర్గాల అవసరాలు తీర్చడంతో పాటు వారి సమాన అభివృద్ధిని ప్రోత్సహించడానికి ప్రత్యేక చొరవ తీసుకుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 40.. స్వయం ప్రతిపత్తి గల సంస్థలైన గ్రామ పంచాయతీలు స్వతంత్రంగా పనిచేసేందుకు అవసరమైన అధికారాలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని స్పష్టం చేస్తోంది. అంతేకాకుండా ఆర్టికల్ 243 ఈ(6) ద్వారా గ్రామ పంచాయతీల చైర్‌పర్సన్ పదవుల్లో వెనుకబడిన తరగతులకు సీట్ల కేటాయింపు కల్పించే అవకాశం ఉంది. అదేవిధంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 టి(6) ద్వారా పురపాలక సంస్థల అధ్యక్ష పదవుల్లో బీసీ వర్గాలకు సీట్ల కేటాయింపు కల్పించే అధికారం ఉంది.

రిజర్వేషన్ల కోసం డెడికేటెడ్ బీసీ కమిషన్: రాజ్యాంగానికి లోబడి స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల నిర్ధారణ కోసం ప్రభుత్వం గత నవంబర్‌లో విశ్రాంత ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు అధ్యక్షతన డెడికేటెడ్ బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. స్థానిక సంస్థల్లో బీసీల స్థితిగతులపై ఈ కమిషన్ సామాజిక పరిశోధనతో పాటు లోతైన అధ్యయనం చేసింది. అదేవిధంగా ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల సర్వే సైతం నిర్వహించాలని శాసనసభ, శాసనమండలిలో నిర్ణయం తీసుకుంది. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సర్వే.. రాష్ట్రంలో వివిధ కులాల ఆర్థిక, సామాజిక, విద్య, ఉపాధి, రాజకీయ స్థితిగతులను వెల్లడించింది.

సిఫారసులకు ఆమోదం: డెడికేటెడ్ బీసీ కమిషన్ ఈ ఏడాది మార్చిలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుపై పలు సిఫారసులు చేస్తూ ఈ ఏడాది ఆగస్టులో నివేదిక సమర్పించింది. రాష్ట్రంలో బీసీల జనాభా 56.33% ఉందని, ఈ జనాభా వెనుకబడి ఉండడం వల్ల వారికి స్థానిక సంస్థల్లో 42 శాతం వరకు రిజర్వేషన్లు ఇవ్వవచ్చని సిఫారసు చేసింది. ఈ సిఫారసును అత్యంత జాగ్రత్తగా పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం..బీసీల రాజకీయ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని నిర్ణయించింది. సిఫారసులకు ఆమోదం తెలిపింది. గతంలో ఈ రిజర్వేషన్లు పలు విధాలుగా ఉన్న సంగతి తెలిసిందే. మరోవైపు రాష్ట్ర శాసనసభ, శాసనమండలిలో తెలంగాణ వెనుకబడిన వర్గాల బిల్లు–2025 (గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు) ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. అన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లును స్వాగతించాయి. ఈ నేపథ్యంలో మొత్తంగా.. రాజ్యాంగం కల్పించిన అధికారాలను వినియోగించుకుని, చట్టసభల అనుమతితో న్యాయ నిర్ణయాలకు లోబడి స్థానిక సంస్థల్లో బీసీలకు 42%సీట్లు, పదవుల రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయిస్తూ జీవో నంబర్ 9 జారీ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

ఆ జీవో మైలురాయి: మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సామాజిక న్యాయం కోసం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం కోటా కల్పిస్తూ తెచ్చిన జీవో వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవానికి, రాబోయే తరాల ఉజ్వల భవిష్యత్తుకు భరోసానిస్తుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ చరిత్రలో ఇది మైలురాయిగా నిలిచిపోతుందని ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఈ జీవోతో స్థానిక సంస్థల్లో బీసీలకు మరిన్ని అవకాశాలు వస్తాయని, సమాజం అభివృద్ధి దిశగా ముందడుగు వేయాలని కోరుకుంటున్నానని చెప్పారు.

రిజర్వేషన్ల ఖరారు ఇలా..

మార్గదర్శకాలు జారీ చేసిన పీఆర్ ముఖ్య కార్యదర్శి

- రెండు వేర్వేరు జీవోలు విడుదల
- పీఆర్ శాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచన
- రాజకీయ పార్టీల సమక్షంలో లాటరీ పద్ధతిలో మహిళా రిజర్వేషన్లు ఖరారు

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఖరారుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టానికి చేసిన సవరణలకు అనుగుణంగా..జిల్లాలు, మండలాలు, గ్రామపంచాయతీల వారీగా జెడ్పీపీ, ఎంపీపీ పదవులు, స్థానాలు, సర్పంచ్ పదవులు, వార్డు సభ్యుల సీట్ల రిజర్వేషన్ల ఖరారు మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఈ మేరకు పీఆర్ఆర్‌డీ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ శుక్రవారం రెండు జీవోలను (ఒకటి మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు, రెండోది గ్రామ పంచాయతీల ఎన్నికల కోసం) విడుదల చేశారు. ఈ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్లు (జిల్లా ఎన్నికల అధికారులు) హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు మినహా) అన్ని అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

మహిళలకు 50 శాతం సీట్లు: శనివారం ఉదయం 11 గంటల లోగా ఎస్టీ,ఎస్సీ,బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారు చేసి సిద్ధంగా పెట్టుకోవాలని జిల్లా కలెక్టర్లను పీఆర్ఆర్‌డీ డైరెక్టర్ సృజన ఆదేశించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతో పాటు గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి కూడా అన్ని కేటగిరీల్లోనూ మహిళలకు 50 శాతం సీట్లు రిజర్వ్ చేసేందుకు లాటరీ పద్ధతిని అనుసరించనున్నారు. శనివారం ఉదయం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో లాటరీ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. మహిళల రిజర్వేషన్లు పూర్తికాగానే జిల్లాల వారీగా రిజర్వేషన్ల గెజిట్‌ను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

జిల్లా, మండల పరిషత్‌లలో ఇలా..: 2018 పంచాయతీరాజ్ చట్టానికి అనుగుణంగా...2019లో జరిగిన మొదటి ఎన్నికల తర్వాత రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు చేయాల్సి ఉన్నందున, ఆ తర్వాత జరిగే ఎన్నికలను రెండో సాధారణ ఎన్నికలుగా పరిగణించాల్సి ఉంటుంది. అయితే 2019 ఎన్నికల తర్వాత కొత్తగా నోటిఫై అయిన ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, జెడ్పీపీలకు జరిగేవి మొదటి ఎన్నికలుగానే పరిగణిస్తారు. అందువల్ల గతంలో వీటికి చేసిన రిజర్వేషన్లను విడిచిపెట్టి, కొత్తగా చేయాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీ సంక్షేమశాఖ జారీ చేసిన జీవోకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని, గతంలోని(2019లోని) మార్గదర్శకాల స్థానంలో ఇప్పుడు జారీచేసిన వాటిని పరిగణనలోకి తీసుకుని ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీ అధ్యక్షులు, జెడ్పీ చైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లు ఖరారు చేయాలని సూచించారు

తొలుత ఎస్సీ, ఎస్టీ, బీసీ..: రిజర్వేషన్ల ఖరారులో భాగంగా ముందుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ తర్వాత మహిళా రిజర్వేషన్లు ఖరారు చేయాలి. షెడ్యూల్డ్ ఏరియాల్లోని ఎంపీపీ సీట్లలో ఎస్టీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వ్ చేయాలి. ఆ మండలంలోని మొత్తం ఎంపీటీసీ సీట్లలో ఎస్టీలకు సగం కంటే ఎక్కువ స్థానాలను రిజర్వ్ చేయాలి. ఈ ఏరియాల్లో ఎంపీపీ అధ్యక్షుల పదవులన్నీ ఎస్టీలకే రిజర్వ్ చేయాలి.

డెడికేటెడ్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగానే..

డెడికేటెడ్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగానే ఎంపీటీసీస్థానాల్లో ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళా రిజర్వేషన్లు చేపడతారు. ఈ కమిటీ సిఫార్సులకు అనుగుణంగానే ప్రతి కేటగిరీలో రిజర్వేషన్లు అమలు చేయాలి. ఆర్డీవోలు ప్రతి మండల ప్రజాపరిషత్‌లోని ఎస్టీ, ఎస్సీ, బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా ఆయా స్థానాలకు రిజర్వేషన్ చేయాలి. మహిళా రిజర్వేషన్లకు సంబంధించి ఎస్టీ (మహిళ), ఎస్సీ, బీసీ (మహిళ), అన్ రిజర్వ్‌డ్ (మహిళ)గా సెపరేట్ కేటగిరీలుగా చేయాలి జెడ్పీపీ చైర్‌పర్సన్ల రిజర్వేషన్‌ను పీఆర్ కమిషనర్ ఎస్టీ, ఎస్సీ, బీసీ కేటగిరీల వారీగా ఖరారు చేస్తారు

గ్రామపంచాయతీ రిజర్వేషన్లు ఇలా..: గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా వార్డు సభ్యులకు, సర్పంచ్ పదవులకు ప్రత్యక్ష పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీలకు కులగణన (ఎస్ఈఈఈపీసీ)–2024 సర్వే ప్రకారమే రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. వార్డు సభ్యుల స్థానాలను (ఎస్టీ, ఎస్సీ, బీసీ కేటగిరీలకు) ఎంపీడీవోలు రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. అయితే గతానికి భిన్నంగా డెడికేటెడ్ కమిషన్ చేసిన సిఫార్సులకు అనుగుణంగానే రిజర్వేషన్లు చేపట్టాలని ఈ ఉత్వర్వుల్లో స్పష్టం చేశారు. ప్రతి కేటగిరీలో సీట్ల రిజర్వేషన్‌ను కమిషన్ సూచనల ప్రకారమే చేయాలి. వార్డుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా కేటగిరీలకు సంబంధించిన రిజర్వేషన్లను వీలైనంత మేర రొటేషన్ పద్ధతిలో చేయాలి. ఎంపీడీవోలు సంబంధిత వార్డులలో ఎస్టీ, ఎస్సీ, బీసీ కేటగిరీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వ్ చేయాలి. కులగణన (ఎస్ఈఈఈపీసీ)–2024 సర్వేకు అనుగుణంగా ప్రతి గ్రామపంచాయతీలోని వార్డుల వారీగా ప్రతి కేటగిరీ (ఎస్టీ, ఎస్సీ, బీసీ) జనాభాను డిసెండింగ్ ఆర్డర్‌లో పెట్టి విడిగా స్టేట్‌మెంట్లు సిద్ధం చేయాలి. దీనికి అనుగుణంగా మొదట ఎస్టీ (డిసెండింగ్ ఆర్డర్‌లో) 2019 మొదటి ఎలక్షన్‌లో కేటాయించిన సీట్లను మినహాయించి, మిగతా వార్డులను ఎస్టీలకు రిజర్వ్ చేసే విషయం పరిగణనలోకి తీసుకోవాలి. అదేవిధంగా ఎస్సీ, బీసీ కేటగిరీల్లోనూ గతంలో (మొదటి ఎన్నికల్లో) చేసిన రిజర్వేషన్లను మినహాయించి మిగతా వాటి నుంచి రిజర్వేషన్లు ఖరారు చేయాలి. ఈ కేటగిరీల రిజర్వేషన్ల ఖరారు పూర్తయ్యాక మిగిలి పోయిన వాటిని అన్ రిజర్వ్‌డ్‌గా పరిగణించాలి. ఇక ఎస్టీ, ఎస్సీ, బీసీ, అన్ రిజర్వ్‌డ్‌లకు రిజర్వ్ చేసిన సీట్లను అన్ని కేటగిరీల్లో 50 శాతం మహిళలకు కేటాయించేందుకు లాటరీ పద్ధతిని అనుసరించాలి.

సర్పంచ్ పదవికి ఇలా..

ఎస్టీ, ఎస్సీ, బీసీ కేటగిరీల్లో సర్పంచ్ పదవుల రిజర్వేషన్ ఖరారు బాధ్యత ఆర్డీవోలకు అప్పగించారు. డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగానే రిజర్వేషన్లు చేపట్టాలి. ఆ మేరకే ప్రతి కేటగిరీలో ఆయా పదవులను రిజర్వ్ చేయాలి. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళలకు రిజర్వ్ చేసే పోస్టులకు సాధ్యమైనంత మేర రొటేషన్ పద్ధతిని (2019 మొదటి ఎన్నికలకు అనుగుణంగా) అనుసరించాలి. మహిళలకు సంబంధించి ఎస్టీ, ఎస్సీ, బీసీ అన్ రిజర్వ్‌డ్ కేటగిరీలను ప్రత్యేక కేటగిరీలుగానే పరిగణించి రిజర్వేషన్లు కేటాయించాలి. వంద శాతం ఎస్టీ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలను ఎస్టీలకే రిజర్వ్ చేయాలి. ప్రతి మండల పరిషత్‌లో సర్పంచ్ పదవులను ఆర్డీవోలు కేటాయిస్తారు.


सत्यमेव जयते
BHARAT AT THE HEART,
SWADESHI AT THE CORE
Indigenous 4G puts Bharat among the World's Top 5
Prime Minister Narendra Modi
Service is the resolve,
India First the inspiration...75 years
Inauguration of Swadeshi 4G (5G ready) Network
By
Prime Minister Shri Narendra Modi
Odisha | 27th September, 2025 | 11:30 AM
Connecting the Unconnected, Empowering Citizens
Under the initiative, more than 97,500 mobile towers have been rolled out in less than one year
Fully indigenous technology to free Bharat from import dependency
Over 26,700 villages get high speed internet connectivity for the first time
People in rural areas to have easy access to services like digital learning, smarter farming tools and 24x7 telemedicine
2.2+ crore citizens now have access to 4G data at affordable prices
New opportunities for youth with strong digital infrastructure
CORE
सी-डॉट
C-DOT
BSNL
TATA CONSULTANCY SERVICES
Say with Pride - It is Swadeshi
न्यूज़
Live telecast on DD News and it's Social Media Channels
Scan to watch live

సాక్షి
శనివారం, 27 సెప్టెంబర్ 2025

అసాధారణ ప్రయోగం

'శాంతిని వాంఛించే వారు సమరానికి సర్వసన్నద్ధంగా ఉండాల'ని నాలుగో శతాబ్దం నాటి రోమన్ రచయిత వెజిటియస్ అంటాడు. రక్షణ అమ్ములపొదిలో పదునైన, శక్తిమంతమైన ఆయుధాలుంటే, అవసరం పడినప్పుడు వినియోగిస్తే శత్రువు 'పాహిమాం' అనక తప్పదని పాకిస్తాన్‌తో ఈమధ్య జరిగిన ఘర్షణలు కూడా నిరూపించాయి. ఈ నేపథ్యంలో మన రక్షణ, పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) రూపొందించిన 2,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగల మధ్యశ్రేణి అగ్ని ప్రైమ్ క్షిపణిని రైలు ఆధారిత మొబైల్ లాంచర్ ద్వారా బుధవారం ప్రయోగించారు. అత్యాధునిక సాంకేతికతల్ని జోడించటం, రైలు పట్టాల సదుపాయం ఉన్న ఎలాంటి మారుమూల ప్రాంతాలకైనా సులభంగా తీసుకువెళ్లగల వెసులుబాటు ఈ క్షిపణి ప్రత్యేకత. మన రక్షణ సన్నద్ధతపై చాన్నాళ్లుగా రక్షణరంగ నిపుణులు పెదవి విరుస్తున్నారు. యూపీఏ హయాంలో అయితే కుదిరిన ప్రతి రక్షణ ఒప్పందంపైనా, కొనుగోళ్లపైనా నీలినీడలు కమ్ముకున్నాయి. అప్పటి రక్షణ దళాల చీఫ్ జనరల్ వీకే సింగ్ నేరుగా నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు లేఖ కూడా రాశారు. అప్పట్లో రక్షణరంగ పరిశోధనలూ, ఆవిష్కరణలూ లేకపోలేదు. ఆత్మనిర్భర్ భారత్ భావన తర్వాత ఇవి మరింత వేగంగా విస్తరించాయి. ఇప్పటికీ రక్షణ కొనుగోళ్లు తప్పడం లేదు. మన రక్షణ బడ్జెట్‌లో 36 శాతం విదేశీ కొనుగోళ్లకు వెచ్చిస్తున్నాం. కానీ అగ్ని ప్రైమ్ వంటి మెరికల్లాంటి ఆయుధాలు మన సత్తా చాటుతున్నాయి. ముమ్ముందు వేరే దేశాలపై మనం ఆధారపడే అవసరం ఉండబోదన్న భరోసానిస్తున్నాయి.

యుద్ధాల తీరుతెన్నులు ఊహకందనివిధంగా మారాయి. ఒకప్పుడు భారీ ఆయుధాలూ, పెనువేగంతో దూసుకెళ్లి శత్రువును దెబ్బతీయగలిగే యుద్ధ విమానాలూ ప్రధాన పాత్ర పోషించేవి. ఇప్పుడది మారింది. తక్కువ ఖర్చుతో తయారయ్యే డ్రోన్‌కు ఆయుధాలు అనుసంధానించి, కృత్రిమ మేధ(ఏఐ) జోడిస్తే చడీచప్పుడూ లేకుండా శత్రు దేశంలో కీలక స్థావరాలను సునాయాసంగా ధ్వంసం చేయటాన్ని, భారీ నష్టం కలిగించటాన్నీ ఉక్రెయిన్ యుద్ధంలో గమనించవచ్చు. ఏఐను జోడించటం వల్ల అవి పరస్పరం సమన్వయం చేసుకుంటూ గమ్యం చేరగానే తమను మోసుకెళ్లిన విమానం నుంచి వాటంతటవే విడివడి మిడతల దండులా శత్రులక్ష్యంపై దాడి చేయటం అసాధారణం. ఈ రంగంలో డీఆర్‌డీవో వంటి సంస్థలు ఇప్పటికే ఎంతో ముందుకెళ్లాయి. రోబోటిక్స్, సైబర్ వార్‌ఫేర్ తదితర రంగాల్లో సైతం ప్రగతి సాధించాయి. 2022 నాటికే మన దేశం ఏఐ ఉత్పత్తులు, సాంకేతికతలకు సంబంధించి 75 కొత్త ఆవిష్కరణలు తీసుకొచ్చింది. శత్రుదేశం నుంచి వచ్చిపడే డ్రోన్‌లూ లేదా విమానాలను మధ్యలోనే అడ్డగించే సాంకేతికత, ఏం జరుగుతున్నదో అంచనాకొచ్చి తగిన విధంగా స్పందించే వ్యవస్థలూ రక్షణావసరాల్లో వినియోగంలోకొచ్చాయి. మానవరహిత యూఏవీలు గూఢచర్యం, దాడి చేయటం, అవసరమైన సామగ్రి మోసుకెళ్లడం వగైరాలు చేస్తున్నాయి. జాతీయ సాంకేతిక పరిశోధన సంస్థ (ఎన్టీఆర్వో) ఎలక్ట్రానిక్స్ రంగంలో శత్రుదేశం కమ్యూనికేషన్ల వ్యవస్థను విచ్ఛిన్నం చేయగల సీ4ఐఎస్‌ఆర్ వంటి అత్యాధునిక సెన్సర్ వ్యవస్థను అభివృద్ధి చేసింది. వాటిని ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ యుద్ధ విమానాలకూ, తేజస్ విమానాలకూ అనుసంధానించటం వల్లనే మన సైన్యానిది పైచేయి అయింది. 2022–23తో పోలిస్తే 2023–24లో మన రక్షణ ఉత్పత్తుల విలువ రూ. 1.27 లక్షల కోట్లకు చేరింది. ఈ క్రమంలో అగ్ని ప్రైమ్ క్షిపణి కీలక మలుపు.

యుద్ధ సమయాల్లో క్షిపణుల వికేంద్రీకరణకు అగ్ని ప్రైమ్ అక్కరకొస్తుంది. అయితే మౌలిక సదుపాయాలు మెరుగుపరిస్తేనే దీనికి సార్థకత. రైల్వే ట్రాక్‌లో 70,000 కిలోమీటర్లతో ప్రపంచంలో మనం నాలుగో స్థానంలో ఉన్నాం. దీన్నింకా విస్తరించాలి. చివరి నిమిషం వరకూ శత్రువు కంటబడకుండా ఈ క్షిపణుల కోసం సొరంగాలు అవసరపడతాయి. నిధుల లేమిని ఎదుర్కొంటున్న డీఆర్‌డీవో, ఇస్రో, ఎన్టీఆర్‌వో వగైరాలకు కేటాయింపులు పెంచితే మరిన్ని అద్భుతాలు సాధ్యమవుతాయి. మన రక్షణ రంగం మరింత బలోపేతమవుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.పంచమి ఉ.8.24 వరకు తదుపరి షష్ఠి, **నక్షత్రం:** అనూరాధ రా.10.50 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** తె.5.00 నుండి 6.46 వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.5.48 నుండి 7.29 వరకు, **అమృత ఘడియలు:** ఉ.11.15 నుండి 1.03 వరకు.

సూర్యోదయం : 5.53
సూర్యాస్తమయం: 5.52
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

ఎక్కువ వద్దు



నువ్వొక ఎంటర్‌టైనర్. నిన్ను ప్రతి ఆటకూ అంచనా వేస్తారు. వారి అంచనాలకు తగ్గకుండా నువ్వు నీ ఆట ఆడాలి. అయితే, ఒక స్ట్రయికర్‌గా నేను దీని గురించి ఎక్కువ ఆలోచించను. ఎక్కువగా ఆలోచిస్తే, ఆటలో మనం పొరపాట్లు చేసే ప్రమాదం ఉంది.

– ఎర్లింగ్ హాలండ్, నార్వే సాకర్ ప్లేయర్

ఉన్నదంతా..!



మీ చుట్టూ సమృద్ధిగా ఆనందమూ ఉంది, దుఃఖమూ ఉంది. మీరు ఏమి కోరుకుంటున్నారో మీ మనసు లోపల పరిశీలించుకోండి. చివరికి మీరు కావాలనుకున్నది మాత్రమే దొరుకుతుంది. విషయం ఏంటంటే, బయటేమీ లేదు! లోపలే అంతా ఉంది!!

– అనుపమ్ మిశ్రా, గాంధేయవాది

నిజం-అబద్ధం



నేనొకటి గట్టిగా నమ్మాను. ఎప్పుడూ అబద్ధం చెప్పకూడదని! కొన్నిసార్లు నిజం చెప్పకపోవటం కూడా అబద్ధం చెప్పినట్లే అవుతుంది. అలా కూడా చేయకూడదు అనుకున్నాను. నాకెంత కష్టం వచ్చినా, నా ఈ నమ్మకంపై నేటికీ నేను నిలబడే ఉన్నాను.

– మార్గరెట్ కోర్ట్ (83), టెన్నిస్ క్రీడాకారిణి

ప్రగతిశీలత



నిజంగా ప్రగతిశీల సమాజం అంటే ఏదైనా ఆలోచన, లేదా ఆవిష్కరణ దాని యోగ్యత వల్ల తప్ప మరే కారణం గానూ గుర్తింపు పొందక పోవటం. బయటి ఎరువులు అంటకుండా హృదయం లోంచి దానికై అది మొలకెత్తే సృజనాత్మకత సహజమైనది, నిజమైనది.

– ప్రసూన్ జోషీ, సెన్సార్ బోర్డ్ ఛైర్మన్

ఎవరూ అడగరు!



నా అభిమాన దర్శకులు తమ సినిమాల్లో నటించమని అడిగే నటుల్లో నేను ఒకడిని కాదు. వాళ్లు నాతో బాగానే ఉంటారు. కానీ కలిసి పని చేయమని అడగరు. జీవితమిలాగే ఉంటుంది. ఇష్టమైన పని కోసం మనమే కష్ట పడాలి.

– సేథ్ రోజెన్, ఎమ్మీ విజేత, కెనడా నటుడు

హెల్ప్ చెయ్యనా?




ఫోన్‌లో పిల్లలు చూస్తున్న కంటెంట్ విషయమై తల్లిదండ్రులు, టీచర్లు స్నేహపూర్వకమైన గమనింపుతో ఉండాలి. 'ఏమిటంతసేపు?' అన్నట్లు కాకుండా, 'దేని కోసం వెతుకుతున్నావు? నేను హెల్ప్ చెయ్యనా?' అన్నట్లుగా వారితో ప్రోత్సాహకరంగా ఉండాలి.

– రితికా రేచల్ థామస్, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తే ఎలా?

భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనంజయ యశ్వంత్ చంద్రచూడ్, 'ఇండియా టుడే' గ్రూప్ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌కు తాజాగా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో భారత న్యాయ వ్యవస్థలోని పలు కీలక అంశాలను స్పృశించారు. భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ–సవాళ్లు, పౌరుల స్వేచ్ఛ మొదలు – రాజకీయాలతో ముడిపడిన కేసుల విచారణ సమయంలో, ప్రత్యేకించి ఈ సోషల్ మీడియా యుగంలో న్యాయమూర్తులు ఎదుర్కొనే సంఘర్షణ వరకు వివిధ సున్నిత అంశాలపై లోతైన దృష్టికోణాన్ని జస్టిస్ చంద్రచూడ్ ఆవిష్కరించారు. తాను రచించిన 'వై ది కాన్‌స్టిట్యూషన్ మేటర్స్' అనే కొత్త పుస్తకంలోని విశేషాంశాల ఆధారంగా సాగిన ఈ ఇంటర్వ్యూలో న్యాయస్థానాలపై ప్రజల విశ్వాసాన్ని పెంపొందించాల్సిన ఆవశ్యకతను జస్టిస్ చంద్రచూడ్ పునరుద్ఘాటించారు. ఆ సుదీర్ఘ ఇంటర్వ్యూలోని కొన్ని ముఖ్యాంశాలు.



రాజ్‌దీప్ సర్దేశాయ్, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్; (చిన్న ఫొటో) చంద్రచూడ్ తాజా రచన

> జైలు కన్నా, బెయిలుకే ప్రాధాన్యం ఉండాలి. వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించటమే ఇందులోని ప్రధాన ఉద్దేశం. ఆరోపణలు రుజువయితేనే కదా దోషి. ఇక, మాట్లాడితే అరెస్ట్ చేస్తారన్న భయం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదు. మాట్లాడే స్వేచ్ఛను ఉపయోగించుకోటానికి ప్రజలు భయపడేలా వ్యవస్థలు వ్యవహరించకూడదు. ప్రజల్ని భయపెట్టటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ప్రభుత్వ పాలసీలను విమర్శించడం నేరం, శిక్షార్హం అనే భయానికి ప్రజలు లోనయితే ప్రభుత్వానికి తన లోపాలు తెలిసేదెలా?

భిన్నాభిప్రాయాలపై ఫిర్యాదులు ఓ భయంకర ధోరణి!

మనం ఇప్పుడు సోషల్ మీడియా యుగంలో ఉన్నాం. అభిప్రాయ వ్యక్తీకరణకు సోషల్ మీడియా స్వేచ్ఛా వేదిక. అలాంటప్పుడు భిన్నాభిప్రాయాలు తప్పవు. కానీ, ఏం మాట్లాడితే కేసు పెడతారోనని సంకోచించే పరిస్థితులు ఉన్నప్పుడు అవి అభిప్రాయ వ్యక్తీకరణపై ప్రభావం చూపుతాయి. తద్వారా మాట్లాడే హక్కుకు భంగం కలుగుతుంది. మన అభిప్రాయం వ్యతిరేకంగా ఉందని, లేదా అనుకూలంగా లేదని ప్రత్యర్థులో, ప్రభుత్వమో భావిస్తే పోలీసులు అరెస్టు చేస్తారేమోనన్న భయం ఉంటుంది. ఇలాంటి భయాలు, సంకోచాలు ఇండియాకు మాత్రమే ప్రత్యేకం కాదు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న సమస్యే! మరో వైపు ప్రజాక్షేత్రంలో సైతం అసహనశీలత ఎక్కువైంది. సాధారణంగా ఎవరైనా తమకు నచ్చిందే వినాలనుకుంటారు. ఎవరో కార్టూన్ వేస్తేనో, లేక మరెవరో ప్రకటన జారీ చేస్తేనో, లేదంటే ప్రసంగిస్తేనో... అది ఎవరికో నచ్చకపోతేనో వెంటనే ఫిర్యాదు చేస్తున్నారు. అంతేకాదు, దేశంలోని ఏ ప్రాంతంలోని వారైనా ఫిర్యాదు చేయవచ్చు. ఏకకాలంలో పది వేర్వేరు ప్రాంతాల నుండీ కేసులు నమోదు కావచ్చు. ఇది నిజంగా చాలా భయంకరమైన ధోరణి. మాట్లాడితే మిమ్మల్ని శిక్షించవచ్చు అనే భయం చాలా ఆందోళన కలిగించే విషయం. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.

విమర్శలను తప్పు పట్టలేం!

అభిప్రాయాలు వ్యక్తం చేసేవారికి కూడా బాధ్యత అవసరం. ముఖ్యంగా – సోషల్ మీడియా ద్వారా ద్వేషం, అసహనం వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నందున మాటలు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. సామాజిక స్పృహను కలిగి ఉండాలి. మన సమాజం బహుళ మతాలు, సంస్కృతుల సమతుల్యతపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి స్వేచ్ఛా హక్కు ఉన్నా, మత భావాలను దెబ్బతీయకుండా మాట్లాడాలి. లేకపోతే చట్టపరమైన పరిణామాలు తప్పవు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2) ఇందుకు ఉన్న సహేతుకమైన పరిమితులను వివరిస్తుంది. అయితే ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయడాన్ని మాత్రం తప్పు పట్టలేం. ఇది సానుకూల ఫలితాలకే దోహదం చేస్తుంది.

చట్టాల పునఃసమీక్ష అవసరం

బ్రిటిష్ ప్రభుత్వం ఇండియాను పాలిస్తున్నప్పుడు చేసిన 'దేశద్రోహం' వంటి చట్టాలను నేడు సమీక్షించాల్సిన అవసరం ఉంది. 'భారత్ ఒక దేశంగా నిలవగలదా?' అని స్వాతంత్ర్యానికి ఆరంభంలో సందేహాలు ఉండేవి. కానీ రాజ్యాంగ నిర్మాణం దేశాన్ని అత్యంత పటిష్ఠంగా ఉంచేలా జరిగింది. ఈ ఏడున్నర దశాబ్దాలలో భారత్ ఒక బలమైన, స్థిరమైన రాజకీయ వ్యవస్థగా అభివృద్ధి చెందింది. కాబట్టి అప్పటి చట్టాలను సమీక్షించాలి. అలాగే 'పరువు నష్టాన్ని' క్రైమ్ పరిధి నుంచి తప్పించాలి. ఎందుకంటే, క్రిమినల్ డిఫమేషన్ గురించి కొత్త దృష్టికోణంతో పరిశీలించడం అవసరమనిపిస్తోంది. ఒకవేళ డిఫమేషన్‌ను క్రిమినల్ చర్యగా కొనసాగించాలంటే కొన్ని పరిమితులను తప్పక ఏర్పరచుకోవాలి. నేర స్వరూపాన్ని కొత్తగా నిర్వచించాలి. మొత్తం ఈ చట్టాన్ని పార్లమెంట్ తిరిగి పరిశీలించాల్సిన సమయం వచ్చిందని నేను భావిస్తున్నాను.

ప్రజలూ రాజ్యాంగ పరిరక్షకులే!

భారత రాజ్యాంగం 75 ఏళ్లుగా దృఢంగా నిలిచి ఉండటం గర్వకారణం. రాజ్యాంగాన్ని సమీక్షించాల్సిన అవసరం లేదు. ఎన్నో సవాళ్లను తట్టుకుని నిలబడింది. ప్రధాన పీఠికకు ఎటువంటి భంగం కలుగకుండా పార్లమెంట్ ఎటూ సవరణలు చేస్తుంటుంది. కాలానికి తగ్గట్లు కోర్టులూ సూచనలు చేస్తుంటాయి. అందుకే రాజ్యాంగం సాధారణ చట్టం తరహాలో కాకుండా తరతరాల శాశ్వత విలువలను ప్రతిబింబిస్తుంది. డాక్టర్ అంబేడ్కర్ చెప్పినట్లు, రాజ్యాంగ ఫలితం దానిని అమలు చేసే వ్యక్తులపై ఆధారపడి ఉంటుంది. కేవలం న్యాయవ్యవస్థ, ప్రభుత్వం మాత్రమే కాదు, ప్రజలకూ రాజ్యాంగ పరిరక్షణలో బాధ్యత ఉంది.

గత తీర్పుల సమీక్ష సహజం!

మన పాలనలో లోపాలున్నప్పటికీ ఆ పాలనను పూర్తిగా తిరస్కరించాలనడం సరికాదు. విధానాల్లో అపసవ్యతలు ఉన్నప్పటికీ మన దేశం సాధించిన ఎన్నో విజయాలను కూడా గుర్తించాలి. హక్కుల సాధనలో మనం గొప్ప ముందడుగు వేశాం. ఇది మనం అంగీకరించవలసిన అంశం. అవసరాలకు అనుగుణంగా గత తీర్పుల సమీక్షలు ఎలాగూ జరుగుతుంటాయి. ఉదాహరణకు అత్యవసర పరిస్థితుల్లో 'జీవించే హక్కు'ను తాత్కాలికంగా నిలిపేయవచ్చు' అని ఏడీఎం జబల్పూర్ కేసులో సుప్రీంకోర్టు చెప్పిన తీర్పును ఆ తర్వాత ఉపసంహరించుకోవటం జరిగింది. ఇలాంటి పరిస్థితి ఏ సమాజ చరిత్రలోనైనా ఉంటుంది.

జైలు కాదు... బెయిల్ ముఖ్యం!

ఉపా (ఉగ్రవాద కార్యకలాపాలు), పీఎంఎల్‌ఏ (మనీ ల్యాండరింగ్) వంటి కొన్ని నిరోధక చట్టాల విషయంలో బెయిళ్లకు చాలా కఠినమైన నియమాలు అమలవుతున్నాయి. ఇది ఒక సమస్యే. న్యాయవ్యవస్థలోని అసలు సూత్రం ఏమిటంటే.. 'ఆరోపణ నిరూపణ అయ్యేంతవరకు ఒక వ్యక్తి నిర్దోషే'నన్నది. జస్టిస్ కృష్ణ చెప్పినట్లు.. 'బెయిలు నియమం కావాలి, జైలు మినహాయింపు అవాలి.' (బెయిల్ మస్ట్ బి ది రూల్.. జైల్ మస్ట్ బి ఎక్సెప్షన్). ఏదైనా కేసులో అరెస్టయిన వ్యక్తి ప్రతి వాయిదాకు, అవసరమైనప్పుడూ, కోర్టు ముందుకు హాజరయ్యే హామీ ఇస్తే బెయిల్ ద్వారా ఆ వ్యక్తిని తాత్కాలికంగా విడుదల చేయవచ్చు.

కోర్టులు వ్యక్తి స్వేచ్ఛను కాపాడాలి!

జస్టిస్ సూర్యకాంత్ ఒక ప్రతిష్ఠాత్మకమైన తీర్పు ఇచ్చారు. నిర్దిష్ట సమయంలో విచారణ ముగియకపోతే కఠిన చట్టాలు ఉన్నా బెయిల్‌ను మంజూరు చేయవచ్చు. ఉదాహరణకు ఒక కేసులో 100 మంది సాక్షులు ఉన్నారు. వారందరి విచారణకు 5–7 సంవత్సరాలు పడుతుంది. ఈ కేసులో నిందితుడు చివరకు నిర్దోషిగా తేలితే అప్పటి వరకు దాదాపు ఐదు సంవత్సరాలు జైల్లో ఉండటం అన్యాయం. అందుకే ఆర్టికల్ 21 కింద వ్యక్తిగత స్వేచ్ఛను కోర్టులు సంరక్షించాల్సిన అవసరం ఉంది. సాక్షులను ప్రభావితం చేసే కొన్ని ప్రత్యేక పరిస్థితులలో తప్ప నిందితుల వ్యక్తిగత స్వేచ్ఛను రక్షించడం జిల్లా కోర్టుల నుండి సుప్రీంకోర్టు వరకు అన్నిటి బాధ్యత.

బెయిల్‌పై భిన్నమైన తీర్పులు తగ్గాలి!

బెయిల్ మంజూరు విషయంలో భిన్నత్వం నిజమే. కానీ సుప్రీంకోర్టులో ప్రతి సంవత్సరం 70 నుంచి 80 వేల కేసులు దాఖలవుతున్నాయి. 34 మంది జడ్జీలు ఒకే సారి ఒకే కేసును విచారించలేరు కనుక ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులున్న బెంచ్‌లుగా విభజించడం జరుగుతుంది. ఫలితంగా వ్యక్తిగత న్యాయమూర్తుల ఆలోచనల వల్ల తీర్పుల్లో భిన్నాభిప్రాయాలు వస్తాయి. అందువల్ల బెయిల్స్ విషయంలో భిన్నమైన తీర్పులు వెలువడవచ్చు. ఈ భిన్నత్వాన్ని తగ్గించవచ్చు కానీ పూర్తిగా నివారించడం సాధ్యం కాదు. అయితే వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన బెయిల్ విషయంలో మాత్రం ఏ బెంచ్‌కైనా ఒకే విధమైన ప్రాధాన్యత ఉండాలి. సుప్రీంకోర్టు నుండి హైకోర్టులకు, అక్కడి నుండి జిల్లా కోర్టులకు ఈ సందేశం చేరాలి.

> ఆరోపణ నిరూపణ అయ్యేంతవరకు ఒక వ్యక్తి నిర్దోషే! బెయిల్ నియమం కావాలి, జైలు మినహాయింపు కావాలి. నిర్దిష్ట సమయంలో విచారణ ముగియకపోతే... కఠిన చట్టాలు ఉన్నా బెయిల్ మంజూరు చేయవచ్చు. ఉదాహరణకు ఒక కేసులో వంద మంది సాక్షులు ఉన్నారు. వారి విచారణకు ఐదు నుండి ఏడు సంవత్సరాలు పట్టవచ్చు. ఈ కేసులో నిందితుడు చివరకు నిర్దోషిగా తేలితే... అప్పటి వరకు ఐదేళ్లు జైల్లో ఉండటం అన్యాయం. ఆర్టికల్ 21 ప్రకారం వ్యక్తి స్వాతంత్ర్యాన్ని పరిరక్షించాలి.

వెనకాడుతున్న జిల్లా కోర్టులు!

మన జిల్లా కోర్టులు బెయిల్ ఇవ్వాల్సిన కేసులలో కూడా ఇవ్వడం లేదు. ఫలితంగా ఏమవుతోందంటే... జిల్లా కోర్టు ద్వారా బెయిల్ సాధ్యమయ్యే కేసులు కూడా హైకోర్టు లేదా సుప్రీంకోర్టు వరకు వెళ్తాయి. ఇందులో పలు ప్రతికూల ప్రభావాలు ఉన్నాయి. మొదటిది ఆలస్యం. జిల్లా కోర్టు నుండి హైకోర్టు ద్వారా సుప్రీంకోర్టు వరకు కేసును తీసుకెళ్లేటప్పుడు తీవ్ర జాప్యం జరుగుతుంది. రెండవది వనరులు. ప్రతి ఒక్కరికీ సుప్రీంకోర్టు వరకు వెళ్లే వనరులు ఉండవు. వనరులు లేకపోవడంతో సుప్రీంకోర్టుకు వెళ్లలేకపోవచ్చు. మూడవది ఇలాంటి వ్యవస్థ సుప్రీంకోర్టుపై అనవసర పనిభారాన్ని మోపుతుంది. ఇది భారతదేశంలోని సంక్లిష్టత, వైవిధ్యం, కేసుల పరిమాణాన్ని సూచిస్తుంది. న్యాయమూర్తుల సంఖ్య పెంచడం కంటే సుప్రీంకోర్టుకు వచ్చే కేసులను పరిమితం చేయడం అవసరం. ప్రభుత్వం అతి పెద్ద కక్షిదారు కావడం వల్ల కేసుల భారమూ అధికమవుతోంది. కాబట్టి సంస్థాగత సమీక్ష అవసరం.


పదవీ విరమణ వయసు పెంచాలి!

న్యాయమూర్తులకు పదవీ విరమణ వయసు ఉండాల్సిందే. అయితే ఆ వయఃపరిమితిని పెంచవలసిన అవసరం కూడా ఉంది. అలాగని అమెరికా సుప్రీంకోర్టు తరహాలో న్యాయమూర్తులు ఎప్పటికీ పదవిలో కొనసాగడమనే పరిస్థితి ఉండకూడదు. కొత్త తరానికి అవకాశం రావాలి. ఇండియాలో ప్రస్తుత పదవీ విరమణ వయసు (జిల్లా జడ్జిలు 60, హైకోర్టు జడ్జిలు 62, సుప్రీంకోర్టు జడ్జిలు 65) తక్కువనే చెప్పాలి. సగటు జీవన ప్రమాణం పెరిగినందు వల్ల విరమణ వయసులనూ పెంచాలి. హైకోర్టు, సుప్రీంకోర్టుకు వేర్వేరు వయసులు ఉండకూడదు. అందరికీ సమానంగా 68 చేయాలి. దాని వల్ల సుప్రీంకోర్టుపై కేసుల ఒత్తిడి తగ్గుతుంది. ◆

దారిచూపింది గత ప్రభుత్వమే!

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం ప్రారంభించిన వాణిజ్యం – పరిశ్రమల శాఖ (ఆహార శుద్ధి)... ఆ రంగానికీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి కూడా ప్రయోజనకరంగా మారింది. విశాఖపట్టణంలో ఆగస్టు 29న జరిగిన ఒక సదస్సులో 'ఆహార శుద్ధి రంగంలో లక్ష కోట్ల పెట్టుబడులు' అంటూ చంద్రబాబు నాయుడు దీన్ని తనదన్నట్టు 'ఓన్' చేసుకున్నారు.

రాష్ట్ర విభజన తర్వాత 2014–2019 మధ్య కాలంలో కేవలం 'రాష్ట్ర ఆహార శుద్ధి సొసైటీ' మాత్రమే ఉండేది. దానికి సీఈఓ స్థాయిలో ఒక అధికారి ఉండేవారు. వ్యవసాయ రంగానికి వాణిజ్య పంటల సాగుతో జవజీవాలు ఇవ్వడానికీ, కార్పొరేట్ సంస్థల పెట్టుబడులు రాష్ట్రానికి తెచ్చి అభివృద్ధి వికేంద్రీకరణ ద్వారా వెనుకబడిన ప్రాంతాల్లో ఆహార పంటల సాగు, ఉత్పత్తుల శుద్ధి, ప్యాకింగ్ వంటి విభాగాల్లో మహిళలకు పెరిగే ఉపాధి వంటి బహుళ ప్రయోజనాలు లక్ష్యంగా ఈ శాఖను గత వైసీపీ ప్రభుత్వం 2020లో ప్రారంభించింది. దీనికున్న విలువను గ్రహించి కూటమి ప్రభుత్వం పరిశ్రమల శాఖ హోదా కల్పిస్తూ జీవో ఇచ్చింది.



ఈ శాఖను ప్రారంభించాక, ఎటువంటి ప్రచార పటాటోపాలు లేకుండానే నాటి సీఎం జగన్‌మోహన్ రెడ్డి 2023 జులై 26న తన క్యాంప్ ఆఫీస్ నుంచి రూ. 1,719 కోట్ల వ్యయంతో 11 'ఫుడ్ ప్రాసెసింగ్' యూనిట్లను ప్రారంభిస్తూ, ఐదింటికి 'వర్చువల్' పద్ధతిలో శంకుస్థాపన చేశారు. వీటి ఉత్పత్తి సామర్థ్యం ఏటా 3.14 లక్షల టన్నులు కాగా, 40,307 మంది రైతులు వీటి ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. వీటిని 'లొకేట్' చేసిన పద్ధతి మొదటి నుంచి జగన్ ప్రభుత్వ విధానమైన 'వికేంద్రీకరణ' సూత్రానికి కట్టుబడి జరిగింది. కూరగాయలు, పండ్ల 'ప్రాసెసింగ్ కేంద్రాలు అన్నమయ్య, చిత్తూరు జిల్లాలు; చిరు ధాన్యాల ప్రాసెసింగ్ కేంద్రం విజయనగరం జిల్లా ఎస్.కోట; ఉల్లిపాయలు, టమోటా 'ప్రాసెసింగ్' కోసం కర్నూలు జిల్లా తడకనపల్లిలను ఎంపిక చేయడం జరిగింది.

2023 అక్టోబర్ 5న తన ఆఫీస్ నుంచి 'గ్రీన్ ల్యాండ్ సాత్ లిమిటెడ్', 'డీపీ చాక్లెట్ ప్రైవేట్ లిమిటెడ్', 'బనానా ప్రాసెసింగ్ క్లస్టర్'... ఇలా మూడు 'ఫుడ్ ప్రాసెసింగ్' కంపెనీలు ఒకే రోజు 'వర్చువల్'గా ప్రారంభించి, మరో 9 పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. వీటి ద్వారా రూ. 3,008 కోట్లు పెట్టుబడి వస్తే, 70 వేల మందికి ఉద్యోగాలు దొరికాయి. 14 జిల్లాలకు చెందిన 91 వేలమంది రైతులకు ప్రయోజనం కలిగింది. అదే రోజు గంటకు 60 టన్నుల ఆయిల్ పామ్ గెలల నుంచి పామాయిల్ నూనె తీసే ఫ్యాక్టరీ– 'త్రీ ఎఫ్ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీని తూర్పు గోదావరి జిల్లా అయ్యవరం వద్ద రూ. 250 కోట్లతో ప్రారంభించడానికి ఒప్పందం జరిగింది. 50వేల మంది రైతులకు ప్రయోజనం, 1500 మందికి ఉపాధి కలుగుతోంది. ఇటువంటి 'ఫుడ్ ప్రాసెసింగ్' రంగం ఇప్పుడు రైతులకే కాక ఈ ప్రభుత్వానికి కూడా అక్కరకు వచ్చింది.

– జాన్సన్ చోరగుడి | అభివృద్ధి – సామాజిక అంశాల వ్యాఖ్యాత

డేటా పాయింట్

గన్ కల్చర్ కేరాఫ్ అమెరికా

అమెరికాలో తుపాకీ సంస్కృతి ఏ స్థాయిలో పెరిగిందంటే... 2022లో సగటున లక్ష మందిలో 4.38 మంది తుపాకీ కాల్పుల వల్లే మరణించారు. 2023లో మొత్తం 46,728 మంది ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. అన్ని దేశాల కంటే అమెరికాలో తుపాకీ కాల్పుల మరణాలు అధికం.



కరుణ – క్రౌర్యం



కరుణ, క్రౌర్యం వ్యతిరేకమైన లక్షణాలనీ, అందులో ఒకటి విజృంభించినప్పుడు మరొకటి ఉండదనీ మనం సాధారణంగా అనుకొంటూ ఉంటాము. సామాన్యంగా ప్రతి మనిషిలోనూ ఈ రెండూ ఉంటాయి. అయితే కొందరిలో కరుణ ఎక్కువగా ఉంటే క్రౌర్యం తక్కువగా ఉంటుంది. మరికొందరిలో క్రౌర్యం ఎక్కువగా ఉంటే కరుణ అత్యంత స్వల్పంగా ఉంటుంది. రెండు గుణాలూ ఒకేసారి వ్యక్తం అవ్వవు. అవి వ్యక్తం కావటానికి సిద్ధంగా ఉన్నా మనం ఏదో ఒక దాన్ని అణచివేస్తాం, కృత్రిమంగా ప్రవర్తిస్తాం. కానీ కొందరి జెన్ గురువుల జీవితాలనూ, శ్రీరామకృష్ణ పరమహంస జీవితాన్నీ పరిశీలిస్తే... వారు అన్ని సందర్భాల్లోనూ ఏ భావాన్నీ అణచివేయక, ఇతరులేమనుకొంటారో అని తలచక, అత్యంత సహజంగా స్పందించినట్టు తెలుస్తుంది.

ఒకసారి శ్రీరామకృష్ణుడు తన అనుచరునితో కలిసి రాజా సౌరేంద్ర టాగూర్ ఇంటికి వెళ్ళారు. రాజా సౌరేంద్ర అత్యంత భక్తితో ఎదురొచ్చి ఆహ్వానం పలికాడు. అయితే అతణ్ణి చూస్తూనే 'నేను నిన్ను రాజా, గీజా అంటూ సంబోధించలేను. ఎందుకంటే అది అసత్యం చెప్పినట్లవుతుంద'న్నారు రామకృష్ణులు. అది ఆయన నిష్కాపట్యాన్నీ, మనోధైర్యాన్నీ తెలియచేస్తుంది. మరొకరోజు 'వరాహ నగర' స్నాన ఘట్టంలో జపం చేస్తూ జయ ముఖర్జీ కనబడ్డాడు రామకృష్ణునకు! జపం చేస్తున్నా అతని చంచలమైన మనసు ఎక్కడెక్కడో తిరుగాడటాన్ని గమనించారు రామకృష్ణులు. అంతే... వెంటనే అతని దగ్గరకు వెళ్ళి రెండు చెంపలు వాయించారు. ఒక రోజు రాణీ రాస్మణి... కాళికాలయానికి వచ్చింది. రెండు పాటలు పాడమని రామకృష్ణులను కోరింది. ఆయన పాడుతుంటే హాయిగా విని ఆనందించక ఆ రాణి ఏదో కోర్టు వ్యవహారాన్ని గూర్చి యోచిస్తూ ఉంది. దాన్ని పసిగట్టిన రామకృష్ణులు మరేమీ ఆలోచింపక వెళ్ళి ఆమె చెంపలు వాయించారు (శ్రీ రామకృష్ణ కథామృతం–01). రామకృష్ణుల ఈ చర్యలన్నీ బయటికి క్రూరంగా కనపడినా వారి పట్ల ఆయనకున్న కరుణను తెలియచేస్తాయి. ఎవరైనా తప్పులు చేస్తూ పతనం వైపు పయనిస్తుంటే పెద్దలు వారిని తీక్షణంగా మందలించైనా సరే సక్రమమైన మార్గంలో నడిపించటమే వాస్తవంగా వారి పట్ల ఉన్న కరుణకు సంకేతమవుతుంది.

– రాచమడుగు శ్రీనివాసులు

ఉత్తరాఖండ్ ఈసీకి సుప్రీం జరిమానా

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్ పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థుల పేర్లు పలు ఓటరు జాబితాల్లో ఉన్నా పోటీ చేయొచ్చంటూ రాష్ట్ర ఎన్నికల కమిషన్(ఎస్ఈసీ) ఇచ్చిన సర్క్యులర్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. చట్టబద్ధమైన నిబంధనలకు విరుద్ధంగా మీరెలా వ్యవహరిస్తారంటూ ప్రశ్నించింది. హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం..రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు రూ.2 లక్షల జరిమానా విధించింది. ఉత్తరాఖండ్ పంచాయతీ రాజ్ చట్టం–2016కు వ్యతిరేకంగా ఎస్ఈసీ వివరణ ఉందంటూ ఉత్తరాఖండ్ హైకోర్టు పేర్కొంది. ఒకే వ్యక్తి ఒకే సమయంలో వేర్వేరు చోట్ల ఓటరుగా నమోదై ఉండరాదని ఆ చట్టం చెబుతోందని గుర్తు చేసింది. ఈ ఉత్తర్వును సవాల్ చేస్తూ ఎస్ఈసీ సుప్రీంకోర్టు గుమ్మం తొక్కగా చుక్కెదురవడం గమనార్హం. సుప్రీం తీర్పుపై కాంగ్రెస్ స్పందించింది. ఓటు చోరీని సుప్రీంకోర్టు బట్టబయలు చేసిందని, ఎన్నికల కమిషన్ అధికార బీజేపీతో చేతులు కలిపిందని ఆరోపించింది.

ఏజీగా వెంకటరమణి పునర్నియామకం



న్యూఢిల్లీ: సీనియర్ న్యాయవాది ఆర్ వెంకటరమణి(75) మరోసారి భారత అటార్నీ జనరల్ (ఏజీ)గా మళ్లీ నియమితులయ్యారు. వెంకటరమణి మూడేళ్ల పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. దీంతో ఈయనను మరో రెండేళ్ల పాటు ఏజీగా నియమిస్తూ కేంద్రం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఏజీలను వారి వినతి మేరకు స్వల్ప కాలానికి తాజాగా నియమించిన దాఖలాలున్నాయి. కేకే వేణుగోపాల్ స్థానంలో 2022 సెప్టెంబర్ 30వ తేదీన వెంకటరమణి ఏజీగా బాధ్యతలు చేపట్టారు. ఈ రాజ్యాంగ పదవికి కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు రాష్ట్రపతి నియామకం చేపడతారు.

తేజ్ ప్రతాప్ కొత్త పార్టీ 'జన్‌శక్తి జనతాదళ్'

పట్నా: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండగా ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ కొత్త పార్టీ ఏర్పాటు చేశారు. లాలు ఇటీవల తేజ్ ప్రతాప్‌ను పార్టీ నుంచి బహిష్కరించడం తెల్సిందే. దీంతో, ఆయన కొత్తగా జన్ శక్తి జనతాదళ్ పేరుతో పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. బిహార్‌లో తన పార్టీ సుదీర్ఘ పోరాటం చేయనుందని తెలిపారు. జాతీయ అధ్యక్షుడిని తానేనని, పార్టీ గుర్తు 'బ్లాక్ బోర్డ్'అంటూ శుక్రవారం ఎక్స్‌లో పార్టీ పోస్టర్‌ను షేర్ చేశారు.

వీర విహంగానికి వందనం



'మిగ్' పోస్టల్ స్టాంపు విడుదల చేస్తున్న ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్, మంత్రి రాజ్‌నాథ్



చండీగఢ్‌లో మిగ్–21కు వైమానిక దళం వీడ్కోలు కవాతు

గగన వీధుల్లో ఘన వీడ్కోలు

- 62 ఏళ్ల మిగ్–21 ప్రస్థానం ముగింపు
- భారత జాతీయ పతాకం గౌరవాన్ని నిలబెట్టింది
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

చండీగఢ్: మేఘావృతం కాని గగనం నీలిరంగులో మెరిసిపోయింది. ఆరు దశాబ్దాలకు పైగా భారతావనికి కొండంత అండగా నిలిచిన వీర విహంగానికి వీడ్కోలు పలికే వేళ.. ఆకాశం వెలిగిపోయింది. యుద్ధ విమానం మిగ్–21 సేవల ఉపసంహరణ ఉద్విగ్న భరిత క్షణాల్లో భారత గగన వీధిలో వాతావరణమిది. చండీగఢ్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో మిగ్–21 డీకమిషనింగ్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. భారత వైమానిక దళం యుద్ధ విమానాల బృందానికి వెన్నెముకగా ఉన్న ఈ ఐకానిక్ మిఖోయాన్–గురేవిచ్ మిగ్–21 ఫైటర్ జెట్‌లు శుక్రవారం చివరిసారిగా భారత గగనతలంలో ఎగిరాయి. దీంతో 62 ఏళ్ల మిగ్–21ల సుదీర్ఘ ప్రస్థానానికి తెర పడింది.

కనురెప్పవేయనివ్వని విన్యాసాలు

ఒక చారిత్రక అధ్యాయం ముగింపును సూచిస్తూ, లాంఛనప్రాయ ఫ్లైపాస్ట్, డీకమిషనింగ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భారతీయ వాయుసేనకు చెందిన ప్రఖ్యాత స్కైడైవింగ్ బృందం 'ఆకాశ్ గంగ'.. 8,000 అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేసి ఆకట్టుకుంది. తరువాత మిగ్–21 విమానం అద్భుతమైన ఫ్లైపాస్ట్, ఎయిర్ వారియర్ డ్రిల్ బృందం కచ్చితత్వంతో కూడిన కవాతు, వైమానిక వందనం కొనసాగాయి. ఫైటర్ పైలట్లు మూడు విమానాల 'బాదల్' ఫార్మేషన్, నాలుగు విమానాల 'పాంథర్' ఫార్మేషన్‌లో చివరిసారిగా గగనతలంపైకి దూసుకుపోయాయి. 'సూర్య కిరణ్' ఏరోబాటిక్ బృందం కూడా ఉత్కంఠభరితమైన విన్యాసాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. నంబర్ 23 స్క్వాడ్రన్‌కు చెందిన మిగ్–21 జెట్‌లు ఫ్లైపాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్నాయి. వాటికి 'వాటర్ కానన్ సెల్యూట్' (నీటి ఫిరంగి వందనం) ఇచ్చారు. 'జాగ్వార్', 'తేజస్' విమానాలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. వీడ్కోలు కార్యక్రమానికి నెల ముందు, రాజస్థాన్‌లోని బికనేర్‌లోని నల్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో మిగ్–21 చివరిసారిగా ఎగిరాయి. ఈ వీడ్కోలుకు గుర్తుగా, ఆగస్టు 18–19న భారత వాయుసేనాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ నల్ ఎయిర్ బేస్ నుంచి మిగ్–21 సోలో సోర్టీస్ నిర్వహించారు. 1981లో భారతీయ వాయుసేన చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన దిల్‌బాగ్ సింగ్, 1963లో ఇక్కడ మొదటి మిగ్–21 స్క్వాడ్రన్‌కు నాయకత్వం వహించడం విశేషం.

దశాబ్దాలపాటు భారతీయ భద్రతను మోసింది


మిగ్–21 కేవలం ఒక విమానం లేదా యంత్రం మాత్రమే కాదని.. అది దేశ గౌరవం, భారత్, రష్యాల మధ్య ఉన్న లోతైన సంబంధాలకు నిదర్శనమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. మిగ్–21 సేవల ఉపసంహరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. అరవయ్యేళ్లకు పైగా మిగ్–21 సాగించిన ప్రయాణం అసమానమైనదని అభివర్ణించారు. ఈ శక్తివంతమైన విమానం దశాబ్దాలుగా దేశ భద్రత భారాన్ని తన రెక్కలపై మోసిందని కొనియాడారు. మన ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి.. యుద్ధ వ్యూహాలను బలోపేతం చేసిందని పేర్కొన్నారు. భారత సైనిక విమానయాన చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించిన ఒక అధ్యాయానికి వీడ్కోలు పలుకుతున్నామని వ్యాఖ్యానించారు. 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధం, 1999 కార్గిల్ యుద్ధం, 2019 బాలాకోట్ వైమానిక దాడుల నుంచి ఇటీవలి ఆపరేషన్ సిందూర్ వరకు, మిగ్–21 మన సాయుధ దళాలకు అపారమైన శక్తిని అందించిందని వివరించారు. భారతీయ సైనిక విమానయాన ప్రయాణంలో అనేక గర్వించదగిన క్షణాలను ఈ విమానం జోడించిందని తెలిపారు. 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో ప్రతికూల పరిస్థితుల్లో మిగ్–21 విమానం ఢాకా గవర్నర్ హౌస్‌పై దాడి చేసిన రోజే.. ఆ యుద్ధం ఫలితం స్పష్టమైపోయిందని రాజ్‌నాథ్ సింగ్ గుర్తు చేసుకున్నారు. అదెలాంటి చారిత్రక మిషన్ అయినా.. మిగ్–21 భారతీయ జాతీయ పతాక గౌరవాన్ని ఉన్నతంగా నిలబెట్టిందన్నారు.

ఎప్పుడో సేవల ఉపసంహరణ

'మిగ్–21 గురించి మాట్లాడేటప్పుడు, భారతీయ వాయుసేన 60 ఏళ్ల నాటి విమానాలను నడుపుతోందన్న వ్యాఖ్యలు వింటుంటాం. కానీ 1960, 1970ల లో సాయుధ దళాల్లోకి వచ్చిన మిగ్–21 యుద్ధ విమానాలను చాలా కాలం క్రితమే సేవల నుంచి తొలగించారన్న ముఖ్యమైన వాస్తవాన్ని నేను స్పష్టం చేయాలనుకుంటున్నాను'.. అని రాజ్‌నాథ్‌సింగ్ ప్రకటించారు. వీడ్కోలు కార్యక్రమంలో భారతీయ వాయుసేన మాజీ చీఫ్‌లు ఏవై టిప్నిస్, ఎస్పీ త్యాగి, బీఎస్ ధనోవా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భారతదేశపు తొలి వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా సహా మిగ్ విమానాన్ని నడిపిన ఎందరో పైలట్లు పాల్గొన్నారు.

సోనమ్ వాంగ్‌చుక్ అరెస్టు

- యువతను రెచ్చగొట్టి హింసను ప్రేరేపించాడని ఆరోపణలు
- జాతీయ భద్రతా చట్టం కింద అదుపులోకి తీసుకున్న పోలీసులు
- లద్దాఖ్ నుంచి బయటకు తరలింపు
- లేహ్‌లో మొబైల్, ఇంటర్నెట్ సేవలు నిలిపివేత
- భద్రత కట్టుదిట్టం.. రంగంలోకి అదనపు బలగాలు



లేహ్/శ్రీనగర్: లద్దాఖ్ పర్యావరణ ఉద్యమకారుడు, సామాజికవేత్త సోనమ్ వాంగ్‌చుక్(59)ను పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు అరెస్టు చేశారు. లద్దాఖ్ రాజధాని లేహ్‌లో బుధవారం జరిగిన హింసాకాండలో నలుగురు మరణించగా, 70 మంది గాయపడిన సంగతి తెలిసిందే. యువతను రెచ్చగొట్టి హింసను ప్రేరేపించాడన్న కారణంతో జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ) కింద డీజీపీ ఎస్.డి.సింగ్ జమ్వాల్ ఆధ్వర్యంలో సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆయన సొంత గ్రామంలో అదుపులోకి తీసుకున్నారు. లేహ్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్తగా మొబైల్, ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. భద్రతను కట్టుదిట్టం చేశారు. అదనపు బలగాలను రంగంలోకి దించారు. వాంగ్‌చుక్‌ను లద్దాఖ్ నుంచి రాజస్తాన్‌లోని జోధ్‌పూర్‌కు తరలించారు. ఆయనపై ఏయే అభియోగాలు మోపారన్న దానిపై పోలీసుల ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రస్తుతం కేంద్ర పాలిత ప్రాంతం(యూటీ)గా ఉన్న లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఆయన కొన్నేళ్లుగా పోరాటం కొనసాగిస్తున్నారు. ఈ నెల 10న నిరాహార దీక్ష ప్రారంభించారు. డిమాండ్ల సాధన కోసం ఉద్యమకారులు బుధవారం ఇచ్చిన బంద్ పిలుపు హింసాత్మకంగా మారింది. లేహ్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కర్ఫ్యూ విధించారు. హింస నేపథ్యంలో వాంగ్‌చుక్ నిరాహార దీక్ష విరమించారు. లద్దాఖ్‌లో అశాంతి, ఉద్రిక్తతలకు వాంగ్‌చుక్ కారణమని కేంద్ర హోం శాఖ గురువారం ఆరోపించింది. అరబ్ వసంతం, నేపాల్ జెన్–జెడ్ ఉద్యమాల గురించి యువతకు నూరిపోస్తూ, వారిని రెచ్చగొట్టేలా ప్రకటనలు చేస్తూ హింసను ప్రేరేపిస్తున్నారని మండిపడింది.

నన్ను బలిపశువును చేయడానికి కుట్ర: వాంగ్‌చుక్

కేంద్ర ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలను వాంగ్‌చుక్ గురువారం ఖండించారు. హింస వెనుక తన ప్రమేయం లేదని తేల్చిచెప్పారు. ప్రజల డిమాండ్లను నెరవేర్చకుండా వారి దృష్టిని మళ్లించడానికే తనపై నిందలు వేస్తోందని ఆరోపించారు. తనను బలిపశువుగా మార్చడం పక్కనపెట్టి జనం ఆకాంక్షలు నెరవేర్చాలని హితవు పలికారు. మరోవైపు వాంగుచుక్ అరెస్టును కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఖండించారు.

ఆరోపణలు నిరూపించగలరా?: గీతాంజలి

సోనమ్ వాంగ్‌చుక్‌ను నేరస్తుడిలా పరిగణిస్తున్నారని ఆయన భార్య గీతాంజలి అంగ్మో మండిపడ్డారు. వాంగ్‌చుక్ ప్రతిష్టను దెబ్బతీయడానికి కేంద్రం తప్పుడు ప్రచారానికి తెరతీసిందని విమర్శించారు. పోలీసులు తమ ఇంటిపై దాడి చేశారని ఆరోపించారు. తన భర్తను జాతివ్యతిరేక శక్తిగా చిత్రీకరిస్తున్నారని ఆక్షేపించారు. ఎలాంటి విచారణ గానీ, కారణంగా గానీ లేకుండా ఆయనను బలవంతంగా లాక్కెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలా జరడం దారుణమని అన్నారు. తన భర్త ఐదేళ్లుగా శాంతియుతంగా పోరాడుతున్నారని, ఏనాడూ హింసను ప్రేరేపించలేదని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, విద్యావ్యాప్తి కోసం కృషి చేస్తూ ఎన్నో పురస్కారాలు పొందారని గుర్తుచేశారు. మేధావులకు, విద్యావేత్తలకు ఇచ్చే మర్యాద అదేనా? అని ప్రశ్నించారు. తన భర్తపై చేస్తున్న ఆరోపణలు నిరూపించగలరా? టీవీలో చర్చకు సిద్ధమా? అని కేంద్ర ప్రభుత్వ పెద్దలకు గీతాంజలి అంగ్మో సవాలు విసిరారు.

అరెస్టు దురదృష్టకరం

సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు అరెస్టు చేయడం దురదృష్టకరమని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. లద్దాఖ్ ప్రజలకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ వెన్నుపోటు పొడిచిందని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, అందుకే ప్రజలు పోరుబాట పట్టారని చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని, ఇప్పటికీ నిలబెట్టుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

10, 12 తరగతులకు ఎన్‌సీఈఆర్‌టీ జాతీయ స్థాయి సర్టిఫికెట్లు

న్యూఢిల్లీ: జాతీయ విద్యా పరిశోధన శిక్షణామండలి(ఎన్‌సీఈఆర్‌టీ)ఇకపై దేశవ్యాప్తంగా ఉన్న అన్ని విద్యా బోర్డులకు సమానంగా వర్తించే 10, 12వ తరగతుల సర్టిఫికెట్లను జారీ చేయనుంది. ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలకు, ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికకు ఇది ఉపయుక్తంగా ఉంటుందని అధికారులు తెలిపారు. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలోని పాఠశాల విద్య, సాక్షరతా విభాగం ఈమేరకు ఈ–గెజిట్‌లో నోటిఫికేషన్ ప్రచురించింది. 10, 12వ తరగతుల సర్టిఫికెట్లను జారీ చేసే బాధ్యతను అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ)కు అప్పగిస్తూ 2021 నవంబర్ 15వ తేదీన జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఇది భర్తీ చేయనుంది. జాతీయ విద్యా విధానం–2020 ప్రకారమే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, చట్ట ప్రకారం ఏర్పాటైన ప్రైవేట్ భారతీయ స్కూల్ బోర్డులకు ఈ విధానం వర్తిస్తుందని తెలిపింది. ఎన్‌సీఈఆర్‌టీ జారీ చేసిన సర్టిఫికెట్లను దేశవ్యాప్తంగా ఒకే రీతిలో పరిగణిస్తారు. దేశంలోని స్కూళ్లలో విద్యార్థుల వలసలు సజావుగా సాగటానికి ఇది తోడ్పడుతుందని ఎన్‌సీఈఆర్‌టీ స్పష్టం చేసింది.

మహిళా సాధికారతకు కృషి

- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- బిహార్‌లో 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' ప్రారంభం
- 75 లక్షల మంది మహిళల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున బదిలీ



పట్నా: బిహార్‌లో మహిళా సాధికారత కోసం ఎన్డీయే ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఆయన శుక్రవారం 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన'ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ పథకం 75 లక్షల మంది పేద మహిళల బ్యాంకు ఖాతాల్లోకి రూ.10,000 చొప్పున బదిలీ చేశారు. రూ.7,500 కోట్లతో ఈ పథకానికి బిహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 75 లక్షల మంది లబ్ధిదారులకు త్వరలో అదనంగా రూ.2 లక్షల చొప్పున అందజేయబోతున్నామని ప్రధాని వెల్లడించారు. అలాగే నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తామన్నారు. వారు స్వయం ఉపాధి పొందవచ్చని సూచించారు. 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన'పై మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. బిహార్ మహిళల ప్రగతి కోసం నితీశ్ కుమార్ ప్రభుత్వం కీలకమైన అడుగు ముందుకు వేసిందని అన్నారు. మన అక్కచెల్లెమ్మలు, ఆడబిడ్డలు ఉద్యోగాలు సంపాదిస్తే, స్వయం ఉపాధి పొందితే వారి కలలకు రెక్కలొచ్చినట్లేనని చెప్పారు. సమాజంలో వారి గౌరవం మరింత పెరుగుతుందని ఉద్ఘాటించారు. 11 ఏళ్ల క్రితం తాము తీసుకున్న 'జన్‌ధన్ ఖాతాల' సంకల్పం వల్లే ఈరోజు 75 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా డబ్బు బదిలీ చేయడం సాధ్యమైందని వివరించారు.

మహిళలకు ఇద్దరు సోదరులు

బిహార్ మహిళలకు నితీశ్ కుమార్, నరేంద్ర మోదీ అనే ఇద్దరు సోదరులు ఉన్నారని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. తమ సోదరీమణుల బాగు కోసం నిరంతరం కష్టపడి పని చేస్తున్నామని వెల్లడించారు. ఈ పథకాన్ని ఈ రోజు ప్రారంభించడం పట్ల గర్విస్తున్నానని స్పష్టంచేశారు. ఇటీవలే ప్రారంభించిన 'జీవిక నిధి సఖ్ సహకారి సంఘ్'ను ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజనతో అనుసంధానిస్తామని ప్రకటించారు. పీఎం ఉజ్వల యోజన, ఉచిత రేషన్ సరుకుల పంపిణీ, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలతో 8.5 కోట్ల మంది బిహారీల జీవితాలు మెరుగయ్యాయని పేర్కొన్నారు. దేశంలో 3 కోట్ల మంది మహిళలను లఖ్‌పతీ దీదీలుగా మార్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వెల్లడించారు. ఇప్పటికే 2 కోట్ల మందికిపైగా మహిళలు లఖ్‌పతీ దీదీలుగా మారారని ప్రధాని మోదీ హర్షం వ్యక్తంచేశారు.

గాజాలో పని పూర్తిచేసే తీరుతాం


- పాలస్తీనాకు మద్దతిస్తే ఉగ్రవాదానికి మద్దతిచ్చినట్లే
- ఒత్తిడికి పశ్చిమదేశాలు తలొగ్గినా ఇజ్రాయెల్ మాత్రం తగ్గదు
- ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో ఇజ్రాయెల్ ప్రధాని
- నెతన్యాహూ ప్రసంగాన్ని బహిష్కరించిన పలు దేశాలు
- ఆయన ప్రసంగం సమయంలో అనుకూల, వ్యతిరేక నినాదాలు



ఐక్యరాజ్య సమితి: గాజాలో హమాస్‌కు వ్యతిరేకంగా తాము చేపట్టిన యుద్ధం మధ్యలో ఆపే ప్రసక్తే లేదని, పని పూర్తిచేసి తీరుతామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ స్పష్టంచేశారు. గాజా యుద్ధం, పాలస్తీనా విషయంలో అంతర్జాతీయ ఒత్తిళ్లకు పశ్చిమదేశాలు తలొగ్గవచ్చేమో కానీ.. ఇజ్రాయెల్ మాత్రం వెనక్కు తగ్గదని తేల్చి చెప్పారు. ఐరాస సర్వప్రతినిధి సభను ఉద్దేశించి శుక్రవారం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కొన్ని దేశాలు నెతన్యాహూ ప్రసంగాన్ని బహిష్కరించాయి. కొన్ని దేశాల ప్రతినిధులు సభలోనే ఉండి నెతన్యాహూ ప్రసంగిస్తున్నప్పుడు ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిగా మరికొన్ని దేశాల ప్రతినిధులు ఇజ్రాయెల్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. అమెరికా మాత్రం ఎప్పటిలాగే ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలిచింది. చాలావరకు ముఖ్య దేశాలన్నీ ఈ సమావేశానికి జూనియర్ అధికారులను పంపి తమ నిరసనను తెలిపాయి. గాజాపై దాడులను ఆపాలని అంతర్జాతీయంగా ఎంతగా ఒత్తిళ్లు వస్తున్నా.. నెతన్యాహూ పట్టించుకోకపోవటంతో ఇటీవలే ఆస్ట్రేలియా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాలు పాలస్తీనా దేశాన్ని గుర్తిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. క్రమంగా అంతర్జాతీయంగా ఒంటరిగా మారుతున్నా నెతన్యాహూ వెనక్కి తగ్గేదే లేదు అని ప్రకటించారు. పాలస్తీనాను గుర్తించిన దేశాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 'పశ్చిమదేశాల నేతలు ఒత్తిళ్లకు తలొగ్గవచ్చు. కానీ, మీకు నేను ఒక హామీ ఇస్తున్నా.. ఇజ్రాయెల్ ఎప్పటికీ తలొగ్గదు. మీ అవమానకరమైన నిర్ణయం (పాలస్తీనాను దేశంగా గుర్తించటం) యూదులు, అమాయక పౌరులకు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుంది. యూదు వ్యతిరేక భావజాలం ఎప్పటికీ అంతమవదేమో.. కానీ, అది దారుణంగా చావాలి'అని పేర్కొన్నారు. ప్రసంగం సందర్భంగా నెతన్యాహూ, ఆయన బృందం ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిచేసి పౌరులను బందీలుగా తీసుకెళ్లిన ఘటనను చూపించే క్యూఆర్ కోడ్‌ను ధరించారు. 'ది కర్స్'పేరుతో రూపొందించిన ఓ మ్యాప్‌ను కూడా ప్రదర్శించారు.

నాటో చీఫ్ వ్యాఖ్యలను ఖండించిన భారత్

న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌పై రష్యా వ్యూహం గురించి భారత ప్రధాని నరేంద్ర మోదీ.. రష్యా అధినేత పుతిన్‌కు ఫోన్‌చేసి ఆరా తీశారంటూ నాటో సెక్రెటరీ జనరల్ మార్క్ రుటే చేసిన వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం ఖండించారు. రుటే వ్యాఖ్యలు ఆధారరహితం అని తేల్చిచెప్పారు. రష్యా నుంచి ముడి చమురు కొంటున్నందుకు భారత ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీగా టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ విషయంలో రష్యా వ్యూహం పట్ల మోదీ ఆసక్తి కనబర్చారని, ఇటీవల పుతిన్‌కు ఫోన్ చేసి ఆరా తీశారని మార్క్ రుటే చెప్పడం సంచలనం సృష్టించింది. జరగని సంభాషణ జరిగినట్లు మార్క్ రుటే ప్రకటించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని రణధీర్ జైస్వాల్ అన్నారు. ఆధారాలు లేకుండా మాట్లాడొద్దని రుటేకు హితవు పలికారు. ఉక్రెయిన్‌పై రష్యా వ్యూహం గురించి మోదీ తెలుసుకోలేదని స్పష్టంచేశారు. రష్యా నుంచి ముడి చమురు కొంటూనే ఉంటామని ఉద్ఘాటించారు. ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలు వద్దని సూచించారు. రష్యా నుంచి పశ్చిమ దేశాలు కూడా ముడి చమురు కొంటున్నాయని రణధీర్ జైస్వాల్ పరోక్షంగా గుర్తుచేశారు.



వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో మునీర్, షెహబాజ్

ట్రంప్ శాంతి దూత: షరీఫ్

- వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడితో పాక్ ప్రధాని, ఆర్మీ చీఫ్ భేటీ
- ప్రాంతీయ భద్రత, ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో సహకారంపై చర్చ
- పాకిస్తాన్‌లో పర్యటించాలంటూ ట్రంప్‌కు ఆహ్వానం

న్యూయార్క్/ఇస్లామాబాద్: అమెరికా–పాకిస్తాన్‌ల మధ్య బంధం నానాటికీ బలపడుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒకవైపు భారత్‌పై కన్నెర్ర చేస్తూ, మరోవైపు పాక్ పాలకులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ తాజాగా వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో సమావేశమయ్యారు. ప్రాంతీయ భద్రత, ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో పరస్పరం సహకారంతోపాటు పలు కీలక అంశాలపై వారు చర్చించారు. గత ఆరేళ్లలో వైట్‌హౌస్‌లో అడుగుపెట్టిన మొట్టమొదటి పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కావడం గమనార్హం. ట్రంప్‌ను శాంతిదూతగా షరీఫ్ అభివర్ణించారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఘర్షణలు నిలిపివేయడానికి ట్రంప్ నిజాయితీగా కృషి చేస్తున్నారని కొనియాడారు. భారత్, పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి రావడానికి ట్రంప్ సాహసోపేత, నిర్ణయాత్మక నాయకత్వమే కారణమని ఉద్ఘాటించారు. దక్షిణాసియాలో అతిపెద్ద యుద్ధం జరగకుండా ట్రంప్ నివారించారని పేర్కొన్నారు. ట్రంప్ నాయకత్వంలో అమెరికా–పాక్ సంబంధాలు రానున్న రోజుల్లో మరింత బలపడతాయని ఆశాభావం షెహబాజ్ షరీఫ్ వ్యక్తంచేశారు. వీలును బట్టి పాకిస్తాన్‌లో పర్యటించాలంటూ ట్రంప్‌ను సాదరంగా ఆహ్వానించారు. ఈ మేరకు పాక్ ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ భేటీ కంటే ముందు ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ఒక గొప్ప నాయకుడు వైట్‌హౌస్‌కు రాబోతున్నారని చెప్పారు.

మారిన ట్రంప్ వైఖరి

2019 జూలైలో అప్పటి పాకిస్తాన్ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ అమెరికాలో పర్యటించారు. వైట్‌హౌస్‌లో అప్పటి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలిశారు. ఇమ్రాన్ ఖాన్‌కు అతికష్టంమీద ట్రంప్ అపాయింట్‌మెంట్ దొరికింది. పాకిస్తాన్ అబద్ధాలు చెబుతోందని, అమెరికాకు దగా చేస్తూ సహాయం రూపంలో బిలియన్ల డాలర్ల నిధులు పొందుతోందని ట్రంప్ ఆ సమయంలో ఆరోపించారు. పాక్ భూభాగం ఉగ్రవాదులకు అడ్డాగా మారిపోయిందని మండిపడ్డారు. ట్రంప్ తర్వాత అమెరికా అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన జో బైడెన్ కూడా పాకిస్తాన్ పట్ల వ్యతిరేకంగానే వ్యవహరించారు. పాక్ ప్రధానమంత్రులతో కనీసం ఫోన్‌లో కూడా మాట్లాడేందుకు బైడెన్ ఇష్టపడలేదు. వారిని ఏనాడూ వైట్‌హౌస్‌కు ఆహ్వానించలేదు. ఇదిలా ఉంటే, ఈ ఏడాది జనవరిలో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత డొనాల్డ్ ట్రంప్ వైఖరి మారిపోయింది. పాక్ పట్ల పూర్తి సానుకూలంగా వ్యవహరిస్తున్నారు. పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ పట్ల ట్రంప్ అంతులేని అనురాగం ప్రదర్శిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

కశ్మీర్ ప్రజలకు మా మద్దతు

- స్వయం పాలన వారి ప్రాథమిక హక్కు: పాక్ ప్రధాని
- చర్చలకు సిద్ధంగా ఉన్నామని వ్యాఖ్య

ఐక్యరాజ్యసమితి: జమ్మూకశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితికి ముమ్మాటికీ భారత ప్రభుత్వమే కారణమని పాకిస్తాన్ ప్రధానమంత్రి షహబాజ్ షరీఫ్ విమర్శించారు. నిష్పక్షపాతంగా ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని జమ్మూకశ్మీర్ ప్రజలు కోరుకుంటున్నా రని, వారికి తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. స్వయం పాలన వారి ప్రాథమిక హక్కు అని తెలిపారు. సింధూ నది జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. ఈ ఒప్పందంలో ఎలాంటి ఉల్లంఘన జరిగినా అది తమపై యుద్ధంగా పరిగణిస్తామని వ్యాఖ్యానించారు. ఆయన శుక్రవారం ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశంలో ప్రసంగించారు. ఈ ఏడాది మే నెలలో జరిగిన ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. నాలుగు రోజులపాటు ఘర్షణ జరిగిందని, పాక్ వైమానిక దళం దాడుల్లో భారత్‌కు చెందిన ఏడు యుద్ధ విమానాలు ధ్వంసమయ్యాయని చెప్పారు. అన్ని కీలక అంశాలపై భారత్‌తో సమగ్ర చర్చలకు పాకిస్తాన్ సిద్ధంగా ఉందని స్పష్టంచేశారు. అన్ని రకాల వివాదాలకు చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే శాంతియుత పరిష్కారం కనిపెట్టాలన్నది తమ విధానమని పేర్కొన్నారు. భారత్‌తో సంప్రదింపులకు నిజాయితీతో కృషి చేస్తున్నామని చెప్పారు.

నోబెల్ బహుమతికి ట్రంప్ పేరు ప్రతిపాదిస్తున్నాం..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై షెహబాజ్ షరీఫ్ ప్రశంసల వర్షం కురిపించారు. దక్షిణాసియాలో భారీ యుద్ధం ఆగిందంటే అదంతా ట్రంప్ చలవేనని తేల్చిచెప్పారు. భారత్, పాక్‌ల మధ్య శాంతికోసం ట్రంప్ ఎంతగానో చొరవ తీసుకున్నారని వెల్లడించారు. ఆయన వల్లే యుద్ధం ఆగిపోయిందన్నారు. ట్రంప్ సేవలకు గుర్తింపుగా నోబెల్ శాంతి బహుమతి కోసం ట్రంప్ పేరును ప్రతిపాదిస్తున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారికంగా ట్రంప్ పేరును నామినేట్ చేస్తోందని తెలియజేశారు.

బ్రిటన్ పౌరులకు డిజిటల్ ఐడీ కార్డులు

అక్రమ వలసల నిరోధానికేనన్న ప్రధాని స్టార్మర్

లండన్: బ్రిటన్ పౌరులకు త్వరలో డిజిటల్ ఐడీ కార్డులు రానున్నాయి. ప్రభుత్వ సేవలు పొందేందుకు, ఉద్యోగాలు సంపాదించేందుకు కూడా ఈ కార్డులు తప్పనిసరి కానున్నాయి. బ్రిటన్ పౌరులతోపాటు దేశంలో శాశ్వత నివాస అర్హత పొందిన విదేశీయులకు కూడా ఈ డిజిటల్ ఐడీ కార్డులు అందజేస్తామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు. ఈ కార్డుల వల్ల పౌరుల వ్యక్తిగత గోప్యతకు ఎలాంటి ప్రమాదం వాటిల్లదని పేర్కొన్నారు. పౌరులు భౌతికమైన కార్డులు తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదని, స్మార్ట్ ఫోన్ లేని పౌరులు కూడా ఈ కార్డును అవసరమైన చోట వాడుకోవచ్చని వివరించారు. 20 ఏళ్ల క్రితమే వీటిని ప్రవేశపెట్టాలని ప్రయత్నించిన అప్పటి ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతతో వెనక్కి తగ్గింది.

నీట్ పీజీ ఆన్సర్ కీపై కేంద్రానికి సుప్రీం నోటీస్

న్యూఢిల్లీ: నీట్–పీజీ 2025 ఆన్సర్ కీని ప్రచురించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం శుక్రవారం నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(పీజీ)ని మరింత పారదర్శకంగా చేపట్టాలని, ఆన్సర్ కీని విడుదల చేయాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లను విచారించింది. అనంతరం, వీటిపై అభిప్రాయం కోరుతూ కేంద్ర ప్రభుత్వంతోపాటు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామ్స్ ఇన్ మెడికల్ సైన్సెస్‌కు నోటీసులు జారీ చేసింది.



అష్టాదశ శక్తి పీఠాల్లోని ఐదో శక్తి పీఠంలో వెలసిన శ్రీ జోగులాంబదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఐదోరోజు స్కందమాతగా భక్తులకు దర్శనమిచ్చారు - అలంపూర్




వరంగల్ శ్రీభద్రకాళి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు శ్రీలలితా మహాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. - హనుమకొండ కల్చరల్



నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజు అమ్మవారు స్కందమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు - బాసర



దసరా ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం శ్రీశైల భ్రమరాంబాదేవి స్కందమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
- శ్రీశైలం టెంపుల్



గద్వాల జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని రూ. 5,51,00,000 నగదుతో ధనలక్ష్మిగా అలంకరించారు. - గద్వాలటౌన్

క్లుప్తంగా...

ఎస్టీపీపీకి మరో అవార్డు



అవార్డు అందుకుంటున్న డీజీఎం స్వామిరాజు, ఈఈ పాల్‌వినీత్

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ)ను మరో అవార్డు వరించింది. మిషన్ ఎనర్జీ ఫౌండేషన్ న్యూఢిల్లీ ద్వారా బెస్ట్‌యాష్ మేనేజ్‌మెంట్, యుటిలైజేషన్, ఇనిషియేటివ్ అవార్డు లభించింది. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఎస్టీపీపీ డీజీఎం స్వామిరాజు, ఈఈ పాల్‌వినీత్ అవార్డు అందుకున్నారు. ఎస్టీపీపీ వరుసగా అవార్డులు అందుకోవడంపై సంస్థ డైరెక్టర్ (ఈఅండ్ఎం) తిరుమలరావు హర్షం వ్యక్తం చేశారు. ఎస్టీపీపీ అధికారులు, ఉద్యోగులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పర్యావరణహిత చర్యల్లో ముందంజలో నిలుస్తూ, ఎస్టీపీపీని అభివృద్ధి పథంలో నడిపించడానికి అధికారులు, ఉద్యోగులు చేస్తున్న కృషి ఫలితంగానే అవార్డులు వస్తున్నాయని పేర్కొన్నారు.

మంచాన్నే స్ట్రెచర్‌గా మార్చి..



బురద మార్గంలో మంచంపై మాసయ్యను తీసుకొస్తున్న బంధువులు

కరకగూడెం: అధ్వానపు రహదారులతో అటవీ ప్రాంత ప్రజల ప్రాణాలను కాపాడుకునేందుకు సాహసం చేయాల్సి వస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం ఆదివాసీ గ్రామమైన అశ్వాపురంపాడుకు చెందిన వృద్ధుడు మడకం మాసయ్య కొన్నేళ్లుగా టీబీతో బాధపడుతూ.. శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురయ్యాడు. ఆయనను ఆస్పత్రికి తీసుకెళ్లే అంబులెన్స్ వచ్చేందుకు రహదారి సక్రమంగా లేకపోవడంతో.. మాసయ్య కుటుంబీకులు, గ్రామస్తులు మంచాన్నే స్ట్రెచర్‌గా మార్చారు. చీకటికి తోడు బురద మార్గం కావడంతో.. కిలోమీటర్ మేర అటవీ మార్గంలో ప్రధాన రహదారి వద్దకు టార్చ్‌లైట్ల వెలుతురులో తీసుకొచ్చారు. అప్పటికే 108 అంబులెన్స్ సిద్ధంగా ఉండడంతో మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నత్త నడకన.. నాశనం

- పండ్లు, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం
- నల్లగొండ, మెదక్ జిల్లాల్లో తీవ్రమవుతున్న సమస్య
- పూత, చిగురు, కాయలను తినేస్తున్న భారీ నత్తలు
- ఉప్పునీరు, స్నెయిల్‌కిల్ మందులతో నివారణ
- జాగ్రత్తలు సూచిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

గుర్రంపోడు: ఆఫ్రికా నత్తలు తెలంగాణపై దండెత్తుతున్నాయి. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో పంటలకు తీవ్ర నష్టం కలిగించిన ఈ నత్తలు.. తాజాగా నల్లగొండ జిల్లాలో బత్తాయి, నిమ్మ, బొప్పాయి పంటలతోపాటు కూరగాయల పంటలపై దాడి చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో అధికంగా నత్తలు ఆశించి నష్టపరుస్తున్నట్లు ఉద్యానవన అధికారులు గుర్తించారు. అధిక తేమ, నీరు ఇంకని భూముల్లో ఆఫ్రికా నత్తల బెడద ఎక్కువగా ఉంది. ఈసారి అధిక వర్షాల వల్ల నత్తల వృద్ధి పెరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే అంటు మొక్కలను, వాటి కవర్లను పట్టుకుని ఇవి ఈ ప్రాంతానికి వచ్చి ఉంటాయని అంటున్నారు. గత ఏడాది కాలంగా సిద్దిపేట జిల్లాలో వీటి ఉధృతి పెరుగుతుండటంపై కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు తగు సూచనలు ఇచ్చారు. సంతతి వృద్ధిని విపరీతంగా పెంచుకునే ఈ నత్తలు ఎండపడని ప్రదేశాల్లో జీవిస్తాయి. పండ్లు, కూరగాయల పంటలకు కొత్తగా నత్తల బెడద ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని ప్రాంతీయ ఉద్యానవన శాఖాధికారి మురళి తెలిపారు.

భారీ ఆకారం.. భారీ నష్టం

గతంలో చిన్నసైజు నత్తలు మాత్రమే అక్కడక్కడ వర్షాకాలంలో కనిపించి ఎండాకాలంలో చనిపోయేవి. ఇప్పుడు పిడికెడు సైజులో ఉన్న పెద్ద సైజు ఆఫ్రికా నత్తలు నర్సరీల ద్వారా వలస వచ్చినట్లు తెలుస్తోంది. ఇవి చెట్టు బెరడు, కొమ్మలకు అతుక్కుని కొరుక్కు తింటాయి. ఇవి జిగురును విడుదల చేసి చెట్టుకు అతుక్కుని ఉంటాయి. వీటి నుంచి వచ్చే విసర్జన ద్వారా పంట అనారోగ్యానికి గురికావడంతో పాటు దిగుబడి కూడా తగ్గుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. బెరడు తినేయడం వల్ల చిన్న మొక్కలు చనిపోతున్నాయని, పెద్ద చెట్లపై కూడా పూత, పిందెలు తినేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.



వంగ మొక్కలను తినేస్తున్న నత్తలు

కూరగాయలను తొలిచేస్తున్నాయి

నా తోటలో బొప్పాయి మొక్కలకు, కూరగాయల పంటలకు నత్తలు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఇప్పటికే నల్లి ఉధృతితో నష్టం జరుగుతుండగా, కొత్తగా నత్తల సమస్య వచ్చి పడింది. బొప్పాయి మొక్క బెరడను పట్టుకుని ఉండి పూత, పిందెలను తినేస్తున్నాయి. రోజూ కట్టెలతో వీటిని రాల్చి మంటలో వేసి చంపాల్సి వస్తోంది. నేలబారు కూరగాయ పంటలకు నత్తల సమస్య తీవ్రంగా ఉంది, బీర, దోస, వంగ లాంటి పంటలను నత్తలు ఆశించి తీవ్ర నష్టం కల్గిస్తున్నాయి. నత్తలకు రక్షణగా ఉండే పెంకు వల్ల క్రిమిసంహారక మందు పిచికారీ చేసినా అవి లోపలకు వెళ్లి రక్షించుకుంటున్నాయి. అధికారులు, శాస్త్రవేత్తలు వీటి నివారణకు తగు చర్యలు సూచించాలి.

– కుంభం తిరుపతిరెడ్డి, రైతు, పిట్టలగూడెం, నల్లగొండ జిల్లా

లోతైన దుక్కులతో నివారణ

ఉద్యాన పంటలకు కొన్ని ప్రాంతాల్లో ఆఫ్రికా నత్తలు తీవ్ర నష్టం కలిగిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇవి గోనెసంచులు, మొక్కజొన్న పంట, విత్తనాలు, నూకకు ఆకర్షించబడి చల్లని వాతావరణంలో అధిక సంతానోత్పత్తిని చేసుకుంటాయి. నత్తలను ఏరివేయాలి. స్నెయిల్ కిల్ అనే మందును వాడి నత్తల ఉధృతిని నివారించుకోవాలి. వేసవి కాలంలో లోతైన దుక్కులు దున్నడం వల్ల భూమి వేడెక్కి నత్తల పెంకులు పగిలి నివారణ జరుగుతుంది.

– టి.సురేశ్‌రెడ్డి, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు

వారానికి మూడు రోజులు ఇలా చేస్తే సరి..

ఆఫ్రికా నత్తల నివారణకు ఒక కిలో ఉప్పును నాలుగు లీటర్ల నీటిలో కలిపి ఆ నీటిలో గోనె సంచిని తడిపి గట్లపై వేస్తే ఈ సంచులపైకి వెళ్లిన నత్తలు ద్రావణం ఘాటుకు చనిపోతాయి. ఆకర్షక ఎర ఏర్పాటులో భాగంగా 25 కిలోల వరి తవుడుకు వంద గ్రాముల థయోడీకార్బ్ గుళికలు, మూడు కిలోల బెల్లం, వంద గ్రాముల ఆముదాన్ని కలిపి చిన్న ఉండలుగా చేయాలి. ఈ ఉండలను బొప్పాయి, క్యాబేజీ ఆకుల కింద పెట్టాలి. వీటిని తిన్న ఆఫ్రికా నత్తలు చనిపోవడం లేదా నిర్వీర్యం అయిపోతాయి. అనంతరం వీటిని ఉప్పు ద్రావణంలో వేస్తే చనిపోతాయి. ఇలా వారానికి రెండు మూడు రోజుల పాటు 15 రోజుల వరకూ చేయాలి. నత్తల ద్వారా మానవులకు వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నందున వీటిని ఏరివేసే సమయంలో చేతికి తప్పనిసరిగా గ్లౌజులు ధరించాలి.

– గోవిందరాజులు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు

జనవరిలో చిన్నోడిని.. నేడు పెద్దోడిని..

- కుటుంబ కలహాలతో ఇద్దరు కొడుకులను చంపేసిన తల్లి
- మహబూబాబాద్ జిల్లాలో తల్లి అరెస్టు



మనీష్‌కుమార్, నిహాల్(ఫైల్)



శిరీష అరెస్టు చూపుతున్న రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజు

కేసముద్రం: కన్నబిడ్డలను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన తల్లే.. తొమ్మిది నెలల్లో ఇద్దరు కొడుకులను హత్య చేసింది. ఈ విషాద ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో చోటుచేసుకుంది. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపురం గ్రామానికి చెందిన ఉపేందర్, వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంఖానిపేటకు చెందిన శిరీషను ప్రేమవివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు కుమారులు మనీష్ కుమార్, మోక్షిత్, నిహాల్ ఉన్నారు. లారీడ్రైవర్‌గా పనిచేస్తున్న ఉపేందర్ తన తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. భర్త తనతో ప్రేమగా ఉండటం లేదని, ఎవరితోనో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని శిరీష మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. తాను ఆత్మహత్య చేసుకుంటే పిల్లలు అనాథలు అవుతారని శిరీష భావించింది. ముందుగా బిడ్డలను చంపి, ఆ తర్వాత తాను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో ఈ ఏడాది జనవరి 15న రెండేళ్ల చిన్నకుమారుడు నిహాల్‌ను నీటిసంపులో పడేసి, ఊపిరాడకుండా చేసి హత్య చేసింది. ప్రమాదవశాత్తు సంపులో పడి చనిపోయినట్లు చిత్రీకరించింది. ఆ తర్వాత గత జూలై 31న రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న పెద్దకుమారుడు మనీష్ మెడపై కత్తితో దాడి చేసింది. గుర్తుతెలియని వ్యక్తులు ఈ దాడి చేశారని అందరూ భావించారు. ఈనెల 24న ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని చూసి మనీష్ (6) మెడకు నైలాన్‌దారం చుట్టి హత్య చేసింది. ఏమీ తెలియనట్లుగా బతుకమ్మ ఆడేందుకు వెళ్లింది. శిరీష అత్త మంగమ్మ పనికి వెళ్లి వచ్చింది. మనీష్ ఎక్కడున్నాడని శిరీషను అడగ్గా, జ్వరంగా ఉంటే ఇంట్లో పడుకోబెట్టానని చెప్పింది. అన్నం తినిపిద్దామని మనుమడి వద్దకు వెళ్లి లేపే ప్రయత్నం చేయగా, మనీష్ చనిపోయి ఉండటంతో కేకలు పెడు తూ బోరున విలపించింది. శిరీషపై అనుమానం వచ్చిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారించడంతో ఇద్దరు కుమారులను తానే చంపినట్లు ఒప్పుకుంది. శిరీషను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సర్వయ్య తెలిపారు.

పండుగ తర్వాత నీటి వనరుల్లోకి చేప పిల్లలు

సాక్షి, హైదరాబాద్: దసరా పండుగ తర్వాత నీటి వనరుల్లో ఉచిత చేప పిల్లలను వదిలేందుకు మత్స్యశాఖ సన్నాహాలు చేస్తోంది. 2025–26 సంవత్సరానికి చేప పిల్లల పంపిణీకోసం టెండర్లు ఆహ్వానించగా, రాష్ట్రవ్యాప్తంగా 88 బిడ్స్ దాఖలు అయ్యాయి. ఇందులో మత్స్యశాఖ 66 బిడ్లను ఖరారు చేసింది. పాతవారితో పాటు కొత్తవారు కూడా బిడ్స్ దాఖలు చేశారు. అయితే ఇందులో ఎవరైనా రెండేసి బిడ్స్ దాఖలు చేశారా? వారి గత చరిత్ర ఎలా ఉంది.. అనే అంశాలను క్షుణంగా తనిఖీ చేసిన తర్వాతే బిడ్స్‌ను ఫైనల్ చేసినట్లు తెలిసింది. కాగా, చేప పిల్లల సరఫరాలో ఎక్కడ కూడా తప్పిదాలు జరగకుండా, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని మత్స్యశాఖ అధికారులు తెలిపారు. 33 జిల్లాల్లోని 26,326 నీటి వనరుల్లో రూ.93.62 కోట్ల వ్యయంతో 84.62 కోట్ల చేప పిల్లలను విడుదల చేస్తారని తెలుస్తోంది. అదే విధంగా 10 కోట్ల రొయ్య పిల్లలను 300 నీటి వనరుల్లో రూ. 28.60 కోట్లతో విడుదల చేయనున్నారు.

రూ. 25 కోట్ల పాత బకాయిలు విడుదల!

గతంలో చేప పిల్లలను సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం రూ.80 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని కాంట్రాక్టర్లు అనేక సార్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో మొత్తం బకాయిల్లో రూ. 25 కోట్లు ప్రభుత్వం చెల్లించినట్లు తెలిసింది. మిగతా వాటిని కూడా విజిలెన్స్ విచారణ ముగియగానే విడతల వారీగా చెల్లిస్తామని కాంట్రాక్టర్లకు మత్స్యశాఖ హామీ ఇచ్చినట్లు సమాచారం.

క్లుప్తంగా...

సీపీఐ జాతీయ కమిటీ సభ్యులకు నేతల అభినందనలు



సాక్షి, హైదరాబాద్: చండీగఢ్‌లో జరిగిన సీపీఐ జాతీయ మహాసభల్లో జాతీయ కార్యదర్శిగా పల్లా వెంకటరెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కూనంనేని సాంబశివరావు ఎన్నిక వడం పట్ల ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో వారిని కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, ఇ.టి.నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితరులు పల్లా వెంకటరెడ్డి, కూనం నేని సాంబశివరావులకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సీపీఐ జాతీయ సమితిలో తెలంగాణకు సముచిత స్థానం కల్పించారని వారు పేర్కొన్నారు.

రాజస్తాన్‌కు భారీగా పెట్టుబడులు

సీఎం భజన్‌లాల్ శర్మ



సాక్షి, హైదరాబాద్: రాజస్తాన్ రాష్ట్రానికి పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తున్నాయని.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ చెప్పారు. గత ఏడాది డిసెంబర్ 10వ తేదీన నిర్వహించిన ప్రవాసీ రాజస్తాన్ దివస్ కార్యక్రమంలో రూ.35 లక్షల కోట్ల పెట్టుబడులకు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటే.. ఇప్పటి వరకు రూ.7 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యాయని వెల్లడించారు. వచ్చే డిసెంబర్ 10న జైపూర్‌లో నిర్వహించనున్న ప్రవాసీ రాజస్తాన్ దివస్‌లో భాగంగా శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో రాజస్తానీ వ్యాపారులు, పారిశ్రామికవేత్తలతో సమావేశమై పెట్టుబడులు పెట్టాలని కోరారు. పెట్టుబడులు పెట్టే వారికి మూడు రోజుల్లోనే అన్ని అనుమతులు ఇస్తున్నామని, భూ కేటాయింపులు కూడా చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సౌర విద్యుత్‌లో భారతదేశంలోనే రాజస్తాన్ మొదటిస్థానంలో ఉందని చెప్పారు. రాజస్తాన్‌ను 350 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాజస్తాన్ పరిశ్రమల మంత్రి బిష్ణోయ్ మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ రాజస్తాన్ రైజింగ్, లీడింగ్‌లో ఉందన్నారు. సమావేశంలో సురానా పరిశ్రమల చైర్మన్ నరేంద్ర సురానా, రాజస్తాన్ ఫౌండేషన్ హైదరాబాద్ చాప్టర్ పవన్ బన్సల్, రాజస్తాన్ కార్మిక శాఖ కార్యదర్శి రమేశ్ తదితరులు మాట్లాడారు.

అరబిందో ఫార్మాను ఆదివారం తగలబెడతా

- ఆలోగా కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హెచ్చరిక



జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా పోలేపల్లి సెజ్‌లో ఉన్న అరబిందో ఫార్మా పరిశ్రమను ఆదివారం తగలబెడతానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హెచ్చరించారు. పరిసర ప్రాంతాలను కాలుష్యంతో నింపేస్తున్న అరబిందో ఫార్మాపై చర్యలు చేపట్టాలని అధికారులను, కాలుష్య నియంత్రణ మండలిని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదన్నారు. సమీప చెరువులోకి కలుషిత జలాలను వదలడం వలన చేపలతోపాటు మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు పంటలు పండక నష్టపోతున్నారని వాపోయారు. ఫార్మా పరిశ్రమ నుంచి వెదజల్లుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని అసెంబ్లీలో ఫిర్యాదు చేసినా కాలుష్య నియంత్రణ మండలి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అధికారులు, కంపెనీ యాజమాన్యం శనివారం కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని, లేకపోతే ఆదివారం ఉదయం 11 గంటలకు అరబిందో కంపెనీని తగలబెడతానని హెచ్చరించారు.

జూబ్లీహిల్స్ అభ్యర్థిగా మాగంటి సునీత

బీఆర్‌ఎస్ టికెట్ ఖరారు చేసిన కేసీఆర్

- మాగంటి గోపీనాథ్ నిబద్ధత నేపథ్యంలోనే నిర్ణయం
- ఎర్రవల్లి నివాసంలో పార్టీ కీలక నేతలతో భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో హరీశ్‌రావు, మహమూద్ అలీ, పద్మారావు, సబితా, కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య సునీత పోటీ చేస్తారు. ఈ మేరకు ఆమె పేరును పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఖరారు చేసి శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. సీనియర్ నాయకుడు, వరుసగా మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన మాగంటి గోపీనాథ్‌కు ఉన్న ప్రజాదరణను దృష్టిలో పెట్టుకుని ఆయన భార్య సునీత పేరును కేసీఆర్ ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నిస్వార్థ నేతగా మాగంటి గోపీనాథ్ నిబద్ధతను పరిశీలించిన తర్వాత, ఆయన కుటుంబానికి అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ ప్రకటించింది.

ఎర్రవల్లి నివాసంలో కీలక భేటీ

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థిగా సునీత పేరును ఖరారు చేసిన నేపథ్యంలో కేసీఆర్ శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో పార్టీ నేతలతో భేటీ నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతో పాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, పద్మారావు గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీతో పాటు మరికొందరు ఈ భేటీలో పాల్గొన్నారు. వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వెళ్లిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కేసీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. కాగా ఉప ఎన్నికలో అనుసరించాల్సిన ప్రచార వ్యూహంపై నేతలకు అధినేత దిశా నిర్దేశం చేశారు. జాతీయ, రాష్ట్ర రాజకీయాలు, కాంగ్రెస్, బీజేపీ విధానాలు, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వైఫల్యం, రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విశ్లేషించారు. హైదరాబాద్ నగరాభివృద్ధిలో బీఆర్‌ఎస్ పాత్ర, రేవంత్ పాలనలో హైదరాబాద్ ఇమేజీకి భంగం వాటిల్లిన తీరు తదితరాలను ప్రస్తావిస్తూ వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన తీరుపై కేసీఆర్ దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం.

కేటీఆర్‌తో సునీత భేటీ

జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తన పేరును ఖరారు చేయడంపై మాగంటి సునీత హర్షం వ్యక్తం చేశారు. పార్టీ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో తెలంగాణ భవన్‌లో ఆమె సమావేశమయ్యారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు రమణ, దాసోజు శ్రవణ్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఇలావుండగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని రహమత్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ బూత్ ఇన్‌చార్జిల సమావేశం శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగింది. ఎమ్మెల్సీలు ఎల్.రమణ, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ప్రచార వ్యూహంపై పార్టీ యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు.

మాగంటి సునీత బయోడేటా

పేరు	:	మాగంటి సునీత
నియోజకవర్గం	:	జూబ్లీహిల్స్ నియోజకవర్గం
వయసు	:	54 ఏళ్లు
స్వస్థలం	:	విజయవాడ
విద్యార్హత	:	పదో తరగతి
సంతానం	:	ఇద్దరు కూతుళ్లు, కుమారుడు
రాజకీయ నేపథ్యం	:	ఎమ్మెల్యే మాగంటి మరణం

తర్వాత సునీత రాజకీయాల్లోకి వచ్చారు. మాగంటి అభిమానులకు, బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా నిలుస్తూ పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాగంటి ఆశయాలను, బీఆర్‌ఎస్ నాయకత్వ పటిమను ప్రజల్లోకి తీసుకెళ్తూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు.

బావా బామ్మర్దుల తప్పుడు ప్రచారం

భువనగిరి ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వం తీసుకునే మంచి నిర్ణయాలు బావ, బామ్మర్దులకు నచ్చవని, తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించి విష ప్రచారం చేస్తారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. అధికారం కోల్పోయిన తర్వాత రెండేళ్లుగా.. వారిద్దరూ చేసే పని ఇదేనని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన ధ్వజమెత్తారు. మెట్రోకు బీఆర్‌ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని, కేటీఆర్, హరీశ్ రావు ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడు తున్నారని విమర్శించారు. మెట్రో రెండో దశను మొదలుపెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదిసార్లు కేంద్ర మంత్రులను కలిశారని గుర్తు చేశారు. మెట్రో విషయంలో గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏమీ చేయలేదని తెలిపారు. మెట్రో రాకుండా అడ్డుకున్నదే బీఆర్‌ఎస్ నాయకులని విమర్శించారు.

యాసంగికి యూరియా ఇప్పుడే పంపండి

- సెప్టెంబర్‌లో 1.84 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా
- రాష్ట్రానికి ఏప్రిల్ నుంచి 7.88 లక్షల మెట్రిక్ టన్నులు
- యాసంగి కోసం ముందుగానే పంపాలని కేంద్రాన్ని కోరాం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఈ నెలలో సమయానికి యూరియా సరఫరా కావడం వల్ల రైతులకు ఎంతగానో ఊరట లభించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. వచ్చే యాసంగి అవసరాలకు అక్టోబర్ నుంచే యూరియా సరఫరా చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి 7.88 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందిందని, అందులో సెప్టెంబర్‌లోనే 1.84 ఎల్‌ఎంటీ సరఫరా అయిందని వివరించారు. గత నెలలో ప్రతిసారీ కేటాయించిన కోటాకంటే తక్కువ యూరియా సరఫరా కావడం వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు, దిగుమతి చేసుకొనే యూరియా టెండర్లలో ఆలస్యం వంటి కారణాల వల్ల రాష్ట్రాలకు యూరియా సరఫరాలో ఆలస్యం జరిగిందని తెలిపారు. సీఎంతోపాటు రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవటంతో సెప్టెంబర్‌లో అధికంగా సరఫరా చేసిందని పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో కేటాయించిన 1.60 లక్షల మెట్రిక్ టన్నులకు బదులు 25వ తేదీ వరకు 1.84 ఎల్‌ఎంటీ యూరియా రాష్ట్రానికి పంపిందని చెప్పారు.

నేడు రాష్ట్రానికి భారీగా యూరియా

ఇప్పటికే అందిన స్టాకుతోపాటు శనివారం నాటికి సీఐఎల్, ఐపీఎల్–గంగవరం, ఎన్‌ఎఫ్‌ఎల్–వైజాగ్, ఐపీఎల్–జూపిటర్, ఇఫ్కో, నర్మద, ఎన్‌బీసీఎల్– సింఫణీ, స్పిక్ కంపెనీల నుంచి 9,864 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి రానుందని మంత్రి తుమ్మల తెలిపారు. మరో 9,674 మెట్రిక్ టన్నులు వరంగల్, మంచిర్యాల, గద్వాల, కరీంనగర్, పందిళ్లపల్లి, జడ్చర్ల, తిమ్మాపూర్ రైల్వే రేక్ పాయింట్లకు చేరుకొని, అక్కడి నుంచి జిల్లాలకు సరఫరా అవుతుందని వివరించారు. ఆయా కంపెనీల నుంచి మరో 34,700 మెట్రిక్ టన్నుల రేక్ ప్లాన్ ఉందని, ఇది ఈ నెలాఖరు వరకు రాష్ట్రానికి చేరుకునే అవకాశం ఉందని చెప్పారు. గత వానాకాలంలో ఈ సమయానికి 9.30 ఎల్‌ఎంటీ యూరియా అమ్మకాలు జరగగా, ఈ సంవత్సరం 9.50 ఎల్‌ఎంటీ సరఫరా చేసినట్లు తెలిపారు. రానున్న యాసంగి కోసం అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో 2 ఎల్‌ఎంటీలకు తగ్గకుండా సరఫరా చేయాలని కేంద్రాన్ని కోరినట్టు చెప్పారు.

కాంగ్రెస్‌లో మదర్ డెయిరీ వార్

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఒక డైరెక్టర్ పదవి కోసం ఎమ్మెల్యేల మధ్య విభేదాలు
- బంధుత్వాల కోసం బీఆర్‌ఎస్‌తో ములాఖత్ అయ్యారని ఎమ్మెల్యే శామేల్ ఆరోపణ
- ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యపై నేరుగా విమర్శలు
- వివాదంపై ఢిల్లీ నుంచి పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఆరా

సాక్షి, హైదరాబాద్/సాక్షి, యాదాద్రి: అధికార కాంగ్రెస్‌లో మదర్ డెయిరీ ముసలం పుట్టింది. మదర్ డెయిరీ డైరెక్టర్ ఎన్నికల సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పార్టీ ఎమ్మెల్యేల మధ్య విభేదాలు పతాక స్థాయికి చేరాయి. ఈ ఎన్నికల్లో డైరెక్టర్ పదవుల కోసం బీఆర్‌ఎస్‌తో ములాఖత్ అయ్యారంటూ ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఇతర ఎమ్మెల్యేలపై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామేల్ తీవ్ర ఆరోపణలు చేశారు. తన ఓటమికి ప్రయత్నించిన బీఆర్‌ఎస్ నేతను మదర్ డెయిరీ డైరెక్టర్‌గా గెలిపించాలని ప్రయత్నిస్తున్నారని, ఇందుకు బంధుత్వాలను వాడుకుంటున్నారని ఆయన బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. అయితే, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను ఉద్దేశించి ఏకంగా భువనగిరిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మరీ శామేల్ ఆరోపణలు చేయడం పార్టీలో చర్చనీయాంశమవుతోంది. కాగా, ఈ వివాదంపై ఢిల్లీ నుంచి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరా తీశారు. విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన శామేల్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారని, తాను సొంత పార్టీ ఎమ్మెల్యేనుద్దేశించి ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందో శామేల్ వివరణ ఇచ్చారని సమాచారం.

ఏం జరిగిందంటే...!

మదర్ డెయిరీకి ఏటా ముగ్గురు డైరెక్టర్లు కొత్తగా ఎన్నికవుతుంటారు. ఈసారి ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే ఈ ముగ్గురు డైరెక్టర్లను ఎన్నుకోవాల్సి ఉంది. జనరల్ (2), మహిళ (1) స్థానాలకు జరగనున్న ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య ఒప్పందం కుదిరిందనే చర్చ జిల్లా రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. తొమ్మిది మంది అభ్యర్థులు పోటీ పడుతున్న ఈ ఎన్నికల్లో ఒక జనరల్, ఒక మహిళా స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను, మరో జనరల్ స్థానంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించేలా ఈ ఒప్పందం జరిగిందనేది బహిరంగ రహస్యమేనని ఆ వర్గాలంటున్నాయి. ఇందుకు తుంగతుర్తి ఎమ్మెల్యే శామేల్ మినహా మూడు డైరెక్టర్ పోస్టులతో సంబంధమున్న నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలందరూ సుముఖంగానే ఉన్నారని, బీఆర్‌ఎస్ మాజీ మంత్రితోపాటు భువనగిరి డీసీసీ అధ్యక్షుడికి బంధువైన బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించేలా రెండు పార్టీల నేతలు ఒప్పందానికి వచ్చారని తెలుస్తోంది. అయితే, ఈ ఎన్నికల్లో తన అసెంబ్లీ స్థానం పరిధిలో ఉన్న డైరెక్టర్ స్థానానికి తాను ప్రతిపాదిస్తున్న అభ్యర్థిని కాకుండా గత అసెంబ్లీ ఎన్నికల్లో తన ఓటమి కోసం యత్నించిన వ్యక్తిని గెలిపించేందుకు ఇతర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు సిద్ధపడడం శామేల్‌కు మింగుడుపడటం లేదని, అందుకే ఆయన బీర్ల అయిలయ్యను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారని తెలుస్తోంది. ఈ విభేదాలు ఎన్నికలు ముగిసిన తర్వాత సమసిపోతాయా? లేదంటే కొనసాగుతాయా? ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఐక్యత దెబ్బతిన్నట్టేనా? ఈ అంశంలో టీపీసీసీ ఏం చేస్తుంది? సీఎం ఎలా స్పందిస్తారన్నది వేచిచూడాల్సిందే!

స్పీకర్‌ను కలిసిన ‘ఆ నలుగురు ఎమ్మెల్యేలు’

- మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి కడియం శ్రీహరి, కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్ భేటీ
- 29 నుంచి ఎమ్మెల్యేల ప్రత్యక్ష విచారణ చేపట్టే అవకాశం
- 30 వరకు గడువు కోరిన శ్రీహరి?

సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్‌లు శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిశారు. మధ్యాహ్నం అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఒక్కో ఎమ్మెల్యే స్పీకర్‌ను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, స్పీకర్ ఇచ్చిన నోటీసులకు సమాధానమిచ్చేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఇవ్వాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పీకర్‌ను కోరినట్టు సమాచారం. మరోవైపు ఎమ్మెల్యేలకు ఇచ్చిన నోటీసులపై ఈ నెల 29వ తేదీ నుంచి స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రత్యక్ష విచారణ జరుపుతారనే చర్చ జరుగుతోంది. వచ్చే నెల 5 నుంచి 12 వరకు ఆయన బార్బడోస్‌లో జరిగే కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ 68వ వార్షిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్తున్నారు. శాసనమండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్, అసెంబ్లీ కార్యదర్శి బృందంతో కలిసి ఆయన వెళ్లనున్నారు. ఆ సదస్సు తర్వాత కూడా కొన్ని దేశాల్లో టూర్ ఉంటుందని, అనంతరం ఆయన అక్టోబర్ 23వ తేదీన హైదరాబాద్ చేరుకుంటారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో స్పీకర్ విదేశీ పర్యటనకు ముందే ఫిరాయింపు ఆరోపణలపై ఎమ్మెల్యేలను ప్రత్యక్షంగా విచారించే అవకాశముందని సమాచారం.

మెట్రోను ప్రభుత్వం నడిపితే తప్పేంటి?

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీశ్

సాక్షి, హైదరాబాద్: మెట్రో ప్రాజెక్టును రాష్ట్రానికి తెచ్చిన కాంగ్రెస్ పార్టీకే కేటీఆర్ పాఠాలు చెప్పే ప్రయత్నాలు చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీశ్ అన్నారు. మెట్రో పనులు జరగకుండా అడ్డుపడిన బీఆర్‌ఎస్ నేతలు.. ఇప్పుడు ఎల్‌అండ్‌టీ గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేటీఆర్ మాటలు వింటుంటే ఎల్‌అండ్‌టీతో బీఆర్‌ఎస్ ఒప్పందం చేసుకుందేమోననే అనుమానాలు వస్తున్నాయన్నారు. అసలు మెట్రోను ప్రభుత్వం నడిపితే బీఆర్‌ఎస్‌కు ఏమవుతుందని ప్రశ్నించారు.

బీసీకే జూబ్లీహిల్స్ టికెట్?

- పోటీలో ఉన్న బీసీ అభ్యర్థుల పేర్లపై సర్వే చేయండి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌కు ఖర్గే సూచన



ఖర్గేకు పుష్పగుచ్ఛమిస్తున్న మహేశ్‌గౌడ్

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా బీసీ నినాదాన్ని ఎత్తుకున్న కాంగ్రెస్ అధిష్టానం.. తెలంగాణలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం టికెట్‌ను బీసీ వర్గానికి ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. బిహార్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ నినాదంతోనే ఆ పార్టీ ముందుకెళ్తోంది. అలాగే, తెలంగాణలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీసీ నినాదాన్నే అస్త్రంగా మలచుకోవాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాష్ట్ర నాయకత్వంతో చర్చించినట్లు సమాచారం. డీసీసీ అభ్యర్థుల ఎంపిక కోసం నియమించిన ఏఐసీసీ పరిశీలకుల సమావేశానికి హాజరయ్యేందుకు ఢిల్లీకి వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ శుక్రవారం ఖర్గేతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ టికెట్ కేటాయింపు, స్థానిక సంస్థల ఎన్నికలు, 42 శాతం రిజర్వేషన్లు తదితర అంశాలపై వివరణ ఇచ్చినట్లు తెలిసింది. జూబ్లీహిల్స్ స్థానం కోసం బొంతు రామ్మోహన్, నవీన్ యాదవ్, మాజీ మంత్రి కంజర్ల లక్ష్మీనారాయణ యాదవ్ కూతురు కంజర్ల విజయలక్ష్మి యాదవ్, సీఎన్ రెడ్డి తదితరులు ప్రధానంగా పోటీలో ఉన్నారని ఖర్గేకు వివరించినట్లు తెలిసింది. ఈ పేర్లపై ప్రత్యేకంగా సర్వే చేయించాలని, సామాజిక సమీకరణాలు, సర్వేలోని ఫలితాల ఆధారంగా టికెట్ కేటాయింపుపై నిర్ణయం ఉంటుందని ఖర్గే చెప్పినట్లు తెలిసింది.

వచ్చే నెలాఖరుకు డీసీసీలు: మహేశ్‌గౌడ్

అక్టోబర్ ఆఖరుకల్లా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల (డీసీసీ) నియామకాలు పూర్తి కానున్నాయని మహేశ్ గౌడ్ ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. అక్టోబర్ 4 నుంచి ఏఐసీసీ పరిశీలకులు అన్ని జిల్లాల్లో పర్యటిస్తారని, 15వ తేదీకల్లా ప్రతి జిల్లాకు డీసీసీ అధ్యక్ష పదవికి ఆరుగురి పేర్లను ఎంపికచేసి సమర్పిస్తారని చెప్పారు. జిల్లాల్లో సమర్థవంతమైన, క్షేత్రస్థాయిలో ప్రతిపక్షాలను దీటుగా ఎదుర్కొనే నాయకులకే బాధ్యతలు అప్పగించాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు.

మీరు రాష్ట్రానికి ఏం తెచ్చారు?

- చర్చకు రావాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మహేశ్‌గౌడ్ సవాల్
- మూసీ సుందరీకరణను అడ్డుకుంటున్నారు
- బీసీ బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఎందుకున్నాయి?

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి రాష్ట్రానికి తెచ్చిన సంక్షేమ పథకాలు, ప్రాజెక్టులు ఏంటనే అంశంపై చర్చకు సిద్ధమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ సవాల్ విసిరారు. గుజరాత్‌లో సబర్మతి నది సుందరీకరణకు అభ్యంతరం చెప్పని కిషన్‌రెడ్డి.. మూసీని మాత్రం అడ్డుకున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ‘42 శాతం రిజర్వేషన్లకు అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు ఓటు వేశారు. కేంద్రానికి వచ్చేసరికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అడ్డుకుంటున్నారు. కిషన్‌రెడ్డి నాకు మంచి మిత్రుడు. కానీ.. రెండేళ్లుగా ఆయన రాష్ట్రం కోసం ఏం చేశారు. ఎన్ని ప్రాజెక్టులు తెచ్చారు? అనే అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నాం. రాజకీయాలకు అతీతంగా బిహార్, తమిళనాడు అభివృద్ధి ఫలాలు అందుకుంటున్నాయి. తెలంగాణపై ఆ సోయి లేకుండా పోయింది. దేశ చరిత్రలో తొలిసారి కుల సర్వే చేశాం. మూడు చట్టాలు చేసి కేంద్రానికి పంపాం. ఆ బిల్లులు కేంద్రం వద్ద ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి? బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి కిషన్‌రెడ్డికి, బండి సంజయ్‌లకు ఉంటే ఒక్క రోజులో మూడు బిల్లులకు మోక్షం లభిస్తుంది. రాష్ట్ర అభివృద్ధే పట్టని కిషన్‌రెడ్డి.. మాకు ఫోబియా పట్టిందని చెప్పడం విడ్డూరం’ అని చెప్పారు.

అన్ని వర్గాలు సహకరించాలి: బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం జీవో తేవడంపై మహేశ్ గౌడ్ స్పందించారు. పకడ్బందీగా కులగణన చేపట్టి, బీసీ కమిషన్ వేసి, సాంకేతిక సమాచారం సేకరించిన తర్వాతే బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం జీవో తెచ్చిందన్నారు. ఇది ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్న కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఈ రిజర్వేషన్లు అమలయ్యేలా అన్ని వర్గాలు సహకరించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ సమాజంతోపాటు కాంగ్రెస్ పార్టీ పక్షాన సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రేవంత్‌రెడ్డీ.. నువ్వు ఓ యూటర్న్ సీఎం

- ఎన్నికల్లో చెప్పింది ఒకటి.. ఇప్పుడు చేస్తున్నది మరొకటి
- మైక్రో బ్రూవరీల మూర్ఖపు ఆలోచన మానుకో
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్



సాక్షి, హైదరాబాద్: ‘పబ్బులు, క్లబ్బుల గురించి గబ్బుగా మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. పబ్బులకు అనుమతి రద్దు చేయకపోగా, కొత్త వాటికి పర్మిషన్ ఇస్తూ కమీషన్లు దండుకుంటున్నావు. రేవంత్‌రెడ్డి.. నువ్వు ఓ యూటర్న్ సీఎం. ఎన్నికల్లో చెప్పింది ఒకటి, ఇప్పుడు చేస్తున్నది మరొకటి. మైక్రో బ్రూవరీల మూర్ఖపు ఆలోచన మానుకో రేవంత్‌రెడ్డి’ అని మాజీ మంత్రి హరీశ్‌రావు.. ముఖ్యమంత్రిపై ఫైర్ అయ్యారు. ‘యూరియా ఇవ్వరు కానీ, ఊరికో మద్యం దుకాణం ఇస్తాం తీసుకోండి అంటోంది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇది రేవంత్‌రెడ్డి బరితెగింపు పాలనకు నిదర్శనం’ అని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఆదాయం పెంచుకునేందుకు రేవంత్ సర్కార్ అడ్డదారులు వెతుక్కుంటున్నదని ఆరోపించారు. కేసీఆర్ తెచ్చిన పథకాలకు కోతలు, ప్రజలకు పన్నుల వాతలు తప్ప 22 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని అన్నారు. ఇప్పటికే మద్యం ధరలను ఇష్టారీతిగా పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆదాయాన్ని మరింత పెంచుకునే విధంగా కొత్త పాలసీ తెచ్చిందని, మద్యం షాపుల దరఖాస్తు ఫీజును ఏకంగా రెండు లక్షల నుంచి రూ. 3 లక్షలకు పెంచారని విమర్శించారు. బెల్ట్ షాపులు ఎత్తివేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, దాన్ని తుంగలో తొక్కి గ్రామగ్రామాన మద్యం ఏరులై పారేలా చేసిందన్నారు. కొత్తగా ఊరూరికి మైక్రో బ్రూవరీలు తెచ్చి తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా చేస్తున్నారని మండిపడ్డారు. గౌడ్‌లకు వైన్ షాపుల్లో 25 శాతం రిజర్వేషన్లు అని ఊదరగొట్టి, కేసీఆర్ ఇచ్చిన 15% రిజర్వేషన్ కూడా ఇవ్వడం లేదన్నారు. నీరాను ప్రోత్సహిస్తామని, ఉన్న నీరా షాపును బంద్ చేసే కుట్ర చేశారని విమర్శించారు. గీత కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే ఇచ్చే నష్టపరిహారాన్ని ఇప్పటివరకు చెల్లించడం లేదన్నారు. ఇక మహిళలకు కల్యాణ లక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తానని ఇవ్వలేదని, యువతులకు నెలకు రూ.2,500 ఇస్తానని మాట తప్పారని ధ్వజమెత్తారు.

స్థానిక సంస్థల రిజర్వేషన్లను పునఃపరిశీలించాలి



కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం... కలెక్టర్లపై సీఎస్‌కు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: స్థానిక సంస్థల ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అసంతృప్తి వ్యక్తం చేశారు. కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో కలెక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, రిజర్వేషన్ ప్రక్రియను తిరిగి నిర్వహించాలని శుక్రవారం ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్ల తీరుపై చేసిన ఫిర్యాదు రెండు జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది. రెండు జిల్లాల్లో జరిగిన స్థానిక సంస్థల రిజర్వేషన్ ప్రక్రియలో నిబంధనలు పాటించకపోవడం వల్ల ఎస్సీ, ఎస్టీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. అధికారులు వ్యవహరించిన తీరు రిజర్వేషన్ ప్రక్రియను పక్కదారి పట్టించే విధంగా ఉందన్నారు. వార్డు, గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో జరిగిన రిజర్వేషన్ల ప్రక్రియను పునః పరిశీలించి, రిజర్వేషన్ ప్రక్రియను తిరిగి చేపట్టే విధంగా ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన సీఎస్‌కు పంపిన ఫిర్యాదులో కోరారు.

సీఎం నిర్ణయంతో రూ.15 వేల కోట్ల భారం

ఎల్‌అండ్‌టీ నిష్క్రమణ వెనుక రేవంత్ కక్షసాధింపు: కేటీఆర్

- బీఆర్‌ఎస్‌పై కుట్రలో భాగం కానందుకే వేధించారు...
- సీఎఫ్‌ఓను జైలుకు పంపుతామని బెదిరించారు
- మెట్రో భూములపై సీఎం, ఆయన అనుచరుల కన్ను పడింది
- మరో కార్పొరేట్ సంస్థను ఎలా బ్లాక్ మెయిల్ చేస్తున్నారో బయటపెడతా అని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనాలోచిత, అహంకారపూరిత నిర్ణయాల వల్లే ప్రఖ్యాత ఎల్‌అండ్‌టీ సంస్థ హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు నుంచి నిష్క్రమించిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సీఎం నిర్ణయంతో రాష్ట్ర ప్రజలపై ఒక్క రోజులోనే రూ.15 వేల కోట్ల అప్పుల భారం పడిందని మండిపడ్డారు. రాష్ట్రం నుంచి ఎల్‌అండ్‌టీ నిష్క్రమణ వెనుక రేవంత్ కక్ష సాధింపుతోపాటు 280 ఎకరాల మెట్రో భూములపై కన్ను పడటమే కారణమన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తదితరులతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ‘మేడిగడ్డ బరాజ్ విషయంలో బీఆర్‌ఎస్‌ను బద్నాం చేసే అవకాశం ఇవ్వకుండా, సొంత ఖర్చుతో మరమ్మతులు చేస్తామని ఎల్‌అండ్‌టీ ముందుకొచ్చింది. మేడిగడ్డ కూలిపోయిందని చెప్పకుంటే బ్లాక్ లిస్టులో పెడతా అని బెదిరించారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో రద్దుతో మొదలై, నారాయణపేట–కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో అనర్హత లేదని ప్రకటించడం దాకా ఎల్‌అండ్‌టీని ప్రభుత్వం వేధించింది. ఈ కక్ష సాధింపు చర్యలు భరించలేకే 2070 వరకు మెట్రో లీజు ఉన్నా ఎల్‌అండ్‌టీ సంస్థ రాష్ట్రం నుంచి వాకౌట్ చేసింది. ఆర్టీసీ ఉచిత ప్రయాణాల ప్రభావం తమపై ఉంటుందని చెప్పిన సీఎఫ్‌ఓను జైలుకు పంపుతామని సీఎం బెదిరించారు. మరో కార్పొరేట్ సంస్థను ఎలా బ్లాక్‌మెయిల్ చేస్తున్నారో నాలుగైదు రోజుల్లో ఆధారాలతో సహా బయటపెడతా’ అని కేటీఆర్ చెప్పారు.

బీఆర్‌ఎస్ చొరవతో మెట్రో పరుగులు

‘2014లో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చినప్పుడు మెట్రో పనులు 25 శాతం మాత్రమే పూర్తి కాగా కేసీఆర్ చొరవతో పనులు చేపట్టి 2017లో మొదటి దశను ప్రారంభించాం. కరోనా సమయంలో రూ.3,000 కోట్ల వడ్డీ రహిత రుణంతో మెట్రోను కాపాడాం. 400 కి.మీ. మెట్రో విస్తరణకు ప్రణాళికలు రూపొందించి, మైండ్‌స్పేస్– శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైలు మార్గానికి కేసీఆర్ శంకుస్థాపన చేస్తే రేవంత్ దానిని రద్దు చేశారు. ఎల్‌అండ్‌టీకి కేటాయించిన 280 ఎకరాల భూములపై సీఎం, ఆయన అనుచరుల కన్నుపడింది. ఈ భూములను అమ్మడానికి లేదా తమ అనుయాయులకు కట్టబెట్టడానికే ఈ కుట్ర జరిగింది. ఇప్పటికే ఉన్న మాల్స్‌ను ఎవరెవరికి రాసిస్తారో త్వరలోనే చూస్తారు. ముడుపులు, కమీషన్ల కోసమే తీసుకున్న ఈ నిర్ణయంపై సీఎం సమాధానం చెప్పాలి. రేవంత్‌రెడ్డి ఏం చేసినా దాని వెనుక ఒక స్కీమ్, ఒక స్కామ్ ఉంటుంది. దీనిపై కనీసం కేబినెట్ సబ్ కమిటీ వేయలేదు, కేబినెట్‌లో చర్చించలేదు. చట్ మంగ్నీ–ఫట్ షాదీ అన్నట్టు తీసుకున్న నిర్ణయంపై కేంద్రం విచారణ జరపాలి. బీఆర్‌ఎస్ సృష్టించిన రూ.20 వేల కోట్ల ఆస్తిని నాశనం చేసి, ప్రజలపై అప్పులు మోపడంపై ప్రజల్లోకి వెళ్లి పోరాటం చేస్తాం’ అని కేటీఆర్ పేర్కొన్నారు.

బ్లాక్‌మెయిలర్స్‌కు కేంద్రంగా హైడ్రా

‘కాంగ్రెస్ పాలనలో హైడ్రా రియల్ ఎస్టేట్‌ను దెబ్బతీసింది. బ్లాక్‌మెయిలింగ్, బ్లాక్‌మెయిలర్లకు హైడ్రానే కేంద్రంగా ఉంది. నన్ను అరెస్టు చేస్తారని కాంగ్రెస్ నేతలు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. అరెస్టు చేసుకుంటే చేసుకోమనండి. నా నిజాయితీకి భయం లేదు. లైడిటెక్టర్ టెస్టుకు కూడా సిద్ధమని చెప్పాను. రేవంత్‌కు పైశాచిక ఆనందం కలిగితే కలగనీయండి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు బీఆర్‌ఎస్‌దే’ అని కేటీఆర్ అన్నారు.

సాక్షి
హైదరాబాద్
శనివారం । 27 । సెప్టెంబర్ । 2025


చాదర్‌ఘాట్‌లో ఇళ్లలోకి చేరిన వరద నీరు


మూసారాంబాగ్ వద్ద మూసీ ఉధృతి..

ఉగ్ర మూసీ

నగరంపై వరుణుడి ప్రతాపం

- వణికించిన ఎడతెరిపిలేని వర్షం
- జంట జలాశయాలకు భారీ వరద
- 24 గేట్లను ఎత్తి దిగువకు నీరు
- పొంగిపొర్లుతున్న మూసీ నది
- ఇళ్లను చుట్టుముట్టిన వరద
- వాగులను తలపిస్తున్న వీధులు
- పరీవాహక ప్రజలు గజగజ
- సురక్షిత ప్రాంతాలకు తరలింపు

హెల్ప్‌లైన్ నంబర్: 90634 23979


పురానాపూల్ ప్రాంతంలో..


సురక్షిత ప్రాంతానికి నిరాశ్రయులు

సాక్షి, సిటీబ్యూరో/రాజేంద్రనగర్/అంబర్‌పేట్/దిల్‌సుఖ్‌నగర్

నగరాన్ని ఎడతెరిపిలేని వర్షం వెంటాడింది. 48 గంటల వ్యవధిలో కొద్ది విరామంతో వరుణుడు విరుచుకుపడ్డాడు. శుక్రవారం జడివానతో పాటు కుంభవృష్టి కురిసింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో జంట జలాశయాలకు భారీగా వరద పోటెత్తుతోంది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ 24 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. జంట జలాశయాల గేట్లను ఎత్తివేయడంతో వరద నీరు పెద్ద ఎత్తున మూసీలోకి వచ్చి చేరింది. వరద పోటెత్తడంతో మూసీకి ఇరువైపులా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.

వెయ్యి మందికిపైగా సురక్షిత ప్రాంతాలకు..

అంబర్‌పేట మూసీ పరీవాహక ప్రాంతాల్లోని కృష్ణానగర్, న్యూ అంబేద్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇళ్లన్నీ జలమయమయ్యాయి. నిరాశ్రయులైన సుమారు 1000 మందికి పైగా జనాన్ని తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించినట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. శంకర్‌నగర్ ప్రాంతంలోని దాదాపు 500 మందిని ఎగువ ప్రాంతంలోని షాజాదీ మసీదులోకి, మూసానగర్‌లోని దాదాపు 150 మందిని స్థానిక కమ్యూనిటీ హాల్‌లోకి, మూసారాంబాగ్ బ్రిడ్జి సమీపంలోని దుర్గానగర్, అంబేద్కర్ నగర్‌లలోని 45 కుటుంబాలను లంక ప్రభుత్వ హైస్కూల్‌లోకి మరో 21 కుటుంబాలను పై అంతస్తుల్లోకి, గోల్నాక కృష్ణానగర్ ప్రాంతంలోని 32 మందిని కృష్ణానగర్ కమ్యూనిటీ హాల్‌లోకి, భూలక్ష్మి టెంపుల్‌లోని 55 మందిని గోడేకి ఖబర్ ప్రాంతానికి తరలించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధికారులతో సమీక్షిస్తున్నారు. పునరావాస కేంద్రాలకు తరలించిన ప్రజలకు భోజన వసతి, తాగునీరు, వైద్య సదుపాయాలతో పాటు అవసరమైన వారికి దుప్పట్లు అందజేసినట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది. శని, ఆదివారాలు కూడా హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన నేపథ్యంలో హెడ్ క్వార్టర్, జోనల్, సర్కిల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ కర్ణన్ ఆదేశించారు.


పురానాపూల్ ప్రాంతంలో..

వరదలో కొట్టుకుపోయిన కారు..

పురానాపూల్ ప్రాంతాన్ని వరద చుట్టుముట్టింది. అక్కడ నిలిపిఉంచిన ఓ కారు వరదలో కొట్టుకుపోతుండటంతో స్పందించిన యువకులు, పోలీసులు తాళ్ల సాయంతో బయటకు లాగారు. మూసారాంబాగ్ బిడ్జి సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లోకి పెద్ద ఎత్తున వరదనీరు చేరింది. మూసారాంబాగ్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేశారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి సూచించారు. సికింద్రాబాద్ రసూల్‌పురాలోని ప్యాట్నీ నాలా పనులను ఆమె పరిశీలించారు.

మూసీలోకి 29 వేల క్యూసెక్కుల నీరు..

మూసీలోకి శుక్రవారం రాత్రి సుమారు 29,557 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎగువ ప్రాంతంలో భారీ వర్షం కురుస్తుండటంతో ఉస్మాన్ సాగర్ జలాశయానికి 8,500 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, దిగువకు 11,557 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. హిమాయత్ సాగర్‌కు 16,500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా దిగువకు 18,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండండి: సీఎం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన సూచించారు.


చాదర్‌ఘాట్‌లో నడుంలోతు నీళ్లలో..

- ఢిల్లీ మెట్రో విధానంలో నిర్వహణకు కసరత్తు
- వాటాల బదిలీపై హెచ్‌ఎంఆర్‌ఎల్ దృష్టి
- రెండో దశపై తొలగనున్న ప్రతిష్టంభన

హస్తిన తరహాలోనే..



ఇక హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్

సాక్షి, సిటీబ్యూరో

నగరంలో ఇక హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) సంస్థ స్వయంగా రైళ్లు నడపనుంది. ఇప్పటి వరకు మెట్రోరైళ్లను నిర్వహించిన ఎల్‌అండ్‌టీ సంస్థ వైదొలగనున్న నేపథ్యంలో ఢిల్లీ మెట్రోరైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) తరహాలో హెచ్‌ఎంఆర్‌ఎల్ రైళ్ల నిర్వహణ చేపట్టే అవకాశం ఉంది. మొదటిదశ మెట్రో ప్రభుత్వం చేతిలోకి రానున్న దృష్ట్యా హెచ్‌ఎంఆర్‌ఎల్ ఆధ్వర్యంలోనే రైళ్లు నడవనున్నాయి. ఈ మేరకు ఢిల్లీలో మెట్రో రైళ్ల నిర్వహణపై అధికారులు దృష్టి సారించారు. అక్కడ డీఎంఆర్‌సీ ఆధ్వర్యంలో పని చేస్తున్న యంత్రాంగాన్ని దృష్టిలో ఉంచుకొని అదేవిధమైన కార్యకలాపాలను హైదరాబాద్‌లో చేపట్టనున్నట్లు సమాచారం. మరోవైపు ఎల్‌అండ్‌టీ వైదొలగనున్నట్లు స్పష్టం కావడంతో తదుపరి చేపట్టాల్సిన కార్యకలాపాలపై కూడా అధికారులు దృష్టి కేంద్రీకరించారు. ఆ సంస్థకు ఏకమొత్తంగా చెల్లించాల్సిన రూ.2000 కోట్లతో పాటు రైళ్ల నిర్వహణ బాధ్యతల బదిలీని వేగవంతం చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఎల్‌అండ్‌టీ తప్పుకోనున్న దృష్ట్యా రూ.13000 కోట్ల బ్యాంకు రుణాలను కూడా ప్రభుత్వమే చెల్లించనున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు ఢిల్లీతో పాటు దేశంలోని వివిధ నగరాల్లో మెట్రో రైళ్లను ప్రభుత్వాలే నడుపుతున్నాయి. హైదరాబాద్ మెట్రో రైల్ మాత్రమే మొట్టమొదటి పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య ప్రాజెక్టుగా అవతరించింది. కానీ ఈ ప్రాజెక్టు నుంచి ఎల్‌అండ్‌టీ వైదొలగనున్నందున హైదరాబాద్ మెట్రో కూడా పూర్తిస్థాయిలో ప్రభుత్వం అధీనంలోకి రానుంది.

ఢిల్లీలో ఇలా..

దేశ రాజధాని ఢిల్లీలో అత్యంత వేగవంతమైన, విశ్వసనీయమైన, ప్రజా రవాణా వ్యవస్థగా ఢిల్లీ మెట్రో నిలిచింది. ఢిల్లీ, గుర్గావ్, నోయిడా, ఘాజియాబాద్, ఫరీదాబాద్, బహదూర్‌గఢ్ తదితర నగరాలను కలుపుతూ మెట్రో రైళ్లు సేవలందజేస్తున్నాయి.2002లో ఢిల్లీ మెట్రో ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయి. దశలవారీగా మెట్రో విస్తరణ చేపట్టారు. ప్రస్తుతం 10 లైన్లలో 450 కి.మీ.వరకు రవాణా సదుపాయాన్ని అందజేస్తోంది. ఢిల్లీ మెట్రో తర్వాత హైదరాబాద్ మెట్రో రెండో స్థానంలో ఉన్నప్పటికీ.. ఇక్కడ విస్తరణ ముందుకెళ్లలేదు. దీంతో ప్రస్తుతం మన హైదరాబాద్ మెట్రో దేశంలో 9వ స్థానానికి పడిపోయింది. ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలను అందజేస్తున్న డీఎంఆర్‌సీకి అంతర్జాతీయ గుర్తింపు (యునైటెడ్ నేషన్స్) కూడా లభించింది. హైదరాబాద్ మెట్రో సైతం ఇప్పటికే పలు అంతర్జాతీయ అవార్డులను అందుకుంది. మొదటి దశ మెట్రోరైల్ నిర్మాణమయంలోనూ అధికారులు, నిపుణులు ఢిల్లీ మెట్రో నిర్మాణాన్ని, నిర్వహణపై అధ్యయనం చేశారు. అలాగే.. ఢిల్లీ విమానాశ్రయం వద్ద భూగర్భంలో ఉన్నట్లుగానే రెండో దశలో హైదరాబాద్ ఎయిర్‌పోర్టు వద్ద కూడా అదే విధంగా భూగర్భమెట్రోరైల్ స్టేషన్‌ను నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందించారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఢిల్లీ మెట్రో నిర్వహణ తరహాలోనే హైదరాబాద్‌లో మెట్రో రైళ్లను నడిపేందుకు తగిన కసరత్తు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

రెండు దశల మధ్య సమన్వయానికి మార్గం..

తాజా పరిణామాల నేపథ్యంలో మెట్రో రెండోదశపై నెలకొన్న ప్రతిష్టంభనకు పరిష్కారం లభించినట్లయింది. రెండో దశ ప్రాజెక్టును ప్రభుత్వమే చేపట్టనున్న సంగతి తెలిసిందే. మొదటిదశ మార్గాలు కూడా ప్రభుత్వం చేతిలోకి రానుండడంతో మొదటి, రెండో దశల మధ్య సమన్వయానికి మార్గం సుగమమైంది. మెట్రో రెండోదశ 'ఎ' విభాగంలో 76.4 కి.మీ. 'బి' విభాగం కింద మూడు కారిడార్లలో సుమారు 85 కి.మీ వరకు విస్తరించనున్నారు. ఈ మార్గాలపై ప్రభుత్వం రెండు దఫాలుగా కేంద్రానికి డీపీఆర్‌లను అందజేసింది. కానీ.. ఎల్‌అండ్‌టీతో సమన్వయం లేని కారణంగా కేంద్రం నుంచి అనుమతి లభించలేదు. ఇప్పుడు ఎల్‌అండ్‌టీ సమస్యకు పరిష్కారం లభించిన దృష్ట్యా కేంద్రం నుంచి త్వరలో అనుమతులు లభించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే రోడ్డు విస్తరణ పనులు తుదిదశకు చేరిన పాతబస్తీ మెట్రో అలైన్‌మెంట్‌తో రెండో దశ పనులను పట్టాలెక్కించాలని ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి ఏదో ఒక కారిడార్‌లో మెట్రో రెండోదశను పూర్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం.

రసూల్‌పురాలో 288 డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రారంభం నేడు

సాక్షి, సిటీబ్యూరో: రసూల్‌పురా ప్రాంతంలోని నారాయణ జోపిడి సిల్వర్ కాంపౌండ్‌లో పాత ఇళ్లను కూల్చివేసి నిర్మించిన (ఇన్‌సిటు) డబుల్ బెడ్రూం గృహాలను శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, అతిథులుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఈటల రాజేందర్ తదితరులు పాల్గొననున్నట్లు జీహెచ్‌ఎంసీ తెలిపింది. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ అధికారంలో ఉన్నప్పుడు పీఎంఏవై (అర్బన్) స్కీమ్ కింద చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల కార్యక్రమంలో భాగంగా ఈ కాలనీ పనులు చేపట్టారు. ఈ కాలనీ వివరాలు ఇలా ఉన్నాయి.. 5 బ్లాకులుగా మొత్తం 288 ఇళ్లు. జీ+3 అంతస్తులు. ఇళ్ల ప్లింత్ ఏరియా 560 చదరపు అడుగులు. మౌలిక సదుపాయాలతో కలిపి ఒక్కో ఇంటి నిర్మాణ వ్యయం రూ.7.75 లక్షలు. ప్రాజెక్ట్ మొత్తం వ్యయం రూ.22.30 కోట్లు. కాలనీలో సీసీ రోడ్లు, సీవరేజ్ లైన్లు, తాగునీటి సరఫరా నిర్మాణం.

బతుకమ్మకుంట ప్రారంభోత్సవం వాయిదా

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో శుక్రవారం జరగాల్సిన బతుకమ్మకుంట ప్రారంభోత్సవం ఆదివారానికి వాయిదా పడింది. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొననున్న మహిళలు, ప్రజలు వర్షంతో ఇబ్బందులు పడకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మ కుంటను ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తారని రంగనాథ్ పేర్కొన్నారు.

క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం: మంత్రి జూపల్లి



గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడా రంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం గోల్కొండ నయాకీలాలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్సులో జరిగిన తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ ఛాంపియన్‌షిప్ విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా హాజరైన పొన్నం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో గత సంవత్సర కాలంలో తెలంగాణకు చెందిన క్రీడాకారులు అద్భుతాలు సృష్టించారని అన్నారు. ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి వారికి సరైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా వివిధ వేదికలపై సత్తాచాటిన తెలంగాణ క్రీడాకారులను నగదు పురస్కారాలతో సత్కరిస్తున్నామన్నారు. క్రికెటర్ మహ్మద్ సిరాజ్ దీనికి ఒక ఉదాహరణ అని అన్నారు. గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్సులో అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్లు జరగడం గొప్ప విషయమన్నారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ గోల్ఫ్ కోర్సులో మరో రెండు హోల్స్ ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. శుక్రవారం ముగిసిన గోల్కొండ మాస్టర్స్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన జమాల్ హుస్సేన్ విజేతగా నిలిచారు. ఆయనకు మంత్రి రూ.15 లక్షల చెక్కుతో పాటు గోల్కొండ మాస్టర్ ట్రోఫీని అందించారు. చండీఘడ్‌కు చెందిన అక్షయ్ శర్మ రన్నరప్‌గా నిలిచారు. ఆయనకు రూ.10 లక్షల చెక్కు అందించారు.

కొత్త పంథాలో డబ్బా ట్రేడింగ్!

- లావాదేవీలు హవాలా నుంచి క్రిప్టో రూపంలోకి
- ఏటా ప్రభుత్వానికి రూ.వందల కోట్ల 'పన్ను పోటు'
- ఆరా తీస్తున్న నిఘా వర్గాలు, ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం

సాక్షి, సిటీబ్యూరో: ఆహార ఉత్పత్తులు, బంగారం, వెండి, ముడిచమురు తదితరాలకు సంబంధించిన కమోడిటీ ట్రేడింగ్‌కు సమాంతరంగా ప్రభుత్వానికి పన్ను ఎగ్గొడుతూ అక్రమార్కులు సాగించే 'డబ్బా ట్రేడింగ్' ఇప్పుడు కొత్త పంథాలో సాగుతున్నట్లు నిఘా, ఆదాయపు పన్ను శాఖ వర్గాలు గుర్తించాయి. హవాలా, క్రిప్టో కరెన్సీ ద్వారా లావాదేవీలు జరిగే ఈ అక్రమ వ్యవహారాల వెనుక మాఫియా హస్తం ఉన్నట్లూ నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. క్రిప్టోతో పాటు హవాలా, నగదు రూపంలో లావాదేవీలు జరుగుతుండటంతో పెద్ద మొత్తంలో నల్లధనం మార్పిడి జరుగుతున్నట్లు తేల్చాయి. ప్రభుత్వానికి పన్ను రూపంలో రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్న ఈ వ్యవహారాలపై కన్నేసి ఉంచాల్సిందిగా నిఘా, పోలీసు వర్గాలకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. దీనికి సంబంధించిన ఇటీవల నగరంలోని బంజారాహిల్స్, అబిడ్స్, కళాసీగూడల్లోనూ ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు చేసినట్లు సమాచారం. అధికారికంగా షేర్ల క్రయవిక్రయాలు నిర్వహించడానికి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు ఉంటాయి. ఇదే రకంగా కమోడిటీస్‌కు సంబంధించిన లావాదేవీలు నెరపడానికి ప్రత్యేక ఎక్స్ఛేంజ్ వంటి వ్యవస్థ ఉంది. వీటిలో జరిగే లావాదేవీలన్నీ పారదర్శకంగా, ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి సాగుతుంటాయి. ప్రతి క్రయవిక్రయం పైనా ప్రభుత్వానికి నిర్దేశిత శాతం పన్ను కచ్చితంగా చెల్లించాల్సి ఉంటుంది. వీటికి సమాంతరంగా లావాదేవీలను అధికారికంగా ఎక్కడా నమోదు చేయకుండా నిర్వహించే లావాదేవీలనే డబ్బా ట్రేడింగ్ అంటారు. ప్రస్తుతం బంగారం, వెండికి సంబంధించిన లావాదేవీలు మాత్రమే ఈ డబ్బా ట్రేడింగ్ ద్వారా ఎక్కువగా జరుగుతున్నాయి. దేశ వ్యాప్తంగా వ్యవస్థీకృతంగా జరిగే ఈ వ్యవహారాలు అటు షేర్ మార్కెట్‌లోనూ, ఇటు కమోడిటీ మార్కెట్‌లోనూ జోరుగా సాగుతున్నాయి. లావాదేవీల రుసుం మిగుల్చుకోవడానికి నిర్వాహకులు, పన్ను భారం తప్పించుకోవ



డంతో పాటు నల్లధనంతో కూడిన లావాదేవీలను నెరపడానికి వినియోగదారులు వీటిని ప్రోత్సహిస్తున్నారు. కమోడిటీస్ డబ్బా ట్రేడింగ్‌లో చక్కెర, ముడిచమురు, వ్యవసాయ ఉత్పత్తులు, బంగారం, వెండి వంటి వస్తువులను ధర తక్కువగా ఉన్నప్పుడు కొని, డిమాండ్ వచ్చేదాకా వేచి ఉండి విక్రయిస్తుంటారు. సాధారణంగా షేర్లు, కమోడిటీస్‌కు సంబంధించిన క్రయవిక్రయాలన్నీ పక్కా పత్రాలతో కంప్యూటర్ల ఆధారంగా ఆన్‌లైన్‌లో జరుగుతుంటాయి. అతి తక్కువ సందర్భాల్లోనే మాత్రమే వాస్తవంగా వస్తుమార్పిడి జరుగుతుంది. డబ్బా ట్రేడింగ్ మాత్రం బ్యాంకు లావాదేవీలు, డీమ్యాట్ అకౌంట్లతో సంబంధం లేకుండా పూర్తి ఆఫ్‌లైన్‌లో జరిగిపోతుంది. ఏళ్లుగా హవాలా మార్గంలో సాగుతుండగా... ప్రస్తుతం క్రిప్టో కరెన్సీ రూపంలోనూ జరుగుతున్నట్లు తేలింది. ఆదాయం భారీగా ఉండటంతో మాఫియా శక్తులు డబ్బా ట్రేడింగ్‌లో అడుగుపెట్టాయని పోలీసులు అనుమానిస్తున్నారు. దుబాయ్, జార్జియాల్లోనూ ఈ డబ్బా ట్రేడింగ్ నెట్‌వర్క్ నడుస్తోందని అధికారులు గుర్తించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్, సూరత్‌లతో పాటు మహారాష్ట్రలోని ముంబైల్లో మాఫియాలతో సంబంధాలున్న వ్యక్తులు వ్యవస్థీకృతంగా ఈ డబ్బా ట్రేడింగ్, హవాలా రూపంలో నగదు మార్పిడి నిర్వహిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ తరహా ట్రేడింగ్ నిర్వహిస్తున్న వ్యక్తులు దేశ వ్యాప్తంగా ఏజెంట్లు, సబ్-ఏజెంట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. హవాలా రాకెట్లు సైతం వీరి చేతుల్లోనే ఉండటంతో చిన్న చిన్న స్లిప్పులు, కొన్ని కరెన్సీ నెంబర్లను కోడ్‌వర్డ్స్‌గా ఏర్పాటు చేసుకోవడం ద్వారా ద్రవ్య మార్పిడి చేసేస్తున్నారు. హవాలా లింకులు ఉండటం కూడా మాఫియా హస్తానికి సంబంధించిన అనుమానాల్ని బలపరుస్తున్నాయి. ఉన్నతాధికారులు ఆదేశాలతో అప్రమత్తమైన నిఘా, పోలీసు అధికారులు రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాలతో పాటు ట్రేడింగ్ లావాదేవీలు జరిగే ప్రాంతాలపై డేగకన్ను వేశారు.

రోడ్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్

- సీఆర్ఐఎఫ్ కింద నిధులు
- రూపురేఖలు మారనున్న జిల్లా రహదారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణ వ్యాప్తంగా 34 రోడ్ల విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్ (సీఆర్ఐఎఫ్) పథకం కింద విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఆయా రోడ్ల విస్తరణకు ఆమోదం తెలుపుతూ కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ ఇటీవల తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి లేఖ రాసింది.

జిల్లాలో ఇలా..

- ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కప్పపహాడ్ నుంచి గున్‌గల్ మీదుగా తులేకలాన్ వరకు 8.2 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణకు రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఇదే నియోజకవర్గంలోని బేగంపేట్ నుంచి ఎలిమినేడు మీదుగా మాదాపూర్ వరరకు 6.2 కిలోమీటర్ల సింగిల్ లేన్ రోడ్డును డబుల్ లేన్‌గా మార్చేందుకు రూ.17 కోట్లు మంజూరు చేసింది.
- మహేశ్వరం నియోజకవర్గంలోని లేమూరు నుంచి శ్రీశైలం జాతీయ రహదారి మీదుగా తిమ్మాపూర్ వరకు 14 కిలోమీటర్ల సింగిల్ లేన్‌ను డబుల్‌రోడ్డుగా విస్తరించేందుకు రూ.38 కోట్లు కేటాయించింది.
- చందానగర్ నుంచి చేవెళ్ల నియోజకవర్గంలోని కవేలిగూడ మీదుగా పెద్ద మంగళారం, మొయినాబాద్, సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్ వరకు 14 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు రూ.30 కోట్లు కేటాయించింది.
- వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం రంగాపూర్ నుంచి లాల్‌పహాడ్ రోడ్డు (14.35 కి.మీ) విస్తరణకు రూ.22 కోట్లు మంజూరు చేసింది.

శ్రీ ప్రత్యంగిరా అమ్మవారి సేవలో మంత్రి పొన్నం



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జ్ఞాపికను అందిస్తున్న ప్రత్యంగిరా దేవి ఆలయ సెక్రటరీ శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురంలోని కుర్తాళ పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారిని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయన వెంట కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన, ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి కూడా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పీఠాధిపతులు శ్రీ సిద్ధేశ్వరానందభారతి స్వామి గతంలో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన అతి శక్తిమంతమైన కోటి ప్రత్యంగిరా మహాయాగం హైదరాబాద్‌లో జరిగిన అద్భుత కార్యక్రమమని, అందులో పాల్గొనడం తన అదృష్టమని తెలిపారు. పూజల్లో పాల్గొన్న వారికి ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్, సువర్ణలత దంపతులు అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పున్నా గణేష్, రాజేశ్వరి రామారావు, వెంకటేశ్వర్లు, ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ సైదులు, అరుణ, సాయికుమార్, బండి మధు, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు

భర్త చెంతకు శ్వేత

- నర్సంపల్లి కిడ్నాప్ కేసు సుఖాంతం



కిడ్నాప్‌కు గురైన శ్వేతను ప్రవీణ్‌కు అప్పగించిన పోలీసులు

కీసర: నర్సంపల్లి గ్రామంలో కిడ్నాప్‌నకు గురైన నవ వధువు శ్వేతను పోలీసులు సురక్షితంగా ఆమె భర్తకు అప్పగించినట్లు కీసర సీఐ ఆంజనేయులు శుక్రవారం మీడియాకు తెలిపారు. నర్సంపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడిని ప్రేమ వివాహం చేసుకున్న శ్వేతను ఈ నెల 24న ఉదయం ఆమె తల్లిదండ్రులతోపాటు, బంధువులు కలిసి భర్త ప్రవీణ్ ఇంటిపై దాడిచేసి కారులో బలవంతంగా తీసుకెళ్లారు. ఈ మేకు బుధవారం శ్వేత భర్త, బంధువులు కీసర పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. దీంతో శ్వేత ఆచూకీ కోసం రెండు టీమ్‌లను ఏర్పాటు చేసి గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో శ్వేతను కీసర పోలీస్‌స్టేషన్‌కు రప్పించారు. అనంతరం విషయాన్ని ఆమె భర్త ప్రవీణ్‌కు తెలిపి అప్పగించారు. కాగా శ్వేతను కిడ్నాప్ చేసిన తండ్రి బాల్‌నర్సింహ, తల్లి మహేశ్వరితోపాటు కుటుంబీకులు మధు, సుగుణ, మమత, మహేష్, బాలులను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఢిల్లీ నుంచి అక్రమంగా మద్యం రవాణా



నారాయణగూడ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అక్రమ మద్యం నిందితులు

- రూ.2.20 లక్షల విలువైన విదేశీ మద్యం, రెండు బైకుల స్వాధీనం

హిమాయత్‌నగర్: ఢిల్లీ నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తూ నగరంలోని నారాయణగూడ ప్రాంతంలో విక్రయిస్తున్న ముఠాతో పాటు మద్యం బాటిళ్లను సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం డీటీఎఫ్ సీఐ సౌజన్య బృందం పట్టుకుంది. ఈమేరకు విచారణ నిమిత్తం నారాయణగూడ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా ప్రకాశం బజార్‌కు చెందిన ఏలూరి రవి, శ్రీధర్, వెంకటేశ్వరరావు అనే ఈ ముగ్గురు వ్యక్తులు ఢిల్లీ నుంచి అక్రమంగా మద్యం దిగుమతి చేసుకుని, అమ్మకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీరిలో ఒకరు హైదరాబాద్‌లో ఉండగా మరో ఇద్దరు ఢిల్లీ నుంచి మద్యం తీసుకువచ్చి రైల్వే స్టేషన్‌లో దిగి ఇచ్చి వెళ్తుంటారు. హైదరాబాద్‌లో ఉండే వ్యక్తి నారాయణగూడ ప్రాంతంలో అమ్మకాలు జరుపుతుంటారు. వచ్చిన లాభాల్లో ముగ్గురూ పంచుకుంటారు. పట్టుబడిన నిందితులను విచారించగా సుల్తాన్ బజార్ రిలయన్స్ స్మార్ట్ స్టోర్ సమీపంలో ఒక నిందితుడి వద్ద 24 మద్యం బాటిళ్లు, మరో నిందితుడి వద్ద నుంచి 20 రెడ్ లెబుల్ ప్రీమియం లిక్కర్ బాటిళ్లతో పాటు రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.2.20 లక్షల విలువ ఉటుంది. తదుపరి విచారణ నిమిత్తం నిందితులతో పాటు మద్యం బాటిళ్లను నారాయణగూడ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. మద్యం పట్టుకున్న డీటీఎఫ్ సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టర్ షానవాజ్ ఖాసీం, ఈఎస్ పంచాక్షరి, ఏఈఎస్ శ్రీనివాసరావు అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఐటీ ఉద్యోగి ఆత్మహత్య

రహమత్‌నగర్: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ ఐటీ ఉద్యోగి భవనం పైనుండి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కళ్యాణ్‌నగర్ వెంచర్-3 జయప్రియ అపార్ట్‌మెంట్‌లో శివకుమార్ (40) అనే ఐటీ ఉద్యోగి నివసిస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం తాను నివాసం ఉన్న అపార్ట్‌మెంట్ పైనుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఈఎన్‌టీ ఆస్పత్రిలో 'మురుగు' సమస్యకు పరిష్కారం



సుల్తాన్‌బజార్: గత పదిహేను రోజులుగా మురుగునీటిలో కూరుకుపోయిన కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రి శుక్రవారం భారీ వర్షానికి మొత్తం జలదిగ్బంధంలో కూరుకుపోయింది. విషయం తెలుసుకున్న హైడ్రా అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగి ఇక్కడ మురుగు నీటి సమస్యను పరిష్కరించారు. నీళ్ల బాటిళ్లు, కూల్‌డ్రింక్ బాటిళ్లు డ్రైనేజీలో వేయడంతోనే ఈ సమస్య ఉత్పన్నమై ఆస్పత్రి కింద ఉన్న నాలా మూసుకుపోయిందని హైడ్రా అధికారులు పేర్కొన్నారు. వాటిని తొలగించి సమస్యను పరిష్కరించామని తెలిపారు.

ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో రైల్వే పోలీసుల తనిఖీలు



ఘట్‌కేసర్: ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో అనుమానితులు (ఉగ్రవాదులు) ఉన్నారని రైల్వే పోలీసులకు (ఆర్పీఎఫ్) సమాచారం అందడంతో ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఉదయం ఆ రైల్లో తనిఖీలు చేపట్టారు. హౌరా నుంచి సికింద్రాబాద్‌కు వెళుతున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో ఉగ్రవాద లక్షణాలున్న వారు ప్రయాణిస్తున్నారని ఫోన్‌కాల్ రావడంతో అప్రమత్తమైన రైల్వే పోలీసులు ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. ఇతరులను ఎవరినీ స్టేషన్‌లోకి రానివ్వకుండా..బయటకు వెళ్లే వారి బ్యాగులు సోదా చేసి పంపారు. పోలీసులు అన్ని కంపార్ట్‌మెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.అనుమానంగా కనిపించిన ప్రయాణికుల లగేజ్ బ్యాగులు సోదా చేశారు. సోదాల్లో ఏమీ లభించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సుమారు గంట తర్వాత ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్‌కు బయల్దేరింది. తనిఖీలతో స్టేషన్‌లో, రైలులో ఉన్న ప్రయాణికులు ఏం జరిగిందో తెలియక ఆందోళన చెందారు.

రైలు బోగీలో ఆర్మీ జవాను మృతి



ఆర్మీ జవాను దినేష్‌కుమార్

సికింద్రాబాద్: కుటుంబ సభ్యులతో కలిసి నగరం నుంచి తిరుమలకు దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఓ ఆర్మీ జవాను రైలు బోగీలో శుక్రవారం ఉదయం మృతి చెందాడు. సికింద్రాబాద్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు వివరాల మేరకు..ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఖుషీనగర్ జిల్లా బలువా గ్రామానికి చెందిన దినేష్‌కుమార్ (41) ఆర్మీ నాయక్ సుబేదార్‌గా పనిచేస్తున్నారు. దినేష్‌కుమార్ భార్య తల్లిదండ్రులు నగరంలోని ఉప్పల్‌లో నివాసం ఉంటున్నారు. నాగాలాండ్ రాష్ట్రం దినాపూర్ ఆర్మీలో పనిచేస్తున్న దినేష్‌కుమార్ కొద్ది రోజుల సెలవుపై నగరానికి వచ్చాడు. రెండు రోజుల క్రితం ఆయన భార్య, ఇద్దరు కుమారులతో కలిసి తిరుమలకు వెళ్లాడు. దర్శనం అనంతరం ఈ నెల 25న రాత్రి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి తిరిగి పయనమయ్యారు. రాత్రి 11 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి రైలులోనే భోజనం చేసిన దినేష్‌కుమార్ నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారు జామున రైలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటున్న తరుణంలో భార్య నిద్రలేపినా దినేష్ కుమార్ మేలుకోలేదు. భార్య అందించిన సమాచారం మేరకు సికింద్రాబాద్ రైల్వే పోలీసులు దినేష్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం రైల్వేస్టేషన్ సమీపంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే దినేష్‌కుమార్ మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. గాంధీ ఆసుపత్రి మార్చురీలో దినేష్‌కుమార్ మృతదేహానికి పోస్టుమార్టం చేయించిన రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సాంస్కృతిక కళాసారథి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సాంస్కృతిక కళాసారథి ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పీఆర్సీ అమలు, వాహన సదుపాయం వంటి తదితర సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో సాంస్కృతిక సారథి కళాకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ..సాంస్కృతిక సారథి కళాకారులకు హెల్త్‌కార్డులు, మృతి చెందిన కళాకారుల కుటుంబాలకు పరిహారం, ఇందిరమ్మ ఇండ్లు, ప్రసూతి సెలవులు, బస్ పాస్‌లు వంటి అంశాలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ నిచ్చారు. కళాకారులకు జిల్లాకో వాహనం, దానికి మైక్ సిస్టమ్ సదుపాయాలను కలుగజేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను కళాసారథులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం సంక్షేమ పథకాలపై రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక కళాసారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలోని దసరా స్పెషల్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌ను ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నాదబ్రహ్మోత్సవ్ 2025ను పురస్కరించుకుని సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు ప్రముఖ కళాకారులచే అన్నమాచార్య సంకీర్తనలతో నాదనైవేద్యం కార్యక్రమం జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఉద్యానవన శాఖ గ్రాండ్ నర్సరీ మేళా పేరుతో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హార్టికల్చర్ షో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని కళింగ కల్చరల్ హాల్‌లో దసరా పండుగ సందర్భంగా ప్రత్యేకంగా హ్యాండ్‌లూమ్ ఇండియా ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, స్కల్ప్చర్స్, దీప్ ఇంటీరియర్స్ చిత్ర ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయి.
- బంజారాహిల్స్ గఫార్ ఖాన్ కాలనీలోని లేబుల్స్ ది పాప్ అప్ స్పేస్‌లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఖిజార్ స్కిల్స్ సోలో ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

నేడు బతుకమ్మ కార్నివాల్

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా శనివారం ట్యాంక్ బండ్‌పై బతుకమ్మ కార్నివాల్ నిర్వహించనున్నట్లు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో హస్తకళా ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే జానపద, గిరిజన కళారూపాలను ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ, పీజీ ప్రవేశ గడువు పెంపు..

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ (బీఏ/ఎం.కాం/ఎమ్మెస్సీ, ఎంబీఏ) కోర్సులు, బి.లిస్క్, ఎం.లిస్క్, డిప్లొమా, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను చివరి తేదీ అక్టోబర్ 10 వరకు పొడిగించినట్లు విశ్వవిద్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి సమాచారం, ఆన్‌లైన్‌లో నమోదు తదితర అంశాలపై సందేహాలు ఉంటే సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని లేదా విశ్వవిద్యాలయ హెల్ప్‌డెస్క్ నెంబర్లు 040-23680333/444/555, టోల్‌ఫ్రీ నెంబర్: 18005990101లో సంప్రదించవచ్చని సూచించారు.

ప్రతికూల వాతావరణంతో విమానాల మళ్లింపు

శంషాబాద్: భారీ వర్షం కారణంగా శంషాబాద్ విమానాశ్రయానికి విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ముంబయి, కోల్‌కత్తా, పూణే నుంచి ఉదయం 7.30 గంటలకు శంషాబాద్ చేరుకోవాల్సిన విమానాలను దారి మళ్లించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్‌కు పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో విజయవాడ విమానాశ్రయానికి మళ్లించారు. సంబంధిత విమానాలు తిరిగి సాయంత్రం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాయి. వాతావర పరిస్థితుల కారణంగా మరి కొన్ని విమానాలు కూడా నిర్దేశించిన సమయానికి ఆలస్యంగా రాకపోకలు జరిపినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

నగరంలో ఏడుగురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

సాక్షి, సిటీబ్యూరో: నగర కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఏడుగురు ఇన్‌స్పెక్టర్‌లను బదిలీ చేస్తూ కొత్వాల్ సీవీ ఆనంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పి.సైదులును బేగంపేట, ఎం.రామకృష్ణ పంజగుట్ట, జె.భాస్కర్ కామాటిపురా, ఎం.రవికుమార్‌ను గోపాల్‌పురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లుగా నియమించారు. వీరితో పాటు మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్‌లను బదిలీ చేశారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో 'కిల్ ది కేన్సర్'

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఇస్కాన్ (కూకట్‌పల్లి- ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షియస్‌నెస్) ఆధ్వర్యంలో కేన్సర్ మహమ్మారిపైన విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. 2018 నుంచి ఈ కార్యక్రమాలను తెలంగాణలోని కళాశాలలలో 'కిల్ ది క్యాన్సర్' అనే పేరుతో కేన్సర్ అవగాహన ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంక్రమించే వ్యాధులలో కేన్సర్ రెండవ స్థానంలో ఉందని, ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిన వివరాల ప్రకారం ప్రతి ముగ్గురు పురుషుల్లో, ప్రతి నలుగురు మహిళల్లో ఒకరు కేన్సర్‌తో బాధపడుతున్నారని పేర్కొన్నారు. కేన్సర్ కేసుల్లో ఎక్కువ భాగం అనారోగ్యకరమైన జీవనశైలి కారణంగానే సంభవిస్తున్నాయని అన్నారు.

పొన్న వాహన సేవలో శ్రీవారు



పొన్న వాహన సేవలో వేంకటేశ్వర స్వామి

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామివారిని ఆలయ అర్చకులు, భక్తులు ఉదయం పొన్న వాహన సేవలో, సాయంత్రం హంస వాహన సేవలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి పూర్ణాహుతితో పాటు బలిహరణ, తీర్థప్రసాద గోష్టి, మంత్రహవనం తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సిపిరి అర్జున్ యాదవ్, ఈట శ్రీనివాసశర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



సునీతా గోపీనాథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ వెంకటేష్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థిగా మాగంటి సునీతాగోపీనాథ్‌ను ప్రకటించిన దృష్ట్యా జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ శుక్రవారం ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు మార్గదర్శకత్వంలో పని చేసి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీనిచ్చారు.

ఆన్‌లైన్ ఉద్యోగం పేరుతో మోసం

వెంగళరావునగర్: ఆన్‌లైన్ ఉద్యోగం పేరుతో మోసం చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన ఎన్.అయ్యప్ప వెంకటేష్ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఈనెల 9న దర్శిదే దాస్ అనే యువతి నుంచి వాట్సప్ మెసేజ్ వచ్చింది. తాను డిజిటల్ మార్కెట్‌లో రిసెప్షనిస్ట్‌గా వర్క్ చేస్తున్నానని పరిచయం చేసుకుంది. తమ వద్ద పార్ట్‌టైం జాబ్స్ ఖాళీగా ఉన్నాయని, స్టార్ హోటల్స్‌కు రేటింగ్స్ పంపితే నగదు వస్తుందని, ఇందుకోసం రిజిస్టర్ చేయాలని తెలియజేసింది. తొలుత అతని వద్ద రూ.వెయ్యి ఆన్‌లైన్‌లో తీసుకున్నారు. ఈ విధంగా రూ.99 వేల వరకు తీసుకున్నారు. ఎన్నిసార్లు ఫోన్లు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో బాధితుడు శుక్రవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లు ఇలా..ప్రయాణించేదెలా..?

- ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో గుంతలమయమైన రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు



బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14లో గుంతలమయమైన రోడ్డు

బంజారాహిల్స్: త్వరలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల నేపథ్యంలో ప్రతిరోజూ ముగ్గురు మంత్రులతో పాటు అధికార యంత్రాంగం మొత్తం అక్కడే తిష్టవేసి ఇప్పటికే 100 కోట్లకు పైగా పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ పనులు నత్తనడకన సాగుతున్నా నిధులు మాత్రం ఉప ఎన్నికల పుణ్యమా..! అని మంజూరయ్యాయి. అయితే పక్కనే ఉన్న ఖైరతాబాద్ నియోజకవర్గంలో మాత్రం అభివృద్ధి జాడ కనిపించడం లేదు. పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ప్రభుత్వ నిర్వాకానికి నిలువెత్తు దర్పణంగా నిలుస్తున్నాయి. ప్రజాప్రతినిధులకు తీరిక దొరకడం లేదు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కొంత కాలంగా పనులపై దృష్టి పెట్టడం లేదు. అనర్హత వేటు నోటీసుల పనితోనే ఆయన బిజీబిజీగా గడుపుతున్నారు. దీంతో అధికారులు కూడా అడిగేవారు లేరు కదా! అని అభివృద్ధి పనులపై దృష్టిపెట్టడం లేదు. ఫలితంగా ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో అడుగడుగునా రోడ్లు గుంతలుపడి వాహనదారులు నరకాన్ని చవిచూస్తున్నారు. గుంతల్లో పడి వాహనదారులు, పాదచారులు ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు.

- ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో 62 ప్రధాన, అంతర్గత రహదారులు గుంతలు తేలి 192 గుంతలు ఉన్నట్లుగా జీహెచ్ఎంసీ రికార్డులు వెల్లడిస్తున్నాయి.
- రహదారులపై గుంతలు పూడ్చామని కమిషనర్ కర్ణన్ గొప్పగా చాటుకున్నా జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని డీఈలు, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఆయన మాటను పెడచెవినపెట్టారు.
- ఈ నేపథ్యంలోనే ఏ రోడ్డు చూసినా గుంతలు తేలి నియోజకవర్గ పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా మారుతోంది. గుంతలకు తోడు పొంగుతున్న డ్రైనేజీ మురుగు, తెరిచి ఉన్న మ్యాన్‌హోళ్లు, పొంగుతున్న వరదనీటి కాలువలు, ఎత్తని చెత్తా చెదారం, పేరుకుపోయిన వ్యర్థాలు నియోజకవర్గాన్ని అత్యంత అధ్వానంగా మారుస్తున్నాయి.
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివసించే నియోజకవర్గంలోనే పరిస్థితి అధ్వానంగా ఉన్నా జీహెచ్ఎంసీ అధికారులు, ఇంజినీర్లు పట్టించుకోవడం లేదు.
- సమస్యలు ఎక్కడికక్కడ పేరుకుపోయి స్థానికులను ఇబ్బంది పెడుతుంది. కొందరు ప్రజా ప్రతినిధులు కేవలం ఫొటోలతోనే సరిపెట్టుకుంటూ పనులపై దృష్టి పెట్టడం లేదు.
- పక్క నియోజకవర్గంలో పనులు జరుగుతుంటే మా నియోజకవర్గంలో ఎందుకు జరగవని జనం నిలదీస్తున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు పనులు చేయించుకోరా..? అని నిలదీస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు, ఇంజినీర్లను రోడ్ల పైకి రప్పించి గుంతలను చూపించరా..? అని ప్రశ్నిస్తున్నారు.
- మీడియాలో వస్తున్న సమస్యలను చూసిన తర్వాతనే జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు స్పందిస్తున్నారు తప్పితే.. ప్రజా ప్రతినిధుల ప్రభావం మాత్రం ఎక్కడా కనిపించడం లేదని దుయ్యబడుతున్నారు.
- ఓట్లు వేసిన పాపానికి అనుభవిస్తున్నామని దుమ్మెత్తిపోస్తున్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇప్పటిదాకా సంబంధిత శాఖల అధికారులతో రివ్యూ మీటింగ్ పెట్టలేదు. దీంతో జీహెచ్ఎంసీ ఇంజినీర్లు వసూళ్లపై దృష్టిపెట్టి పనులను పక్కనపెట్టారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ శిబిరం సందర్శన



శిక్షణ శిబిరాన్ని సందర్శించిన హైదరాబాద్ గ్రూపు కమాండర్

బంజారాహిల్స్: ఎన్‌సీసీ-3 తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్ల వార్షిక శిక్షణ శిబిరాన్ని హైదరాబాద్ గ్రూప్ కమాండర్ కల్నల్ ప్రశాంత్‌కుమార్ సందర్శించారు. ఈ నెల 22న ప్రారంభమై అక్టోబర్ 1 వరకు కొంపల్లిలోని శివ శివానీ కళాశాలలో జరుగుతున్న ఈ శిబిరం మూడో తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ శరత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. నగరానికి సంబంధించిన అనేక కళాశాలలు, పాఠశాలలకు సంబంధించిన సుమారు 572 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు శిబిరంలో పాల్గొంటున్నారు. ఈ శిబిరంలో విద్యార్థులకు శారీరక దారుఢ్యం, మానసిక సన్నద్ధత, ఫైరింగ్, సమాజ సేవ, విపత్తు నిర్వహణ, నాయకత్వ లక్షణాలు, దేశ రక్షణలో విద్యార్థుల పాత్ర, జాతీయ సమైక్యత తదితర అంశాలపై కఠోర శిక్షణ ఇస్తున్నారు. ఈ క్యాంపులో అనేక అంశాలపై విద్యార్థులకు నిష్ణాతులతో తర్ఫీదునిస్తున్నాయి. ముఖ్యంగా మహిళా సాధికారత దిశగా యువ క్యాడెట్లకు ధైర్యాన్ని నూరిపోస్తున్నారు. ఈ క్యాంపులో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మంజులశర్మ, అధికారులు మేజర్ సిలార్, లెఫ్టినెంట్ సంజీవకుమార్‌సింగ్, సుబేదార్ మేజర్ విజయ్, సుబేదార్ ప్రవీణ్ దగ్గరుండి క్యాంపు నిర్వహిస్తున్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సునీత, దేదీప్య విజయ్



నివాళులర్పిస్తున్న ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితరులు



మిఠాయిలు తినిపిస్తున్న పూసాల సంపత్

బంజారాహిల్స్: చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు శుక్రవారం బంజారాహిల్స్‌లో ఘనంగా జరిగాయి. రజక సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల సంపత్‌తో పాటు సంఘం నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ వేడుకలు నిర్వహించారు. బడ్జెట్‌లో తక్కువ కేటాయించి రాష్ట్రంలోని రజకులను అవమానించి తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినందుకు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన జయంతి కార్యక్రమాన్ని తిరస్కరించినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచకొండ వెంకన్న, ముత్యాల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాటం ప్రతి మహిళకు ఆదర్శం..

వెంగళరావునగర్: చాకలి ఐలమ్మ పోరాటం సమాజంలోని ప్రతి మహిళకు ఆదర్శంగా నిలుస్తుందని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి నిజవహర్‌నగర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు ముదిరాజ్, కిట్టు, బొట్టురాజు, అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో..

లక్డీకాపూల్: నిమ్స్‌లో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి నివాళులరిస్తూ.. ఆమె వీరత్వాన్ని స్మరించుకున్నారు. నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా ఆయన ఉత్తమ మహిళలుగా నెఫ్రాలజిస్ట్ డా.స్వర్ణలత, అడ్మినిస్ట్రేషన్ విభాగం అధికారి డా.వై.హేమలీల, సుకన్య, శారదా, కామేశ్వరిలను సత్కరించారు. తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.రాజుకుమార్, రాష్ట్ర రజక యువజన సంఘం అధ్యక్షుడు నల్లతీగల రాజు, మెడికల్ సూపరింటెండెంట్ డా. నిమ్మ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దళిత బహుజన శక్తుల ఐక్యతతోనే రాజ్యాధికారం



కూటమి నేతలతో అభివాదం చేస్తున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్

హిమాయత్‌నగర్: దేశంలోని దళిత బహుజన రాజకీయ శక్తుల ఐక్యతతోనే దళితులకు రాజ్యాధికారం దక్కుతుందని జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి(ఎన్.డీ.ఎస్.ఎఫ్) చైర్మన్, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. ఎన్.డీ.ఎస్.ఎఫ్ 5వ వార్షికోత్సవ మహాసభ శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కాన్ఫడరేషన్ చైర్మన్, ప్రొఫెసర్ డా.వి.ఎల్.రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్లమూరి కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ..ఎస్సీ, ఎస్టీ, బీసీల నాయకత్వంలో పని చేస్తున్న వివిధ రాజకీయ పార్టీల ఐక్యతతో పొలిటికల్ పవర్ సాధన కోసం ఉమ్మడిగా మనువాద దోపిడీ పార్టీలపై రాజకీయ పోరాటం చేయనున్నట్లు తెలిపారు. మనువాద పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎన్.డీ.ఎస్.ఎఫ్ ఎదగడమే కాకుండా మూడో ప్రత్యామ్నాయంగా ఎన్నికల బరిలో నిలబడుతుందని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణలో స్థానిక ఎన్నికలతో పాటు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో పోటీ చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎన్‌డీఎస్‌ఫ్ నేతలు జె.ఎన్.రావు, నక్క దేవేందర్ రావు, చిప్పరి సుబ్బారావు, ఎన్.రోజాలీలా, షేక్ బాషా, కొల్ల సుధాకర్, మద్దెల రాయప్ప, అశోక్ కుమార్, ఇటికాల గణేష్ పాల్గొన్నారు.

మహిళ మెడలోని చైన్ స్నాచింగ్

వెంగళరావునగర్: నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని యువకుడు మంగళసూత్రం లాక్కుని పారిపోయిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..గోదావరి జిల్లాకు చెందిన కాసాని లక్ష్మి, వెంకటేశ్వరరావు దంపతులు 20 ఏళ్ల కిందట నగరానికి వచ్చి జీవిస్తున్నారు. ఆమె ఐదేళ్లుగా యూసుఫ్‌గూడ గణపతి కాంప్లెక్స్ వద్ద కూరగాయలు విక్రయిస్తుంది. ఈనెల 25న మధ్యాహ్నం భోజనం చేయడానికి చర్చిగల్లీ మీదుగా ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా మార్గమధ్యలో వెనుక నుంచి వచ్చిన ఓ యువకుడు ఆమె మెడలో ఉన్న మంగళసూత్రం లాక్కొని పారిపోయాడు. మంగళ సూత్రం విలువ దాదాపు రూ.1.20 లక్షల ఖరీదు ఉంటుంది. బాధితురాలు శుక్రవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

బంజారాహిల్స్: ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై జీహెచ్ఎంసీ ఉద్యోగినులు, ఆశావర్కర్లు, ఆర్పీలు, బీఎల్ఓలతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. జీహెచ్ఎంసీ సర్కిల్-18 డీసీ సమ్మయ్య, యూసీడీ డీపీఓ ఆశావిరోనికతో పాటు పలువురు మహిళా సంఘాల సభ్యురాళ్లు కూడా పాల్గొన్నారు.



లలితా దేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి



మహాలక్ష్మీగా పర్వతవర్ధిని అమ్మవారు

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడిలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



మహాచండీ దేవిగా మాగంటి కాలనీ విజయ కనకదుర్గా



ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు

బంజారాహిల్స్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలువైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం 5వ రోజు జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి లలితా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఫిలింనగర్ దైవసన్నిదానంలోని రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి ఆలయంలో అష్టోత్తర శతకలశాభిషేకం నేత్రపర్వంగా నిర్వహించారు. మాగంటి కాలనీలోని విజయ కనకదుర్గా అమ్మవారు మహాచండీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని విశ్వసాయి మందిరంలోని కనకదుర్గా దేవి మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలోని విజయగణపతి ఆలయంలో అమ్మవారిని మూడున్నర లక్షల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మి దేవిగా అలంకరించారు.

సీతారామస్వామి ఆలయంలో..

జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-18లోని సీతారామస్వామి ఆలయంలోని పర్వతవర్ధిని అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతిరోజూ సాయంత్రం ఇక్కడ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. అనూష శ్రీనివాస్ శిష్యులచే కూచిపూడి నృత్య ప్రదర్శన, మైథిలీ మరాఠే అనూప్ శిష్యులచే మోహినీయట్టం నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



కరెన్సీ నోట్లతో బంజారాహిల్స్ విజయగణపతి స్వామి ఆలయంలో అమ్మవారి అలంకరణ



ఫిలింనగర్ దైవసన్నిదానంలో రాజరాజేశ్వరి దేవికి అష్టోత్తర శతకలశాభిషేకం పూజలు



మహాలక్ష్మిగా బంజారాహిల్స్ కనకదుర్గా



మహాలక్ష్మిగా శ్రీనగర్‌కాలనీ భ్రమరాంబికా

లోతట్టు ప్రాంతాలు జలమయం



సోమాజిగూడ రాజీవ్ గాంధీ చౌరస్తాలో..



జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10లో..



కేబీఆర్ పార్కు వద్ద మ్యాన్‌హోళ్లు తెరుస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, ఖైరతాబాద్, సోమాజిగూడ, కృష్ణానగర్, శ్రీనగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇప్పటికే 25 రోజులుగా ఇందిరానగర్, కృష్ణానగర్ ప్రాంతాల్లో నిత్యం వరద పొంగుతుండగా ఈ తాజా వానతో స్థానికులు మరింత ఇబ్బందులు పడ్డారు. కేబీఆర్ పార్కులోని కుంటలు మరోసారి నిండి జీహెచ్ఎంసీ వాక్‌వేతో పాటు రోడ్డు పైకి నీళ్లు రావడంతో అధికారులు మోటార్లు పెట్టి వరదను కాల్వల్లోకి పంపింగ్ చేశారు. కేబీఆర్ పార్కుతో పాటు శబ్దాలయ స్టూడియో వైపు నుంచి వరద పెద్ద ఎత్తున వస్తుండటంతో వరద నీటి కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలతో పాటు, చెత్తాచెదారాన్ని జీహెచ్ఎంసీ డీఈ అభినయ్ ఆధ్వర్యంలో తొలగించారు.







కలర్‌ఫుల్‌గా సాగే సందడిలో కలిసి మెలిసి, మురిసిపోతున్నారు నగరవాసులు.. కేక పుట్టించే కేడియాలతో అబ్బాయిలు, చెన్యా చోళీలతో ఛెంగున దుమికే జలపాతాల్లా అమ్మాయిలు మెరిసిపోతున్నారు. నవరాత్రి వేడుకలు.. మరే పండుగకూ లేనంత ఫ్యాషన్ స్టైల్స్‌కు పట్టం కడతాయి. దీనికి ముఖ్యకారణం దాండియా, గర్బా తదితర వేడుకల సందర్భంగా లుక్‌ని మార్చేసే వస్త్రధారణే. తొమ్మిది రోజుల పాటు కొనసాగే దాండియా వేడుకల్లో కుటుంబ సమేతంగా పాల్గొనడం అనే ఉత్తరాది సంప్రదాయం నగరంలో స్థిరపడిపోయింది. దీంతో నవరాత్రి వేడుకలకు కొంత కాలం ముందస్తు ప్రిపరేషన్‌తో పాటు ఆ జ్ఞాపకాలను, దాని తాలూకు గుర్తులను కూడా మరింత కాలం నిలిచిపోయేలా చేస్తోంది.

- సాక్షి, సిటీబ్యూరో

ఫ్యాషన్ ఫెస్టివల్.. అదిరే స్టైల్

నగరంలో నవరాత్రి ఫ్యాషన్ ట్రెండ్స్

- పండుగ దుస్తుల రూటే సెపరేటు
- యాక్సెసరీస్‌లో ఫ్యూజన్ శైలికి జై
- తొమ్మిది రోజులకు తగ్గట్టుగా అలంకరణతో స్పెషల్ లుక్
- వేర్వేరు నగరాలకు వెళ్లి మరీ షాపింగ్

నవరాత్రి తొమ్మిది రోజులూ రాత్రి పొద్దు పోయాక మొదలై తెల్లవారుజామున 3గంటల వరకూ దాదాపు 5గంటల పాటు సాగే దాండియా, గర్బా నృత్యాల్లో బరువైన దుస్తులు, జంక్ జ్యువెలరీ ధరించి పాల్గొనడం కొంత శ్రమే అయినా సిటిజనులు సై అంటున్నారు.

రోజుకో లుక్‌లో..

దాండియా ఈవెంట్స్‌లో పాల్గొనేవాళ్లు ప్రతి రోజూ దుస్తులు మార్చాల్సి ఉంటుంది. ఒక రోజు బాలీవుడ్, ఒక రోజు ట్రై కలర్, ఒక రోజు ఎవరైనా దేవుడు/దేవతలాగా.. ఇలా తమని తాము తీర్చిదిద్దుకోవాల్సి ఉంటుంది. అలాగే ఒక రోజు ఏదైనా ప్రాపర్టీ యూజ్ చేసి డ్యాన్స్ చేయమంటారు. 'తెలుగువాడినే అయినా నవరాత్రి ఉత్సవాల్లో ఏటా 9 రోజుల పాటు జరిగే నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం అలవాటు. ఈ సారి ఫ్యాన్సీ జ్యువెలరీ కోసం అహ్మదాబాద్‌కి వెళ్లి షాపింగ్ చేశాం' అని చెప్పారు నగరానికి చెందిన వేణు.

డ్రెస్, జ్యువెలరీ బరువే ఎక్కువ..

'అందరికన్నా నేను ధరించబోయే డ్రెస్, జ్యువెలరీ బరువే ఎక్కువ. నాది ఫోర్ పీస్ డ్రెస్. లోపల షర్ట్, కెడియా, కింద ప్యాంట్ దాని చుట్టూ మరొక బరువైన వస్త్రం. తలకి ధరించిన పగిడీని మా అమ్మ నేను కలిసి తయారు చేసుకున్నాం' అని వేణు వివరించారు. 'ప్రతి సారీ నా డ్రెస్‌కి బాగా కాంప్లిమెంట్స్‌తో పాటు గతేడాది తొలిరోజుతో పాటు. లాస్ట్ డే నాన్‌స్టాప్ డ్యాన్స్ చేసినందుకు ప్రైజ్‌లు కూడా వచ్చాయి. ఈ సారి కూడా నాదే హవా' అంటూ ఆనందం వ్యక్తం చేశారు.



వస్త్రధారణ విశేషాలు..

- చానియా–చోళీ/గాగ్రాచోళీ అత్యంత ప్రజాదరణ పొందిన ఎంపిక, అలంకరించిన స్కర్ట్, టాప్‌ను కలిగి ఉంటుంది, మిర్రర్ వర్క్, ఎంబ్రాయిడరీ ఎరుపు నారింజ వంటి శక్తివంతమైన రంగులతో మెరుస్తుంది.
- చానియా–చోళీ/గాగ్రాచోళీ అత్యంత ప్రజాదరణ పొందిన ఎంపిక, అలంకరించిన స్కర్ట్, టాప్‌ను కలిగి ఉంటుంది, మిర్రర్ వర్క్, ఎంబ్రాయిడరీ ఎరుపు నారింజ వంటి శక్తివంతమైన రంగులతో మెరుస్తుంది.
- ఫ్యూజన్ వేర్‌తో మరింత సౌకర్యం కదలిక సౌలభ్యం కోసం, మహిళలు పొడవైన, ప్రవహించే స్కర్ట్‌తో నడుము దగ్గర ముడి వేసిన బటన్–డౌన్ చొక్కా వంటి ఆధునిక కలయికలను ఎంచుకుంటారు.
- చికంకారి పలాజ్జో ప్యాంటుతో జత చేసిన పొడవైన కుర్తా ఫ్యాషన్ సౌకర్యవంతమైన దుస్తులను అందిస్తుంది.
- అనార్కలి సూట్లు కాలానుగుణమైన, పొడవైన సిల్హౌట్‌ను కలిగి ఉంటాయి. ఇవి నృత్యానికి అనువైనవి.

హెడ్‌వేర్ : సంప్రదాయ పగిడీలు లేదా టర్బన్‌లు పండుగ స్పర్శను జోడిస్తాయి.

వేడి నీళ్లు, ఉప్పుస్నానం..

దాండియా కోసం నెల నుంచే సన్నాహాలు మొదలవుతాయి. ఈ ఈవెంట్‌లో మెయిన్ డ్రెస్‌కి ఎన్ని అదనపు హంగులు జత చేస్తే అంత అట్రాక్షన్.. 'కాళ్లు అడుగుభాగం పగిలిపోతుంది. మొత్తం పొట్టులా వచ్చేస్తుంది. డ్యాన్స్ చేస్తూ అక్కడ పడిపోయిన పూసలు, గవ్వలు అన్నీ తొక్కుతుంటాం. కనీసం ఒక్క టీటీ ఇన్‌జక్షన్ అయినా అవసరం పడుతుంది. ప్రతిరోజూ ఇంటికొచ్చి వేడి నీళ్లలో ఉప్పు వేసుకుని స్నానం చేయకతప్పదు. డ్రెస్‌కి జతచేసేది అంతా జంక్ జ్యువెలరీ కాబట్టి ఒంటికి పట్టే చెమటతో చర్మ సమస్యలు తప్పవు. నృత్యం ప్రారంభంలో తళతళలాడే పగిడి చివరి రోజుకి అంతా తుప్పు పట్టేస్తుంది. - ప్రియాంక

కచ్‌కు వెళ్లి కొనుక్కొచ్చా..

"నెల క్రితమే నా ప్రిపరేషన్ స్టార్ట్ అయ్యింది. గుజరాత్‌లోని కుచ్ భుజోడి నుంచి నా గాగ్రాలు కొన్నాను. అక్కడి తెగల వారు తయారు చేసిన రాబరి స్కర్ట్స్ చాలా అద్భుతంగా ఉంటాయి. అహ్మదాబాద్ నుంచి హైదరాబాద్‌లోని కోఠి దాకా షాపింగ్ చేశా. కొత్త కొత్త స్టెప్స్ కోసం ఇంటర్నెట్‌లో వీడియోలు చూడడం, సొంతంగా స్టెప్స్ సృష్టించడం.. తరచూ కుట్లు, అల్లికలతో డ్రెస్సులను డెకరేట్ చేయడం ఓ సవాల్."

- స్నేహ సరయా



పురుషుల కోసం..

కుర్తా ధోతీ ఓ క్లాసిక్ సొగసైన ఎంపిక నృత్యానికి అనువైన సౌకర్యవంతమైన స్టైలిష్ లుక్‌ని అందిస్తుంది. కేడియా స్పెషల్.. సంప్రదాయ రూపాన్ని పొందేందుకు మగవాళ్లు పొడవాటి చొక్కాను తరచూ తలపాగాతో జత చేస్తారు. పురుషులు ధోతీ ప్యాంటుతో జత చేసిన కుర్తా వంటి ఆధునిక ఫ్యూజన్ దుస్తులను ఎంచుకోవచ్చు.

యాక్సెసరీస్..

నగలు : చంకీ నెక్లెస్‌లు, ఆక్సిడైజ్డ్ చెవిపోగులు స్టేట్‌మెంట్ పీసెస్ ఈ ఫెస్టివల్‌కు ప్రసిద్ధి చెందాయి.

పాదరక్షలు : అలంకరించిన జుట్టీలు లేదా సంప్రదాయ మోజారిలు నృత్యానికి తగినట్టుగా ఉంటాయి.





దేవీమాత సన్నిధిలో భక్తిగీతాలాపన..

బంజారాహిల్స్ : దేవీ నవరాత్రులను పురస్కరించుకుని జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ కల్చరల్ సెంటర్‌లో 'పరంపర' సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి గీతాల రాగాలాపన అహూతులను తన్మయత్వానికి గురిచేశాయి. ప్రముఖ కర్ణాటక గాత్ర విద్వాంసురాలు సూర్యగాయత్రి తనదైన శైలిలో దేవీ మాతను స్తుతిస్తూ పాడిన భక్తి పాటలు ఆకట్టుకున్నాయి. సిద్ధివినాయక గణనాయకం.. స్తోత్రంతో ఆరంభించిన ఈ కచేరి రెండు గంటల పాటు ఆనందడోలికల్లో ముంచెత్తింది. పరంపర నిర్వాహకులు శశిరెడ్డి, డాక్టర్ శ్రీనాగి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఆకట్టుకున్న సాంకేతిక ఆవిష్కరణలు..

సాక్షి, సిటీబ్యూరో: సాంకేతిక ప్రేమికులు, యువ నిపుణులు, కంటెంట్ క్రియేటర్లు పరస్పరం కలిసి, ఆలోచనలను పంచుకోడానికి వీలుగా తైవాన్‌కు చెందిన టెక్ దిగ్గజం అసుస్ నగరంలోని బంజారాహిల్స్ రోస్ట్ సీసీఎస్ కేఫ్‌లో 'బియాండ్ ఇన్‌క్రెడిబుల్ విత్ అసుస్' నిర్వహించింది. ఇందులో భాగంగా హాజరైన వారి కోసం ఇంటరాక్టివ్ గేమ్స్‌తోపాటు, రాపిడ్ ఫైర్ వంటి సెషన్స్ నిర్వహించింది. సందర్శకులు ఫొటో బూత్‌లో ఎంజాయ్ చేశారు. వివోబుక్ మల్టీకలర్ సిరీస్ వంటి పలు సాంకేతిక ఆధారిత ఉత్పత్తులను ఇందులో ప్రదర్శించారు. బెంగళూరు, పుణె తరువాత తదుపరి ప్రదర్శనకు నగరాన్ని ఎంచుకున్నామని, దశల వారీగా మరిన్ని నగరాలకు విస్తరిస్తామని బ్రాండ్ వైస్ ప్రెసిడెంట్ ఆర్నాల్డ్ వివరించారు.

'ది చైల్డ్ హూ నెవర్ న్యూ'

సాక్షి, సిటీబ్యూరో: ఆటిజం వంటి కారణాలతో ప్రత్యేక అవసరాలున్న పిల్లల సంరక్షణ సంస్థలను వారి కుటుంబాలను వెలుగులోకి తెచ్చి, వారికి మద్దతు, శక్తినిచ్చే చర్చా కార్యక్రమం నగరంలో మంగళవారం జరుగనుంది. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ మద్రాస్ రీడింగ్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. గచ్చిబౌలిలో హోటల్ హయత్‌లో జరిగే ఈ కార్యక్రమంలో ఇద్దరు ప్రత్యేక అవసరాలున్న పిల్లల తల్లులు మధు రంగనాథన్, ఉపాసన మహ్తానీలు పాల్గొంటారని, ఇందులో భాగంగా మధు రంగనాథన్ రాసిన 'ది చైల్డ్ హూ నెవర్ న్యూ' పుస్తకంపై చర్చ ఉంటుందన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలున్న ఇద్దరు తల్లుల వ్యక్తిగత అనుభవాల నేపథ్యంలో మధ్యాహ్నం 3:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకూ కొనసాగుతుందన్నారు.







ఆడుదామా.. దాండియా..

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్ రోడ్‌నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీలోని రిక్రియేషన్ సెంటర్‌లో దాండియా వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై దాండియా పాటలకు ఆటలు ఆడుతూ శుక్రవారం సందడిగా గడిపారు. చిన్నా పెద్దా తేడా లేకుండా చిన్నారులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున దాండియా వేడుకల్లో పాల్గొన్నారు. - బంజారాహిల్స్

హిందుస్తానీ స్వరాలు.. కూచిపూడి నృత్యాలు..

సాక్షి, సిటీబ్యూరో: దసరా నవరాత్రి వేడుకల్లో భాగంగా ప్రత్యేకంగా నిర్వహించిన పూనమ్ బాజాజ్ (క్రిస్టల్) సితార్, హిందుస్తానీ మ్యూజిక్ : ఏ టైమ్‌లెస్ డైలాగ్, మెలొడీస్ ఫర్ ది డివైన్ వేడుకలు నగరవాసులను అలరిస్తున్నాయి. హైటెక్ సిటీలోని కోహినూర్ బై అవరో రియాల్టీ వేదికగా నిర్వహించిన వేడుకల్లో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. ఇందులో భాగంగా జ్యోతి కళాక్షేత్రం స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ శిష్యులు, గురువు జ్యోతి రెడ్డి మార్గదర్శకత్వంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. చిన్నారులు పుష్పాంజలి, రాజరాజేశ్వరి అష్టకం, దశావతారం, తరంగం, దుర్గా స్తుతి వంటి ప్రదర్శనలతో వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. విదూషి కమలా భట్ (వోకల్), వికాస్ నరేగల్ (తబలా), మధుసూదన భట్ (సమ్వాదిని) అద్భుత వాద్య–గానంతో సందడి చేశారు. ఈ వేడుకల్లో నిర్వాహకులు గోడి విజేత దేవి, గోడి సతీష్ రెడ్డి, ది మెడ్‌బ్రిడ్జ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



అవగాహనతోనే.. కేన్సర్ నివారణ

మిస్ వరల్డ్–2025 ఓపల్ సుచాత

ఓపల్ ఫర్ హర్ ద్వారా ప్రచారం

మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సహకారంతో విస్తృతం



మాదాపూర్ : అవగాహనతోనే కేన్సర్ నివారణ సాధ్యమని, ఇందుకు మిస్ వరల్డ్ ఆర్గనేజేషన్ సహకారంతో 'ఓపల్ ఫర్ హర్' ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని మిస్ వరల్డ్–2025 ఓపల్ సుచాత అన్నారు. మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్ వేదికగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. హైదరాబాద్ రావడం తనుకు ఎప్పుడూ సంతోషమేనని, కేవలం థాయ్‌ల్యాండ్‌కు మాత్రమే కాకుండా ప్రపంచానికి ప్రాతినిథ్యం వహిస్తున్నందున తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు, బాలికలకు రొమ్ము కేన్సర్ పట్ల అవగాహన కల్పించేందుకు తాము పింక్ పవర్ రన్‌లో పాల్గొంటున్నామని, ఇందులో భాగంగా ఈ నెల 27న చారిటీ విత్ మిస్ వరల్డ్ పేరుతో స్థానిక స్వచ్ఛంద సంస్థల కోసం ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మిస్ వరల్డ్ కిరీటం అందుకున్న తర్వాత తన జీవితం ఎంతగానో మారిందని, పలు దేశాల్లో రొమ్ము కేన్సర్ పట్ల అవగాహనతో పాటు పలు ప్రాజెక్టుల కోసం ఆయా దేశాల బ్యూటీలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. కేన్సర్ బారిన పడిన బాధితులకు శారీరక, మానసిక మద్దతు అందిస్తున్నట్లు తెలిపారు. యేటా బ్రెజిల్‌లో 74 వేల కేసులు బయటపడుతుంటే, అమెరికా ఖండం మొత్తం మీద 2 లక్షలకు పైగా కేసులు గుర్తిస్తున్నట్లు మిస్‌వరల్డ్ అమెరికా జెస్సికా పెడ్రోసో అన్నారు.



కేసులను ముందుగా గుర్తించాలి..

అవగాహనతోనే కేన్సర్ కేసులను ముందుగా గుర్తించగలమని మిస్‌వరల్డ్ కరేబియన్ ఔరెల్లీ జోయాచిమ్ అన్నారు. మిస్ వరల్డ్ అనేది బ్యూటీ పేజెంట్ కంటే ఎక్కువని, ఇటువంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం పొందడం సంతోషకరమని అన్నారు. మిస్‌వరల్డ్ మిస్ ఆసియా కృష్ణగ్రావిడ్జ్, మిస్ ఒసియానా జాస్మిన్ స్ట్రేంజర్ మాట్లాడుతూ చిన్నారులకు సేవచేయడానికి విభిన్న సంస్థలతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌తో భాగస్వామ్యం చేసుకుని పలు కార్యక్రమాలను చేస్తున్నామని ఫార్చ్యూన్ హాస్పిటాలిటీకి చెందిన డాక్టర్ రామకృష్ణ అన్నారు. ఇందులో భాగంగా శనివారం 200 మందికి పైగా అల్పాదాయ వర్గాలకు చెందిన కార్మికులకు వస్త్రాలను పంపిణీ చేయడంతో పాటు 100 మంది చిన్నారులకు సహాయం అందించనున్నట్లు తెలిపారు. మిస్‌వరల్డ్ యూరప్ మోజాక్లోజా, మిస్‌వరల్డ్ ఆఫ్రికా, మొదటి రన్నరప్ సెల్మాకామన్య పాల్గొన్నారు.



పండగ ఆనందాలు

రెట్టింపు

సాక్షి, సిటీబ్యూరో: దసరా, దీపావళి వరుస పండుగలతో సందడి మొదలైంది. షాపింగ్, వాహనాల కొనుగోళ్లతో ఇల్లంతా హడావుడిగా తయారవుతోంది. పండగ సీజన్ ప్రారంభం కావడంతో ఇంటికి రంగుల్ని వేయించడం అందరికీ కుదరకపోవచ్చు. రంగులు వేయకున్నా ఇల్లు మెరవాలంటే శుభ్రం చేయడం కోసం కొంత సమయాన్ని వెచ్చించాలి. ఇందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. హడావుడి లేకుండానే ఓ పద్ధతి ప్రకారం ఇంటిని అలంకరించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఫ్లోరింగ్: మార్బుల్ ఫ్లోరింగ్ ఇంటికి అందనపు అందం, ఆకర్షణే. అయితే ఇదంతా తరచూ నిర్వహణ ఉన్నప్పుడే.. ఇంట్లోకి దుమ్ము, ధూళి రాకుండా నివారించాలి. దీని కోసం డోర్ మ్యాట్లు వాడకంతో సరిపెట్టకుండా ఇంటికి వచ్చే అతిథులు షూలను బయటేవిప్పి ఇంట్లోకి వచ్చేలా చూసుకోవాలి. ఫ్లోరింగ్ శుభ్రత కోసం రసాయనాల జోలికి వెళ్లకుండా నీటిలో కొంచెం అమ్మోనియా కలిపితే శుభ్రం చేశాక మీ ఫ్లోరింగ్ మెరిసిపోతుంది.

కార్పెట్లు: ఇవి దుమ్మును ఎక్కువగా ఆకర్షిస్తాయి. తరచూ వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేయాల్సిందే.. దుమ్ముతో కార్పెట్ కళావిహీనంగా కనిపించవచ్చు. కాబట్టి నాలుగున్నర లీటర్ల నీటిలో ఓ కప్పు తెల్ల వెనిగర్‌ను కలిపి బ్రష్‌తో రుద్దితే కార్పెట్‌లోని వర్ణాలు మెరుస్తాయి. కార్పెట్‌పై కొన్నిసార్లు టీ, సిరా వంటి మరకలు పడితే వాటిని పోగొట్టడానికి పావు కప్పు తేనె, సోడా, రెండు చెంచాల తెల్ల వెనిగర్‌తో చేసిన పేస్టు రుద్దాలి. ఫలితంగా ఆ మరకలు తొలిగిపోతాయి. పేస్టును ఆరనిచ్చి వ్యాక్యూమ్ క్లీనర్‌తో మరక ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేయండి.

గోడలు: గోడలను తరచూ స్టాటిక్ డస్టర్‌తో తుడవాలి. బూజు, సాలెగూడు లాంటివి ఉంటే తొలగిపోతాయి. అనుకోకుండా గోడలపై పానీయాలు, టీ వంటివి పడితే వెంటనే నీళ్లు, గాఢత తక్కువగా ఉండే డిటర్జెంట్లతో శుభ్రం చేయాలి. గోడల్ని గట్టిగా రుద్దవద్దు.

వంటింట్లో: బాత్ ఫిట్టింగ్‌ల దగ్గర నుంచి ఫర్నిచర్ వరకు ఉక్కు ఎక్కువగా వాడుతుంటాం. స్టీల్‌కే పరిమితం కాకుండా పైన క్రోమ్‌పూతతో వస్తున్నాయి. స్నానాల గదిలో, వంటిట్లో వాడే నల్లాలు.. నీటిలోని ఉప్పు పేరుకుపోవడంతో చూడ్డానికి వికారంగా కనిపిస్తాయి. ఇలాంటి మరకల్ని తొలగించి స్టీల్ వస్తువులు మెరిసిపోవాలంటే ఆల్కాహాల్‌తో తుడవాలి. నల్లాపై మరకల్ని టూత్‌పేస్టుతో తుడిచి తొలగించవచ్చు.

గ్లోబల్ సిరి.. భాగ్యనగరి!

దేశీయ స్థిరాస్తి రంగానికి కలిసిరానున్న ట్రంప్ నిర్ణయం

మెట్రో నగరాల్లోని కార్యాలయ స్థలాలకు డిమాండ్	గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల ఏర్పాటుకు అవకాశాలు

దేశంలో ఆఫీసు స్పేస్ లీజులలో 40 శాతం వాటా జీసీసీలదే..

నగరంలో 52 లక్షల చ.అ. లీజుకు తీసుకున్న జీసీసీలు

పీఠం ఎక్కిన తొలి రోజు నుంచీ భారత్‌పై పగబట్టినట్లుగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా నిర్ణయం.. దేశీయ స్థిరాస్తి రంగానికి ఊతమివ్వనుంది. ప్రత్యేకించి కార్యాలయ స్థలాలకు డిమాండ్‌ను కల్పించనుంది. వృత్తి నిపుణులకు జారీ చేసే హెచ్1బీ వీసా రుసుముల పెంపు నిర్ణయంతో.. దేశీయంగా గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల(జీసీసీ) ఏర్పాటుకు అపార అవకాశాలు ఏర్పడతాయని స్థిరాస్తి నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే బహుళ జాతి సంస్థల జీసీసీలకు హాట్ ఫేవరేట్ నగరాలైన బెంగళూరు, హైదరాబాద్‌లకు ఇదొక వరంగా మారనుంది. అందుబాటులో అద్దెలు, నైపుణ్య కార్మికుల లభ్యత, తక్కువ జీవన వ్యయం, మెరుగైన మౌలిక వసతులు, ప్రోత్సాహకర ప్రభుత్వ విధానాలతో హైదరాబాద్ జీసీసీలకు హబ్‌గా మారే అవకాశాలున్నాయి. – సాక్షి, సిటీబ్యూరో





జీసీసీలకు ఇండియా కేంద్రంగా అభివృద్ధి చెందడంతో బహుళ జాతి కంపెనీలు ఇక దేశీయంగానే జీసీసీల ఏర్పాటుకు ఆసక్తి చూపిస్తాయి. దీంతో హైదరాబాద్, బెంగళూరు, పుణె, చెన్నై వంటి టెక్నాలజీ హబ్ మెట్రోల్లోని ఆఫీసు స్పేస్‌లకు ఆదరణ ఏర్పడనుంది. ప్రస్తుతం దేశంలో 1700లకు పైగా జీసీసీలు ఉండగా.. వీటిల్లో 19 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం 64 బిలియన్ డాలర్ల మార్కెట్‌గా ఉంది. 2030 నాటికి 2,400 జీసీసీలకు, 25–30 లక్షల మంది ఉద్యోగులకు, అలాగే వంద బిలియన్ డాలర్ల మార్కెట్‌కు విస్తరిస్తుందని కొల్లియర్స్ నివేదిక అంచనా వేసింది.



ఒక్కో నగరం ఒక్కో ప్రత్యేకత..

జీసీసీలు అనేవి బహుళ జాతి సంస్థల ఆఫ్‌షోర్ యూనిట్లు. ఇవి ప్రతిభ, సాంకేతికత, ఆవిష్కరణలను ఏకీకృతం చేసి కేంద్రాలు. దేశంలోని మెట్రో నగరాలు ఒక్కో రంగంలో కీలక హబ్‌లుగా ఉన్నాయి. బెంగళూరు ఐటీ, పరిశోధనాభివృద్ధికి, ముంబై బీఎఫ్ఎస్ఐకి, హైదరాబాద్ ఫార్మా, ఐటీ, కృత్రిమ మేధస్సుకు, పుణె ఇంజనీరింగ్‌కు, ఢిల్లీ–ఎన్‌సీఆర్ ఈ–కామర్స్, చెన్నై తయారీ రంగాలకు కేంద్రాలుగా ఉన్నాయి. ఖర్చును ఆదా చేసే కేంద్రాల నుంచి ఆవిష్కరణ, విలువ ఆధారిత సేవలకు వ్యూహాత్మక కేంద్రాలుగా రూపాంతరం చెందుతున్నాయి. దేశంలోని జీసీసీలు కృత్రిమ మేధస్సు(ఏఐ), మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలలో వృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయి.

అమెరికా కంపెనీలే ఎక్కువ..

భారత్‌లో జీసీసీల ఏర్పాటుకు అమెరికాకు చెందిన కంపెనీలే ఎక్కువ ఆసక్తిని కనబరుస్తున్నాయి. 2021 నుంచి ఇండియాలో జరిగిన జీసీసీ లీజులలో యూఎస్ కంపెనీల వాటా ఏకంగా 70 శాతంగా ఉందంటే డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. ఫార్చ్యూన్ –500 కంపెనీలు, గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజాలు ఈ ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి. అయితే ఇటీవల కాలంలో యూకే, యూరప్ మిడిల్ ఈస్ట్ ఆఫ్రికా(ఈఎంఈఏ), ఆసియా పసిఫిక్ (ఏపీఏసీ) దేశాల జీసీసీలు కూడా ఇండియాలో జీసీసీలను విస్తరిస్తున్నాయి. 2025లో జరిగిన 2.8 కోట్ల చ.అ. జీసీసీ ఆఫీసు స్పేస్ లావాదేవీలలో జపాన్, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి ఏపీఏసీ దేశాల వాటా 10 శాతంగా ఉంది.

ఏ విభాగంలో జీసీసీలు ఎక్కువంటే.. (చ.అ. లక్షల్లో)		
విభాగం	2021	2025
టెక్నాలజీ	73	కోటి
బీఎఫ్ఎస్ఐ	20	75
ఇంజనీరింగ్ అండ్ తయారీ	14	47
హెల్త్‌కేర్	4	23
కన్సల్టింగ్	3	14
ఇతరత్రా	18	21

నగరాల వారీగా జీసీసీ లీజులు (చ.అ. లక్షల్లో)		
నగరం	2021	2025
బెంగళూరు	46	1.06 కోట్లు
హైదరాబాద్	37	52
చెన్నై	9	48
ఢిల్లీ–ఎన్‌సీఆర్	20	46
ముంబై	9	14
పుణె	11	10
కోల్‌కతా	-	4

జీసీసీ స్పేస్ 10 కోట్ల చ.అ.

నాలుగేళ్లలో ఇండియాలోని ఏడు ప్రధాన నగరాలలో 10 కోట్ల చ.అ. స్థలాలను జీసీసీలు లీజుకు తీసుకున్నాయి. ఇది మొత్తం ఆఫీసు స్పేస్ డిమాండ్‌లో 36 శాతం. జీసీసీ లీజింగ్‌లలో టెక్నాలజీ రంగం ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది. 37 శాతం లావాదేవీలలో ఐటీ రంగం తొలి స్థానంలో నిలవగా.. బీఎఫ్ఎస్ఐ, ఇంజినీరింగ్, తయారీ రంగాలు 40 శాతం స్థలాన్ని లీజుకు తీసుకున్నాయి. అలాగే 2026లో 7–7.5 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలలో 2.9–3.2 కోట్ల చ.అ. స్థలాన్ని జీసీసీలు లీజుకు తీసుకుంటాయని 'కొల్లియర్స్' అంచనా వేసింది. అలాగే 2027లో 7.5–8.5 కోట్ల కార్యాలయ స్థల లావాదేవీలలో జీసీసీల వాటా 3.2–3.4 కోట్లతో, ఏటా 40 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని అంచనా.

హైదరాబాద్ వర్సెస్ బెంగళూరు

బహుళ జాతి సంస్థల జీసీసీలకు దక్షిణాది నగరాలు హాట్ ఫేవరెట్‌గా ఉన్నాయి. ప్రత్యేకించి ఐటీ హబ్‌లుగా పేరొందిన హైదరాబాద్, బెంగళూరు నగరాలు బహుళ జాతి సంస్థల జీసీసీలను ఆకర్షించడంలో తీవ్రపోటీపడుతున్నాయి. 2021–25 మధ్యకాలంలో ఈ రెండు నగరాలు మొత్తం జీసీసీ డిమాండ్‌లో 60 శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయి. 2021తో పోలిస్తే 2025లో చెన్నైలో జీసీసీ లీజులు 5.3 రెట్లు పెరిగాయి. బెంగళూరు, హైదరాబాద్ 2021 నుంచి జీసీసీ లీజింగ్‌లలో 60 శాతం వాటాను నమోదు చేస్తున్నాయి. బెంగళూరులోని ఓఆర్ఆర్, హైదరాబాద్‌లోని సెకండరీ బిజినెస్ డిస్ట్రిక్ట్(ఎస్‌బీడీ) ప్రాంతాలు ఎక్కువ డిమాండ్ ఉంది. ఫార్చ్యూన్–500 కంపెనీలు ఈ కారిడార్లలో జీసీసీల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయి. 2021 నుంచి దేశంలోని జీసీసీ లీజులలో ఈ కారిడార్ల వాటా ఏకంగా 37 శాతంగా ఉంది.



5.09 కోట్ల ఆఫీసు స్పేస్..

దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ఈ ఏడాది జనవరి–సెప్టెంబర్ మధ్యకాలంలో 5.09 కోట్ల చ.అ. గ్రేడ్–ఏ ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరిగాయి. గతేడాది ఇదే కాలంలో జరిగిన 4.73 కోట్ల చ.అ.లతో పోలిస్తే ఇది 8 శాతం అధికం. అలాగే ఈ ఏడాది తొలి తొమ్మిది నెలల్లో 7 నగరాలలో కొత్తగా 4.14 కోట్ల గ్రేడ్–ఏ కార్యాలయ స్థలం సరఫరా అయింది. గతేడాది ఇదే కాలంలో సప్లయి అయిన 3.78 కోట్ల చ.అ. స్పేస్‌తో పోలిస్తే ఇది 10 శాతం ఎక్కువ.

నగరంలో 355 జీసీసీలు..

ప్రస్తుతం హైదరాబాద్‌లో 355కు పైగా జీసీసీ సెంటర్లున్నాయి. అమెరికా, యూరప్, జపాన్, సౌత్ కొరియా దేశాలకు చెందిన జీసీసీలు నగరంలో కొలువుదీరాయి. మెక్ డొనాల్డ్స్, వాన్‌గార్డ్, సిటిజెన్ బ్యాంక్, హీనెకెన్, బారీకేల్‌బాట్, డై–ఇచి, హెచ్‌సీఏ హెల్త్‌కేర్ వంటి సంస్థలు హైదరాబాద్‌లో జీసీసీలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. 2021లో నగరంలో 37 లక్షల చ.అ. స్థలాన్ని జీసీసీలు లీజుకు తీసుకోగా.. 2025 నాటికి 52 చ.అ.లకు చేరాయి.

సంవత్సరాల వారీగా జీసీసీ లీజులు(చ.అ. కోట్లలో)			
సంవత్సరం	మొత్తం ఆఫీసు స్పేస్	జీసీసీ లీజులు	జీసీసీ వాటా (శాతంలో)
2021	3.3	1.32	40
2022	5.03	1.47	29
2023	5.82	1.82	31
2024	6.72	2.57	38
2025(అంచనా)	7	2.8	40

క్రెడిట్ కార్డు.. వాడకం చూడు!



జీఎస్టీ శ్లాబుల మార్పుతో దేశంలో కొత్త ధరలు సెప్టెంబరు 22 నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో ఈ కామర్స్ అమ్మకాలు జోరందుకున్నాయని రిజర్వు బ్యాంకు గణాంకాలు, మార్కెటింగ్ సంస్థల నివేదికలు చెబుతున్నాయి. ప్రత్యేకించి క్రెడిట్ కార్డుల ద్వారా స్మార్ట్ ఫోన్లు, ఫ్రిజ్‌లు, ఏసీలు, టీవీలను భారీగా కొనుగోలు చేస్తున్నారట. సెప్టెంబరు 20న ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో క్రెడిట్ కార్డులతో చేసిన వ్యయం రూ.1,514 కోట్లు కాగా.. సెప్టెంబరు 22న ఇది ఏకంగా రూ.10,412 కోట్లకు చేరడమే ఇందుకు నిదర్శనం.

- సాక్షి, స్పెషల్ డెస్క్


పండుగ సీజన్ కావడంతో క్రెడిట్ కార్డు ద్వారా చేసే కొనుగోళ్లు భారీగా పెరుగుతాయని మార్కెటింగ్ సంస్థలు, వ్యాపార విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా పర్యటనల కోసం, ఇల్లు, లైఫ్‌స్టైల్ అవసరాల కోసం క్రెడిట్ కార్డులతో కొనుగోళ్లు ఎక్కువగా చేస్తున్నారట. ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీల వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, వంట గదికి సంబంధించిన వస్తువులు, దుస్తులు, పిల్లల కోసం బొమ్మలు, వస్తువులు.. ఇలా ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు జోరందుకున్నాయట.

సెప్టెంబరులో 22 తర్వాత..

'జీఎస్టీ 2.0'తో దేశంలో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. సెప్టెంబరు 22కు ముందు, ఆ తరవాత క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన కొనుగోళ్లే ఇందుకు నిదర్శనం. సెప్టెంబరు 21న.. నేరుగా వెళ్లి షాపింగ్, పెట్రోల్ బంకుల (పాయింట్ ఆఫ్ సేల్ యంత్రాల ద్వారా) వంటి వాటి దగ్గర జరిగిన లావాదేవీల విలువ రూ.1,107 కోట్లు కాగా, మర్నాడు ఇది రూ.2,533 కోట్లకు ఎగబాకడం విశేషం. సెప్టెంబరు 23, 24లలో సగటున వీటి ద్వారా జరిగిన లావాదేవీల విలువ రూ.1,651 కోట్లు. ఇక, ఈ కామర్స్ వేదికల్లో.. సెప్టెంబరు 22–24 మధ్య సగటున రూ.8,000 కోట్లకుపైగానే క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులు జరిపారు.

సెప్టెంబరు 22న భారీగా పెరిగిన కొనుగోళ్లు

ఈ కామర్స్ కొనుగోళ్లకే	దేశంలో 11.23 కోట్లకు చేరిన క్రెడిట్ కార్డులు
అత్యధిక వినియోగం	ఆగస్టులో రూ.1.91 లక్షల కోట్లకు చేరిన వ్యయం



ఈ కామర్స్ కొనుగోళ్లకే..



దేశంలోని అన్ని బ్యాంకులకూ సంబంధించిన క్రెడిట్ కార్డుల ద్వారా.. ఈ ఆగస్టులో చేసిన 'ఈ కామర్స్' కొనుగోళ్లకు చేసిన వ్యయం రూ.1,18,376 కోట్లు. అలా కాకుండా పాయింట్ ఆఫ్ సేల్ యంత్రాల ద్వారా క్రెడిట్ కార్డులతో చేసిన ఖర్చు రూ.72,747 కోట్లు. అదే, డెబిట్ కార్డుల ద్వారా ఈ కామర్స్ కొనుగోళ్లకు చెల్లించింది కేవలం రూ.12,599 కోట్లు మాత్రమే. అంటే.. క్రెడిట్ కార్డులను మనవాళ్లు ఏ రేంజిలో వాడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

ఆగస్టులో 7 లక్షలు

దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగింది. రిజర్వు బ్యాంకు లెక్కల ప్రకారం.. ఒక్క 2025 ఆగస్టు నెలలోనే ఏకంగా 7 లక్షల కొత్త క్రెడిట్ కార్డులను బ్యాంకులు ఇచ్చాయి. దీంతో దేశంలో క్రెడిట్ కార్డుల సంఖ్య 11.23 కోట్లకు చేరింది. గతేడాది ఆగస్టుతో పోలిస్తే ఈ ఆగస్టులో క్రెడిట్ కార్డు ద్వారా చేసిన ఖర్చు 13.7 శాతం పెరిగి 1.91 లక్షల కోట్లకు చేరింది. ఈ జులైలో చేసిన రూ.1.93 లక్షల కోట్లతో పోలిస్తే మాత్రం స్వల్పంగా తగ్గింది.

బ్యాంకు	2025 ఆగస్టు నాటికి మొత్తం క్రెడిట్ కార్డులు	ఆగస్టులో ఇచ్చినవి
హెచ్‌డీఎఫ్‌సీ	2.50 కోట్లు	2,21,856
ఎస్‌బీఐ	2.13 కోట్లు	69,531
ఐసీఐసీఐ	1.81 కోట్లు	1,30,607
యాక్సిస్	1.53 కోట్లు	1,40,801
కోటక్ మహీంద్రా	45.88 లక్షలు	6,754
ఐడీఎఫ్‌సీ	39.57 లక్షలు	95,671

రూ.2 లక్షల కోట్ల వరకూ..

2025 జనవరిలో 10.89 కోట్లుగా ఉన్న క్రెడిట్ కార్డుల సంఖ్య ఆగస్టులో 11.23 కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో ఈ కార్డుల ద్వారా ఖర్చు చేసిన మొత్తం రూ.1.85 లక్షల కోట్ల నుంచి రూ.1.91 కోట్లకు చేరింది. మధ్యలో మార్చి నెలలో రూ.2 లక్షల కోట్ల మార్కును కూడా దాటింది. సగటున ఒక కార్డు ద్వారా ఖర్చు చేసిన మొత్తం జనవరిలో రూ.16,950 నుంచి జులైలో రూ.17,399కి పెరిగింది.

క్లుప్తంగా...

రెండు నెలల్లో జిల్లా జడ్జీలను నియమించండి

2023 జ్యుడీషియల్ సర్వీస్ రూల్‌లో జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ

సాక్షి, న్యూఢిల్లీ: రెండు నెలల్లోగా జిల్లా న్యాయమూర్తులను నియమించాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే, 2023 తెలంగాణ జ్యుడీషియల్ సర్వీస్ నిబంధనలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. 2023లో జరిగిన జ్యుడీషియల్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ పరీక్ష ఫలితాలను తక్షణమే ప్రకటించాలని చెప్పింది. తెలంగాణలోని కోర్టుల్లో ఏడేళ్లపాటు ప్రాక్టీసు చేసి ఉంటేనే జిల్లా జడ్జీలుగా నియమించాలని గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. '2023 నిబంధనలను సడలించకుండా అర్హత పొందిన వారిని జిల్లా న్యాయమూర్తులుగా నియమించేందుకు మాకు అభ్యంతరం లేదు'అని పిటిషనర్ తరపు న్యాయవాది సాగర్ చెప్పారు. ఈ నేపథ్యంలో అర్హులైన వారిని రెండు నెలల్లోగా జిల్లా జడ్జీలుగా నియమించాలని సుప్రీంకోర్టు గడువు విధించింది. అయితే, భవిష్యత్తులో జరిగే నియామకాలకు ఈ తీర్పు వర్తించదని స్పష్టంచేసింది.

యూజర్ చార్జీలపై వివరణ ఇవ్వండి

కేంద్ర, రాష్ట్రాలకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రుల నుంచి బయో మెడికల్ వేస్ట్ సేకరణకు యూజర్ చార్జీల వసూలుపై వివరణ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయాలని ఇరు ప్రభుత్వాల పొల్యూషన్ కంట్రోల్ బోర్డులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ అక్టోబర్ 28కి వాయిదా వేసింది. పడకల వారీగా బయో మెడికల్ వేస్ట్‌ను సేకరించడానికి జూన్ 4న రాష్ట్ర పీసీబీ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ మరో 434 మంది వైద్యులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వేదుల శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. పడకలున్న ఆస్పత్రులకు ఒకలా.. పడకల్లేని వాటికి మరోలా చార్జీలు వసూలు చేయాలని నిర్ణయించిందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. కేంద్ర, రాష్ట్ర పీసీబీలకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

ప్రయాణంలో మహిళలకు మరింత రక్షణ

అదనపు డీజీ చారు సిన్హా వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రయాణ సమయంలో మహిళలకు మరింత రక్షణ కల్పించే అంశంపై తెలంగాణ పోలీస్ మహిళా భద్రతా విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ.. కమిషనరేట్ల పరిధిలో టీజీఎస్ఆర్టీసీ, మెట్రో రైలు, రవాణా శాఖ, ప్రైవేట్ బస్సు సేవల సంఘం, ఆటో డ్రైవర్ల సంఘాల సంయుక్త భాగస్వామ్యంతో ఇందుకు అవసరమైన చర్యలు ప్రారంభించింది. మహిళలు, బాలికలు సురక్షితంగా ప్రయాణించేందుకు అనువైన వాతావరణం కల్పించడంతోపాటు, ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాల్లో రవాణా సమయంలో జరిగే లైంగిక వేధింపుల సంఘటనలపై తక్షణ స్పందన దిశగా పనిచేసే ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసినట్టు మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ చారు సిన్హా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణ సమయంలో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే 100, 112 నంబర్లకు డయల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు అందిన తక్షణం పోలీసు గస్తీ వాహనాలు సంఘటన స్థలానికి వెంటనే చేరుకుంటాయని, అనంతరం 'షీ టీమ్స్'దర్యాప్తు చేపడతాయని పేర్కొన్నారు. ఈ వేధింపుల సమస్య పరిష్కారానికి ప్రతీ సంస్థ నుంచి పర్యవేక్షణ, సంస్థల మధ్య సమన్వయం కోసం సంస్థల నుంచి నోడల్ ఆఫీసర్ నియమిస్తున్నట్ల తెలిపారు. శిక్షణ పొందిన సిబ్బంది, సమర్థవంతమైన అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థతో మహిళల సురక్షిత ప్రయాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

సోషల్ మీడియా యాక్టివిస్టు సౌందరరెడ్డి అక్రమ అరెస్టుపై

సీబీఐ దర్యాప్తు

ప్రాథమిక విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీబీఐకి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: సోషల్ మీడియా యాక్టివిస్ట్ సౌందరరెడ్డి అలియాస్ సవీందర్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌పై హైకోర్టు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. ఇందులో భాగంగా సీబీఐ ఏపీ విభాగాధిపతిని సుమోటోగా ప్రతివాదిగా చేర్చింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసి, ప్రాథమిక నివేదికను తమ ముందుంచాలని ఆయన్ను ఆదేశించింది. తదుపరి విచారణ వరకు సౌందరరెడ్డిని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచే ప్రక్రియను ఆపేసింది. సీబీఐ దర్యాప్తునకు ఇవ్వాల్సిన ప్రాథమిక ఆధారాలు ఈ కేసులో ఉన్నాయంది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్ ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సౌందరరెడ్డి అరెస్ట్ అక్రమమనేందుకు ప్రాథమిక ఆధారాలున్నాయని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. 'గంజాయి కేసులో సౌందరరెడ్డిని పోలీసులు ఇరికించారు. పోలీసులు వారి చట్టవిరుద్ధ చర్యలను కప్పిపుచ్చుకునేందుకు ఇలా చేశారు. తగిన అరెస్ట్ వారెంట్ లేకుండా, సుప్రీంకోర్టు నిర్దేశించిన అరెస్ట్ విధానాన్ని అనుసరించకుండా సౌందరరెడ్డిని అరెస్ట్ చేశారు. అలాగే అధికారుల విశ్వసనీయతపై కూడా మాకు సందేహాలున్నాయి. అందుకే ఈ కేసులో జోక్యం చేసుకుంటున్నాం. అన్యాయంగా, ఏకపక్షంగా పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించడానికి వీల్లేదు. ఈ కేసులో పోలీసుల చర్యలు చాలా దారుణంగా ఉన్నాయి' అని ధర్మాసనం వివరించింది.

8.30కి అరెస్ట్ చేస్తే.. 7.30కే మధ్యవర్తుల నివేదిక ఎలా సాధ్యం?

'సౌందరరెడ్డిని 22వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో అరెస్ట్ చేశామని పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. అదే రిపోర్టులో 7.30 గంటలకు మధ్యవర్తుల నివేదిక సిద్ధం చేసినట్లు పోలీసులు చెప్పారు. మరి 8.30 గంటలకు అరెస్ట్ చేస్తే, 7.30 గంటలకే ఎలా మధ్యవర్తుల నివేదిక సిద్ధం అవుతుంది? అలాగే తనను 22వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు అరెస్ట్ చేశారని సౌందరరెడ్డి మాకు చెప్పారు. సౌందరరెడ్డి సాయంత్రం 4.20 గంటలకు విజయవాడలో ఉన్నారని, అనంతరం అక్కడి నుంచి కుంచనపల్లికి వెళ్లారని కూడా జియో కంపెనీ తన మెమోలో ఈ కోర్టుకు చెప్పింది. ఆ తర్వాత సాయంత్రం 6.21 గంటలకు అతని ఫోన్ స్విచాఫ్ అయినట్లు కూడా జియో చెప్పింది. అటు తరువాత 7 గంటలకు సౌందరరెడ్డి భార్య లక్ష్మీప్రసన్న తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయకుండా జనరల్ డైరీలో నమోదు చేశారు. 7.30 గంటల కన్నా ముందే ఆమె తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారని అర్థమవుతోంది. సౌందరరెడ్డి అరెస్ట్ విషయంలో పోలీసులు చెబుతున్న దానికీ, వాస్తవంగా జరిగిన దానికీ పొంతన కుదరడం లేదు. పోలీసులు చెబుతున్న విషయాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి' అని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

వ్యక్తిగత స్వేచ్ఛకు విఘాతం కలగకూడదనే జోక్యం

'ఓ వ్యక్తిని అరెస్ట్ చేసే సమయంలో పోలీసులు యూనిఫాంలో ఉండి తీరాలని డీకే బసు కేసులో సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పింది. అంతేకాక వారి గుర్తింపును సైతం తెలియచేయాల్సి ఉంటుందని కూడా సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే ఈ కేసులో పోలీసులు సౌందరరెడ్డిని అరెస్ట్ చేసే సమయంలో యూనిఫాంలో లేరు. ఇదే విషయాన్ని ప్రత్తిపాడు సీఐ ధృవీకరించారు. సాధారణంగా మేము ఇలాంటి కేసుల్లో లోతుల్లోకి వెళ్లం. అయితే పోలీసుల తీరు అత్యంత ఆక్షేపణీయంగా ఉండటంతో లోతుల్లోకి వెళ్లక తప్ప లేదు. సౌందరరెడ్డి స్వేచ్ఛకు విఘాతం కలగకూడదనే మేం జోక్యం చేసుకుంటున్నాం. అధికరణ 226 కింద ఉన్న అసాధారణ అధికారాన్ని సైతం ఉపయోగిస్తున్నాం. ఓ వ్యక్తి అరెస్ట్ సక్రమమైనప్పుడే అతన్ని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచడం సాధ్యమవుతుంది' అని జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం స్పష్టం చేసింది.

..అందుకే సీబీఐకి అప్పగిస్తున్నాం

'సౌందరరెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసుల విశ్వసనీయతపై మాకు ప్రాథమిక అనుమానాలున్నాయి. అందుకే అధికరణ 226 కింద జోక్యం చేసుకుంటున్నాం. అంతేకాక వ్యక్తి స్వేచ్ఛను హరించకుండా అడ్డుకునేందుకు ఈ అధికరణ కింద మాకున్న అధికారాన్ని ఉపయోగించకుండా ఎవరూ నిరోధించలేరు. ప్రస్తుత కేసులో లేవనెత్తిన విషయాలను, అలాగే విచారించాల్సిన వ్యక్తుల్లో రాష్ట్ర పోలీసు అధికారులు ఉన్న నేపథ్యంలో ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐ చేత దర్యాప్తు చేయించడం సబబుగా ఉంటుందని భావిస్తున్నాం. ఇందుకే ఈ వ్యాజ్యంలో ఆంధ్రప్రదేశ్ సీబీఐ విభాగాధిపతిని ప్రతివాదిగా చేరుస్తున్నాం. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు జరిపి మాకు ప్రాథమిక నివేదిక సమర్పించాలని సీబీఐని ఆదేశిస్తున్నాం. సీబీఐ ప్రాథమిక నివేదిక ఇచ్చేంత వరకు సౌందరరెడ్డిని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచడాన్ని నిలిపేస్తున్నాం' అని ధర్మాసనం తేల్చి చెప్పింది. సౌందరరెడ్డి టవర్ లోకేషన్ డేటా, తాడేపల్లి పోలీస్‌స్టేషన్ సీసీటీవీ ఫుటేజీ, పోలీసుల రిమాండ్ రిపోర్టు, తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదుదారు లక్ష్మీ ప్రసన్న ఇచ్చిన ఫిర్యాదులను సీల్డ్ కవర్‌లో ఉంచామని, వాటిని సీబీఐ దర్యాప్తు అధికారికి అందచేయాలని రిజిస్ట్రార్ (జుడీషియల్)ను ఆదేశిస్తున్నామని పేర్కొంది.

మొదటి నుంచీ తప్పుదోవ పట్టించిన పోలీసులు

తాజాగా శుక్రవారం ఈ వ్యాజ్యంపై జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసన్న తరఫు న్యాయవాది సానేపల్లి రామలక్ష్మణరెడ్డి వాదనలు వినిపించారు. ఈ కేసులో పోలీసులు మొదటి నుంచీ కోర్టును తప్పుదోవ పట్టిస్తూ వస్తున్నారని తెలిపారు. సౌందరరెడ్డి అక్రమ నిర్బంధంపై తాము 23న పిటిషన్ దాఖలు చేశామని, దీనిపై ఈ ధర్మాసనం సాయంత్రం 4 గంటలకు విచారణ జరిపిందన్నారు. ఈ సందర్భంగా పోలీసులు అసలు సౌందరరెడ్డిని తాము అరెస్ట్ చేయలేదని, ఆయన ఎక్కడున్నారో కూడా తెలియదని ఈ కోర్టుకు చెప్పారన్నారు. అయితే ఇందుకు విరుద్ధంగా పోలీసులు సౌందరరెడ్డిని అదే రోజు సాయంత్రం మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారని ఆయన వివరించారు. దీన్ని బట్టి ఈ కేసులో పోలీసులు కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారన్న విషయం స్పష్టమవుతోందన్నారు. దీనిని తీవ్రంగా పరిగణించాలని ఆయన కోర్టును కోరారు.

మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తాం.. అనుమతించండి

ఈ సమయంలో పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) తిరుమాను విష్ణు తేజ స్పందిస్తూ, సౌందరరెడ్డిని అరెస్ట్ చేసిన నేపథ్యంలో అతన్ని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి తీరాల్సి ఉందని, ఇది తమ బాధ్యత అని తెలిపారు. సౌందరరెడ్డిని స్వేచ్ఛగా వదిలేయాలన్న హైకోర్టు ఆదేశాల వల్ల అతన్ని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచే ప్రక్రియ నిలిచి పోయిందన్నారు. ఈ ప్రక్రియను కొనసాగించేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. అంతిమంగా రిమాండ్ విషయంలో మేజిస్ట్రేటే తగిన నిర్ణయం తీసుకుంటారని వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఈ కేసు దాఖలైన నాటి నుంచి నేటి వరకు జరిగిన పరిణామాలన్నింటినీ రికార్డ్ చేసింది. దర్యాప్తును సీబీఐకి అప్పగించేందుకు దారి తీసిన పరిస్థితులను కూడా వివరించింది. అనంతరం దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 13వ తేదీకి వాయిదా వేసింది.

తన భర్తను అక్రమంగా నిర్బంధించారంటూ పిటిషన్

తన భర్త సౌందరరెడ్డిని పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ కుంచాల లక్ష్మీ ప్రసన్న హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం విచారణ జరిపింది. సౌందరరెడ్డిని తాము అదుపులోకి తీసుకోలేదని, ఆయన ఎక్కడ ఉన్నారో తెలియదని పోలీసులు హైకోర్టుకు నివేదించారు. దీంతో ధర్మాసనం.. సౌందరరెడ్డి ఎక్కడున్నా కూడా వెతికి తమ ముందు హాజరు పరచాలని, అతన్ని ఏ కేసులో కూడా మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచడానికి వీల్లేదని పోలీసులను ఆదేశించింది. అంతేకాక సౌందరరెడ్డిని అపహరించారంటూ లక్ష్మీ ప్రసన్న తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశానని చెబుతున్న నేపథ్యంలో ఈ నెల 22 సాయంత్రం 5 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు స్టేషన్‌లో ఉన్న సీసీటీవీ ఫుటేజీని తమ ముందుంచాలని పోలీసులను ఆదేశించింది. అలాగే 22న సాయంత్రం సౌందరరెడ్డి ఎక్కడ ఉన్నారో తెలియ చేసేందుకు వీలుగా అతని సెల్ టవర్ వివరాలను ఇవ్వాలని జియో ఫోన్ జనరల్ మేనేజర్‌ను సైతం ఆదేశించిన విషయం తెలిసిందే.

దేశ 'ఏరోస్పేస్ రాజధాని'గా తెలంగాణ

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- రాష్ట్రంలో ఏరోస్పేస్ రంగం బలోపేతంపై నిపుణులతో భేటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణను దేశ 'ఏరోస్పేస్ రాజధాని'గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఫిక్కీ తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ కమిటీ సహకారంతో శుక్రవారం సచివాలయంలో రాష్ట్రంలోని ప్రముఖ ఏరోస్పేస్ రంగ పారిశ్రామికవేత్తలు, నిపుణులతో ఆయన మేధోమథనం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఏరోస్పేస్ రంగ పరిశ్రమలకు ఊతం కల్పించేందుకు ప్రభుత్వం తరఫున తీసుకోవాల్సిన చర్యలు, భవిష్యత్తు ప్రణాళికలపై సలహాలు, సూచనలు స్వీకరించారు. 'రాష్ట్రంలో ఏరోస్పేస్ ఎకోసిస్టం బలోపేతానికి 60 ఏళ్ల కిందటే బలమైన అడుగులు పడ్డాయి. ఇప్పుడా ఫలితాలు మన కళ్ల ముందు కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌లో ఇప్పటికే 30కి పైగా ఏరోస్పేస్, డిఫెన్స్ ఓఈఎంఎస్ లు, వేయికి పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయి. డీఆర్డీవో, హాల్, జీఎంఆర్, టాటా, అదానీ ఎల్బిట్, సాఫ్రాన్, బోయింగ్– టీఏఎస్ఎల్ జేవీ వంటి దిగ్గజ సంస్థల కార్యకలాపాలకు కేంద్రంగా ఉంది'అని మంత్రి పేర్కొన్నారు.



ఏరోస్పేస్ రంగ పారిశ్రామికవేత్తలతో మంత్రి శ్రీధర్‌బాబు

రాష్ట్ర ఏరోస్పేస్ ఎగుమతుల విలువ రూ. 28,000 కోట్లకు పైగా ఉందని వివరించారు. ఆదిభట్ల ఏరోస్పేస్ సెజ్ తరహాలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్రంలో ఫేజ్–2 ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్ విస్తరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, హెచ్‌సీ రోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డా.రాధాకృష్ణ, ఫిక్కీ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ హెడ్ రాజీవ్ జూలకంటి, కో–చైర్మన్ జయదేవ్ మీలా తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు వైద్యులపై టీజీఎంసీ వేటు

వృత్తి ధర్మం మరిచినందుకు కఠినచర్య

సాక్షి, హైదరాబాద్: వృత్తిపరమైన నిబంధనలు పాటించకుండా, నైతిక విలువలను ఉల్లంఘించిన ఐదుగురు వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) కఠిన చర్యలు తీసుకుంది. ఈ మేరకు హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని వివిధ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న నలుగురు వైద్యులను ఆరునెలలు, ఒక వైద్యుడిని ఏడాది పాటు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సస్పెండైన వైద్యులందరూ తమ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను 10 రోజులలో స్వాధీనం చేయాలని ఆదేశించింది. లేని పక్షంలో వారి పేర్లను మెడికల్ రిజిస్టర్ నుంచి శాశ్వతంగా తొలగించనున్నట్లు హెచ్చరించింది. ఈ వైద్యులు విధులు నిర్వర్తిస్తున్న ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లను కూడా సమీక్షించాలని లేదా రద్దు చేయాలని ఆరోగ్య శాఖ అధికారులకు సిఫారసు చేస్తున్నట్లు తెలిపింది. వృత్తి ధర్మాన్ని విస్మరించి అవకతవకలకు పాల్పడుతూ.. మోసపూరిత ప్రకటనలు, అనైతిక పద్ధతులతో వ్యవహరించే వైద్యులను ఉపేక్షించేది లేదని టీజీఎంసీ వైస్ చైర్మన్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు.

సస్పెండైన వైద్యులు వీరే

- డాక్టర్ ఎ.చైతన్య రెడ్డి, ఈసీఐఎల్ లోని ఆక్సీకేర్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తూ.. భువనగిరిలో అనర్హులైన వైద్యులతో కలిసి నకిలీ కార్యక్రమాలు నిర్వహించినట్లు టీజీఎంసీ తెలిపింది. ఈ మేరకు ఆయనను 6 నెలల పాటు సస్పెండ్ చేసింది.
- డాక్టర్ ఎం.గౌతమ్ రెడ్డి, కొత్తపేట ఓమ్నీ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తూ కూడా.. అదే క్వాక్స్ సమావేశానికి స్పాన్సర్‌షిప్ ఇచ్చినందుకు 6 నెలల పాటు సస్పెండ్ చేసింది.
- డాక్టర్ కేవీ మల్లికార్జున రావు, వనస్థలిపురం ఈవీఏ హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్‌గా అనధికార వైద్యులతో కార్యక్రమం నిర్వహించినందుకు 6 నెలలపాటు సస్పెండ్ చేసింది.
- డాక్టర్ కన్నయ్య తాళ్లపల్లి, జూబ్లీహిల్స్ లోని లివోయంగ్ క్లినిక్‌లో.. అర్హత లేకపోయినా కాస్మెటాలజిస్ట్/హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్‌గా ప్రకటించుకున్నందుకు ఏడాది పాటు సస్పెండ్ చేసింది.
- డాక్టర్ కె.ఉమా మహేశ్వర్, సంగారెడ్డిలోని పద్మావతి న్యూరో, మల్టీ–స్పెషాలిటీ హాస్పిటల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఎస్ఎంసీ అనుమతి లేని అర్హతలను ఆస్పత్రిలో ప్రదర్శించినందుకు 6 నెలలు సస్పెండ్ చేసింది.



వనస్థలిపురంలో ఆర్ఎస్ బ్రదర్స్ షోరూం ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: కుటుంబసమేత షాపింగ్‌లో మొదటి వరసలో ఉండే బ్రాండ్, ఆర్ఎస్ బ్రదర్స్ సంస్థ తమ 15వ షోరూంను.. వనస్థలిపురం ఓల్డ్ పనామా గోడౌన్స్ సమీపంలో బొమ్మిడి ఎలైట్ టవర్స్‌లో శుక్రవారం ప్రారంభించింది. సినీ హీరో అక్కినేని నాగచైతన్య, శోభిత ధూళిపాల దంపతులు వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ.. ఆర్ఎస్ బ్రదర్స్ పేరు వింటే చాలు.. సంప్రదాయం, విశ్వసనీయత, సరికొత్త ఫ్యాషన్లు గుర్తుకు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ బ్రదర్స్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.రాజమౌళి, ఆర్ఎస్ బ్రదర్స్ హోల్ టైం డైరెక్టర్ టి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నిలోఫర్ రోగులకు ధర్మశాల భవనం

సాక్షి, హైదరాబాద్: నిలోఫర్ ఆసుపత్రి సమీపంలో పదేళ్లుగా నిరుపయోగంగా ఉన్న మూడంతస్తుల ధర్మశాల భవనాన్ని.. రోగుల సహాయకుల కోసం స్వాధీనం చేసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఇటీవల నగరంలోని ఆసుపత్రుల తీరుతెన్నులపై సమీక్షల సందర్భంగా.. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి నిలోఫర్ ఆస్పత్రి వద్ద రోగుల బంధువులు పడుతున్న బాధలు, నిరుపయోగమైన భవనం సమస్యను వైద్యులు తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి.. వెంటనే నిలోఫర్ ఆసుపత్రిలోని ధర్మశాల భవనాన్ని రోగుల సహాయకులకు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వైద్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ శుక్రవారం భవనాన్ని తమకు స్వాధీనం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను ఆదేశించారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకోకండి

మంత్రి పొన్నం ప్రభాకర్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): రజకుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రవీంద్రభారతి లో శుక్రవారం తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 130వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. అన్ని నియోజకవర్గాలలో ఎలక్ట్రికల్ డ్రైక్లీనర్ సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. రజకులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశా లు జారీ చేశామని, ఎవరైనా అధికారులు అడ్డంకులు సృష్టిస్తే సస్పెండ్ చేస్తా మని హెచ్చరించారు. రాబోయే మూడు రోజుల్లో 102 జీవో అమలుకు ఆదేశాలు జారీ చేస్తామని ప్రకటించారు. అనంతరం చాకలి ఐలమ్మపై ప్రచురించిన పుస్తకాన్ని, పాటల సీడీని ఆవిష్కరించారు. కాగా, గ్రూప్–1లో ఆర్టీవో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం తెలంగాణ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎఫ్‌టీఈలకు పేస్కేల్ ఇవ్వాలి

- మంత్రి సీతక్కకు జేఏసీ నేతల విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన సీతక్క

సాక్షి, హైదరాబాద్ : గత 20 ఏళ్లుగా ఉపాధి హామీ పథకంలో ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయీస్ (ఎఫ్‌టీఈ))గా పనిచేస్తున్న తమకు పేస్కేల్ వర్తింపచేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ఎఫ్‌టీఈ జేఏసీ విజ్ఞప్తి చేసింది. ప్రతీ ఏడాది రూ.30 కోట్లు అదనంగా వెచ్చిస్తే తమకు పేస్కేల్ అమలు చేయవచ్చని పేర్కొంది. శుక్రవారం సచివాలయంలో మంత్రితో జేఏసీ నాయకులు సమావేశమయ్యారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి సీతక్క పేస్కేల్ ఫైల్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, తమ జీతాల చెల్లింపుల్లో పలు సాంకేతిక సమస్యలను సాకుగా చూపుతూ పే అండ్ అకౌంట్స్ సెక్షన్ జాప్యం చేస్తోందని వారు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశంపై పేఅండ్అకౌంట్స్ సెక్షన్ అధికారులతో మాట్లాడిన మంత్రి.. చిన్న చిన్న సమస్యలతో వారి జీతాలు ఆపొద్దని, మానవతా దృక్పథంతో జీతాలు చెల్లించాలని ఆదేశించారు.

జల సంరక్షణతోనే జన సంరక్షణ.. : జల సంరక్షణతోనే జన సంరక్షణ సాధ్యమవుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. వర్షపు నీటి సంరక్షణలో తెలంగాణ తొలి స్థానాన్ని పొందడంలో కీలక పాత్ర పోషించిన గ్రామీణ అభివృద్ధి శాఖ సిబ్బందిని ఆమె అభినందించారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన జల సంచాయ్ జన భాగీదారీ 1.0 విభాగంలో తెలంగాణకు అగ్రస్థానం దక్కిన విషయం తెలిసిందే.

క్లుప్తంగా...

అప్రమత్తంగా ఉండండి

కలెక్టర్లతో మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో.. రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై శుక్రవారం ఆయన సచివాలయం నుంచి నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో.. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. 24 గంటల్లో భారీ వర్షాలు నమోదైన రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో, రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురవడానికి అవకాశమున్న జిల్లాల్లో తీసుకోవలసిన చర్యలపై మార్గదర్శనం చేశారు. వికారాబాద్ జిల్లాలో కురుస్తున్న అతి భారీ వర్షాల కారణంగా మూసీకి భారీ వరద వస్తోందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైన చోట్ల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు.

ఎంబీబీఎస్ వెబ్ ఆప్షన్ల గడువు 29 వరకు

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ రెండో దశ ప్రవేశాల కౌన్సెలింగ్ వెబ్ ఆప్షన్ల గడువును కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్) సోమవారం వరకు పొడిగించింది. రెండో దశ వెబ్ ఆప్షన్ల గడువు శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు ముగియాల్సి ఉంది. అయితే వరంగల్‌లోని ఫాదర్ కొలంబో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కి 150 ఎంబీబీఎస్ సీట్లకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) షరతులతో కూడిన అనుమతి ఇవ్వడంతో, గడువును పొడిగించారు. ఈ మేరకు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవడానికి సోమవారం ఉదయం 11 గంటల వరకు అవకాశం కల్పిస్తున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. రెండో దశలో వెబ్ ఆప్షన్లు ఇచ్చినవారు కూడా కావాలనుకుంటే మళ్లీ సవరించుకోవచ్చు లేదా కొత్తగా ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ సీట్లకు సంబంధించిన వివరాలు మ్యాట్రిక్స్ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- లేకుంటే తీవ్ర పరిణామాలు
- అఖిల భారత చిరంజీవి యువత హెచ్చరిక


తైక్వాండో శ్రీను

సాక్షి, అమరావతి: అసెంబ్లీ సాక్షిగా మెగాస్టార్ చిరంజీవిని ఉద్దేశించి వ్యంగ్యంగా మాట్లాడిన నందమూరి బాలకృష్ణ వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను డిమాండ్ చేశారు. బాలకృష్ణ తనను తాను అతీత శక్తిగా భావించుకుంటూ మెగా కుటుంబంపై గతంలోనూ పలుమార్లు అవమానకరంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజ్ఞత మరిచి అధికార మదం తలకెక్కించుకున్న బాలకృష్ణ చట్టసభల్లో చిరంజీవి ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడటం దారుణమన్నారు. మెగా కుటుంబం అండ లేకుంటే మీ పరిస్థితి ఎంత దారుణంగా ఉండేదో ఒక్కసారి ఊహించుకుంటే మంచిదని హితవు పలికారు. బాలకృష్ణ వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని లేకుంటే.. తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

మత్తయ్యకు ఊరట

- ఓటుకు నోటు కేసులో హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించిన సుప్రీం కోర్టు
- మత్తయ్యను విచారించాలన్న ప్రభుత్వ వినతిని తిరస్కరించిన ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు కోట్లు'కేసులో నిందితుడు (ఏ4) జెరూసలేం మత్తయ్యకు సుప్రీంలో ఊరట లభించింది. ఈ కేసులో మత్తయ్యపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను రాష్ట్ర హైకోర్టు కొట్టివేయడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. అలాగే మత్తయ్యను విచారించాలంటూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. మత్తయ్యపై 2016లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను అప్పటి ఉమ్మడి హైకోర్టు హైకోర్టు క్వాష్ చేయగా, దీన్ని సవాల్ చేస్తూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అదే ఏడాది జూలై 6న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇదే సందర్భంలో ఈ కేసులో కీలక సాక్షిగా ఉన్న ఎల్విస్ స్టీఫెన్‌సన్ సైతం సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లపై గత వారం సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ ముగించింది. శుక్రవారం ధర్మాసనం తీర్పు వెలువరించింది. హైకోర్టు తీర్పులో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా మత్తయ్య పాత్రపై దర్యాప్తు చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ పిటిషన్ కొట్టివేసింది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది డాక్టర్ మేనకా గురుస్వామి, మత్తయ్య తరఫున ప్రకాష్, ప్రియాంక ప్రకాశ్ వాదనలు వినిపించారు. ఈ కేసులో ఏ2గా బిషప్ హ్యారీ సెబాస్టియన్, ఏ4 మత్తయ్యలు 20 సార్లు ఫోన్లో మాట్లాడుకున్నట్లు కాల్ డేటా చెబుతోందని మేనకా గురుస్వామి ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ కేసు చాలా కీలకమైందని, మత్తయ్యను విచారించేందుకు అనుమతివ్వాలని తొమ్మిదేళ్లుగా సుప్రీంకోర్టును కోరుతున్నట్లు చెప్పారు. తాను నేరస్థలంలో లేనని, అక్రమంగా తనను ఇరికిస్తున్నారని మత్తయ్య తరఫు న్యాయవాదులు వాదించారు.


నల్లగొండ జిల్లాలో రహదారిని ముంచెత్తిన తిరుమలగిరి బంధం వాగు..


వరిచేలను ముంచెత్తిన వరద


పురానాపూల్ వద్ద నీట మునిగిన కారు

తెలంగాణకు రెడ్ అలర్ట్

వచ్చే రెండురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు	నైరుతిలో సగటు కంటే 31% అధిక వర్షపాతం
ఇప్పటికే పొంగి ప్రవహిస్తున్న గోదావరి, కృష్ణా, మూసీ నదులు	
ఏకమైన వాగులు, వంకలు.. నిండుకుండల్లా చెరువులు	మూడు రోజుల్లో ముగియనున్న నైరుతి సీజన్
చాలాచోట్ల నీట మునిగిన వరి, పత్తి, మిర్చి పంటలు	
హైదరాబాద్‌లో శుక్రవారం ఎడతెరిపి లేకుండా వర్షం	
వర్షాల కారణంగా వివిధ ప్రాంతాల్లో ముగ్గురు మృతి	

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో వచ్చే రెండురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో రాష్ట్రం మొత్తం రెడ్ అలర్ట్ ప్రకటించింది. 27 నుంచి 29వ తేదీ వరకు పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ వాతావరణ పరిశోధనా కేంద్రం అధిపతి డాక్టర్ పి.లీలారాణి శుక్రవారం తెలిపారు. శనివారం వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలలో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. 28న నిర్మల్, నిజామాబాద్, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. అన్ని జిల్లాల్లోనూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. 29న ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 30, అక్టోబర్ 1 తేదీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలుల (గంటకు 30-40 కి.మీ.)తో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆమె వెల్లడించారు.

పొంగుతున్న వాగులు, నదులు

రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. చాలాచోట్ల వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. గోదావరి, కృష్ణా, మూసీ తదితర నదుల ఉధృతి పెరుగుతోంది. హైదరాబాద్ నగరంలోనూ శుక్రవారం రోజంతా భారీ వర్షం కురిసింది. వాయువ్య మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారడంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి రుతుపవనాల సీజన్‌లో శుక్రవారం నాటికి రాష్ట్రంలో సగటున 72.33 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 95.06 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణం కంటే 31% అధిక వర్షపాతం నమోదైంది. సీజన్ మొత్తంలో మెదక్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, నాగర్‌కర్నూల్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా.. మరో 17 జిల్లాల్లో అధికం, 10 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మరో మూడు రోజుల్లో నైరుతి సీజన్ ముగియనుంది.

పుల్కల్‌లో 14.6 సెంటీమీటర్ల వర్షం

సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో శుక్రవారం అత్యధికంగా 14.2 సెంటీమీటర్ల వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు నీట మునగటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముంబై హైవేపై ముత్తంగి నుంచి సంగారెడ్డి వరకు రోడ్డుకు ఇరువైపుల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పుల్కల్, వట్‌పల్లి, మునిపల్లి, రాయికోడ్ మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలంలో 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పత్తి, వరి పంటలు నీట మునిగాయి. భారీ వర్షాలకు గోదావరి నది ఉగ్రరూపం దాలుస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం శుక్రవారం మధ్యాహ్నానికి 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. శుక్రవారం రాత్రి 8 గంటలకు 45.10 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. ములుగు జిల్లాలో భారీ వర్షాలకు బాడువా ప్రాంతంలో మిర్చి పంట నీట మునిగింది. టేకులగూడెం సమీపంలో 163 నంబర్ జాతీయ రహదారిని గోదావరి వరద ముంచెత్తటంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కాళేశ్వరం త్రివేణీ సంగమం వద్ద 11.410 మీటర్ల ఎత్తులో నీటిమట్టం పుష్కర ఘాట్‌ను తాకుతూ ప్రవహిస్తోంది. మేడిగడ్డ బరాజ్‌కు 8.35 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బరాజ్ మొత్తం 85 గేట్లు ఎత్తి వరద మొత్తాన్ని దిగువకు వదులుతున్నారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి మూసీ, ఈసీ, కాగ్నా నదులు ఉప్పొంగాయి. కోట్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టులు అలుగుపారాయి. ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా శుక్రవారం మొత్తం ఏకధాటికి వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో 5.68 సెంటీమీటర్లు, పెద్దకొత్తపల్లిలో 5.63 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 500 ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్నాయి.

వేర్వేరు చోట్ల ముగ్గురు మృతి

భారీ వర్షాలకు శుక్రవారం రాష్ట్రంలో ముగ్గురు మృతిచెందారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం బెగుళూర్ గ్రామంలో మంద లక్ష్మి (42) అనే మహిళ ఇంటి గోడకూలి మరణించారు. రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుర్రంపల్లికి చెందిన ఎన్కెపల్లి సత్తయ్య (60) వాగు దాటుతుండగా గల్లంతయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టగా ఓచెట్టుకు చిక్కుకున్న స్థితిలో మృతదేహం లభ్యమైంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జనకాపూర్ గ్రామానికి చెందిన పవార్ బిక్కునాయక్ (78)కు ఛాతీలో నొప్పి రావటంతో కెరమెరిలోని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా, అనార్‌పల్లి వాగు ఉప్పొంగటంతో వాహనంలో తరలించేందుకు వీలు కాలేదు. దీంతో ఆయన మార్గమధ్యలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వాగుపై వంతెన ఉంటే ప్రాణాలు దక్కేవని ఆవేదన వ్యక్తం చేశారు. కెరమెరి మండలం కరంజీవాడ గ్రామానికి చెందిన మండాడి కోసు (60) కూడా వాగు ప్రవాహంతో ఆస్పత్రికి వెళ్లలేక ఇంట్లోనే ఉండిపోవడంతో ఈ నెల 21న మృతిచెందాడు.

మూసీ ముంచేసింది..

నీట మునిగిన మహాత్మాగాంధీ బస్‌స్టేషన్





సాక్షి, హైదరాబాద్: మూసీ నది హైదరాబాద్‌ను శుక్రవారం రాత్రి అతలాకుతలం చేసింది. నదిలో ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగిపోవటంతో నదికి ఇరువైపులా ఉన్న కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. ఎన్నడూ లేనివిధంగా మహాత్మా గాంధీ బస్‌స్టేషన్‌ను కూడా వరద ముంచెత్తింది. ఒక్కసారిగా వరదనీరు బస్ స్టేషన్‌లోకి చొచ్చుకురావటంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. బస్ స్టేషన్‌లోని ప్రయాణికులను హైడ్రా, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది బయటకు తరలించారు. ముందుజాగ్రతగా మూసీ నదిపై ఉన్న లోలెవలె వంతెనలన్నీ మూసివేశారు. పురాణాపూల్, చాదర్‌ఘాట్, మూసారంబాగ్ కాజ్‌వేలను మూసివేస్తూ ట్రాఫిక్ పోలీసు చీఫ్ జోయల్ డెవిస్ శుక్రవారం రాత్రి నిర్ణయం తీసుకున్నారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మూసీనదికి భారీ వరద పోటెత్తింది. దీంతో శుక్రవారం రాత్రి అధికారులు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ గేట్లను ముందస్తు హెచ్చరిక చేయకుండానే ఎత్తివేశారు. దీంతో దిగువన ఒక్కసారిగా వరద ప్రవాహం పెరిగిపోయింది. వెంటనే స్పందించిన హైడ్రా, ఎస్‌డీఆర్‌ఎస్ విభాగాలు.. మూసీ వెంట ఉన్న కాలనీల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అధికారులు, పోలీసులు మూసీ పరీవాహక ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కాగా, 1908లో కూడా సెప్టెంబర్ 26నే మూసీ నదికి వరదలు వచ్చాయి. అప్పుడు వచ్చిన వరదలకు వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, దాదాపు 20వేల ఇళ్లు నేలమట్టమయ్యాయి. దీంతో హైదరాబాద్ నగరాన్ని వరదల నుంచి రక్షించడానికి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను నిర్మించారు. మళ్లీ ఇప్పుడు సెప్టెంబర్26నే మూసీ వరద ముంచెత్తడంతో నాటి సంఘటనలను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు.

మరిన్ని చిత్రాలు సాక్షి ప్లస్ (ఈ-పేపర్)లో

ఓటుకు నోటును ఎన్నికల చట్టాల కింద విచారించండి

సుప్రీంకోర్టును కోరిన సీఎం రేవంత్ రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఓటుకు నోటు (కోట్లు)కేసును ఎన్నికల చట్టాల కింద విచారించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టును కోరారు. ఇది క్రిమినల్ కేసు కాదని, ఎన్నికల వివాదమని గతంలోనే తాము న్యాయస్థానానికి తెలిపినట్లు పేర్కొన్నారు. అందుకే ఎన్నికల చట్టాల కింద విచారించాలని విన్నవించారు. ఈ కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల నియమావళి కింద విచారణ చేపట్టాలని 2021, జూలై 22న రేవంత్‌రెడ్డి, ఈ కేసులో తన పేరు తొలగించాలని సండ్ర వెంకట వీరయ్య అదే ఏడాది ఏప్రిల్ 13న స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిని శుక్రవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్ ధర్మాసనం విచారించింది. రేవంత్‌రెడ్డి, సండ్ర వెంకట వీరయ్య తరఫున సీనియర్ న్యాయవాదిత్దార్థ లూథ్రా, బీఆర్‌ఎస్ తరఫున సీనియర్ న్యాయవాది ఆర్యమా సుందరం హాజరయ్యారు.

జగదీశ్‌రెడ్డి ఇంప్లీడ్‌ను అనుమతించొద్దు..

ఓటుకు కోట్లు కేసును పక్క రాష్ట్రాల్లోని హైకోర్టుల్లో విచారించేలా ఆదేశాలివ్వాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తరఫు న్యాయవాది ఆర్యమా సుందరం కోరారు. అందువల్ల జగదీశ్వర్‌రెడ్డిని ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యేందుకు అనుమతించాలన్నారు. దీనిపై రేవంత్ తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అభ్యంతరం వ్యక్తం చేశారు. జగదీశ్‌రెడ్డిని ఇంప్లీడ్ అయ్యేందుకు అనుమతి ఇవ్వొద్దని, ఇలా ఇవ్వడం అన్యాయమన్నారు. ఇదే కేసుకు సంబంధించి ఏ4గా ఉన్న మత్తయ్య ఎఫ్ఐఆర్ క్వాష్‌కు సంబంధించిన సీజేఐ ధర్మాసనం తీర్పు వెలువరించిందని పిటిషనర్లు ధర్మాసనం దృష్టికి తీసుకురాగా, ఆ తీర్పు కాపీలను తమకు ఇవ్వండని జస్టిస్ జేకే మహేశ్వరి అన్నారు. అనంతరం ధర్మాసనం అక్టోబర్ 14కు వాయిదా వేసింది.

ఓటుకు నోటు కేసులో కర్త, కర్మ, క్రియ అన్నీ చంద్రబాబే

ఈ కేసులో చంద్రబాబు దోషి అని తేలకుండా చక్రం తిప్పిన కేంద్రం

చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలను ముఖ్యమంత్రి పదవుల నుంచి తప్పించాలి

ఓటుకు నోటు కేసు నిందితుడు జెరూసలేం మత్తయ్య


మాట్లాడుతున్న జెరుసలేం మత్తయ్య

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఓటుకు నోటు కేసులో కర్త, కర్మ, క్రియ అన్నీ ఏపీ సీఎం చంద్రబాబేనని ఆ కేసులో నిందితుడు జెరూసలేం మత్తయ్య అన్నారు. ఓటుకు నోటు కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్న చంద్రబాబు నాయుడు దోషిగా తేలితే, కేంద్రంలో తెలుగుదేశం పార్టీ మద్దతుతో నడిచే మోదీ ప్రభుత్వాన్నీ చంద్రబాబు కూల్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు ఒత్తిడికి లొంగిన కేంద్ర పెద్దలు ఆయనకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకున్నారని, సుప్రీంకోర్టును ప్రభావితం చేశారని ఆరోపించారు. శుక్రవారం ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో న్యాయవాది శ్రీనివాసరావుతో కలిసి సుప్రీంకోర్టు తీర్పుపై మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో ఏర్పడిన టీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కూల్చివేసి, తన పార్టీ ఎమ్మెల్యేలతో డమ్మీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి రెండు తెలుగు రాష్ట్రాలలో తానే అధికారం చలాయించాలనే ఉద్దేశంతో రేవంత్ రెడ్డి ద్వారా ఎమ్మెల్యేల కొనుగోలుకు చంద్రబాబు కుట్ర చేశాడని మత్తయ్య ఆరోపించారు. క్రైస్తవ నామినేటెడ్ ఎమ్మెల్యేను కొనేందుకు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి తనను స్టీఫెన్‌సన్ వద్దకు పంపారన్నారు. ఓటుకు రూ.5 కోట్లు ఇస్తామని ఒప్పించాలని తనను రాయబారం పంపించారని, ఆ తర్వాత వారే నేరుగా డబ్బుల సంచులతో వెళ్లి తెలంగాణ ప్రభుత్వ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారని గుర్తు చేశారు. ఈ కేసు గత కొన్నేళ్లుగా సుప్రీంలో పెండింగ్‌లో ఉందన్నారు. చంద్రబాబు ఏపీకి తిరిగి ముఖ్యమంత్రి అయ్యారని, ఈ కేసులో వీలైనంత త్వరగా బయట పడాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు. కేవలం వారం రోజుల్లోనే మూడుసార్లు విచారణ జరిపించి తనను ఆ కేసు నుంచి తప్పించడమే ఇందుకు నిదర్శనమని ఎత్తి చూపారు. చంద్రబాబుతో ఉన్న అవసరం రీత్యా కేంద్రం ఈ విషయంలో పూర్తిగా ఆయనకు సహకరిస్తోందని మండిపడ్డారు. ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రతులను ఈ సందర్భంగా చించివేశారు. చంద్రబాబు నిజాలను దాచి, వ్యవస్థలను మేనేజ్ చేశారని పోస్టర్‌ను ప్రదర్శించారు. ఈ కేసులో మరోసారి తన నుంచి 164 స్టేట్‌మెంట్ రికార్డు చేయాలని, ఈ కేసును తిరిగి విచారణ జరిపాలని, చంద్రబాబు ఆడియో టేప్‌ల ఫోరెన్సిక్ ఆధారాలు, రూ.50 లక్షల నగదు ఇలా అన్నింటిపై పూర్తి స్థాయి విచారణ జరపాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం రేవంత్ రెడ్డి, చంద్రబాబుల శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, వారిద్దరినీ సీఎం పదవుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఢిల్లీలో కేంద్రం ఎన్నికల ముఖ్య కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు. 'ఓటుకు నోటు కేసులో నేను ఓడిపోయాను. నేరస్తులు తప్పించుకున్నారు. న్యాయం బలైంది' అంటూ నినాదాలు చేశారు.

ఎస్సారెస్పీ 39 గేట్లు ఎత్తివేత

ప్రాజెక్టులోకి 2.91 లక్షల క్యూసెక్కుల వరద
2.22 లక్షల క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి విడుదల
నాగార్జునసాగర్ 26, శ్రీశైలం 10 క్రస్ట్ గేట్లు ఎత్తివేత

నాగార్జునసాగర్/జగిత్యాల అగ్రికల్చర్/ దోమలపెంట: భారీ వర్షాలతో గోదావరి నదిలో వరద ఉధృతి పెరుగుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు భారీ వరద వస్తుండటంతో ప్రాజెక్టు 39 గేట్లను ఎత్తి 2,10,925 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. వివిధ మార్గాల ద్వారా మొత్తం 2.22 లక్షల క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 2.91 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు నుంచి వరద కాల్వకు 2 వేల క్యూసెక్కులు, కాకతీయ కాల్వకు 5,500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,500 క్యూసెక్కులు, సరస్వతి కెనాల్‌కు 400 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతలకు 360 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఉరకలేస్తున్న కృష్ణమ్మ

కృష్ణానది కూడా భారీ వర్షాలకు ఉగ్రరూపం దాల్చింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద పెరగడంతో శ్రీశైలం ప్రాజెక్టు పది గేట్లు ఎత్తారు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ప్రియదర్శిని జూరాల ఆనకట్ట స్పిల్‌వే, విద్యుదుత్పత్తి చేయడంతో పాటు సుంకేసుల, హంద్రీ నుంచి మొత్తం 2,87,051 క్యూసెక్కుల వరద కొనసాగుతుంది. శ్రీశైలం ప్రాజెక్టు పది గేట్లను ఒక్కొక్కటి పది అడుగుల మేర ఎత్తి 2,70,190 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ అదనంగా 65,756 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.70 అడుగుల వద్ద 202.9673 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గడిచిన 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 5,000, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,409, ఎంజీకేఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.832 మిలియన్ యూనిట్లు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 15.186 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. శ్రీశైలం నుంచి భారీ వరద వచ్చి చేరుతుండగా నాగార్జునసాగర్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా 2,30,182 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 33,130 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 587.40 అడుగుల నీరుంది.


శ్రీశైలంలో గేట్లు ఎత్తిన దృశ్యం..


ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో వరద ప్రవాహం..

సింగరేణి ఉద్యోగులకు 29న లాభాల వాటా

ఒక్కొక్కరికి సగటున రూ.1.96 లక్షలు..
కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5.500 చొప్పున చెల్లింపు

సాక్షి, న్యూఢిల్లీ/ సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి ఉద్యోగులకు ఇటీవల లాభాల్లో వాటాగా ప్రకటించిన నగదును యాజమాన్యం ఈ నెల 29న చెల్లించనుంది. సంస్థ లాభాల్లో 34% వాటాగా ప్రకటించిన నేపథ్యంలో రూ.819 కోట్లను కార్మికుల ఖాతాలో జమ చేయనున్నట్లు శుక్రవారం రాత్రి సింగరేణి యాజమాన్యం వెల్లడించింది. ఒక్కొక్కరికి సగటున రూ.1.96 లక్షలు, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 చొప్పున చెల్లిస్తారు. కార్మికుల మస్టర్ల (హాజరు) ఆధారంగా ఎవరికి ఎంత మొత్తంలో చెల్లించనున్నారో శనివారం స్పష్టత వస్తుందని సమాచారం.

బొగ్గు గని కార్మికులకు రూ.1.03 లక్షల బోనస్

దేశవ్యాప్తంగా కోల్ ఇండియా పరిధిలోని బొగ్గుగని కార్మికులకు రూ.1.03 లక్షల పీఎల్ఆర్ (ప్రొడక్టివిటీ లింక్డ్ రివార్డ్) బోనస్ ప్రకటించారు. కోల్‌కతాలో గురువారం అర్ధరాత్రి వరకు జరిగిన జేబీసీసీఐ ఆరో సమావేశంలో కోల్ ఇండియా పరిధిలోని బొగ్గు పరిశ్రమల నిర్వాహకులు, జాతీయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు రూ.1.20 లక్షల బోనస్ ఇవ్వాలని కోరినా, చివరకు యాజమాన్యం రూ.1.03 లక్షలుగా ఖరారు చేసింది. గత ఏడాది రూ.93,750 చెల్లించగా, ఈసారి దానికి అదనంగా మరో రూ.9,250 పెంచారు. ఇదిలా ఉండగా, కోల్ ఇండియావ్యాప్తంగా కార్మికులకు దసరాకే బోనస్ చెల్లించనుండగా, సింగరేణిలో మాత్రం దీపావళికి చెల్లిస్తారు. ఈమేరకు సింగరేణివ్యాప్తంగా 40 వేల మంది కార్మికులు ఈ బోనస్ అందుకోనున్నారు. కొత్తగూడెం రీజియన్ పరిధిలో 6,378 మంది కార్మికులకు బోనస్ అందనుంది. బోనస్ సాధనలో అఖిల భారతీయ ఖదాన్ మజ్దూర్ సంఘ్ నాయకులు సుధీర్‌గురుడే, సుజిత్ సింగ్, టీఎస్ పవన్‌కుమార్ కీలక పాత్ర పోషించారని బీఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవనాయక్ తెలిపారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హర్షం

కార్మికుల పనితీరు, కష్టాన్ని కోల్ ఇండియా గుర్తించిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సీఐఎల్, దాని అనుబంధ సంస్థలు, సింగరేణి సంస్థ కార్మికులకు బోనస్ ప్రకటించడంపై ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు.



● కేరెంటింగ్

మాటే... బాట

జీవితంలో ఎదురయ్యే అనేక సంఘటనల గురించి తల్లిదండ్రులు తరచూ పిల్లలతో మాట్లాడుతూ ఉండాలి. మన మాటలతోనే వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి. ఆ మాటలు ఎలా ఉండాలంటే...

ఒక వ్యక్తి ప్రవర్తన వారు చూసిన, దగ్గరగా మసలిన వ్యక్తులు, వారి చుట్టూ ఉన్న ప్రపంచంపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా బాల్యంలో పరిసరాలు, మనుషుల ప్రభావం అధికంగా ఉంటుంది. అందుకే పిల్లలు తరచూ అనేక ఆలోచనలు, సందేహాలతో సతమతమవుతుంటారు. ఇవి ఒకదాన్ని ఒకటి డామినేట్ చేస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనిస్తుండాలి.

అంతర్గత సౌందర్యమే అసలైన అందం

పిల్లలు టీనేజ్ లేదా యుక్తవయసుకు వచ్చినపుడు వారిలో ఆత్మవిశ్వాసం పాళ్లు చాలా తక్కువగా ఉంటాయి. అన్ని విషయాల్లో ఇతరులతో పోల్చుకుని వారి కన్నా తాము తక్కువని ఫీలవుతుంటారు. శరీరం రంగు విషయంలో ఇది మరింత ఎక్కువగా ఉంటుంది. దీన్ని ఆ వయసులో వారికి అర్థమయ్యేలా వివరించడం కొంత కష్టం అయినప్పటికీ అందం తాత్కాలికమని, అసలు అందం అంటే తెలుపు, నలుపు రంగులకు సంబంధించిన విషయం కాదని చెప్పాలి. అలాగే ఎత్తు, బరువు, ఆకృతి అందచందాలకు గుణగుణాలకు కొలమానం కాదని, అంతర్గత సౌందర్యం మాత్రమే అసలైన అందమని వారికి విడమరచి చెప్పాలి. మన ప్రతిభను ప్రపంచానికి చూపేందుకు అనేక మార్గాలున్నాయని వారికి తెలియజెప్పాలి.

మీ కలలకు మేం రంగులద్దుతాం!

కలలు కనడం ఏమీ చెడ్డ విషయం కాదు. అయితే అవి ఆచరణసాధ్యం కానివి...పరిమితికి మించినవి కావడం మాత్రం కష్టంగా అనిపించే విషయం. పిల్లలు తాము ఎలా ఉండాలి? ఎవరిలా ఉండాలి... అనే విషయం గురించి తరచూ ఆలోచిస్తుంటారు. కొందరు పిల్లలు తమ తల్లిదండ్రుల్లా ఉండాలని కోరుకుంటారు. మరికొందరు అంతకంటే మిన్నగా బతకాలని, ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇంకా ఉన్నతస్థాయిలో ఉండాలని కోరుకుంటారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఇలాగే ఉండాలని శాసించకూడదు. వారి ఆలోచనలను తెలుసుకుని, కలలను సాకారం చేసుకోవడంలో తోడ్పడాలి. తమను తాము తీర్చిదిద్దుకునేందుకు అవసరమైన సలహాలు మాత్రమే ఇవ్వాలి. ఒకవేళ వారికి ఈ విషయంలో స్పష్టత లేకపోతే నిర్ణయాలు తీసుకోవడంలో సహకరించాలి.

ఎలాంటి స్నేహాన్ని ఎంచుకోవాలంటే..?

మిత్రలాభం, సావాస దోషం ఈ రెండూ స్నేహం వల్ల కలిగే లాభ నష్టాలను సూచించే పదాలు. ఎందుకంటే స్నేహం పిల్లలను అమితంగా ప్రభావితం చేస్తుంది. ఒకేవ్యక్తితో సావాసం చేయడం అన్నివేళలా అంత మంచిది కాదు. పెరుగుతున్న కొద్ది స్నేహాలు కొంత క్లిష్టంగా మారుతుంటాయి. అందుకే తోటివారినెవరినీ విడదీసి చూసి ఎంపిక చేసుకునే బదులు అందరితో కలివిడిగా ఉండటం నేర్పాలి.. మంచి స్నేహితులు ఎప్పుడూ మిమ్మల్ని తక్కువగా చూడరు. అగౌరవపరచరు. మీ స్నేహాన్ని ఆస్వాదిస్తారు.. విశ్వాసపాత్రులుగా ఉంటారని వారికి వివరించి చెప్పాలి.

పోల్చిచూడవద్దు

కోరికలు, అవసరాలకు అంతనేది ఉండదు. మన దగ్గర ఉన్నదాంట్లో తృప్తి పడటం నేర్చుకోవాలి. అందుకు సదా కృతజ్ఞులమై ఉండాలి. అంతే తప్ప తోటివారితో పోల్చుకుని వారి వద్ద ఉన్నవి, అనుభవిస్తున్నవి మన దగ్గర లేవని బాధపడకూడదని చెబుతుండాలి.

ప్రవర్తనా లోపాలు ఉండరాదు

కొంతమంది పిల్లలు తోటి విద్యార్థులను బెదిరిస్తుంటారు. తల్లిదండ్రులను చిన్నచూపు చూస్తూ అవమానిస్తుంటారు. ఈ ప్రవర్తనను మొగ్గలోనే తుంచి వేయాలి. లేకపోతే మనం అమ్మానాన్నలుగా విఫలం అయినట్లే లెక్క. ఇతరులను బెదిరించడం, ఎగతాళి చేయడం తప్పని, పైగా అది ఇతరులకే కాదు, వారికి కూడా ఎంతో హాని కలిగించే విషయం కూడానని చెప్పాలి. అందుకే ఇంటిని, బడిని పిల్లలకు సురక్షితమైన ప్రదేశాలుగా ఉంచటం అత్యవసరం.

ప్రతి ఒక్కరినీ గౌరవించాలి

దేవుడు మానవుల ఆత్మల్లో కొలువై ఉంటాడని, ఒకరికొకరు సాయం చేసుకోవడం, ఇతరులను గౌరవించడం నిజమైన దైవారాధన అని రవీంద్రనాథ్ ఠాగూర్ తరచూ బోధించేవారు. ఇలాంటి మహనీయుల ఆదర్శ వాక్యాలను పిల్లల మనసులో నాటుకునేలా తల్లిదండ్రులు పదే పదే చెబుతుండాలి.స్థాయీ భేదాలు, లైంగిక తారతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించాలని చెప్పాలి. ఎవరూ తక్కువ కాదని, స్త్రీలు లైంగిక వస్తువులు కాదు... పురుషులంటే వారిని హింసించే వేటగాళ్లు కాదు... ఎవరూ ఎవరికీ సేవకులు లేదా బానిసలు కాదని చెప్పాలి.

సంతోషమే ఏకైక మార్గం

మనస్సును ఎల్లప్పుడూ సంతోషంగా ఉంచుకోవాలి. ఎవరైనా సంతోషంగా ఉండాలంటే మీ ముందున్న ఏకైక మార్గం మీ తోటివారిని సంతోషంగా ఉంచడమేనని తెలియజెప్పాలి.

అభిరుచులూ ముఖ్యమే!

చదువుకు అడ్డం అంటూ పిల్లలను క్రీడలు, లలిత కళలు లేదా ఇతర అభిరుచులకు దూరం చేయకూడదు. ఇవేమీ లేకుండా కేవలం చదువు ఒక్కటే లక్ష్యంగా పెట్టుకోవాలి, మరే అభిరుచులూ ఉండకూడదంటే అది వారిని తీవ్ర నిరుత్సాహానికి గురిచేస్తుందని గుర్తుంచుకోండి

మంచితనమే మిన్న

ఏమి జరుగుతుందో అది జరుగుతుంది. మనం ఏం చేస్తే అదే మనకు తిరిగొస్తుంది. అది మంచయినా... చెడయినా... అందుకే ఎప్పుడూ తోటివారితో సామరస్యంతో, మంచితనంతో ఉండాలని పిల్లలకు నేర్పించాలి.

లైఫ్@360



● అయ్యంగార్ యోగ

మల్లిక ఫిట్‌నెస్ మంత్ర

48 సంవత్సరాల వయస్సులో కూడా చక్కటి సౌష్ఠవంతో యువ నటీమణులతో పోటీపడుతున్న బాలీవుడ్ నటి మల్లికా షెరావత్. ఆమె తనను ఫిట్‌గా ఉంచే అయ్యంగార్ యోగా సాధన గురించి ఇటీవల ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది.

వేగంగా బరువు తగ్గాలని, తొందరగా ఫిట్‌నెస్ పెంచుకోవాలని ఇంచుమించు అందరూ అనుకుంటారు. అయితే అలాంటి క్విక్-ఫిక్స్ డైట్‌లు, ట్రెండింగ్ వర్కౌట్‌లు, సోషల్ మీడియా ట్రిక్స్ మూలంగా వచ్చిన ఫిట్‌నెస్ అంతే తొందరగా కరిగిపోతుందని తెలుసుకోలేక చాలామంది స్థిరమైన ఫిట్‌నెస్ మార్గాన్ని గాలికి వదిలేస్తుంటారు.

నా ఫిట్‌నెస్ ఫిలాసఫీ

''నా ఆరోగ్యానికి, ఫిట్‌నెస్‌కు యోగా చేయడమే కారణం. అంతేగానీ ఫ్యాషన్ డైట్‌లు లేదా క్రాష్ ప్రోగ్రామ్‌లు కాదు' అని మల్లిక ఇన్‌స్టా సాక్షిగా తేల్చి చెప్పింది. ఆరోగ్యంగా ఉండాలన్న తపన.. క్రమశిక్షణ, స్థిరత్వం తన అతి పెద్ద సాధనాలని నొక్కి చెప్పింది. ట్రెండీ ఫిట్‌నెస్ హ్యాక్‌లను ఆమోదించే చాలా మంది సెలబ్రిటీల మాదిరిగా కాకుండా, మల్లికా దీర్ఘకాలిక అలవాట్లను పెంపొందించుకోవడం వైపే మొగ్గు చూపుతుంది. అందుకే అయ్యంగార్ యోగాను తన దిన చర్యలో భాగంగా మార్చుకుంది.

ఫిట్‌నెస్‌ను తాను తాత్కాలికంగా తీసుకోలేదని, దానిని తన జీవనశైలిలో భాగంగా చేసుకున్నానని చెబుతూనే, అయ్యంగార్ యోగా వల్ల తన శరీరాన్ని షేప్ కోల్పోకుండా ఉంచుకోవడమే కాకుండా, తన బిజీ జీవితంలో సమతుల్యతను కాపాడుకోవడానికి, ముఖ్య విషయాల మీద దృష్టి పెట్టడానికి సహాయపడిందని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసుకుంది.

ఏమిటీ అయ్యంగార్ యోగా?

అయ్యంగార్ యోగకూ పతంజలి ఋషి యోగ సూత్రాలకూ అవినాభావ సంబంధం ఉంది. అష్టాంగ యోగా ఎనిమిది అంశాలను ఆచరణాత్మక వ్యవస్థలో మిళితం చేస్తుంది. అధికారిక అయ్యంగార్ యోగా వెబ్‌సైట్ ప్రకారం, దాని క్రమం, ఆధారాల ఉపయోగం, భద్రతపై ప్రాధాన్యత దీనిని ప్రపంచవ్యాప్తంగా అత్యంత విస్తృతంగా అభ్యసించే యోగా రూపాలలో ఒకటిగా మార్చాయి.

అయ్యంగార్ యోగాలో కీలకమైన అంశం ఏమిటంటే పట్టీలు, బోల్‌స్టర్లు, బ్లాక్స్, తాళ్లు వంటి ఆధారాలను ఉపయోగించడం. ఈ సాధనాలు ప్రారంభకులకు అధునాతన అభ్యాసకులకు సరైన భంగిమను సాధించడంలో సహాయపడతాయి. అదే సమయంలో గాయం ప్రమాదాలను తగ్గిస్తాయి. ఇది అభ్యాసాన్ని అత్యంత సమగ్రంగా చేస్తుంది. అన్ని వయసుల వారికి, ఫిట్‌నెస్ స్థాయులకు అనుకూలంగా ఉంటుంది.

మెదడుకు చురుకైన ఆహారం



రోజువారీ ఆహారంలో కూరగాయలు, లీన్ ప్రోటీన్లు, మంచి కొవ్వు, మరిన్ని... దశాబ్దాలుగా, మెడిటేరియన్ డైట్ తీసుకోవడం వల్ల మెదడు వృద్ధాప్యాన్ని వాయిదా వేయవచ్చని నిపుణులు చెబుతున్నారు.

గ్రీన్ టీ: ఇది మీ న్యూరాన్లకు శక్తినిస్తుంది: గ్రీన్ టీలో కాటెచిన్లు పుష్కలంగా ఉన్నాయి, ఇవి వాపులను, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి కావలసిన శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు, ఇవి న్యూరోడీజనరేషన్‌కు కీలకంగా పనిచేస్తాయి.

మెదడు పనితీరును పెంచే మొక్క మన్కై

దీనిని 'డక్ వీడ్' అని కూడా పిలుస్తారు, మన్కై, అనేది పాలీఫెనాల్స్, బీ12, మొక్కల ఆధారిత ప్రోటీన్లతో నిండిన ఒక చిన్న వాటర్ ప్లాంట్. ఇది మెదడు వృద్ధాప్యంతో ముడిపడి ఉన్న కీలక ప్రోటీన్‌లను నియంత్రించడంలో సహాయ పడుతుంది.

చెడును తొలగిస్తుంది, మంచిని జోడిస్తుంది

గ్రీన్-మెడ్ ప్రణాళిక ఆరోగ్యకరమైన పదార్థాలపై మాత్రమే కాదు, ఇది రెడ్ మీట్, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్‌లను కూడా తగ్గిస్తుంది, రెండూ వృద్ధాప్యంతో ముడిపడి ఉన్నాయి.

మెడిటరేనియన్ డైట్ అంటే...

పుష్కలంగా పండ్లు, కూరగాయలు, బ్రెడ్, ఇతర ధాన్యాలు, బంగాళదుంపలు, బీన్స్, గింజలు, ఆలివ్ నూనెనే ఎక్కువగా వాడతారు. పాల ఉత్పత్తులు, గుడ్లు, చేపలు వంటివి మెడిటరేనియన్ డైట్ లో మితంగా తీసుకుంటారు. ఈ ఆహారంలో రెడ్ మీట్ కంటే చేపలు, పౌల్ట్రీ ఉత్పత్తులు ఎక్కువగా ఉంటాయి. మొక్కల ఆధారిత ఆహారాలనే ఎక్కువగా తింటారు.



వ్యాపించకుండానే వాష్ చేసేద్దాం

అంటువ్యాధులతోపాటు రకరకాల సీజనల్ వ్యాధుల వ్యాప్తిని, ఇన్ఫెక్షన్లను నివారించడానికి అతి తేలికైన, అత్యంత ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి 'హ్యాండ్‌వాష్'. అవును, నిజమే. చేతుల పరిశుభ్రత వల్ల జీర్ణకోశ వ్యాధులు. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు గణనీయంగా తగ్గుతాయని శాస్త్రీయ అధ్యయనాలు చూపిస్తున్నాయి. సబ్బుతో చేతులు కడుక్కోవడం, ముఖ్యంగా టాయిలెట్ ఉపయోగించిన తర్వాత, తినడానికి ముందు, చర్మంపై ఉన్న చాలా సూక్ష్మజీవులను సమర్థంగా తొలగించగలదు. ముఖ్యంగా వర్షాకాలంలో, వర్షంలో తడిసినప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవడం వల్ల వ్యాధుల వ్యాప్తి గణనీయంగా తగ్గుతున్నట్లు అధ్యయనంలో రుజువైంది.

సాక్షి సినిమా

మా ప్రపంచం వేరు



● ఆయుష్మాన్, రష్మిక

ఆయుష్మాన్ ఖురానా, రష్మికా మందన్నా ప్రధాన పాత్రల్లో నటించిన హారర్ మిస్టరీ రొమాంటిక్ కామెడీ చిత్రం 'థామా'. మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా రూపొందిన ఈ చిత్రానికి 'ముంజ్యా' ఫేమ్ ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహించారు. దినేష్ విజన్, అమర్ కౌశిక్ నిర్మించారు. ఈ చిత్రంలో అలోక్ పాత్రలో ఆయుష్మాన్ ఖురానా, తడ్కా పాత్రలో రష్మికా మందన్నా నటించారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ శుక్రవారం ముంబైలో జరిగింది. శ్రద్ధా కపూర్ ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ''ఏ... నాటకాలు ఆపు... నీకేం కాలేదు, నా కొడుకు సైతాన్... సైతాన్, నేను నీతో ఉండలేను... మా ప్రపంచం వేరు'' అని అర్థం వచ్చే డైలాగ్స్ ఈ హిందీ ట్రైలర్‌లో ఉన్నాయి. దీపావళి పండగ సందర్భంగా 'థామా' సినిమాను అక్టోబరు 21న రిలీజ్ చేయనున్నట్లుగా అధికారికంగా వెల్లడించారు.

వినోదాల విందు



● నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి

నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమా 'అనగనగా ఒక రాజు'. మారి దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా వచ్చే సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదల కానుంది. శుక్రవారం ఈ సినిమా కొత్త ప్రోమో వీడియోను టీజర్‌లా రిలీజ్ చేశారు మేకర్స్. ఓ ఆభరణాల ప్రకటనకు స్పూఫ్‌గా ఈ ప్రోమోను చేశారు. ''తనదైన కామెడీ టైమింగ్‌తో 'అనగనగా ఒక రాజు' సినిమాలో ప్రేక్షకులను అలరించనున్నారు నవీన్ పొలిశెట్టి. ఈ సంక్రాంతికి ప్రేక్షకులకు వినోదాల విందుని హామీ ఇస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

చార్మినార్‌లో సందడి



● లక్ష్య, అనన్యా పాండే

స్టార్ట్ కెమెరా... టేక్ అన్నారు డైరెక్టర్ వివేక్ సోని. అంతే... హీరో లక్ష్య బైక్ స్టార్ట్ చేశారు... వెనకాల హీరోయిన్ అనన్యా పాండే కూర్చుకున్నారు. రయ్‌మంటూ బైక్ ముందుకు సాగింది. సీన్ పూర్తయింది. షాట్ ఓకే అన్నారు వివేక్. ఈ షూటింగ్ జరిగింది ఎక్కడంటే హైదరాబాద్‌లోని చార్మినార్ దగ్గర. ఎరుపు రంగు సంప్రదాయ దుస్తుల్లో లక్ష్య, అనన్య కలర్‌ఫుల్‌గా కనిపించారు. అక్కడి జనాలు వీరిని గుర్తు పట్టి, చుట్టుముట్టారు. సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీశారు. లక్ష్య, అనన్యా పాండే జంటగా నటిస్తున్న కాలేజ్ రొమాంటిక్ మూవీ 'చాంద్ మేరా దిల్' కోసమే ఈ సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఈ చిత్రంలో ఈ ఇద్దరూ ఇంజినీరింగ్ స్టూడెంట్స్ పాత్రల్లో కనిపిస్తారు. ఈ చిత్రం షూటింగ్‌ని వారం రోజుల పాటు హైదరాబాద్‌లో ప్లాన్ చేశారు. చార్మినార్ తర్వాత మరో పాపులర్ ప్లేస్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తారట. ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది.



● చార్మినార్ దగ్గర...



● ప్రభాస్



● మహేశ్‌బాబు



● ఎన్టీఆర్



● రామ్‌చరణ్



● నాని

మిషన్ మేకోవర్

కథ డిమాండ్ మేరకు సినిమా సినిమాకు కొత్త లుక్స్‌లోకి మారిపోతుంటారు హీరోలు. కథల్లోని హీరో క్యారెక్టరైజేషన్‌కు తగ్గట్లుగా గెటప్ మార్చేస్తుంటారు. ఇలా తమ కొత్త సినిమాల కోసం కొందరు హీరోలు ఒక 'మిషన్' మీద ఉన్నారు. ఆ మిషన్ ఏంటంటే 'మేకోవర్'. ఈ 'మిషన్ మేకోవర్' విశేషాలు తెలుసుకుందాం.

రాముడి పాత్రలో..?

సిల్వర్ స్క్రీన్‌పై లాంగ్ హెయిర్, గడ్డంతో మహేశ్‌బాబు కనిపించి చాలా సంవత్సరాలైంది. ఇప్పుడు రాజమౌళి దర్శకత్వంలో చేస్తున్న 'ఎస్ఎస్ఎమ్‌బీ29' (వర్కింగ్ టైటిల్) సినిమా కోసం మహేశ్ బాబు పూర్తిగా మేకోవర్ అయ్యారు. హెయిర్, గడ్డం పెంచారు. అలాగే వర్కౌట్స్‌తో ఫిజికల్‌గా కూడా ధృడంగా తయారయ్యారు. కాగా ఈ కథకు మైథలాజికల్ టచ్ కూడా ఉందని, ఈ చిత్రంలో రాముడి పాత్రలో మహేశ్‌బాబు కనిపిస్తారనే టాక్ కూడా ప్రచారంలోకి వచ్చింది. ఈ వార్త నిజం అయితే 'ఎస్ఎస్ఎమ్ బీ29'లో మహేశ్ బాబును ప్రేక్షకులు పలు రకాల లుక్స్‌లో చూసే అవకాశం ఉంది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ ఏడాది నవంబరులో ఈ సినిమా అప్‌డేట్‌ను ఇస్తామని రాజమౌళి చెప్పారు. నవంబరులో ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేస్తారని భోగట్టా. దాదాపు రూ. 1000 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా 2027 మార్చిలో విడుదల కానుందనే ప్రచారం సాగుతోంది.

పోలీస్ ట్రైనింగ్

ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజాసాబ్, ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలోని 'స్పిరిట్' సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు ప్రభాస్. ఈ చిత్రంలో ప్రభాస్ పోలీసాఫీసర్ పాత్రలో నటించనున్నారు. ఈ హీరో పోలీస్‌గా కనిపించనున్న తొలి చిత్రం ఇదే. దీంతో 'ది రాజాసాబ్, ఫౌజి' చిత్రాల షూటింగ్ పూర్తికాగానే, 'స్పిరిట్'లో పవర్‌ఫుల్ పోలీస్ లుక్ కోసం ప్రభాస్ మేకోవర్ కావాల్సి ఉంది. ఇందుకోసం ఆయన ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకోనున్నారట. ఈ చిత్రంలో 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రి హీరోయిన్‌గా నటించనున్నారు. ఇండియాలోని ప్రముఖ లోకేషన్స్‌తో పాటు మెక్సికో, యూకే వంటి విదేశీ లొకేషన్స్‌లోనూ 'స్పిరిట్' చిత్రీకరణ జరగనుంది. టీ సిరీస్ ఫిలింస్, భద్రకాళి ప్రొడక్షన్స్ పతాకాలపై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

బరువు తగ్గాలని...

ఎన్టీఆర్ హెవీ వర్కౌట్స్ చేస్తున్న ఓ వీడియో ఇటీవల వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఈ హీరో ఈ రేంజ్‌లో కష్టపడుతున్నది 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమా కోసమే. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో 'డ్రాగన్' సినిమా తెరకెక్కుతోంది. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో ఎన్టీఆర్ క్యారెక్టరైజేషన్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని తెలిసింది. ఆల్రెడీ సినిమా షూటింగ్ కొంత భాగం పూర్తయింది. అయితే కథ రీత్యా ఈ సినిమాలో ఎన్టీఆర్ ఓ డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తారట. ఈ లుక్ కోసమే ఎన్టీఆర్ మేకోవర్ అవుతున్నారని తెలిసింది. ఈ లుక్ కోసం బరువు తగ్గే మిషన్ మీద ఉన్నారు. ఇక ఇటీవల ఓ యాడ్ షూటింగ్‌లో భాగంగా ఎన్టీఆర్ స్వల్పంగా గాయపడ్డారు. వైద్యులు ఆయనకు రెండు వారాల పాటు విశ్రాంతి సూచించారు. దీంతో ప్రస్తుతం ఎన్టీఆర్ రెస్ట్ మోడ్‌లో ఉన్నారు. కోలుకున్న తర్వాత తిరిగి ఆయన 'డ్రాగన్' సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారు. ఈ చిత్రం తదుపరి షెడ్యూల్ విదేశాల్లో ప్రారంభం కానుందని తెలిసింది. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ నటుడు టొవినో థామస్ విలన్ రోల్ చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'డ్రాగన్' సినిమా వచ్చే ఏడాది జూన్ 25న విడుదల కానుంది.

ద్విపాత్రాభినయం?

'పెద్ది' సినిమా కోసం బరువు పెరిగారు రామ్‌చరణ్. సరైన వర్కౌట్స్, డైట్‌తో పూర్తిగా కొత్తగా మేకోవర్ అయ్యారు. రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ మల్టీస్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. ఈ సినిమాలో రామ్‌చరణ్ రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపించనున్నారని తెలిసింది. ఆల్రెడీ ఈ సినిమా నుంచి రామ్‌చరణ్ ఫస్ట్ లుక్ విడుదలైంది. కానీ ఈ లుక్ కాకుండా మరో లుక్‌లో కూడా రామ్‌చరణ్ కనిపిస్తారు. ఈ రెండో లుక్ కోసమే ఈ హీరో బరువు పెరిగారని తెలిసింది. ఇలా 'పెద్ది'లో రెండు లుక్స్‌లో కనిపించనున్నారనే టాక్ తెర పైకి రావడంతో ఈ చిత్రంలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అలాగే ఈ చిత్రంలో రామ్‌చరణ్ క్యారెక్టరైజేషన్‌లో డిఫరెంట్ వేరియేషన్స్ ఉంటాయని, ఇందులో భాగంగానే డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తారనే ఊహాగానాలూ ఉన్నాయి. త్వరలో ఈ విషయాలపై ఓ క్లారిటీ వస్తుంది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు, శివరాజ్‌కుమార్, దివ్యేందు శర్మ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు ఏఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

డిఫరెంట్ జడల్

'ది ప్యారడైజ్' ప్రపంచం కోసం పూర్తిగా మారిపోయారు హీరో నాని. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఈ సినిమాలో జడల్ అనే డిఫరెంట్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారు నాని. ఈ జడల్ పాత్ర కోసం నాని ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. ఇంటెన్స్ అండ్ హెవీ వర్కౌట్స్‌తో బరువు పెరిగారు. ఇక ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో మోహన్‌బాబు, 'కిల్' ఫేమ్ రాఘవ్ జుయల్ నెగటివ్ రోల్స్ చేస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా 2026 మార్చి 26న విడుదల కానుంది.

ఇలా తమ కొత్త సినిమాల కోసం లుక్స్, గెటప్స్ మార్చుకున్న, మార్చుకుంటున్న హీరోలు మరికొంతమంది ఉన్నారు.

– ముసిమి శివాంజనేయులు

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



తొమ్మిది గంటల కంటే ఎక్కువ నిద్ర పోవడం వల్ల జ్ఞాపకశక్తి బలహీన పడుతుందని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ హెల్త్ సైన్స్ సెంటర్ అధ్యయన నివేదిక. అధిక నిద్ర వల్ల డిప్రెషన్ బారిన పడే ప్రమాదం ఉంది. 'గ్లోబల్ కౌన్సిల్ ఆన్ బ్రెయిన్ హెల్త్' పెద్దలకు ఏడు నుంచి ఎనిమిది గంటల నిద్రను సిఫారసు చేసింది.



ఇందిర

'ఇల్లే తీర్థం–వాకిలే వారణాసి–కడుపే కైలాసం' అనుకుంటారు కొందరు.
కొందరు మాత్రం 'ప్రపంచమే అతి పెద్ద ఇల్లు' అనుకుంటారు. ప్రయాణాలను ఇష్టపడతారు. ఒక వయసు దాటిన తరువాత 'ఈ వయసులో ప్రయాణం ఏమిటి' అనుకుంటారు ఇంకొంతమంది. అయితే ప్రయాణం వయసెరుగదు. ఎందుకంటే వయసు భారాన్ని అధిగమించే ఉత్సాహం ప్రయాణాలలో ఉంది. అలాంటి ఒక ఉత్సాహవంతురాలు ఇందిర. కేరళకు చెందిన ఇందిర ఎం. ఉపాధ్యాయురాలు. ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తరువాత 35 దేశాలు పర్యటించింది.

పయనమే జీవనం..

కొత్త కొత్త ప్రదేశాలు చూడాలని చిన్నప్పుడు కలలు కనేది ఇందిర. అయితే అరవై ఏళ్ల వయసులోగానీ ఆ కల నెరవేరలేదు. సౌత్ ఆఫ్రికన్ సవానా తన తొలి ఇంటర్నేషనల్ ట్రిప్. తొలి ప్రయాణ విశేషాల గురించి అపురూపంగా చెబుతుంది. జీవవైవిధ్యంతో అలరించే ప్రకృతి, బిగ్‌ఫైవ్‌లాంటి వన్య ప్రాణులు, వైవిధ్యమైన వాతావరణం... స్థూలంగా తొలి పర్యటన ఇందిరకు ఎంతో సంతోషాన్నిచ్చింది.

సఫారీలో తాను చూసిన ఏనుగులు, సింహాల గురించి చిన్నపిల్లలా ఉత్సాహపడుతూ... 'ప్రయాణాల పుణ్యమా అని నాకు ఎంతోమంది స్నేహితులయ్యారు. జీవితంతో పాటు రకరకాల విషయాలు మాట్లాడుకుంటాం. మాలో చాలామందికి ఒకేరకమైన జీవితానుభవాలు ఉన్నాయి. నా స్నేహ బృందంలో వివిధ వయసుల వాళ్లు, ప్రాంతాల వాళ్లు ఉన్నారు. అయితే మా స్నేహానికి వయసు, ప్రాంతం ఎప్పుడూ అడ్డుగోడ కాలేదు' అంటుంది ఇందిర.

పెళ్లికావడానికి ముందు ప్రయాణాలు చేయాలనే ఉత్సాహం ఉన్నా ఆమె దగ్గర సరిపడా డబ్బు ఉండేది కాదు. ఉద్యోగం వచ్చి, పెళ్లయిన తరువాత కుటుంబ ఖర్చులు, బాధ్యతల వల్ల ప్రయాణాలు చేయలేకపోయింది. 'సోలో ట్రావెలింగ్ గురించి ఆలస్యంగా తెలిసింది. అది నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. నన్ను నేను లోతుగా తెలుసుకోవడానికి ఉపయోగపడింది' అంటుంది ఇందిర.

ప్రతి ప్రయాణంలో ఆమె ఎన్నో అనుభవాలను మూటగట్టుకుంది. ఇస్తాంబుల్‌లో ఉన్నప్పుడు సూట్‌కేస్ కోడ్ మరిచిపోయింది. జపాన్‌లో ఒకరోజు గాయపడింది... ఇలాంటి ఎన్నో సందర్భాలలోనూ ఎవరో ఒకరు ఆమెకు సహాయంగా నిలిచేవారు. ఎక్కడ ఏ కష్టం వచ్చినా, దయాగుణం అనుకోని అతిథిలా వచ్చేది.

సోలో ట్రావెల్‌ను ఎంజాయ్ చేసినట్లే గ్రూప్ ట్రావెల్‌ను కూడా ఎంజాయ్ చేసింది ఇందిర. 'గ్రూప్‌తో కలిసి ప్రయాణం చేసినప్పుడు కుటుంబసభ్యులతో ఉన్నట్లుగానే ఉంటుంది. ప్రతి ఒక్కరూ మరొకరికి సహాయపడతారు' అంటున్న ఇందిర ఇప్పటివరకు 35 దేశాలకు వెళ్లింది. మరిన్ని దేశాలకు వెళ్లడానికి సన్నద్ధం అవుతోంది. తాజాగా స్కాండినేవియా దేశాల పర్యటనకు సిద్ధం అవుతోంది.

తొలి ప్రయాణం... ఒక ట్రిగ్గర్

తొలి ప్రయాణానికి సంబంధించి పిల్లలు నన్ను ఎంతో ప్రోత్సహించారు. మొదటి ప్రయాణ సమయంలో ఖర్చు గురించి ఆలోచించాను. అయితే విలువైన ప్రయాణ అనుభవాల ముందు ఆ ఖర్చు ఒక లెక్కే కాదని తెలుసుకున్నాను. ప్రయాణాన్ని ఇంత బాగా ఆస్వాదిస్తానని ఊహించలేదు. తొలి ప్రయాణం అనేది నేను ప్రయాణాలను ఇష్టపడేలా చేసిన ఒక ట్రిగ్గర్. ఎప్పుడూ ఉండే ఇంటిని దాటి మనల్ని మనం కనుగొనడంలో ఒక నిర్దిష్ట నిశ్శబ్ద శక్తి ఉంది. నేను చాలా ఆలస్యంగా ప్రయాణాలు ప్రారంభించాను. చాలా ముందుగానే మొదలు పెట్టి ఉంటే బాగుండేదనిపిస్తోంది. సోలో ట్రావెల్‌కు చాలామంది వెనకాడుతుంటారు. అయితే మనలో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి అవి ఎంతో ఉపయోగపడతాయి.

– ఇందిర ఎం

అడ్వెంచర్ ఆఫ్ స్టార్స్



పరిణీతి చోప్రా

కొద్దిమంది బాలీవుడ్ సెలబ్రిటీలకు సాహసయాత్రలు అంటే ఎంతో ఇష్టం. వారిలో పరిణీతి చోప్రా ఒకరు. ఆమె స్కూబా డైవర్. పాడి (ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆఫ్ డైవింగ్ ఇన్‌స్ట్రక్టర్స్)కు బ్రాండ్ అంబాసిడర్. తన సముద్ర సాహసయాత్రలను ఆమె 'ధ్యానం'గా అభివర్ణిస్తుంది. ఎన్నో చేపలు, ఎన్నో తాబేళ్లు, పరిచిత, అపరిచిత సముద్ర జీవులు... అండర్ వాటర్‌డైవింగ్ అనుభవాల గురించి సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటుంది పరిణీతి చోప్రా. 'యాత్రలు అంటే ఇష్టం. సాహసయాత్రలు అంటే మరీ ఇష్టం' అంటుంది జాక్వెలిన్ ఫెర్నాండేజ్. ఆమె తన సాహసయాత్రల తాలుకు ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటుంది. మోడల్, నటి లిసా హెడన్‌కు సర్ఫింగ్ అంటే ఇష్టం. 'ఆర్ట్ ఆఫ్ సర్ఫింగ్'లో పట్టా పుచ్చుకుంది. తనకు ఇష్టమైన సర్ఫింగ్ కోసం దేశవిదేశాలలో ఎన్నో ప్రదేశాలకు వెళుతుంటుంది.

బ్యాటిల్‌ఫీల్డ్ టూరిజం

సరికొత్తగా ఆదరణ పొందుతున్న ట్రావెల్ ట్రెండ్స్‌లో బ్యాటిల్‌ఫీల్డ్ ట్రెండ్ ఒకటి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో దేశం కోసం ఎంతోమంది యోధులు పోరాడిన ఎన్నో ప్రదేశాలు, వాటి విశేషాలు తెలుసుకోవడానికి పర్యాటకులు ఇష్టపడుతున్నారు. తుపాకుల మోతతో ప్రతిధ్వనించిన కొండలు, లోయలు, యోధులు నివసించిన ఊళ్లు చూడడానికి ఇష్టపడుతున్నారు. చరిత్ర, సాహసం, దేశభక్తిని మిళితం చేసే ట్రావెల్ ట్రెండ్ ఇది. బ్యాటిల్‌ఫీల్డ్ టూరిజాన్ని ఇష్టపడేవారి కోసం రక్షణ మంత్రిత్వశాఖ, పర్యాటక మంత్రిత్వ శాఖ 'భారత్ రణభూమి' యాప్‌ను రూపొందించింది. 2025 ట్రావెల్ ట్రెండ్స్‌లో రిజెనరేటివ్ టూరిజం (టూరిజం ప్లస్ సస్టేనబుల్ టూరిజం), స్లీప్ టూరిజం (తగినంత నిద్ర కోసం), ఫెస్టివ్ టూరిజం (పండగల సందర్భంగా ప్రముఖ ఆలయాల ప్రయాణం)... ఇలాంటి ఎన్నో పాపులర్ అయ్యాయి.



దృష్టి లోపం ఉన్న వ్యక్తులు పరిసరాలను నావిగేట్ చేయడానికి ప్రత్యూష, ఐశ్వర్య 'స్పేస్‌ఫెల్ట్' అనే పేరుతో అప్లికేషన్‌ను రూపొందించారు. దృష్టి లోపం సమస్యతో బాధపడిన ప్రత్యూష, ఐశ్వర్యలు కలిసి ఈ అప్లికేషన్‌ను రూపొందించారు. హైదరాబాద్‌లో గ్రెయల్ మేకర్ ఇన్నోవేషన్ ద్వారా వీరు తమ సేవలను నాలుగేళ్లుగా అందిస్తున్నారు. పిల్లలు ఇంట్లోనే ఉండి చూపును పెంచుకునేందుకు, వారి తల్లిదండ్రులకు 'విజన్ నానీ డిజిటల్ యాప్' ద్వారా పనులను సులభతరం చేస్తున్నారు.

చూపున్న యాప్



ప్రత్యూష – ఐశ్వర్య

దృష్టి లోపం ఉన్న చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు సాంకేతికంగా ఉపయోగపడేలా తమ జీవన ప్రయాణాన్ని మార్చుకున్నారు స్పేస్‌ఫెల్ట్, విజన్ నానీ యాప్ ఫౌండర్స్ ప్రత్యూష, ఐశ్వర్య.

పిల్లల మెరుగైన భవిష్యత్తుకు

తమ వర్క్ గురించి ప్రత్యూష మాట్లాడుతూ – ''కార్టికల్ విజువల్ ఇంపెయిర్‌మెంట్ ఉన్న పిల్లలు, ఏదైనా కారణాల వల్ల మెదడు పనితీరులో లోపాలు ఉన్నా వారు చూసింది త్వరగా అర్థం చేసుకోలేరు. చదువుతో పాటు జీవనంలో వెనకబడిపోతుంటారు. ఇలాంటప్పుడు వారి తల్లితండ్రులు స్పెషల్ సెంటర్స్ కోసం వెతుకుతుంటారు. హైదరాబాద్‌తో పాటు కొన్ని ప్రధాన పట్టణాలలోనే ఈ సెంటర్లు, అవీ చాలా తక్కువ శాతంలో ఉంటాయి. అలాంటి తల్లితండ్రులు పిల్లల భవిష్యత్తు కోసం ఉన్న చోటును వదులుకొని నగరాలకు వలస వెళ్లాల్సి ఉంటుంది. దీనివల్ల వారి కుటుంబం మొత్తం ఇబ్బందులు పడుతుంటుంది. అందుకని, 'విజన్ నానీ' పేరుతో దృష్టి లోపం ఉన్న పిల్లల కోసం డిజిటల్ ప్రొడక్ట్‌ను రూపొందించాం. తమ ఇంటినుంచే బాల్య అంధత్వానికి కారణమేంటో తెలుసుకునేలా, వారికి సరైన మార్గదర్శకం చూపేలా దీనిని తయారు చేశాం.

దీనిని తమ స్మార్ట్ ఫోన్ ద్వారా ఎక్కడి నుంచైనా యాక్సెస్ చేయవచ్చు. కమ్యూనిటీ సెంటర్లలో కూడా వీటిని ఉపయోగిస్తున్నాం. తల్లిదండ్రులకు, సంరక్షకులకు, స్పెషల్ టీచర్స్‌కు అనుకూలమైన విజన్ థెరపీ యాక్సెస్‌ను కూడా ఈ యాప్ అందిస్తుంది.

స్వయంగా అర్థం చేసుకొని...

చిన్నప్పుడు నేను చూపు సమస్యలను ఎదుర్కొన్నాను. దీంతో చదువులో వెనకబడేదాన్ని. మా అమ్మ నా సమస్యను నివారించడానికి చాలా ప్రయత్నాలు చేసింది. పెద్దయ్యాక నాలాంటి వారికోసం ఉపయోగపడే పనిచేయాలని అనుకునేదాన్ని. అందుకే ఎంతో కష్టపడి పట్టుదలతో ఐఐటీ హైదరాబాద్‌లో బయోటెక్నాలజీ డిగ్రీ చేశాను. విజన్ సమస్య ఉన్నవారు టెక్నాలజీ ఉపయోగించడంతో ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో తెలుసుకోవాలని, ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో వాలెంటీర్‌గా చేరాను. అక్కడ దృష్టి లోపంతో వచ్చే పిల్లల సమస్యలను స్వయంగా చూస్తూ అర్థం చేసుకునేదాన్ని. వాస్తవానికి విజన్ థెరపీకి 3–5 ఏళ్ల వరకు క్రమం తప్పకుండా రావాలి.

కానీ, తల్లిదండ్రులకు కుదరక మిస్ చేసేవారు. దీంతో వారి సమస్య అలాగే ఉండేది. ఇంటి నుంచే వారి సమస్యను పరిష్కరించే విధానం ఉంటే బాగుంటుందనుకున్నాం. ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లోనే ఐశ్వర్య పరిచయం అయ్యింది. తను 18 ఏళ్ల వయసులో బ్రెయిన్ ట్యూమర్ వల్ల చూపు కోల్పోయింది. కోలుకున్నాక చూపు లేని వారికి సాయం చేయాలనుకుంది. తను ఎదుర్కొన్న సంఘటనలను, తనకు ఎదురైన అనుభవాలను తెలుసుకొని, ఈ డిజిటల్ ప్రొడక్ట్‌ని డెవలప్ చేశాం. ఇప్పటి వరకు 7000 మంది పిల్లలు ఈ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి, విదేశాల నుంచి కూడా ఈ యాప్‌కి యూజర్స్ ఉన్నారు.

సమస్యకు పరిష్కారం

నాకు సమస్య ఉన్నప్పుడు మా అమ్మ నాకు చాలా సాయంగా ఉన్నారు. అందరికీ ఆ సపోర్ట్ ఉండకపోవచ్చు. వాలెంటీర్‌గా చేసినప్పుడు అక్కడికి వచ్చిన పిల్లలను చూసి చాలా బాధనిపించేది. టెక్నాలజీ పరంగా మనం ఎంతో ప్రగతి సాధిస్తున్నాం. కానీ, మన పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యను తీర్చలేకపోతున్నాం అనిపించింది. టెక్నాలజీని ఉపయోగించే దృష్టి లోపంతో బాధపడుతున్నవారికి పరిష్కారం కనుక్కోవాలని ఈ యాప్‌ను తీసుకువచ్చాం.

– ప్రత్యూష

పనులు సులువయ్యాయి

దృష్టిలోపంతో జీవిస్తున్న వ్యక్తిగా నేను ఎదుర్కొన్న సమస్యలు ఏంటో నాకు బాగా తెలుసు. నాలాంటి వారు ఆ సమస్యలను ఎదుర్కోకూడదు అనే ఆలోచన నుంచి ఈ యాప్‌ని డిజైన్ చేశాం. పబ్లిక్ టాయిలెట్లు, మ్యూజియం.. మొదలైన ప్రదేశాలకు వెళ్లినప్పుడు వారు 'క్యూఆర్' కోడ్ సాయంతో ఇబ్బందులు లేకుండా సందర్శించవచ్చు. పిల్లల్లో కంటి సమస్య ఉన్నవారి పేరెంట్స్‌కి ఇప్పుడు వర్క్ సులువుగా మారింది. అదే విషయాన్ని రివ్యూస్ ద్వారా తల్లిదండ్రులు తెలియజేస్తుంటే చాలా ఆనందంగా అనిపిస్తుంది.

– ఐశ్వర్య

పబ్లిక్ ప్లేసులో క్యూఆర్

చూపులేని వారిని బయటకు తీసుకెళ్లినప్పుడు, అక్కడ పబ్లిక్ వాష్‌రూమ్ వరకు ఒకరు తోడుగా వెళ్లినా, ఆ డోర్ వరకు తీసుకెళ్లి వదిలేస్తారు. కానీ, వారు వాష్‌రూమ్‌లో చాలా ఇబ్బంది పడతారు. ఇలాంటప్పుడు యాప్‌లోని క్యూఆర్ కోడ్ (మనీ పే యాప్స్ ఏ విధంగా వాడతారో అలా)ని ఉపయోగించి, లోపల వాష్‌రూమ్‌లో ఏ వస్తువులు ఎక్కడ, ఏ డైరెక్షన్‌లో ఉన్నాయో తెలుసుకోవచ్చు. ఇదేవిధంగా పబ్లిక్ ప్లేస్‌లో ఉన్న లొకేషన్స్, ఆడియో విని, ఎవరి సాయం లేకుండానే వాటిని ఉపయోగించవచ్చు. మ్యూజియంకు వెళితే చూపులేనివారికి అక్కడ ఏమీ తెలియదు. యాప్ క్యూఆర్ కోడ్ ను ఉపయోగిస్తే ఆడియో విని అక్కడి స్టోరీ తెలుసుకోవచ్చు. దీనిని లాంచ్ చేసింది చూపులేనివారికోసమే అయినా ఇప్పుడు ఈ యాప్ మిగతావారికీ ఉపయోగపడుతోంది. హైదరాబాద్‌లో ఉన్న అభయ స్వచ్ఛంద సంస్థ, ఎల్.వి.ప్రసాద్ వారితో కలిసి వర్క్ చేస్తున్నాం'' అని వివరించారు ఈ యాప్ డెవలపర్.

– నిర్మలారెడ్డి

స్మారెస్ట్ కిడ్

భలే బాలుడు!





ఐస్‌క్రీమ్ తిన్నంత వీజీగా కోడింగ్ చేస్తాడు. చందమామ కథలు చెప్పినంత తేలికగా జటిలమైన సాంకేతిక విషయాలు చెబుతాడు. ఇంతకీ ఈ బుడతడి వయసు ఎంతనుకుంటున్నారా? అక్షరాలా ఆరు సంవత్సరాలు మాత్రమే!

ఆరు సంవత్సరాల అగ్ని వి 'ఇండియాస్ స్మార్టెస్ట్ కిడ్'గా పేరు తెచ్చుకున్నాడు. పెద్దవాళ్లకే కష్టం అనిపించే ఎన్నో విద్యలలో నైపుణ్యం సాధించాడు. కోడింగ్ రాసే నైపుణ్యం ఉన్న అగ్ని వి రోబోటిక్స్ తరగతులకు హాజరవుతుంటాడు. క్వాంటమ్ ఫిజిక్స్ కాన్సెప్ట్‌ల గురించి చర్చిస్తుంటాడు.

లైట్లు, సెన్సర్‌లు, మోటర్‌లు కంట్రోల్ చేసే చిన్న ఎలక్ట్రానిక్ బోర్డ్‌కు ప్రోగ్రామింగ్ చేశాడు.

'సోషల్ మీడియా సెన్సేషన్‌గా మారాడు. సోషల్ మీడియాలో అగ్ని వికి పది లక్షల మంది ఫాలోవర్‌లు ఉన్నారు. రణ్‌వీర్ అల్లాబాదియాతో ఈ బాలుడు చేసిన పాడ్‌కాస్ట్ పాపులర్ అయింది. 'ఇస్రో'తో కలిసి పనిచేయాలనేది అగ్ని వి లక్ష్యం. ఎఫ్ఐ రేసర్, ఆస్ట్రోనాట్ కావాలనేది భవిష్యత్ కల.

బతుకమ్మ సద్దులు

వంటిల్లు

సద్దుల బతుకమ్మ రోజున అమ్మవారికి నైవేద్యంగా సమర్పించే వంటకాలు ప్రాంతాల వారీగా ఉంటాయి. మొక్కజొన్నలు, జొన్నలు, సజ్జలు, మినుములు, శనగలు, పెసర్లు, పల్లీలు, నువ్వులు, గోధుమలు, పుట్నాలు, బియ్యం.. తో వంటలు చేస్తారు. సద్దుల బతుకమ్మకు నైవేద్యాలు ఈ వారం వంటిల్లు.

పొడులతో సద్దులు..




కావల్సినవి

- అన్నం – 3 కప్పులు
- నువ్వులు, వేరుశనగలు, ఎండు కొబ్బరి (వేయించి, పొడులు అర కప్పు చొప్పున) – పొడులకు, కారం, ఉప్పు కలుపుకోవచ్చు.

తయారి

ఒక్కో కప్పు అన్నానికి ఒక్కో అరకప్పు రకం పొడి కలిపి సద్దులను సిద్ధం చేసుకోవాలి. అవసరమైతే శనగపప్పు, పల్లీలు, కరివేపాకు, ఎండుమిర్చి వేసిన పోపును కలుపుకోవచ్చు.

సజ్జ ముద్దలు / సజ్జ లడ్డూలు



కావల్సినవి: సజ్జల పిండి – 2 కప్పులు; బెల్లం – కప్పు (తురిమినది); సోంపు – 2 టీ స్పూన్లు; నెయ్యి – 2 టీ స్పూన్లు

తయారి: సజ్జ పిండిలో తగినన్ని నీళ్ల కలిపి, ముద్ద చేయాలి. తగినంత ముద్ద తీసుకొని, చపాతీ చేసినట్టుగా రొట్టె చేసి, పెనం మీద వేసి కాల్చాలి. మరీ గట్టిగా కాకుండా రెండువైపులా కాల్చి, ప్లేట్‌లో వేయాలి. వేడిగా ఉండగానే చేత్తో రొట్టెను చిన్న చిన్న ముక్కలు చేసి, (చేత్తో చేయలేని వారు రోట్లో రొట్టె, బెల్లం వేసి దంచవచ్చు) బెల్లం, సోంపు, నెయ్యి వేసి, గట్టిగా అదుముతూ లడ్డూలు కట్టాలి. ఇలా తయారుచేసిన సజ్జ ముద్దలను అమ్మవారికి నైవేద్యంగా పెడతారు.

వీటిలో ఐరన్ పుష్కలంగా లభిస్తుంది. అందుకని చిన్నపిల్లలు, గర్భవతులకు తప్పక పెడతారు. 3–4 రోజుల వరకు నిల్వ ఉంటాయి. కొన్ని ప్రాంతాల్లో సజ్జ రొట్టెకు బదులుగా గోధుమ రొట్టెతో ముద్దలు కడతారు.

పెరుగన్నం



కావల్సినవి: కప్పు అన్నం, కప్పు పెరుగు, తగినంత ఉప్పు

తయారి: అన్నంలో పెరుగు, ఉప్పు వేసి కలపాలి. చివరగా బాణలిలో కొద్దిగా నెయ్యి/నూనె వేసి పోపు పెట్టుకోవాలి. అదనంగా జీడిపప్పు చేర్చుకోవచ్చు.

పరమాన్నం



కావల్సినవి: కప్పు – బియ్యం; మూడు – కప్పుల పాలు; కప్పు– నీళ్లు; కప్పు – బెల్లం; మూడు టీ స్పూన్లు – నెయ్యి;

తయారి: అన్నం ఉడుకుతుండగా దాంట్లో తరిగిన బెల్లం, నెయ్యి వేసి, పాలు పోసి, మరికాసేపు ఉడికించి దించాలి. నెయ్యిలో వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ పరమాన్నంలో కలపాలి.

బ్యూటిప్స్



ముఖంపై బ్లాక్‌హెడ్స్ పోవాలంటే... క్యారట్ తురుములో పంచదార పొడి, ఉప్పు కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకుని చేతి వేళ్ళతో ముఖంపై వలయాకారంలో మసాజ్ చేయాలి. ఇలా చేస్తే ముఖంపై ఉన్న బ్లాక్ హెడ్స్, వైట్ హెడ్స్ మటుమాయమవుతాయి.

నయా ట్రెండ్

5120×1080 అల్ట్రా వైడ్

'థిన్నెస్ట్ వీడియో' అనేది ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ లేటెస్ట్ ట్రెండ్. 5120×1080 అల్ట్రా-వైడ్, పనోరమ స్ట్రిప్ ట్రెండ్ అని కూడా పిలుస్తున్నారు. సాధారణ వీడియోల టాప్, బాటమ్‌లను కట్ చేసి స్లిమ్, లాంగ్ స్ట్రిప్ ఫామ్‌తో సినిమాటిక్ రీల్ క్రియేట్ చేయడమే ఈ ట్రెండ్. వీడియోలను ల్యాండ్ స్కేప్ మోడ్, హై రిజల్యూషన్‌లో షూట్ చేయాల్సి ఉంటుంది.

పాత వీడియోలను కొత్తగా మెరిపించడానికి క్రియేటర్స్ ఈ ట్రెండ్‌లో భాగం అవుతున్నారు. పెద్ద పెద్ద బ్రాండ్‌లు కూడా ఈ ట్రెండ్‌ను ఫాలో కావడం విశేషం.



ఈ ట్రెండ్‌లో మీరు కూడా భాగం కావాలనుకుంటే ఇలా చేయండి...

- ల్యాండ్ స్కేప్ మోడ్, హైరిజల్యూషన్‌లో షూట్ చేయాలి. 5120×1080 పిక్సెల్స్ సెట్ చేయడానికి క్యాప్‌కట్, అడోబ్ ప్రీమియర్ ప్రో, ఇన్‌షాట్‌లాంటి వీడియో ఎడిటింగ్ యాప్‌లను ఉపయోగించాలి.
- అల్ట్రా-వైడ్ హారిజాంటల్ బ్యాండ్‌లో ఫిట్ కావడానికి ముఖ్యమైన భాగాన్ని హైలైట్ చేస్తూ వీడియో క్రాప్ చేయాలి
- కలర్ గ్రేడింగ్, ట్రెండింగ్ సౌండ్ ట్రాక్స్ యాడ్ చేయాలి.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
సెప్టెంబర్ 26న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,19,110	బంగారం (24 క్యారెట్లు)	1,16,830	బంగారం (24 క్యారెట్లు)	1,14,880
బంగారం (22 క్యారెట్లు)	1,12,000	బంగారం (22 క్యారెట్లు)	1,05,300	బంగారం (22 క్యారెట్లు)	1,05,300
వెండి	1,45,000	వెండి	1,41,300	వెండి	1,53,000

రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,16,380	బంగారం (24 క్యారెట్లు)	1,18,500	బంగారం (24 క్యారెట్లు)	1,15,090
బంగారం (22 క్యారెట్లు)	1,08,460	బంగారం (22 క్యారెట్లు)	1,09,020	బంగారం (22 క్యారెట్లు)	1,05,500
వెండి	1,41,300	వెండి	1,43,500	వెండి	1,53,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

స్టాక్ మార్కెట్లు (తెలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
733	236
80,426	24,655

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్డాక్	22,446	△	61
డోజోన్స్	46,282	△	335
ఎఫ్టీఎస్ఈ 100	9,280	△	66
డాక్స్	23,734	△	199
హాంగ్సెంగ్	3,828	▽	25
నికాయ్	45,355	▽	400

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		88.35	89.37
£	బ్రిటన్ పౌండ్		117.17	120.14
€	యూరో		102.36	105.15
¥	జపాన్ యెన్ (100)		59.28	60.80
AU$	ఆస్ట్రేలియా డాలర్		57.29	59.57
S$	సింగపూర్ డాలర్		66.32	70.01
SAR	సౌదీ రియాల్		22.77	24.27
UAE D	యూఏఈ దిర్హామ్		23.28	24.52
¥	చైనా యువాన్		11.56	13.38

మన ఫార్మాపై ప్రభావం ఉండదు..

- అమెరికా టారిఫ్‌లు పేటెంట్, బ్రాండెడ్ ఉత్పత్తులకే పరిమితం
- నిపుణులు, పరిశ్రమ వర్గాల వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధాల దిగుమతులపై అక్టోబర్ 1 నుంచి వంద శాతం సుంకాలు విధించాలన్న అమెరికా నిర్ణయంతో మన కంపెనీలపై తక్షణ ప్రభావం పడే అవకాశమేమీ ఉండకపోవచ్చని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. ఈ నిబంధన కేవలం పేటెంట్, బ్రాండెడ్ ఉత్పత్తులకే తప్ప జనరిక్ ఔషధాలకు కాదని వివరించాయి. చౌకైన, అత్యంత నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తూ అంతర్జాతీయంగా ఔషధాల సరఫరా వ్యవస్థకి భారత్ మూలస్తంభంగా నిలుస్తోందని, 47 శాతం అమెరికా ఔషధ అవసరాలను తీరుస్తోందని ఫార్మా ఎగుమతుల ప్రోత్సాహక మండలి ఫార్మెక్సిల్ చైర్మన్ నమిత్ జోషి తెలిపారు. టారిఫ్‌ల ప్రభావం మన మీద ఉండకపోవచ్చని పేర్కొన్నారు. 'మనం చాలా మటుకు జనరిక్స్‌నే అందిస్తున్నందున పేటెంట్, బ్రాండెడ్ ఫార్మా దిగుమతులపై ప్రతిపాదిత 100 శాతం టారిఫ్‌లు భారత ఎగుమతులపై తక్షణ ప్రభావమేమీ చూపకపోవచ్చు. అంతేగాకుండా పలు బడా భారతీయ కంపెనీలు ఇప్పటికే అమెరికాలో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. తయారీ ప్లాంట్లు లేదా రీప్యాకేజింగ్ యూనిటను నిర్వహించడంతో పాటు ఇతర సంస్థల కొనుగోలు అవకాశాలను కూడా పరిశీలిస్తున్నాయి' అని నమిత్ జోషి వివరించారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ (ఐపీఏ) కూడా మన ఫార్మాపై అమెరికా టారిఫ్‌ల తక్షణ ప్రభావమేమీ ఉండదని తెలిపింది. ఐపీఏ సెక్రటరీ జనరల్ సుదర్శన్ జైన్ ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, సన్ ఫార్మా తదితర 23 దేశీ దిగ్గజాలకు ఐపీఏలో సభ్యత్వం ఉంది. వీటికి ఔషధ ఎగుమతుల్లో దాదాపు 80 శాతం, దేశీ మార్కెట్లో సుమారు 64 శాతం వాటా ఉంది.

కొత్త అవకాశాలపై ఇన్వెస్ట్ చేయాలి ..

రాబోయే రోజుల్లో బల్క్ డ్రగ్స్, ఏపీఐలకు (యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియంట్స్) సంబంధించిన వ్యయాలను మరింతగా తగ్గించుకుంటే ఇతర సరఫరాదారుల కన్నా భారత్ వైపే అమెరికా మరింతగా మొగ్గు చూపడానికి అవకాశం ఉందని జోషి చెప్పారు. అలాగే సంక్లిష్టమైన జనరిక్స్, పెప్టైడ్స్, బయోసిమిలర్స్ మొదలైన విభాగాల్లో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడంపై కూడా ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. అమెరికాకు తమ ఎగుమతులు పెద్దగా లేనందున టారిఫ్‌ల ప్రభావం ఎక్కువగా ఉండదని ఎమ్‌క్యూర్ ఫార్మా తెలిపింది. భారత ఫార్మా కంపెనీల జనరిక్ ఔషధాల సరఫరాతో 2022లో అమెరికా హెల్త్‌కేర్ వ్యవస్థకు 219 బిలియన్ డాలర్లు, 2013–2022 మధ్య కాలంలో 1.3 లక్షల కోట్ల డాలర్ల మేర ఆదా అయిందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. వచ్చే అయిదేళ్లలో మరో 1.3 లక్షల కోట్ల డాలర్లు ఆదా అవుతుందనే అంచనాలు ఉన్నట్లు పేర్కొన్నాయి.

ఫార్మెక్సిల్ గణాంకాల ప్రకారం 2024–25లో అమెరికాకు భారత ఫార్మా ఎగుమతులు 30.47 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

జనరిక్స్ మన బలం..

భారత్ బలం జనరిక్ ఔషధాలని, వీటికి టారిఫ్‌ల నుంచి మినహాయింపు ఉన్నందున భారత్‌పై ప్రభావం ఉండదని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా వీపీ దీపక్ జోత్వానీ తెలిపారు. అయితే, అమెరికా వెలుపల ఉంటూ, ఆ దేశానికి ఎగుమతి చేసే బ్రాండెడ్ డ్రగ్ కంపెనీలతో కొన్ని భారతీయ ఫార్మా సంస్థలకు సంబంధాలు ఉన్నాయని చెప్పారు. కాబట్టి సదరు కంపెనీలకు యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ)లాంటివి సరఫరా చేసే మన కంపెనీలపై పరోక్షంగా ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అటు ప్రధానంగా జనరిక్స్‌నే ఎగుమతి చేస్తుంది కాబట్టి భారత్‌పై టారిఫ్‌ల ఎఫెక్ట్ ఉండదని, కాకపోతే ఈ పరిణామం, భవిష్యత్తులో దేశీయంగా ఫార్మా పరిశ్రమ అభివృద్ధికి సవాళ్లు ఎదురు కావొచ్చని సూచిస్తోందని ఫౌండేషన్ ఫర్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ వ్యవస్థాపకుడు రాహుల్ అహ్లువాలియా చెప్పారు. ఈ నేపథ్యంలో మన కంపెనీలకు పెద్ద మార్కెట్లు అందుబాటులోకి వచ్చే దిశగా అమెరికా, యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవడంపై మరింతగా దృష్టి పెట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అటు అమెరికా వినియోగదారులపై టారిఫ్‌ల భారం మరీ ఎక్కువగా ఉండకుండా కొన్ని కేటగిరీలను మినహాయిస్తూ, తదుపరి చర్యలు ఉండొచ్చని అడ్వైజరీ సేవల సంస్థ ఆక్స్‌ఫర్డ్ ఎకనమిక్స్ హెడ్ లూయిస్ లూ తెలిపారు.

మరణించిన వారి ఖాతాలకు ఇక సత్వర పరిష్కారం



- బ్యాంక్‌లకు 15 రోజుల గడువు
- ఆలస్యం చేస్తే పరిహారం చెల్లించాలి
- ఆర్‌బీఐ కొత్త నిబంధనలు

ముంబై: మరణించిన వ్యక్తులకు సంబంధించి డిపాజిట్ ఖాతాలు, లాకర్ల క్లెయిమ్‌లను 15 రోజుల్లోగా పరిష్కరించాలంటూ ఆర్‌బీఐ కొత్త నిబంధనలు ప్రకటించింది. ఆలస్యం చేస్తే నామినీలకు పరిహారం చెల్లించాలని పేర్కొంది. మరణించిన వ్యక్తుల ఖాతాల క్లెయిమ్‌ల విషయంలో బ్యాంకులు భిన్నమైన పద్ధతులను అనుసరిస్తుండడంతో సేవల నాణ్యతను పెంచే దిశగా ఆర్‌బీఐ ఏకరూప నిబంధనలు తీసుకొచ్చింది. వీటిని సాధ్యమైనంత త్వరగా, 2026 మార్చి 31లోపు అమలు చేయాల్సి ఉంటుందని ఆర్‌బీఐ పేర్కొంది. నామినేషన్ లేదా సర్వైవర్‌షిప్‌తో డిపాజిట్ ఖాతా తెరిచినట్టయితే.. సంబంధిత డిపాజిటర్ మరణానంతరం నామినీ లేదా సర్వైవర్‌షిప్‌కు బ్యాలన్స్‌ను బదిలీ చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఖాతాలకు నామినీ లేదా సర్వైవర్‌షిప్ క్లాజు లేకపోతే.. నిర్దేశిత మొత్తం లోపు బ్యాలన్స్ ఉన్న సందర్భాల్లో సులభతర చెల్లింపుల నిబంధనలు పాటించాలని ఆర్‌బీఐ పేర్కొంది. కోఆపరేటివ్ బ్యాంకులకు ఈ పరిమితిని రూ.5 లక్షలు, ఇతర బ్యాంక్‌లకు ఇది రూ.15 లక్షలుగా నిర్ణయించింది. అంటే మరణించిన వ్యక్తి ఖాతాలకు సంబంధించిన బ్యాలన్స్ ఇంతకులోపు ఉండి, నామినేషన్ లేదా సర్వైవర్‌షిప్ నమోదు లేని సందర్భాల్లో బ్యాంకులు వారసులకు సులభతర క్లెయిమ్‌కు వీలు కల్పించాల్సి ఉంటుంది. ఈ పరిమితికి మించి బ్యాలన్స్ ఉంటే అప్పుడు సక్సెషన్ సర్టిఫికెట్ లేదా లీగల్ హైయిర్ (చట్టబద్ధ వారసులుగా ధ్రువీకరణ) సర్టిఫికెట్‌ను బ్యాంక్‌లు అడగొచ్చు. క్లెయిమ్ నమోదు చేసి, డాక్యుమెంట్లు సమర్పించిన నాటి నుంచి 15 రోజుల్లో బ్యాంకులకు పరిష్కరించాలి. జాప్యానికి కారణాలు బ్యాంకుల వైపు ఉంటే, డిపాజిట్ ఖాతాలోని బ్యాలన్స్‌పై బ్యాంక్ రేటుకు అదనంగా 4% చొప్పున వార్షిక వడ్డీని చెల్లించాల్సి ఉంటుంది. లాకర్‌కు సంబంధించి క్లెయిమ్‌ను జాప్యం చేస్తే రోజుకు రూ.5,000 చొప్పున చెల్లించాలని ఆర్‌బీఐ పేర్కొంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
జీఎస్‌టీ కోతతో షాపింగ్ సందడి | మళ్లీ ఐపీవోల హవా

బీఎస్ఎన్ఎల్ 'స్వదేశీ' 4జీ నెట్‌వర్క్

నేడు ప్రారంభించనున్న ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్‌ను ప్రధాని నరేంద్ర మోదీ నేడు (శనివారం) ప్రారంభించనున్నారు. దీనితో టెలికం పరికరాలను పూర్తిగా దేశీయంగానే ఉత్పత్తి చేసుకుంటున్న చైనా, డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియా సరసన అయిదో దేశంగా భారత్ కూడా చేరనుంది. బీఎస్ఎన్ఎల్‌కి చెందిన 97,500 మొబైల్ 4జీ టవర్లను ఒరిస్సాలోని ఝర్సుగూడలో ప్రధాని ప్రారంభిస్తారని, ఇది భారతీయ టెలికం రంగానికి ఒక కొత్త శకంలాంటిదని కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఇందులో 92,600 మొబైల్ సైట్లు పూర్తిగా స్వదేశీ 4జీ టెక్నాలజీతో రూపొందినవని, వీటిని 5జీకి అప్‌గ్రేడ్ చేయొచ్చని ఆయన పేర్కొన్నారు. కోర్ నెట్‌వర్క్ సిస్టమ్‌ను సీ–డాట్, రేడియో యాక్సెస్ నెట్‌వర్క్ (ర్యాన్) సిస్టమ్‌ను తేజస్ నెట్‌వర్క్ రూపొందించగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) వీటిని అనుసంధానం చేసింది. మరోవైపు, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్, భారతి ఎయిర్‌టెల్ కలిసి 4,700 మొబైల్ 4జీ టవర్లను ఇన్‌స్టాల్ చేశాయి. ఈ టవర్లతో మారుమూల, సరిహద్దు ప్రాంతాల్లోని 26,700 గ్రామాలకు కవరేజీ లభిస్తుంది. తద్వారా ఇరవై లక్షల మంది పైగా సబ్‌స్క్రయిబర్స్‌కి సర్వీసులు అందుతాయి.

3 వారాల కనిష్టానికి సూచీలు

- సుంకాల విధింపుతో ఫార్మా షేర్లలో అమ్మకాలు
- యాక్సెంచర్ అంచనాల కోతతో ఐటీ షేర్లు డీలా
- సెన్సెక్స్ 733 పాయింట్లు క్రాష్...



ముంబై: ఫార్మా దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్100% దిగుమతి సుంకాలు విధింపుతో శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్ దాదాపు 1% నష్టపోయింది. సెన్సెక్స్ 733 పాయింట్లు క్షీణించి 80,426 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 236 పాయింట్లు కోల్పోయి 24,655 వద్ద నిలిచింది. ఈ ముగింపు ఇరు సూచీలకు 3 వారాల కనిష్ట స్థాయి. గ్లోబల్ ఐటీ దిగ్గజం యాక్సెంచర్ 2026 ఆర్థిక సంవత్సరానికి తన ఆదాయ వృద్ధి అంచనాలు తగ్గించడమూ సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడి పెంచింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ఆందోళనలు కొనసాగాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 827 పాయింట్లు, నిఫ్టీ 262 పాయింట్లు కోల్పోయాయి.

- అక్టోబర్ 1 నుంచి బ్రాండెడ్, పేటెంట్ ఔషధ ఉత్పత్తుల దిగుమతులపై 100% సుంకాలు విధిస్తామంటూ ట్రంప్ ప్రకటనతో ఫార్మా షేర్లు కుప్పకూలాయి. వోక్హార్డ్ 9.4%, ఇండోకో రెమెడీస్ 5.3%, జైడస్ లైఫ్‌సైన్సెస్ 4.2%, గ్లెన్‌మార్క్ ఫార్మా 3%, నాట్కో ఫార్మా 2.6%, సన్‌ఫార్మా 2.5%, లుపిన్, డాక్టర్ రెడ్డీస్ 2% నష్టపోయాయి.
- యాక్సెంచర్ 2026 ఆర్థిక సంవత్సరపు ఆదాయ వృద్ధి, లాభాల అంచనాల తగ్గింపునకు తోడు అమెరికా హెచ్–1బీ వీసా ఫీజు పెంపు ఆందోళనలతో దేశీయ ఐటీ షేర్లలో అమ్మకాల పరంపర కొనసాగింది. ఇంటెలెక్ట్ డిజైన్ అరేనా 7%, ఒరాకిల్ ఫైనాన్స్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ 4.43%, జెన్సార్ టెక్నాలజీస్ 3.59% పతనమయ్యాయి.
- సోలార్ ప్యానల్ తయారీ సంస్థ సాత్విక్ గ్రీన్ ఎనర్జీ లిస్టింగ్ నిరాశపరిచింది. ఇష్యూ ధర (రూ.465) పోలిస్తే బీఎస్ఈలో 1% డిస్కౌంటుతో రూ.460 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 8% పతనమై రూ.427 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 5.44% నష్టంతో రూ. 440 వద్ద స్థిరపడింది.
- జీకే ఎనర్జీ లిస్టింగ్ మెప్పించింది. ఇష్యూ ధర (రూ.153)తో పోలిస్తే బీఎస్ఈలో 8% ప్రీమియంతో రూ.165 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 15% ఎగసినప్పటికీ. చివరికి 10% లాభంతో రూ.168 వద్ద ముగిసింది.




సెమీఫైనల్లో బోపన్న-యుజికి జోడీ

జపాన్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)-టకెరు యుజికి (జపాన్) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. టోక్యోలో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో బోపన్న-యుజికి ద్వయం 7-6 (7/5), 7-6 (7/4)తో మూడో సీడ్ మాక్సిమో గొంజాలెజ్-ఆండ్రెస్ మోల్తెని (అర్జెంటీనా) జోడీని బోల్తా కొట్టించింది. 1 గంట 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో-జపాన్ జంట 17 ఏస్‌లు సంధించడంతోపాటు నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సర్వీస్‌లో 53 పాయింట్లకుగాను 46 పాయింట్లు... రెండో సర్వీస్‌లో 23 పాయింట్లకుగాను 12 పాయింట్లు సాధించింది. మ్యాచ్ మొత్తంలో రెండు జోడీలు తమ సర్వీస్‌లను కాపాడుకోవడంతో ఒక్క బ్రేక్ పాయింట్ కూడా రాలేదు. కీలకమైన టైబ్రేక్‌లలో బోపన్న-యుజికి జోడీ పైచేయి సాధించి విజయాన్ని దక్కించుకుంది. 45 ఏళ్ల బోపన్న ఈ ఏడాది 20వ టోర్నమెంట్ ఆడుతూ తొలిసారి సెమీఫైనల్ దశకు చేరుకోవడం విశేషం.

412 పరుగుల లక్ష్యాన్ని ఛేధించిన భారత్ 'ఎ'

- రెండో అనధికారిక టెస్టులో ఐదు వికెట్లతో ఘనవిజయం
- ఆస్ట్రేలియా 'ఎ' జట్టుపై 1–0తో సిరీస్ సొంతం
- రాహుల్, సాయి సుదర్శన్ శతకాలు


సాయి సుదర్శన్


కేఎల్ రాహుల్

లక్నో: టీమిండియా ప్లేయర్లు కేఎల్ రాహుల్ (210 బంతుల్లో 176 నాటౌట్; 16 ఫోర్లు, 4 సిక్స్‌లు), సాయి సుదర్శన్ (172 బంతుల్లో 100; 9 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో కదంతొక్కడంతో... ఆస్ట్రేలియా 'ఎ'తో జరిగిన రెండో అనధికారిక టెస్టులో భారత్ 'ఎ' జట్టు ఐదు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. 412 పరుగుల లక్ష్యఛేదనలో భారత జట్టు 91.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 413 పరుగులు చేసి నెగ్గింది. భారత ఫస్ట్‌క్లాస్ క్రికెట్ చరిత్రలో ఇది ఆరో అతిపెద్ద ఛేదన. ఫలితంగా రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత 'ఎ' జట్టు 1–0తో చేజిక్కించుకుంది. కెప్టెన్ ధ్రువ్ జురేల్ (66 బంతుల్లో 56; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఓవర్‌నైట్ స్కోరు 169/2తో శుక్రవారం చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్... మానవ్ సుతార్ (5) వికెట్‌ను త్వరగానే కోల్పోయింది. రాహుల్, సుదర్శన్, ధ్రువ్ జురేల్ సాధికారికంగా ఆడటంతో... మన జట్టుకు ఇబ్బంది లేకుండా పోయింది. సెంచరీ చేసిన వెంటనే సుదర్శన్ వెనుదిరగగా... ఇంగ్లండ్ పర్యటన ఫామ్‌ను కొనసాగించిన రాహుల్ ఆసీస్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్నాడు. సెంచరీ చేసేందుకు 136 బంతులు తీసుకున్న అతడు... ఆ తర్వాత 76 పరుగులను కేవలం 74 బంతుల్లోనే సాధించాడు. విజయానికి చేరువైన తర్వాత ధ్రువ్ జురేల్ వెనుదిరిగినా... నితీశ్ కుమార్ రెడ్డి (16 నాటౌట్; 3 ఫోర్లు)తో కలిసి రాహుల్ జట్టును విజయతీరాలకు చేర్చాడు. అంతకుముందు ఆస్ట్రేలియా 'ఎ' జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 420 పరుగులు చేయగా... భారత 'ఎ' జట్టు 194 పరుగులకు ఆలౌటైంది. ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 185 పరుగులు చేసింది. అజేయ సెంచరీతో చెలరేగిన రాహుల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల అనధికారిక వన్డే సిరీస్ మంగళవారం కాన్పూర్‌లో తొలి మ్యాచ్‌తో మొదలవుతుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భారత్ 'సూపర్' విజయం


అభిషేక్

- చివరి మ్యాచ్‌లో స్కోర్లు సమం
- సూపర్ ఓవర్‌లో ఓడిన శ్రీలంక
- నిసాంక సెంచరీ వృథా


'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నిసాంక

దుబాయ్: ఆసియా కప్ టి20 టోర్నీలో లీగ్‌తో పాటు 'సూపర్-4' దశను భారత్ అజేయంగా ముగించింది. శుక్రవారం జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ 'సూపర్ ఓవర్'లో శ్రీలంకపై విజయం సాధించింది. సూపర్ ఓవర్లో 5 బంతులు ఆడిన లంక 2 పరుగులకే పరిమితం కాగా... భారత్ తొలి బంతికే 3 పరుగులు సాధించి గెలిచింది. ఇక **ఆదివారం జరిగే ఫైనల్లో పాకిస్తాన్‌తో భారత్ టైటిల్ కోసం తలపడనుంది.**

అంతకుముందు టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (31 బంతుల్లో 61; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) మరోసారి మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. టోర్నీలో వరుసగా మూడో అర్ధ సెంచరీ నమోదు చేసిన అభిషేక్ ఈసారి గత మ్యాచ్‌లకంటే వేగంగా 22 బంతుల్లోనే ఆ మార్క్‌ను అందుకోవడం విశేషం. మిడిలార్డర్‌లో తిలక్ వర్మ (34 బంతుల్లో 49 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), సంజు సామ్సన్ (23 బంతుల్లో 39; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కూడా కీలక పరుగులు సాధించడంతో జట్టు భారీ స్కోరు నమోదు చేయగలిగింది. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 42 బంతుల్లో 66 పరుగులు జోడించారు. అనంతరం శ్రీలంక 20 ఓవర్లలో 5 వికెట్లకు 202 పరుగులు సాధించింది. పతుమ్ నిసాంక (58 బంతుల్లో 107; 7 ఫోర్లు, 6 సిక్స్‌లు) అద్భుత సెంచరీతో సత్తా చాటగా, కుషాల్ పెరీరా (32 బంతుల్లో 58; 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 70 బంతుల్లోనే 127 పరుగులు జోడించి విజయంపై ఆశలు రేపారు. అయితే చివర్లో భారత బౌలర్లు కట్టడి చేయడంతో లంక విజయలక్ష్యం చేరలేకపోయింది. ఛేదనలో తొలి ఓవర్లోనే కుశాల్ మెండిస్ (0) అవుటైనా... నిసాంక, పెరీరా కలిసి శ్రీలంక ఇన్నింగ్స్‌ను నడిపించారు. భారత బౌలర్లందరినీ సమర్థంగా ఎదుర్కొన్న వీరిద్దరు దూకుడుగా బ్యాటింగ్ చేశారు. ఫలితంగా 10 ఓవర్లలో జట్టు స్కోరు 114 పరుగులకు చేరింది. అయితే గెలుపు దిశగా సాగుతున్న సమయంలో తక్కువ వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయింది. నిసాంక పోరాడినా...జట్టును గెలుపుతీరం చేర్చడంలో విఫలమయ్యాడు. హర్షిత్ వేసిన ఆఖరి ఓవర్లో లంక విజయానికి 12 పరుగులు అవసరం కాగా...11 పరుగులే వచ్చాయి. ఈ మ్యాచ్‌లో బుమ్రా, శివమ్ దూబేలకు విశ్రాంతినిచ్చిన భారత్ తుది జట్టులో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణాలకు చోటు కల్పించింది.

స్కోరు వివరాలు : భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) కమిందు (బి) అసలంక 61; గిల్ (సి అండ్ బి) తీక్షణ 4; సూర్యకుమార్ (ఎల్బీ) (బి) హసరంగ 12; తిలక్ వర్మ (నాటౌట్) 49; సామ్సన్ (సి) అసలంక (బి) షనక 39; పాండ్యా (సి) అండ్ (బి) చమీరా 2; అక్షర్ (నాటౌట్) 21; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి) 202. వికెట్ల పతనం:** 1-15, 2-74, 3-92, 4-158, 5-162. **బౌలింగ్:** తుషార 4-0-43-0, తీక్షణ 4-0-36-1, చమీరా 4-0-40-1, హసరంగ 4-0-37-1, షనక 2-0-23-1, అసలంక 2-0-18-1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) వరుణ్ (బి) హర్షిత్ 107; కుశాల్ మెండిస్ (సి) గిల్ (బి) పాండ్యా 0; కుషాల్ పెరీరా (స్టంప్డ్) సామ్సన్ (బి) వరుణ్ 58; అసలంక (సి) గిల్ (బి) కుల్దీప్ 5; కమిందు (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 3; షనక (నాటౌట్) 22; లియనాగె (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 202. వికెట్ల పతనం:** 1-7, 2-134, 3-157, 4-163, 5-191. **బౌలింగ్:** పాండ్యా 1-0-7-1, అర్ష్‌దీప్ 4-0-46-1, హర్షిత్ 4-0-54-1, అక్షర్ 3-0-32-0, కుల్దీప్ 4-0-31-1, వరుణ్ 4-0-31-1.

సూర్యకుమార్‌పై ఐసీసీ చర్య

- మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా
- శిక్షపై అప్పీల్ చేసిన భారత్
- రవూఫ్‌కు 30 శాతం జరిమానా


సూర్యకుమార్


రవూఫ్

దుబాయ్: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో పాకిస్తాన్‌పై విజయాన్ని భారత సైనికులకు అంకితం ఇస్తున్నట్లుగా భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ చేసిన ప్రకటనపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) స్పందించింది. ఈ వ్యాఖ్య రాజకీయపరమైనదని, ఇది క్రీడా స్ఫూర్తికి విరుద్ధమంటూ అతనిపై చర్య తీసుకుంది. సూర్యకుమార్ మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానాగా విధించింది. సెప్టెంబర్ 14న లీగ్ దశలో పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ ముగిసిన తర్వాత 'పహల్గామ్ ఉగ్రవాద దాడి బాధితులకు మేం అండగా ఉంటాం. మా విజయం భారత సైనికులకు అంకితం' అని సూర్య వ్యాఖ్యానించాడు. క్రీడల్లో ఆర్మీ ప్రస్తావన తీసుకురావడాన్ని ప్రశ్నిస్తూ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఐసీసీకి ఫిర్యాదు చేసింది. గతంలోనూ రాజకీయపరమైన, గాజాపై ఇజ్రాయిల్ దాడివంటి అంశాలపై క్రికెటర్లు స్పందించకుండా ఐసీసీ ఆంక్షలు పెట్టిన విషయాన్ని పీసీబీ తమ ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనపై మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్సన్ విచారణ జరిపారు. రిఫరీ ముందు హాజరైన సూర్యకుమార్ తాను ఎలాంటి తప్పూ చేయలేదని సమాధానమిచ్చాడు. సూర్య వివరణపై విభేదించిన రిఫరీ ఇక ముందు ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని హెచ్చరిస్తూ 30 శాతం జరిమానా విధించారు. ఈ శిక్షపై బీసీసీఐ అప్పీల్ చేసినట్లు సమాచారం. అయితే మళ్లీ ఎప్పుడు విచారణ జరుగుతుందనే విషయంలో స్పష్టత లేదు. ఇక్కడా కూడా సూర్యదే తప్పని నిర్ధారణ అయితే శిక్ష మరింత పెరుగుతుంది.

ఫర్హాన్‌కు హెచ్చరికతో సరి!

సూపర్-4 దశలో భారత్‌తో మ్యాచ్‌లో పాక్ ఆటగాళ్లు హారిస్ రవూఫ్, సాహిబ్‌జాదా ఫర్హాన్ ప్రవర్తన గురించి బీసీసీఐ చేసిన ఫిర్యాదుపై కూడా రిచర్డ్సన్ విచారణ జరిపారు. ప్రేక్షకుల వైపు చూస్తూ యుద్ధంలో భారత విమానాలు కూలినట్లుగా, వాటి సంఖ్య ఆరు అన్నట్లుగా రవూఫ్ పదే పదే సైగలు చేశాడు. తాను కూడా తప్పేమీ చేయలేదని, ప్రేక్షకులను ఉత్సాహపరిచేందుకే అలా చేశానని రవూఫ్ ఇచ్చిన వివరణతో కూడా సంతృప్తి చెందని రిఫరీ అతనికి కూడా 30 శాతం జరిమానా విధించారు. అయితే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న తర్వాత ఏకే-47 తరహాలో బ్యాట్‌ను ఎక్కు పెట్టి సంబరాలు చేసుకున్న ఫర్హాన్‌పై మాత్రం ఎలాంటి చర్య తీసుకోలేదు. తాను అలా చేయడంలో ఎలాంటి దురుద్దేశం లేదని, తాను ఉండే ప్రాంతంలో ఏదైనా సంబరాల సమయంలో ఇలా గన్‌ను సరదాగా ఎక్కు పెడతారని అతను చెప్పాడు. గతంలో ధోని, కోహ్లి కూడా మైదానంలో ఇలాంటిదే చేసిన విషయాన్ని కూడా అతను గుర్తు చేశాడు. దాంతో ఫర్హాన్‌ను రిఫరీ కేవలం హెచ్చరికతో వదిలి పెట్టారు.

ఉద్యోగులకూ 'గ్రీవెన్స్ డే'

- ప్రతి నాలుగో శుక్రవారం సమస్యలు చెప్పుకోవచ్చు
- రెవెన్యూ శాఖలో సీసీఎల్ఏ లోకేశ్ కుమార్ వినూత్న ప్రయత్నం

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులకు కూడా గ్రీవెన్స్ డే నిర్వహించాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది. ఇప్పటికే ఉద్యోగుల గ్రీవెన్స్ డే అమల్లో ఉన్న పంచాయతీరాజ్ శాఖ తరహాలోనే రెవెన్యూ శాఖలోనూ వినూత్న ప్రయోగం చేయాలని ఆ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్ నిర్ణయించారు. ఈ మేరకు ప్రతి నెలలో నాలుగో శుక్రవారాన్ని గ్రీవెన్స్‌డేగా ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో వివిధ హోదాల్లో పని చేస్తున్న రెవెన్యూ శాఖ ఉద్యోగులు తమ సమస్యలను నేరుగా ఆయనకు చెప్పుకోవచ్చు. ఇందుకు గూగుల్‌మీట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గూగుల్‌మీట్‌కు ఒకరోజు ముందుగా ప్రధాన కార్యాలయం నుంచి పంపిన గూగుల్ మీట్ లింక్ అదనపు కలెక్టర్లకు వెళ్తుంది. ఆ నెలలో ఏయే ఉద్యోగి రెవెన్యూ కార్యదర్శితో మాట్లాడాలనుకుంటున్నారో.. అంతకంటే ముందే వారి సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని అదనపు కలెక్టర్లు సేకరిస్తారు. ఈ సమాచారం ఆధారంగా ఎవరెవరు మాట్లాడాలనేది వారే నిర్ణయించి ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన లింక్‌ను సదరు ఉద్యోగికి పంపడంతో పాటు సంబంధింత వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేస్తారు. అలా యాడ్ అయిన ఉద్యోగులతో రెవెన్యూ శాఖ కార్యదర్శి నేరుగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. ఈ మేరకు గ్రీవెన్స్ డే సర్క్యులర్‌ను అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపారు.

నూతన డీజీపీగా శివధర్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

డీజీపీ (హెచ్ఓపీఎఫ్– హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్) ఫుల్ అడిషనల్ చార్జ్‌గా శివధర్‌రెడ్డి ఉంటారని సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన ఆ పోస్టులో కొనసాగుతారన్నారు.

సమర్థుడైన అధికారిగా...

శివధర్‌రెడ్డి స్వస్థలం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తూలేకలాన్ (పెద్దతుండ్ల) గ్రామం. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు హైదరాబాద్‌లో చదువుకున్న శివధర్‌రెడ్డి.. ఉస్మానియా వర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేసి కొంతకాలం అడ్వొకేట్‌గా ప్రాక్టీస్ చేశారు. ఆ తర్వాత సివిల్ సర్వీసెస్ క్లియర్ చేసి 1994లో ఐపీఎస్‌లోకి ప్రవేశించారు. ఏఎస్పీగా విశాఖపట్నంలోని అనకాపల్లి, నర్సీపట్నం, చింతపల్లిలో పని చేశారు. గ్రేహౌండ్స్ స్క్వాడ్రన్ కమాండర్‌గా, బెల్లంపల్లి, ఆదిలాబాద్, నల్లగొండ, శ్రీకాకుళం, నెల్లూరు, గుంటూరు జిల్లాల ఎస్పీగా సేవలందించారు. ఎస్ఐబీలో డీఐజీగా కూడా మావోయిస్టుల అణిచివేతలో కీలక పాత్ర పోషించారు. 2014లో తెలంగాణ రాష్ట్రానికి మొదటి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేశారు. 2016లో గ్యాంగ్‌స్టర్ నయీం ఎన్‌కౌంటర్ ఆపరేషన్ లోనూ కీలకంగా వ్యవహరించారు. ఐక్యరాజ్య సమితి శాంతిపరిరక్షక దళంలో భాగంగా యునైటెడ్ నేషన్స్ మిషన్ ఇన్ కొసావోలో కూడా శివధర్‌రెడ్డి పనిచేశారు. 2007లో మక్కా మసీదులో బాంబు పేలుళ్ల ఘటనలో 14 మంది చనిపోయిన ఘటన తర్వాత హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా అప్పటి ప్రభుత్వం ఆయనను నియమించింది. అత్యంత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన ఆ సమయంలో తీవ్రంగా శ్రమించి, శాంతిభద్రతలను సమర్థంగా కాపాడిన అధికారిగా గుర్తింపు పొందారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆగస్టు 2024లో డీజీపీగా ప్రమోషన్ పొందిన తర్వాత కూడా అదే పోస్టులో కొనసాగుతున్నారు. ఉత్తమ సేవలకు గాను శివధర్‌రెడ్డి గ్యాలంట్రీ మెడల్, పోలీస్ మెడల్, ప్రెసిడెంట్ మెడల్, ఐక్యరాజ్యసమితి మెడల్ సహా అనేక అవార్డులు అందుకున్నారు.



సీఎం చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న శివధర్‌రెడ్డి

పోలీస్‌శాఖలో మరిన్ని కీలక మార్పులు!

సాక్షి, హైదరాబాద్: పోలీస్‌శాఖలో కీలక పోస్టు అయిన డీజీపీ ఎవరన్నదానికి తెరదించుతూ ప్రభుత్వం శివధర్‌రెడ్డికి ఆ బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, పోలీస్‌శాఖలో మరిన్ని కీలక పోస్టులకు బదిలీలు దాదాపు ఖరారైనట్టు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్ సీపీగా కొనసాగుతున్న సీనియర్ ఐపీఎస్ సీవీ ఆనంద్‌కు ఏసీబీ, విజిలెన్స్ డీజీగా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. దీంతో అత్యంత కీలకమైన హైదరాబాద్ కమిషనర్‌గా ఎవరు వస్తారన్న దానిపై పోలీస్‌శాఖలో చర్చ జరుగుతోంది. ఈ పోస్టుకు పోటీలో పలువురు సీనియర్ ఐపీఎస్‌లు ఉన్నా.. ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా ఉన్న వీసీ సజ్జనార్ వైపు ప్రభుత్వం మొగ్గుచూపుతున్నట్టు సమాచారం. శాంతిభద్రతల అడిషనల్ డీజీగా ఉన్న మహేశ్ భగవత్ సైతం హైదరాబాద్ సీపీ రేసులో ఉన్నారు. అదేవిధంగా ఇంటిలిజెన్స్ డీజీగా ప్రస్తుతం ఏసీబీ డీజీగా పనిచేస్తున్న విజయ్‌కుమార్‌ను నియమించే చాన్స్ ఉంది. ఇక అగ్నిమాపక శాఖ డీజీగా ఉన్న వై.నాగిరెడ్డిని ఆర్టీసీ ఎండీగా పంపే అవకాశం ఉన్నట్టు పోలీస్‌శాఖలో చర్చ జరుగుతోంది. వీటితోపాటు మరిన్ని కీలక పోస్టులకు సంబంధించిన బదిలీ ఉత్తర్వులు రెండు మూడు రోజుల్లో వెలువడే అవకాశం ఉంది.

మద్యం షాపుల రిజర్వేషన్లు ఖరారు

- రాష్ట్రవ్యాప్తంగా 393 దుకాణాలు గౌడ్‌లకు, ఎస్సీలకు 262, ఎస్టీలకు 131
- జనరల్ కేటగిరీలో 1834 దుకాణాలు
- కలెక్టర్ల సమక్షంలో డ్రా పద్ధతిలో కేటాయించిన ఎక్సైజ్ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మద్యం షాపులకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. 2025–27 సంవత్సరాలకు దరఖాస్తులను ఆహ్వానించిన 2,620 దుకాణాలకుగాను 786 షాపులను రిజర్వేషన్ కేటగిరీలో చేర్చారు. గౌడ్, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు కేటాయించిన ఈ 786 దుకాణాలకు సంబంధించిన డ్రాలను శుక్రవారం జిల్లాల కలెక్టర్ల సమక్షంలో తీసి రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఇందులో 393 షాపులు గౌడ్ సామాజిక వర్గానికి రిజర్వు కాగా, ఎస్సీలకు 262, ఎస్టీలకు 131 షాపులు దక్కాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే నల్లగొండలో అత్యధికంగా గౌడ్ సామాజిక వర్గానికి 34 దుకాణాలు కేటాయించారు. సిద్దిపేటలో అత్యధికంగా ఎస్సీలకు 19 షాపులు ఖరారు కాగా, కొత్తగూడెం జిల్లాలోని 88 షాపులకు గాను 44 షాపులను ఎస్టీలకే రిజర్వు చేశారు. గద్వాల, శంషాబాద్, సిద్దిపేట, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల ఎక్సైజ్ జిల్లాల్లో ఒక్క షాపును కూడా ఎస్టీలకు రిజర్వు చేయలేదు. ఈ మద్యం దుకాణాల కేటాయింపునకు గురువారం ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. శుక్రవారం నుంచి వచ్చే నెల 18 వరకు దరఖాస్తులను స్వీకరించి అదే నెల 23న డ్రా పద్ధతిలో షాపులు కేటాయించనున్నారు. మద్యం షాపులకు చేసుకునే దరఖాస్తు ఫీజును రూ.3లక్షలుగా నిర్ణయించారు.

నవమి నాటికి తేలకపోతే.. సజీవ సమాధి

- నా చావుకు సీఎం రేవంత్‌రెడ్డిదే బాధ్యత
- మాజీ డీఎస్పీ దోమకొండ నళిని

సాక్షి, యాదాద్రి: మాజీ డీఎస్పీ దోమకొండ నళిని శుక్రవారం ఫేస్‌బుక్‌లో మరో ప్రకటన పోస్టు చేశారు. ఇది తన మరణ వాంగ్మూలంగా ఆమె పేర్కొన్నారు. నవమి నాటికి తన సర్వీస్ సమస్యలు సీఎం రేవంత్‌రెడ్డి తేల్చకపోతే సజీవ సమాధి అవుతానన్నారు. 'చాలామంది అభిమానులు నా జబ్బును ట్రీట్ చేస్తామని నన్ను సంప్రదిస్తున్నారు. వారికి ధన్యవాదాలు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనేది ఆటో ఇమ్యూన్ డిసీజెస్‌లో అత్యంత ప్రమాదకరమైంది. అలోపతిలో దీనికి స్టెరాయిడ్స్ వాడతారు. ఎక్కువ కాలం ఇవి వాడితే కాళ్లు, చేతులు వంకర్లుపోతాయి. అందుకే నేను ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని ఆయుర్వేదం, పంచకర్మ, యోగ, యజ్ఞం వంటి వాటిని ఎంచుకున్నాను. కాబట్టే ఎనిమిదేళ్లయినా అంగవైకల్యం



రాకుండా కాపాడుకున్నాను. నాకు ఈ వ్యాధి తీవ్రస్థాయిలో రావడానికి నాటి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం. రాష్ట్రపతి మెడల్ లక్ష్యంగా డైనమిక్ ఆఫీసర్‌గా పనిచేసిన నన్ను సస్పెండ్ చేయడం, వెంటాడి వేటాడటం నా అన్ని సమస్యలకు మూల కారణం. 21నెలల క్రితం నేనిచ్చిన రిపోర్ట్‌పై ఇంకా చర్య తీసుకోకుండా సీఎం రేవంత్‌రెడ్డి నిర్లిప్తంగా ఉన్నారు. ఇది నన్ను మరింత ఒత్తిగికి గురిచేస్తోంది. ఇదే నా చావుకు దారి తీస్తుందేమో! ఏ ఆఫీసర్‌నైనా సస్పెండ్ చేస్తే 6 నెలల్లోపు ఎంక్వైరీ పూర్తి చేయాలి. అలా చేయకపోతే 7వ నెల నుంచి పూర్తి జీతం ఇవ్వాలి. ఈ పనిని ప్రభుత్వం చేయలేదు. కేసీఆర్ కూడా నా విషయం పట్టించుకోలేదు. నవమి నాటికి నా విషయం ఎటూ తేలకపోతే సజీవ సమాధి అవుతాను'అని తన పోస్టులో పేర్కొన్నారు.

ట్రంప్ ఫార్మా షాక్

▶ మొదటి పేజీ తరువాయి

సుంకాల దెబ్బకు ఇళ్ల ధరలు ఎగబాకడంతో పాటు అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగేందుకు దారితీస్తుందనేది ఆర్థిక నిపుణుల మాట!

జాతీయ భద్రత సాకు...

ఔషధాలు, కిచెన్ క్యాబినెట్లు, సోఫాలు ఇతరత్రా ఫర్నిచర్, భారీ ట్రక్కులపై దిగుమతి సుంకాల విధింపునకు జాతీయ భద్రత, ఇతరత్రా కారణాలను ట్రంప్ సాకుగా చూపడం విశేషం. అయితే, అమెరికాలో కార్యకలాపాలు మొదలుపెట్టిన, ఇప్పటికే ప్లాంట్లను నిర్మిస్తున్న ఫార్మా కంపెనీలకు ఈ టారిఫ్‌లు వర్తించవని ట్రంప్ పేర్కొన్నారు. మరి అమెరికాలో ఇప్పటికే ఫ్యాక్టరీలు ఉన్న విదేశీ ఫార్మా సంస్థలకు టారిఫ్‌లు వర్తిస్తాయా లేదా అనేది దానిపై స్పష్టత లేదు. 2024లో అమెరికా దాదాపు 233 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా, వైద్య ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నట్లు అంచనా. ట్రంప్ టారిఫ్ దెబ్బతో కొన్ని మందుల ధరలు రెట్టింపు కావడంతో పాటు వైద్య ఖర్చులు కూడా భారీగా పెరిగి పోయే అవకాశం ఉంది. 'టారిఫ్‌లు అమెరికన్లకు పెను భారంగా మారతాయి. ఔషధాల ధరలు తక్షణం పెరిగిపోవడం, ఇన్సూరెన్స్ ఖర్చులు ఎగబాకడం, ఆసుపత్రుల్లో మందులకు కొరతతో ప్రజలు అల్లాడటం ఖాయం' అని కెనడియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్ పాస్కల్ చాన్ హెచ్చరించారు. మరోపక్క, విదేశాల్లో తయారైన భారీ ట్రక్కులు, విడిభాగాలను దిగుమతి చేసుకోవడం వల్ల దేశీ తయారీ సంస్థలను దెబ్బతీస్తోందని ట్రంప్ స్పష్టం చేశారు. సుంకాల పెంపు భారాన్ని వినియోగదారులపై వేయడం వల్ల ధరలు భారీగా ఎగబాకుతాయన్న ఆందోళనలను ట్రంప్ కొట్టిపారేశారు. ఇదిలా ఉంటే, కిచెన్ క్యాబినెట్లు, ఫర్నిచర్‌పై సుంకాలతో ఇళ్ల ధరలకు రెక్కలు రావడం ఖాయమని రియల్టీ సంస్థలు గగ్గోలు పెడుతున్నాయి. ఇప్పటికే సరఫరా సమస్యలు, అధిక వడ్డీ రేట్లతో ప్రజలకు ఇళ్ల కొనుగోలు భారమవుతున్న తరుణంలో ట్రంప్ టారిఫ్‌లు మరింత గుదిబండగా మారతాయని అమెరికా జాతీయ రియల్టర్ల అసోసియేషన్ పేర్కొంది. ఏప్రిల్‌లో వివిధ దేశాలపై సుంకాల మోతకు తెరతీసినప్పుడు అమెరికాలో ద్రవ్యోల్బణం 2.3 శాతంగా ఉండగా, తాజాగా 2.9 శాతానికి ఎగబాకడం గమనార్హం.

బడా ఫార్మా దిగ్గజాల అమెరికా బాట...

కొన్ని నెలలుగా ట్రంప్ టారిఫ్ బెదిరింపుల నేపథ్యంలో మెర్క్, ఎలీలిలీ, జాన్సన్ అండ్ జాన్సన్, ఆస్ట్రాజెనికా, రోషె తదితర అంతర్జాతీయ ఫార్మా దిగ్గజాలు ఇప్పటికే అమెకాలో విస్తరణ ప్రణాళికలను ప్రకటించాయి. భారీగా పెట్టుబడులను కుమ్మరిస్తామంటూ ట్రంప్‌కు హామీ ఇచ్చాయి. బడా కంపెనీలు తయారీ ప్లాంట్లను అమెరికాకు తరలిస్తుండటం, ప్లాంట్ల నిర్మాణ పనులకు తెరతీయడంతో వాటిపై పెద్దగా ప్రభావం ఉండదని జెఫరీస్ అనలిస్ట్ ఆకాశ్ తివారీ అభిప్రాయపడ్డారు. చిన్న కంపెనీలకు మాత్రం టారిఫ్‌ల దెబ్బ తప్పదని పేర్కొన్నారు.

లగ్జరీ కార్ల కేసులో ఈడీ సోదాలు

- డీలర్ బషరత్ ఖాన్ ఇల్లు, కార్యాలయాల్లో తనిఖీలు
- విదేశీ కార్లకు సంబంధించిన డాక్యుమెంట్లు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: లగ్జరీ కార్ల కొనుగోలు, విక్రయాల్లో అక్రమాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టి పెట్టింది. నగరానికి చెందిన లగ్జరీ కార్ల విక్రయాల డీలర్, ఎస్‌కే కార్ లాంజ్ షోరూమ్ ఓనర్ బషరత్ అహ్మద్ ఖాన్ ఇంటితో పాటు, షోరూమ్‌లో శుక్రవారం సోదాలు నిర్వహించింది. గచ్చిబౌలిలోని షోరూమ్‌తో పాటు జూబ్లీహిల్స్‌లోని బషరత్ ఖాన్ ఇంట్లో, అతడి స్నేహితుల ఇళ్లలో సోదాలు చేసింది. 20 మంది ఈడీ అధికారులతో కూడిన రెండు బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. దాదాపు ఆరు గంటల పాటు అధికారులు సోదాలు నిర్వహించారు. రూ.కోట్లు విలువ చేసే ఇంపోర్టెడ్ కార్లకు చెందిన ఇన్‌వాయిస్‌లు ఇతర డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. గత రెండేళ్లుగా ఇతర దేశాల నుంచి దిగమతి చేసుకున్న కార్లను ఎవరెవరికి విక్రయించారనే వివరాలు సేకరించారు. ఆయా కార్లకు సంబంధించిన కస్టమ్స్ డ్యూటీ సహా ఇతర పన్నులను చెల్లించారా లేదా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఫెమా ఉల్లంఘనలకు సంబంధించి..

విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న కార్ల అక్రమ రవాణాకు సంబంధించి విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా చట్టం) కింద జరిగిన ఉల్లంఘనలకు సంబంధించి ఈ దాడులు జరిగాయి. ఇంటర్నేషనల్ స్మగ్లింగ్ మాఫియా అమెరికా, జపాన్ నుంచి ఇంపోర్టెడ్ లగ్జరీ కార్లను భారత్‌కు అక్రమంగా తరలిస్తోంది. ఇంపోర్టెడ్ కార్లకు విదేశాల్లో లెఫ్ట్ డ్రైవ్ ఉండగా ఇండియాకు స్మగ్లింగ్ చేసే కార్లకు రైట్ హ్యాండ్ డ్రైవ్‌గా మార్చి తరలిస్తున్నారు. ఇలాంటి మార్పులతో కార్ల అసలు రేటును సగం తగ్గించి చూపుతున్నారు. ఈ మేరకు నకిలీ పత్రాలను తయారు చేస్తున్నారు. ఇలా అక్రమంగా వచ్చే కార్లను బషరత్ అహ్మద్ ఖాన్ కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నాడు. ఈ మొత్తం వ్యవహారంలో కస్టమ్స్ డ్యూటీ సహా ఇతర ట్యాక్స్‌లను చెల్లించలేదు. తద్వారా కేంద్ర ప్రభుత్వానికి రూ.25 కోట్లు నష్టం వాటిల్లింది. ఇది వెలుగులోకి రావడంతో విదేశాల నుంచి కార్ల అక్రమ రవాణాపై కస్టమ్స్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) ఏజెన్సీలు దర్యాప్తు చేపట్టాయి. ఎస్‌కే కార్ లాంజ్ వ్యవహారాన్ని గుర్తించి నిర్వాహకుడు బషరత్ ఖాన్‌ను ఈ ఏడాది మే నెలలో అరెస్టు చేశారు. ఖాన్ ఫోర్జరీ డాక్యుమెంట్లతో 8 కార్లు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. దీంతో ఫెమా కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ హైదరాబాద్ యూనిట్ కేసు నమోదు చేసింది. డీఆర్ఐ కేసు ఆధారంగా రంగంలోకి దిగింది. దర్యాప్తులో భాగంగా తాజాగా సోదాలు నిర్వహించింది.

ఈడీ సోదాలను స్వాగతించిన బండి సంజయ్

లగ్జరీ కార్ల డీలర్ బషరత్ ఖాన్ ఇంట్లో, కార్యాలయంలో ఈడీ సోదాలు చేయడాన్ని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్వాగతించారు. ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖాన్ కుటుంబ కంపెనీ పేరుతో బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఓ వాహనం తీసుకోవడాన్ని బండి సంజయ్ ఇటీవల ఓ ట్వీట్‌లో ప్రస్తావించారు. ఈ విషయంలో దర్యాప్తు సంస్థలు వాస్తవాలు వెలికితీయాలని కోరారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.





శుక్రవారం రాత్రి మూసీ నది ముంచెత్తడంతో హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ వద్ద ఇదీ పరిస్థితి..

సింగరేణి సమస్యలపై సీఎం నజర్?

- దసరా తర్వాత ప్రత్యేక సమావేశానికి పచ్చజెండా
- కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు, మంత్రులు, కార్మిక సంఘాలతో భేటీ
- కారుణ్యం, మారుపేర్ల డిపెండెంట్లలో ఆశలు



సింగరేణి కార్మికులు



ఇటీవల ముఖ్యమంత్రిని కలిసిన గుర్తింపు సంఘం నేతలు

గోదావరిఖని (రామగుండం): సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం కానున్నాయా?.. కారుణ్య నియామక సమస్యలు తీరనున్నాయా?.. మారుపేర్ల డిపెండెంట్లకు ఉద్యోగాలపై స్పష్టత రానుందా?.. ఆర్థిక ప్రయోజనాలపై ఆదాయపన్ను మాఫీ, కార్మికులకు సొంతింటి పథకం.. ఇలా సింగరేణి కార్మికుల సమస్యలకు మోక్షం లభించనుందా?.. త్వరలో కోల్‌బెల్ట్ ప్రాంత నేతలతో భేటీ కావడానికి ముఖ్యమంత్రి అంగీకరించడంతో అందరిలో ఆసక్తి, సంతోషం నెలకొంది.

సమస్యలివీ..

- హయ్యర్ సెంటర్ మెడికల్ రిఫరల్ ఉద్యోగులకు సింగరేణి యాజమాన్యం గత జూలై 31న మెడికల్ బోర్డు నిర్వహించింది. దీనికి 55 మందిలో ఒకరు గైర్హాజర్ కాగా.. ఐదుగురిని మాత్రమే మెడికల్ ఇన్వాలిడేషన్ చేసింది. మిగిలిన 49 మందిలో 32 మందిని ఫిట్ ఫర్ సేమ్ జాబ్, 17 మందిని అండర్‌గ్రౌండ్ నుంచి సర్ఫేజ్‌కు అవకాశం కల్పించింది. ఏడాది పాటు మెడికల్ బోర్డు కోసం డ్యూటీలు పోయాయి. చివరికి మెడికల్ ఇన్వాలిడేషన్ కాకపోవడంతో.. బాధితులు నాయకుల కాళ్లు, చేతులు పట్టుకుని వేడుకుంటున్నారు.
- మారుపేర్ల కార్మికుల పిల్లలు రెండేళ్లుగా రోడ్డెక్కి పోరాటం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలు, గుర్తింపు ఎన్నికల్లో వీరికి సంస్థలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని రాజకీయ పార్టీలు, యూనియన్‌ల నాయకులు హామీ ఇచ్చారు. ఇప్పుడు న్యాయ సలహా కోసం అడ్వకేట్ జనరల్ ముందు ఈ సమస్య ఉంది. ఇవే కాదు.. ఇలాంటి అనేక సమస్యలు సింగరేణిలో పెండింగ్‌లో ఉన్నాయి.
- గత అసెంబ్లీ, గుర్తింపు సంఘం ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలు పేరుకుపోయాయి. ప్రధానంగా కారుణ్య నియామకాలు 4 నెలలుగా నిలిచిపోయాయి. ఇంటర్వ్యూ పూర్తయిన సుమారు 260 మంది కార్మికుల పిల్లలకు ఉద్యోగాలివ్వలేదు. కోల్ ఇండియాలో అమలవుతున్నా.. సింగరేణి కార్మికులకు అమలు కాని పెర్క్స్‌పై ఆదాయ పన్నును యాజమాన్యమే చెల్లించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. కార్మికులకు సొంతింటి పథకం అమలు చేస్తామన్న హామీ నెరవేరలేదు. దీంతో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీపై కార్మికుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

దసరా తర్వాత సింగరేణి సమస్యలపై సీఎం భేటీ

సింగరేణిలో నెలకొన్న సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి.. దసరా తర్వాత కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు, మంత్రులు, కార్మిక సంఘాలతో భేటీ కానున్నట్లు తెలుస్తోంది. లాభాల వాటా విషయంలో ఇటీవల గుర్తింపు యూనియన్ నాయకులు సీఎంను కలిశారు. సంస్థలో పేరుకుపోయిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అన్ని సమస్యలు సావధానంగా విన్న సీఎం 'ముందు లాభాల వాటా పూర్తి చేయండి, తర్వాత మిగతా సమస్యలపై దసరా తర్వాత కూర్చొని మాట్లాడుతాం'.. అని హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ మేరకు పేరుకుపోయిన సమస్యలను డైరెక్టర్(పా)కు పంపినట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయి నివేదిక తెప్పించుకున్న తర్వాత భేటీ అయ్యే అవకాశాలున్నట్లు సమాచారం.



వీరనారి చాకలి ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



గాంధీభవన్‌లో ఐలమ్మ జయంతి

వీరనారి చాకలి ఐలమ్మ 130వ జయంతి వేడుకలను గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం ఐలమ్మ వారసులతో కలిసి కేక్ కట్ చేశారు. ఐలమ్మ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు ఈరవత్రి అనిల్, మెట్టు సాయికుమార్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు టి.కుమార్‌రావు పాల్గొన్నారు.



నగరంలో రాజస్తాన్ సీఎం

సాక్షి, హైదరాబాద్: వివిధ అధికారిక సమావేశాలు, కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన రాజస్తాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మకు బేగంపేట విమానాశ్రయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ క్యాంపస్ టీ–హబ్‌ను రాజస్తాన్ సీఎంతో కలిసి సందర్శించారు.



గోమాతకు సీమంతం చేస్తున్న సురేందర్ కుటుంబ సభ్యులు

గోమాతకు సీమంతం

నర్సంపేట రూరల్: పెంచుకుంటున్న గోమాతకు సీమంతం చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం దాసరిపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమం వివరాలివి. దాసరిపల్లి గ్రామానికి చెందిన పెండ్యాల సురేందర్ గోపాల మిత్రగా పనిచేస్తున్నాడు. హనుమకొండలోని మహర్షి గోశాల నుంచి ఒక ఆవు దూడను తెచ్చుకుని కన్నకూతురిలా పెంచుకుంటున్నారు. ఆ ఆవుకు గౌరి అని నామకరణం చేశారు. ఇటీవల ఆ ఆవుకు కృత్రిమ గర్భధారణ చేయించగా గర్భం దాల్చింది. దీంతో శుక్రవారం గౌరి (గోమాత)కి సీమంతం నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో పిండివంటలు చేయించి వేద పండితుల నడుమ పూజలు చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామస్తులు హాజరయ్యారు.



ఐలమ్మకు బీఆర్ఎస్ నివాళి

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ భవన్‌లో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఐలమ్మకు నివాళులర్పించారు.

అగ్రజులంతా అజ్ఞాతవాసులే

- అజ్ఞాతంలోనే మావోయిస్టు కీలక నేతలు..
- కోవర్టు ఆపరేషన్లతో ముందస్తు జాగ్రత్తలు
- 90వ దశకంలో బస్తర్‌కు భారీగా వెళ్లిన కేడర్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీపీఐ(మావోయిస్టు) పార్టీకి దిశా నిర్దేశం చేసే కేంద్ర కమిటీ సభ్యుల సంఖ్య పది లోపుకు పడిపోయింది. దీంతో భవిష్యత్‌లో ఆ పార్టీలో రాజకీయ శూన్యత ఏర్పడే అవకాశం ఉందనే ప్రచారం ఊపందుకుంది. కానీ పార్టీకి అలాంటి ప్రమాదమేమీ లేదనే వాదనలు మావోయిస్టు పార్టీ సానుభూతిపరుల నుంచి వస్తున్నాయి. ఇటీవల ఇద్దరు అగ్రనేతలు మరణించిన సందర్భాల్లో వెల్లడైన వివరాల ఆధారంగా కథనమిది.

బస్తర్‌లో 49 మందితో మొదలు

ఉమ్మడి ఏపీలో పీపుల్స్‌వార్ ఉద్యమం 1980లో ఉధృతమైంది. భవిష్యత్‌లో ప్రభుత్వ నిర్బంధం పెరిగితే తలదాచుకునేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్‌తో సరిహద్దు పంచుకుంటున్న అప్పటి మధ్యప్రదేశ్ (ప్రస్తుత ఛత్తీస్‌గఢ్)లోని బస్తర్ అటవీ ప్రాంతాన్ని ఎంచుకున్నారు. దీంతో వరంగల్ నుంచి మూడు, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి రెండేసి చొప్పున మొత్తం ఏడు బృందాలు మహదేవపూర్ అటవీ ప్రాంతం మీదుగా బస్తర్‌లో అడుగుపెట్టాయి. ఒక్కొక్క బృందంలో ఏడుగురు వంతున మొత్తం 49 మంది నక్సలైట్లు బస్తర్‌కు వెళ్లారు. ఇందులో ఏడాది తిరిగే సరికి ఒక బృందం వెనక్కి రాగా, రెండు బృందాలు తీవ్రమైన ఆటుపోట్లను ఎదుర్కొన్నాయి. దశాబ్దం గడిచేసరికి 25 మంది మావోయిస్టులు అక్కడ నిలదొక్కుకుని 1990 నాటికి బస్తర్‌లో పార్టీకి బలమైన పునాదులు వేయగలిగారు. ఆ 25 మందిలో ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మరణించిన కడారి సత్యనారాయణరెడ్డి (కోసా), కాతా రామచంద్రారెడ్డి (రాజు దాదా) కూడా ఉన్నారు.

వెంటాడిన కోవర్టులు

90వ దశకం మధ్యలోకి వచ్చేసరికి బస్తర్‌లో పీపుల్స్‌వార్ పార్టీ బలపడుతుంటే ఏపీలో నిర్బంధం తీవ్రమైంది. ఒకవైపు వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతుంటే.. మరోవైపు కోవర్టుల అంశం తెరపైకి వచ్చింది. కత్తుల సమ్మయ్య, జడల నాగరాజు వంటి వారు చేసిన కోవర్టు ఆపరేషన్లు ఆ పార్టీని ప్రమాదంలోకి నెట్టాయి. చివరకు 1999లో జరిగిన కొయ్యూరు ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యులైన నల్లా ఆదిరెడ్డి, శీలం సంతోశ్‌రెడ్డి, నరేష్ చనిపోయారు. కోవర్టు ఆపరేషన్ కారణంగానే కొయ్యూరు ఎన్‌కౌంటర్ జరిగిందనే నిర్ధారణకు మావోయిస్టు పార్టీ వచ్చింది. దీంతో షెల్టర్ జోన్ నుంచి గెరిల్లా జోన్‌గా మారిన బస్తర్ ప్రాంతానికి తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున నక్సలైట్లను పంపినట్టు తెలుస్తోంది. అయితే, అప్పటికే తెలంగాణలో కోవర్టు ఆపరేషన్ల కారణంగా జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని.. రెండోసారి పంపిన బ్యాచ్‌ల్లో ఎక్కువ మందికి అత్యంత రహస్య జీవితం అప్పగించినట్టు తెలుస్తోంది. అప్పటికే బస్తర్‌లో పాతుకుపోయిన అగ్రనాయకులకు మాత్రమే అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించి అడవుల్లోకి పంపినట్టు సమాచారం.



అమరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మావోయిస్టులు (ఫైల్)

జాగ్రత్తలో భాగమే..

అజ్ఞాతంగా పనిచేస్తున్న మావోయిస్టులకు సంబంధించిన సమాచారం పార్టీలో ఇతర కేడర్‌కు కూడా తెలియకుండా జాగ్రత్త పడినట్టు తెలుస్తోంది. ఈమేరకు పత్రిక ప్రకటనలు విడుదల చేసే సమయంలోనూ జాగ్రత్తలు తీసుకున్నట్టు సమాచారం. ఉదాహరణకు కేంద్ర కమిటీ తరపున అధికార ప్రతినిధి పేరు అభయ్, దండకారణ్యం తరపున వికల్ప్, తెలంగాణ తరపున జగన్, భద్రాద్రి – అల్లూరి జిల్లా డివిజన్ తరపున ఆజాద్ వంటి పేర్లతోనే లేఖలు జారీ చేస్తున్నారు. తద్వారా ఆ పేర్ల వెనక ఉన్న అసలు మనిషెవరో బయట ప్రపంచానికి తెలియకుండా జాగ్రత్త పడినట్లు సమాచారం. వీరికి సంబంధించిన వివరాలపై నిఘా వర్గాలకు కూడా పూర్తి స్పష్టత లేదని మావోయిస్టుల సానుభూతిపరుల్లో చర్చ జరుగుతోంది.

అవసరమైతే అందుబాటులోకి..

90ల నుంచి అత్యంత రహస్య అజ్ఞాత జీవితం గడుపుతున్న మావోయిస్టులు ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి ఎనిమిది మంది ఉన్నారు. మిగిలిన తెలంగాణ జిల్లాల నుంచి మరో ఆరుగురు వరకు ఉన్నట్టు సమాచారం. వీరంతా సిద్ధాంతపరంగానే కాక, పార్టీ నిర్మాణం, గెరిల్లా యుద్ధరీతులు అనుసరించడంలో కేంద్ర కమిటీ స్థాయి కలిగిన నేతలుగా చెబుతున్నారు. వీరికి అనుబంధ బృందాలను కలిపితే నలభైకి అటూఇటుగా పార్టీకి కొత్త నాయకత్వం వహించే నేతలు మావోయిస్టు పార్టీకి ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందువల్లే తీవ్ర నిర్బంధం, వరుస మరణాలు చోటు చేసుకుంటున్నప్పటికీ ఆ పార్టీ సాయుధ పోరాట పంథా నుంచి వెనక్కి తగ్గడం లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పార్టీకి సంబంధించి పైస్థాయిలో నాయకత్వ శూన్యత ఏర్పడేందుకు ఆస్కారం లేదనే చర్చ నడుస్తోంది. మరోవైపు తెలంగాణ పోలీసు రికార్డుల ప్రకారం రాష్ట్రం నుంచి 76 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. వీరంతా వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు పేర్లతో వేర్వేరు హోదాల్లో రహస్య జీవితం గడుపుతున్నారు.



మన్మోహన్‌కు నివాళి

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా శుక్రవారం గాంధీభవన్‌లో మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. మహిళా కాంగ్రెస్ నేతలతో కలిసి మంత్రి సీతక్క మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశాభివృద్ధికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఐలమ్మకు కూడా మహిళా కాంగ్రెస్ నేతలు ఘనంగా నివాళులర్పించారు.

జీవోతో కాదు.. ఆచరణలో చూపాలి: పాయల్ శంకర్

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ జీవోతో బీసీలను మోసగించవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్ కోరారు. కేవలం జీవోతో చేతులు దులిపేసుకుని.. అమలు చేయకుండా వేరే దారులు వెతికే ప్రయత్నం చేయొద్దని కోరారు. ఆయన సాక్షితో మాట్లాడుతూ.. ఇప్పటికే బీసీల విషయంలో అనుసరిస్తున్న విధానాలు, బీసీ డిక్లరేషన్ అమలు చేయకపోవడం తదితర చర్యలపై కాంగ్రెస్‌పై ఎన్నో అనుమానాలు ఉన్నాయన్నారు. ఒకపక్క రాష్ట్రపతి దగ్గర రెండు బిల్లులు, మరోపక్క గవర్నర్ వద్ద మరో బిల్లు పెండింగ్‌లో ఉండగా.. జారీ చేసిన జీవో ఏ మేరకు చెల్లుతుందని న్యాయనిపుణులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారన్నారు.

కొండా లక్ష్మణ్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ జయంతి పోస్టర్‌ను శుక్రవారం బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ నేతృత్వంలో గ్రేటర్ హైదరాబాద్ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ట్యాంక్‌బండ్ జలదృశ్యం వద్ద శనివారం ఉదయం 8 గంటలకు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించనున్నామని తెలిపారు.



నిమ్మకు గడ్డు కాలం

ఇతర రాష్ట్రాల్లో పెరుగుతున్న సాగు

- ఎగబాకని ధరలు • డిమాండ్‌కు మించి పండిస్తూ..
- కోల్డ్ స్టోరేజీ, సిట్రస్ ఫ్యాక్టరీ నిర్మిస్తేనే ఫలితం

నిమ్మను అతిగా సాగు చేస్తుండటంతో మార్కెట్లో డిమాండ్ తగ్గుతోంది. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే గడ్డు కాలం ఏర్పడే అవకాశం ఉందని వ్యాపారులతో పాటు రైతులు సైతం అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి మెట్ట నియోజకవర్గాల్లో నిమ్మ సాగు నుంచి కర్షకులను విడదీయలేని పరిస్థితులున్నాయి. సుమారు ఐదు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో తోటలను సాగు చేస్తూ అందులోనే తమ జీవితం ఉందని వారు భావిస్తున్నారు. కొందరైతే ఇతర పంటలను పండించకుండా, తోటలను నాలుగైదు చోట్ల సాగు చేస్తున్నారు. ఫలితంగా దిగుబడి గణనీయంగా పెరుగుతోంది. మరోవైపు ఇక్కడ ఫ్యాక్టరీలు, కోల్డ్ స్టోరేజీలు లేకపోవడంతో నష్టమో, లాభమో కాయలు కోసి యార్డుల్లోనే విక్రయించాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. బయటి రాష్ట్రాల్లో సాగు విస్తీర్ణం పెరగడం సైతం రైతుల ఇబ్బందులకు కారణమవుతోంది.



నిమ్మ తోటలు

జిల్లాలో సాగు ఇలా..
- విస్తీర్ణం: 28,437 ఎకరాల్లో
- సీజన్లో యార్డు నుంచి ఎగుమతులు: 15 లారీల్లో..
- ప్యాక్ చేసి ఎగుమతి చేసే కాయలు: 300 టన్నులు

పొదలకూరు: ఉద్యాన పంటల్లో నిమ్మ సాగు మేటిగా ఉంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటగిరి సమీపంలోని పెట్లూరు వద్ద పరిశోధన స్థానాన్ని గతంలోనే ఏర్పాటు చేశారు. సర్వేపల్లి, వెంకటగిరి, ఆత్మకూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో 28,437 ఎకరాలకుపైగా నిమ్మ సాగవుతోంది. ఒక్క పొదలకూరు మండలంలోనే నాలుగు వేల ఎకరాల్లో పండిస్తున్నారు. ఫలితంగా ఇక్కడ ప్రభుత్వ నిమ్మ మార్కెట్ యార్డును రెండు దశాబ్దాల క్రితమే ఏర్పాటు చేశారు.

ఎంతో మందికి జీవనోపాధి

సీజన్లో ఇక్కడి నుంచి నిత్యం 15 లారీల్లో కాయలు ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు ఎగుమతవుతుంటాయి. ఇలా 300 టన్నుల కాయలు వెళ్తుంటాయి. వందలాది మందికి ఇది జీవనోపాధిగా మారింది. ఈ ప్రాంతంలో చాలా మంది రైతులకు రెండు వేల నిమ్మ చెట్లున్నాయి. చాలా కాలం పాటు ఇక్కడ పండేదే నిమ్మగా చెలామణి అయింది. అయితే ప్రస్తుతం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోనూ సాగవుతోంది. కర్ణాటకలోని బిజాపూర్, తెలంగాణలోని నకిరేకల్.. మన రాష్ట్రానికి పోటీగా మారాయి. మార్కెట్‌ను శాసించే ఢిల్లీకి బయటి రాష్ట్రాల నుంచి కాయలు ఎగుమతవుతున్నాయి. దీంతో ఇక్కడి మార్కెట్ తరచూ తారుమారవుతోంది.

పతనమవుతున్న ధరలు

ఢిల్లీకి కాయలు అధికంగా ఎగుమతవుతున్న నేపథ్యంలో డిమాండ్ తగ్గి ధరలు పతనమవుతున్నాయి. దీంతో కొన్ని సందర్భాల్లో రైతులకు గిట్టుబాటు ధరలూ లభించడం లేదు. ఇక్కడ దాదాపు మూడు నెలలుగా ధరలు ఆశాజనకంగా పెరిగిందీ లేదు. ఈ ఏడాది వేసవిలో కొద్ది రోజులు ధరలు పలికి ఆ తర్వాత తగ్గుతూ వచ్చాయి. దీంతో భవిష్యత్తులో ఈ ప్రాంతంలో తోటలను తగ్గించుకుంటేనే మేలనే భావన కర్షకుల్లో వ్యక్తమవుతోంది.

కోల్డ్ స్టోరేజీ, సిట్రస్ ఫ్యాక్టరీ అవసరం

పొదలకూరులో కోల్డ్ స్టోరేజీ, సిట్రస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా భావిస్తున్నా, కార్యరూపం దాల్చడం లేదు. ఇదే అంశమై రైతులు విజ్ఞప్తి చేస్తున్నా, ఎలాంటి ప్రయోజనం లభించడంలేదు. కోల్డ్ స్టోరేజీ ఉంటే కోసిన కాయలను రెండు, మూడు రోజుల వరకు నిల్వ చేసుకునేందుకు వీలు కలుగుతుంది. నిమ్మను 80 శాతం ఇంటి అవసరాలకు.. మిగిలిన 20 శాతాన్ని కాస్మొటిక్స్, ఆహారోత్పత్తులకు వినియోగిస్తున్నారు. నిమ్మకు అనుబంధంగా ఫ్యాక్టరీని స్థానికంగా ఏర్పాటు చేస్తే రైతులకు ఊరట లభిస్తుంది. ఇలాంటి ఫ్యాక్టరీని పొదలకూరు ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విస్తీర్ణం తగ్గలేదు



తోటల విస్తీర్ణం తగ్గలేదు. నిమ్మకు చీడపీడలు అధికంగా ఉంటాయి. రైతులు సకాలంలో స్పందించి పిచికారీ చేసుకుంటే అదుపులో ఉంటాయి. కాయల ధరలు బాగా పెరిగి ఆర్థికంగా స్థిరపడిన సమయంలో తోటల విస్తీర్ణాన్ని బాగా పెంచారు.
– ఆనంద్, ఉద్యానాధికారి, పొదలకూరు

సాగు తగ్గించడమే మేలు



నిమ్మ సాగును కొంత వరకు తగ్గించడమే మేలు. బోర్ల ద్వారా నీటి సౌకర్యం ఉన్న ప్రతి రైతు దీనిపై మక్కువ చూపుతున్నారు. దిగుబడి పెరిగితే డిమాండ్ తగ్గుతుందనే విషయాన్ని తెలుసుకోవాలి. మూడు నెలలే అంతో ఇంతో డిమాండ్ ఉంటుంది. ఆ తర్వాత కష్టాలు పడాల్సి వస్తుంది. కూలిలు సైతం గిట్టుబాటు కాక ఇబ్బందులు పడ్డాం.
– శంకర్‌రెడ్డి, రైతు, ముదిగేడు

కష్టంగా ఉంది



నిమ్మ సాగు కష్టంతో కూడుకున్న పని. కంపోస్ట్ ఎరువులను ఏటా తోలి యాజమాన్య పద్ధతులను చేపట్టాల్సి ఉంటుంది. పెట్టుబడులు బాగా అవుతున్నా, అందుకు తగిన విధంగా రాబడి ఉండటం లేదు. వేసవిలోనే ధరలు పతనమైతే రైతులు కోలుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. సాగు తగ్గించుకోవడమే మంచిదనిపిస్తోంది.
– దయాకర్‌రెడ్డి, రైతు, కల్యాణపురం

భవిష్యత్తులో ఇబ్బందులు



నిమ్మకు ఇప్పటికిప్పుడు వచ్చిన ఇబ్బందుల్లేకపోయినా, భవిష్యత్తులో సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. బయటి రాష్ట్రాల్లో నిమ్మ సాగు పెరుగుతోంది. బిహార్‌లో సైతం దీన్ని పండిస్తున్నారంటే ఆశ్చర్యంగా ఉంది. మన ప్రాంతంలో డిమాండ్ తగ్గేందుకు ఇదీ ఓ కారణంగా భావించాల్సి వస్తోంది.
– బాలకృష్ణారెడ్డి, వ్యాపారి, నిమ్మ మార్కెట్ యార్డు, పొదలకూరు

భలే మంచి టెట్రా బేరము

తమిళనాడుకు తరలుతున్న ఏపీ, కర్ణాటక మద్యం • ఎస్ఈబీ లేక యథేచ్ఛగా సాగుతున్న అక్రమ రవాణా

పలమనేరు: కర్ణాటక టెట్రా ప్యాకెట్ల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇటు చిత్తూరు జిల్లాతోపాటు అటు తమిళనాడుకు గుట్టుచప్పుడు కాకుండా తరలిపోతున్నాయి. కర్ణాటకలో 90 ఎంఎల్ ప్యాకెట్ టెట్రా ప్యాకెట్ రూ.45కే లభ్యమవుతోంది. దీన్ని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు ఏపీలోని సరిహద్దు ప్రాంతాల నుంచి తమిళనాడుకు చేరవేస్తున్నారు. దీనికితోడు తమిళనాడులో మద్యం కొరతను సైతం తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు.

బజ్జీ దుకాణాల్లోనూ మద్యమే

కన్నడ టెట్రా ప్యాకెట్లతోపాటు ఏపీ మద్యం దుకాణాల నుంచి తీసుకెళ్లే మందు విక్రయాలు చిత్తూరు జిల్లాలోని అంతర్రాష్ట్ర సరిహద్దు నియోజకవర్గాల్లో ఊపందుకున్నాయి. గతంలో రహస్యంగా సాగుతున్న ఈ తంతు ఇప్పుడు బహిరంగగానే విక్రయిస్తున్నారు. గ్రామాల్లోని చిల్లర కొట్లు, టీ దుకాణాలు, హోటళ్లు, బజ్జీ, బోండా అంగళ్లల్లోనూ మద్యం లభిస్తోంది. కొందరైతే దీన్నే జీవనోపాధిగా చేసుకున్నారు.

రకరకాల మార్గాలు

కర్ణాటక రాష్ట్రం నుంచి తమిళనాడుకు ఎన్నో అడ్డదారులున్నాయి. రకరకాల మార్గాల్లో నిత్యం మద్యం అక్రమంగా తరలిస్తున్నారు. కన్నడ మద్యం దుకాణాల నిర్వాహకులకు ఆన్‌లైన్‌లో నగదును జమచేస్తే మద్యాన్ని వారే ఏపీ సరిహద్దుకు చేరవేస్తున్నారు. అక్కడి నుంచి స్మగ్లర్లు సులభంగా తమిళనాడుకు రవాణా చేస్తున్నారు. మరి కొందరు కర్ణాటక నుంచి ఇక్కడికి చేరిన సరుకును ఇళ్లల్లో కాకుండా గ్రామాల్లోని పొలాలు, గడ్డివాములు, భూమిలో పాతిపెట్టి, ఆపై తమిళనాడుకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది.



కర్ణాటక నుంచి తమిళనాడు చేరుతున్న కన్నడ టెట్రా ప్యాకెట్లు

కన్నడ మద్యం తమిళనాడుకు

పలమనేరు నియోజకవర్గంలోని వీకోట కర్ణాటకు ఆనుకొని ఉంది. ఇక్కడ కన్నడ మద్యం ఎంతైనా దొరుకుతుంది. బైరెడ్డిపల్లి మండలంలోని కర్ణాటక బోర్డర్‌లోనూ కన్నడ మద్యం దుకాణాలున్నాయి. కుప్పం నియోజకవర్గం సైతం ఓ వైపు కర్ణాటక.. మరోవైపు తమిళనాడులకు సరిహద్దుగా ఉంటోంది. కొందరు ఇక్కడి కూటమి నేతల అండతో యథేచ్ఛగా తమిళనాడు తీసుకెళ్లి దొంగచాటుగా టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తున్నారు.

ఏపీ నుంచి తమిళనాడుకు

ఇక జిల్లాలోని చిత్తూరు, గంగాధరనెల్లూరు, నగరి, పుత్తూరు నియోజకవర్గాలకు ఆనుకొని తమిళనాడు ఉంది. ఈ ప్రాంతాల నుంచి యథేచ్ఛగా ఇక్కడి మద్యాన్ని తమిళనాడుకు చేరవేస్తున్నారు. ఇక్కటి మద్యం షాపుల నిర్వాహకులు ప్రైవేటు వారు కావడం స్మగ్లర్లకు కలిసి వస్తోంది. అప్పుగా సైతం ఏపీ మద్యం కేసులను తీసుకెళ్లి తమిళనాడులో ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు.

చౌకబేరము!

కర్ణాటకాకు చెందిన విస్కీ, ఒరిజినల్ చాయిస్, డీలక్స్ విస్కీ, త్రిబుల్‌ఎక్స్ రమ్, ఓల్డ్ అడ్మిరల్, బ్రాందీ తదితర బ్రాండ్లు 180 ఎంఎల్ టెట్రా ప్యాకెట్ల రూపంలో దొరుకుతున్నాయి. అక్కడ వీటి ధరలు ఒక్కో ప్యాకెట్ 90 ఎంఎల్ రూ.45, క్వార్టర్ ప్యాకెట్ రూ.90గా ఉంది. అదే సరుకు తమిళనాడుకు చేరితే 90 ఎంఎల్ రూ.100, క్వార్టర్ రూ.140గా ఉంది. కన్నడ కిక్కుకు అలవాటు పడిన మందుబాబులు వాటి వైపే మొగ్గు చూపుతున్నారు. రోజుకు రెండు కేసులు అమ్మినా రూ.5 వేలదాకా మిగులుతోంది.

ఆగిన తనిఖీలు

గత ప్రభుత్వంలో సెబ్ స్క్వాడ్‌లు నిరంతరం బోర్డర్లలో నిఘా పెట్టేవారు. కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సెబ్‌ను తీసేసింది. కేవలం ఎక్సైజ్ శాఖ మాత్రమే అదీ మద్యం దుకాణాల నిర్వహణలో ఉంది. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణాపై అసలు తనిఖీలే లేకుండా పోయాయి.

ఏపీలో చీప్ ట్రిక్స్

ఏపీలోని మద్యం ప్రియులకు రూ.99కే మద్యం ఇస్తామన్న కూటమి ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదు. ఇక్కడున్న మద్యం కంటే కన్నడ మద్యం ధర తక్కువ. దీంతో కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో ఇప్పటికీ కన్నడ టెట్రాప్యాకెట్లే రాజ్యమేలుతున్నాయి.



మార్కెట్‌లో నకిలీ నోటు!

శ్రీ సత్యసాయి జిల్లాలో కలకలం రేపుతున్న నకిలీ కరెన్సీ

- అమాయకులే లక్ష్యంగా కేటుగాళ్లు గాలం
- కొత్తచెరువు, పుట్టపర్తి, కదిరి పట్టణాల్లో అధికం
- హిందూపురంలో వాణిజ్య లావాదేవీల్లో నకిలీ నోట్లు
- పుట్టపర్తిలో విదేశీ కరెన్సీ ముసుగులో రూ.లక్షల్లో దోపిడీ
- గొర్రెలు, పశువుల సంతల్లో ఈజీగా నకిలీ నోట్ల మార్పిడి

సాక్షి, పుట్టపర్తి : మార్కెట్‌లో నకిలీ నోటు హల్‌చల్ చేస్తోంది. చిరువ్యాపారాలు, రైతులను టార్గెట్ చేసుకుని నకిలీ నోట్ల కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. సందు దొరికితే నకిలీ నోట్లు అంటగడుతున్నారు. బ్యాంకుకు వెళ్లినప్పుడు 'నకిలీ నోట్ల' వ్యవహారం బయటపడుతుండగా.. బాధితులు నెత్తీనోరూ కొట్టుకుంటున్నారు. కొందరు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోంది.

'డిజిటల్' అందుబాటులో ఉన్నా...

ఫోన్‌పే, గూగుల్‌పే, యూపీఏ, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ తదితర ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నా గ్రామీణులు వాటి జోలికి వెళ్లడం లేదు. ఒక్క నంబరు తేడాతో ఫోన్‌పే ద్వారా లేనిపోని సమస్యలు వస్తుండటంతో పల్లెటూరి వ్యాపారులు కరెన్సీకే జై కొడుతున్నారు. దీంతో కేటుగాళ్లు అలాంటి వారిని లక్ష్యంగా చేసుకుని ప్రతి వారం గొర్రెలు – మేకల సంత, పశువుల సంతల్లో జీవాలను కొనుగోలు చేసి నకిలీ నోట్లు కట్టబెట్టి పరారవుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో చోటుచేసుకున్న నకిలీ ఘటనలన్నీ సంతల్లోనే జరగడం గమనార్హం. కొత్తచెరువు, గోరంట్ల, కదిరి, తనకల్లులో నకిలీ నోట్ల ఘటనలు వెలుగు చూశాయి. ఇక పుట్టపర్తిలో విదేశీ కరెన్సీ మార్పిడి పేరుతో నకిలీ నోట్లు అంటగడుతున్నట్లు సమాచారం. హిందూపురం పట్టణంలోనూ రూ.200 నకిలీ నోట్లు బయటపడ్డాయి.

పర్సెంటేజీలకు ఆశపడి..


ఇటీవల బయటి ప్రాంతాల నుంచి కొందరు కేటుగాళ్లు జిల్లాలో ప్రవేశించారు. నకిలీ నోట్ల కట్టలను.. అసలు నోట్లతో కలిపి చెలామణి చేస్తున్నారు. బెంగళూరులో ఓ వ్యక్తి దగ్గర నుంచి నకిలీ నోట్ల కట్టలు జిల్లాలోకి ప్రవేశిస్తున్నట్లు సమాచారం. అతడి వద్ద నుంచి 30 శాతం పర్సెంటేజీతో కొందరు తీసుకొచ్చి.. మార్పిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. రూ.150 చెల్లిస్తే రూ.200 నకిలీ నోటు ఇస్తారు. దీన్ని మార్చుకుంటే రూ.50 అదనంగా వస్తుంది. ఆ పర్సెంటేజీకి ఆశపడి కొందరు యువకులు నకిలీ నోట్ల చెలామణి పనిలో బిజీగా గడుపుతున్నారు. ఎక్కడైతే ఎక్కువగా నగదు సహిత లావాదేవీలు ఉంటున్నాయో.. అక్కడ ఎంట్రీ ఇచ్చి మోసాలకు పాల్పడుతున్నారు.

ఎక్కువగా రూ.200 నోట్లే..

పెద్ద నోట్లతో ఎక్కువగా మోసం జరుగుతోందని ప్రచారం అవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రూ.500 నోట్లు ఒకటికి రెండుసార్లు పరిశీలిస్తున్నారు. దీంతో నకిలీ నోట్ల మార్పిడి కొంచెం కష్టంగా మారడంతో నకిలీ కరెన్సీ మాయగాళ్లు రూ.200 నోట్లపై పడినట్లు సమాచారం. హిందూపురం పట్టణంలో చిరు వ్యాపారుల వద్ద రూ.200 నోట్ల కట్టలు అధికంగా వెలుగులోకి వస్తున్నాయి. ఆయా నోట్ల కట్టల్లో నకిలీ నోట్లు కలపడంతో మోసపోయిన ఘటనలు ఇటీవల కాలంలో నాలుగైదు వెలుగు చూశాయి. అయితే ఒక్కో వ్యక్తికి ఒకటి లేదా రెండు నోట్లు మాత్రమే రావడంతో పెద్ద నష్టం లేదని మౌనంగా ఉన్నట్లు తెలిసింది.



నకిలీ నోట్లను చూపుతున్న ఇతని పేరు నగేష్, ముదిగుబ్బ మండలం. ఈ ఏడాది ఆరంభంలో కదిరి మార్కెట్ యార్డులో రెండు పొట్టేళ్లను విక్రయించగా.. కొనుగోలు చేసిన వ్యక్తి రూ.32 వేలకు గానూ అన్నీ నకిలీ నోట్లే ఇచ్చాడు. ఇంటికి వెళ్లాక గుర్తించిన రైతు నగేష్ వెంటనే కదిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



ఇటీవల బత్తలపల్లిలో ఓ కేటుగాడు రూ.10 విలువ చేసే సరుకు కొని ఇలా ఈ నకిలీ రూ.200 నోటు ఇచ్చారు. ఆ వ్యాపారి రూ.190 వెనక్కు ఇవ్వగా ఎంచక్కా జేబులో వేసుకుని వెళ్లాడు. ఆ డబ్బులు బ్యాంకు డిపాజిట్ చేసేందుకు వెళ్లిన చిరువ్యాపారి అది కలర్ జిరాక్స్ అని తెలిసి లబోదిబోమన్నాడు.

వదిలే ప్రసక్తే లేదు



పశువులు, గొర్రెల సంతల్లో నకిలీ నోట్ల చెలామణి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరిపై అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి. నకిలీ నోట్ల మార్పిడి నేరం. ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు. ఎవరు ఇచ్చారనే విషయం గుర్తుంచుకుని పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయండి.
– సతీశ్ కుమార్, జిల్లా ఎస్పీ

ఏ విద్యార్థీ చదువుకు దూరం కారాదు

సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: బాలకార్మికులు, వలస కూలీల పిల్లలు, అనాథలు, నిరాశ్రయులుగా చదువుకు దూరమైన పిల్లలను గుర్తించి వారికి చక్కని విద్య, వసతితో పాటు బాగోగులు చూడాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు అన్నారు. ఇలాంటి ఏ విద్యార్థీ చదువుకు దూరం కాకూడదని తెలిపారు. ఉండవల్లిలోని డాన్ బాస్కో నవజీవన్ బాల భవన్ (చిగురు బాలల ఆశ్రమం)లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడం కోసం బోధనా సిబ్బందికి, వివిధ ఎన్జీవోల నిర్వాహకులకు రాష్ట్ర స్థాయి శిక్షణా శిబిరం నిర్వహించారు. మూడురోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో శుక్రవారం ముగింపు సందర్భంగా ఎస్పీడీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చదువుకు దూరమైన వారిని గుర్తించి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస విద్యాలయాల్లోని చేర్పించి విద్యనందిస్తున్నామన్నారు.

'స్పా'తో మున్సిపల్ శాఖ ఒప్పందం

సాక్షి, అమరావతి: మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి, పట్టణ ప్రణాళిక అమలులో సామర్థ్యాన్ని పెంచేందుకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ డాక్టర్ కొండా రమేష్ ఒప్పందంపై సంతకం చేశారు.

కలెక్టరేట్ల వద్ద ఏబీవీపీ నిరసనలు

సాక్షి, అమరావతి: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) శుక్రవారం వివిధ జిల్లాల్లోని కలెక్టరేట్‌ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జీఓ–77 రద్దు చేయాలని నేతలు డిమాండ్ చేశారు.

యోగా ప్రచార పరిషత్ ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో యోగా ప్రచార పరిషత్(ఏపీవైపీపీ) ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి సత్యకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగా, ప్రకృతి వైద్యం, పరిశోధనలను ప్రోత్సహించడం కోసం రూ.10 కోట్లతో విశాఖ, విజయవాడ, ఒంగోలు, తిరుపతిలో ప్రచార కేంద్రాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

క్రీడా సంఘాలకు శాప్ గుర్తింపు తప్పనిసరి

సాక్షి, అమరావతి: క్రీడా సంఘాలకు గుర్తింపు, వార్షిక రిజిస్ట్రేషన్లు తప్పనిసరి చేయాలని ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) నిర్ణయించింది. శుక్రవారం శాప్ 86వ బోర్డు సమావేశం జరిగింది. శాప్ చైర్మన్ రవినాయుడు, ఎండీ భరణి పాల్గొన్నారు.

ఏపీ జెన్‌కో డైరెక్టర్‌కు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.నాగలక్ష్మికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఏపీ పవర్ డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (ఏపీపీడీసీఎల్) నాన్‌–హోల్ టైమ్ చైర్మన్‌గా నియమించింది. ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీపీఎఫ్‌ఎస్‌ఎల్) బోర్డులో డైరెక్టర్, ప్రమోటర్/ సబ్‌స్క్రైబర్/ షేర్‌హోల్డర్‌గానూ, రూరల్ అగ్రికల్చర్ పవర్ లిమిటెడ్ (ఏపీఆర్‌ఏపీఎల్) బోర్డులో డైరెక్టర్‌గానూ బాధ్యతలిచ్చింది.

జీఎస్టీ ప్రయోజనాలపై అవగాహన కల్పించండి: సీఎస్

సాక్షి, అమరావతి: జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు నెల రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని సీఎస్ కె.విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్.. నెల రోజుల సెలబ్రేషన్స్ కార్యక్రమంపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. దసరా నుంచి దీపావళి వరకు నెల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక ప్రచార అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు.

సాగునీటి కాలువలకు రూ.57.14 కోట్లు

సాక్షి, అమరావతి: గతేడాది ఆగస్టు, సెప్టెంబరులో వరద ఉధృతికి దెబ్బతిన్న సాగునీటి కాలువలు, అక్విడెక్టులు, బ్రిడ్జిల మరమ్మతులకు రూ.57.14 కోట్లు మంజూరు చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 392 ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టడానికి నిధులు మంజూరు చేయాలని ఈఎన్‌సీ పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది.

డీఎస్సీ అభ్యంతరాల పరిష్కారానికి చర్యలు

జోనల్, రాష్ట్రస్థాయిలో ఫిర్యాదుల పరిష్కారానికి కమిటీల ఏర్పాటు

సాక్షి, అమరావతి: డీఎస్సీ–2025 టీచర్ నియామకాల్లో అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం జోనల్, రాష్ట్ర స్థాయిలో కమిటీలను ఏర్పాటుచేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఆదేశాలు జారీచేశారు. సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుపు వచ్చినప్పటికీ అభ్యర్థిత్వం పరిగణనలోకి తీసుకోకపోవడం.. కాంట్రాక్టు/ఔట్ సోర్సింగ్ సమయంలో చేసిన అర్హత కోర్సుల కారణంగా తిరస్కరణ, జీఓ–77 నిబంధనలు పాటించకపోవడం.. హారిజాంటల్, వెర్టికల్ రిజర్వేషన్ల సమస్యలు, కుల/వికలాంగుల సర్టిఫికెట్ల సమస్యలు, మెరిట్ లిస్ట్‌లో ఉన్నప్పటికీ తుది ఎంపికలో లేకపోవడం, మెరిట్ లిస్టుపై అభ్యంతరాలు తదితర అంశాల పరిష్కారానికి ఈ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటుచేసినట్లు ఆయన పేర్కొన్నారు. జోనల్ స్థాయి కమిటీలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ చైర్‌పర్సన్‌గా జోన్‌లోని ఇద్దరు డీఈఓలు జిల్లా స్థాయి పోస్టులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించి 15 రోజుల్లో పరిష్కరించాలన్నారు. అలాగే, రాష్ట్రస్థాయి కమిటీలో అదనపు డైరెక్టర్ (సర్వీసెస్) చైర్‌పర్సన్‌గా డీఎస్సీ కన్వీనర్ మెంబర్‌గా జోనల్/రాష్ట్రస్థాయి ఫిర్యాదులు స్వీకరించి 15 రోజుల్లో ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. తుది అప్పీల్ అధికారిగా పాఠశాల విద్య డైరెక్టర్ రాష్ట్ర కమిటీ నిర్ణయాలపై 30 రోజుల్లో పరిష్కరించాలని కోన శశిధర్ ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

జోనల్ స్థాయి ఫిర్యాదులకు మెయిల్ ఐడీలు..

mdscgrievances.z1@apschooledu.in,
mdscgrievances.z2@apschooledu.in,
mdscgrievances.z3@apschooledu.in,
mdscgrievances. z4@apschooledu.in
రాష్ట్రస్థాయి ఫిర్యాదులకు: mdscgreivances.
state@apschooledu.in
తుది అప్పీల్ కోసంmdscappellateauthority@apschooledu.in
ఫిర్యాదులను పంపించాలన్నారు.

బెంగళూరులో ఒరిగిన బహుళ అంతస్తుల భవనం

బనశంకరి: బెంగళూరు నగరంలో నిర్మాణం పూర్తి చేసుకున్న బహుళ అంతస్తుల భవనం ఓ వైపునకు వాలిపోయింది. కోరమంగళ వెంకటాపురలో ఈ ఘటన చోటుచేసుకుంది. సుమారు 750 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐదు అంతస్తులుగా నిర్మించారు. ఈ భవనంలోకి ఇంకా ఎవరూ చేరలేదు. శుక్రవారం ఈ కట్టడం ఓ వైపునకు ఒరిగింది. దీంతో పక్కన నివాసం ఉంటున్న వందలాది కుటుంబాల వారు తీవ్ర భయాందోళనకు లోనై ఇళ్లనుంచి బయటకు వచ్చారు. అధికారులు, మడివాళ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆ కట్టడం సమీపంలోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు చేపట్టారు. ముందు జాగ్రత్త చర్యగా అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. శనివారం నుంచి భవనాన్ని కూలగొట్టనున్నారు. శుక్రవారమే జేసీబీలను అక్కడికి తీసుకొచ్చారు.

● వండర్ గర్ల్

పర్యావరణ కోసం పోరాడుతోంది





పిల్లలూ.... ఈ ప్రకృతి దానిలో భాగమైన భూమి మనకు దొరికిన వరం. ఇది మనుషులైన మనతో పాటు అనేక జీవాలకు ఆవాసం. మరి అంతటి విలువైన ప్రకృతిని సంరక్షించుకోవాల్సిన మనం ఏం చేస్తున్నాం? అనేక రూపాల్లో రోజు రోజుకీ ధ్వంసం చేస్తున్నాం. కానీ మణిపూర్‌కు చెందిన లిసిప్రియా కంగుజాం మాత్రం 'ఈ సమస్త భూమండలాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన మీద ఉన్నది' అని తన ఆరేళ్ళ వయసు నుండి పర్యావరణ సమస్యల మీద అవగాహన కల్పించడం ప్రారంభించింది.

2011లో జన్మించిన ఈ బాలిక, 2018లో అంటే ఆరేళ్ళ వయసులో చైల్డ్ మూవ్‌మెంట్ అనే సంస్థను స్థాపించి, క్లైమేట్ చేంజ్‌ను ఎదుర్కొనేందుకు పిల్లలను సమీకరించింది. లిసిప్రియా 2019లో యునైటెడ్ నేషన్స్ క్లైమేట్ చేంజ్ కాన్ఫరెన్స్ (ఇ్వ25)లో మాట్లాడి, అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. ఆమె ప్రసంగంలో పర్యావరణ రక్షణ కోసం యువత శక్తిని ఉపయోగించాలని నొక్కి చెప్పింది.

భారతదేశంలో క్లైమేట్ చేంజ్‌ను పాఠ్యాంశంలో చేర్చాలని, శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించాలని కోరింది. సామాజిక మాధ్యమాల ద్వారా ఆమె సందేశం లక్షల మంది యువతకు చేరడంతో ఆమె పోరాటానికి గుర్తింపుగా 2019లో డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం చిల్డ్రన్స్ అవార్డ్, 2020లో గ్లోబల్ చైల్డ్ ప్రాడిజీ అవార్డ్ వంటి పురస్కారాలు అందుకుంది. లిసిప్రియా, సమకాలీన సమాజంలో యువతకు స్ఫూర్తిగా నిలిచి, పర్యావరణ రక్షణ కోసం అవిశ్రాంత కృషి చేస్తోంది, భవిష్యత్ తరాలకు మార్గం సుగమం చేస్తూ. అంతేకాకుండా ప్రపంచ నాయకులను పర్యావరణ సంక్షోభానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోమని ప్రేరేపించడమే లక్ష్యంగా పెట్టుకుని ఆ దిశగా కృషిచేస్తుంది.

● స్ఫూర్తి

21 ఏళ్లకే న్యాయవాది అయ్యింది



భలే భలే. ఈమె చిన్న వయసులో న్యాయవాది అయ్యింది. అదీ మన దేశంలో కాదు. ఇంగ్లాండ్‌లో. ఇంకా గొప్ప కదూ.

న్యాయవాది కావాలంటే ఎన్నో విషయాలపై అవగాహన ఉండాలి. చట్టాలు, న్యాయ సూక్ష్మాలు తెలిసి ఉండాలి. బారెడు పుస్తకాలు చదివి ఉండాలి. నిత్యం సమాజంలో ఏం జరుగుతుందో గమనిస్తుండాలి. ఇవన్నీ చేస్తేనే న్యాయవాదిగా నిలదొక్కుకుంటారు. పాతికేళ్ల దాటితే తప్ప చాలామంది న్యాయవ్యాద వృత్తిని చేపట్టరు. అలాంటిది 18 ఏళ్లకే లా డిగ్రీ పొంది, 21 ఏళ్లకు న్యాయవాదిగా కేసులు వాదిస్తూ పేరు తెచ్చుకుంటోంది ఓ యువతి. తనే కృషాంగి మేస్రామ్. భారత సంతతికి చెందిన తను ఇంగ్లాండ్‌లో అతి పిన్న వయస్కురాలైన సొలిసిటర్‌గా చరిత్ర సృష్టించింది.



పశ్చిమ బెంగాల్‌లోని మాయాపూర్‌కు చెందిన కృషాంగి మెస్రామ్‌కు చిన్ననాటి నుంచి న్యాయశాస్త్రంపై ఆసక్తి ఎక్కువ. న్యాయవాదుల్లా తాను కోర్టులో వాదనలు వినిపించాలని, బాధితులకు న్యాయం అందించాలని భావించింది. వారి కుటుంబం ఇంగ్లండ్‌లో స్థిరపడింది. 15 సంవత్సరాల వయస్సులో స్థానికంగా లా కాలేజీలో చేరాలని భావించినా, ఇంటికి దూరంగా ఉండటానికి ఆమె ఇష్టపడలేదు. ఆ సమయంలో మిల్టన్ కీన్స్‌లోని ఓపెన్ యూనివర్సిటీలో లా చదివేందుకు అవకాశం ఉందని తెలుసుకొని, అందులో చేరాలని నిర్ణయం తీసుకుంది. ఇంట్లోనే తల్లిదండ్రులు, చెల్లెలితో కలిసి ఉంటూ మూడేళ్లపాటు కష్టపడి లా పూర్తి చేసింది. న్యాయవాదిగా పేరు తెచ్చుకునేందుకు కావాల్సిన నైపుణ్యాలను ఆ సమయంలోనే అపపోసన పట్టింది. 18 ఏళ్ల వయస్సులో బ్యాచిలర్ ఆఫ్ లాస్ (ఆనర్స్) డిగ్రీ పూర్తి చేసిన తర్వాత సింగపూర్‌లో ఓ ఉద్యోగంలో చేరింది. మూడేళ్ల అక్కడ పని చేసి, తగిన అనుభవాన్ని గడిచింది. తిరిగి ఇంగ్లండ్ చేరుకున్న ఆమె అతి పిన్న వయస్కురాలైన సొలిసిటర్‌గా మారింది. ప్రైవేట్ క్లయింట్‌లకు న్యాయవాదిగా మారి సేవలందిస్తానని వివరిస్తోంది.

● మహనీయులు

తెలుగు సమగ్ర సాహిత్య దీప్తి ఆరుద్ర



తెలుగువారికి అనేక మంది ప్రముఖులు సాహిత్యసేవలు అందించారు. వారి చేసిన పని ద్వారా భాషావ్యాప్తి, సాహిత్య విస్తరణ జరిగింది. అటువంటివారిని వారిని మనం ఎల్లప్పుడూ స్మరించుకోవాలి. వారిలో ఒకరు ఆరుద్ర. ఆరుద్ర అసలు పేరు భాగవతుల సదాశివశంకరశాస్త్రి. 1925 ఆగస్టు 31న విశాఖపట్నంలో జన్మించారు. విశాఖపట్నం ఎ.వి.ఎన్. కాలేజీ ఉన్నత పాఠశాలలో, ఆ తర్వాత విజయనగరంలో ఎం.ఆర్.కళాశాలలో చదువుకున్నారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో చదువుకు స్వస్తి పలికారు. 1943-47 మధ్యకాలంలో రాయల్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో గుమాస్తాగా పనిచేశారు. తర్వాత చెన్నై నుంచి వెలువడే వారపత్రిక 'ఆనందవాణి'కి సంపాదకుడిగా పనిచేశారు.

చెన్నై చేరుకున్న ఆరుద్ర డిటెక్టివ్ నవలలతో మొదలుపెట్టి సమగ్ర ఆంధ్ర సాహిత్యం సంపుటాల వరకు రచించారు. త్వమేవాహంతో మొదలుపెట్టి వందలాదిగా గేయాలు, గేయ నాటికలు, కథలు, నవలలు, సాహిత్య పరిశోధక వ్యాసాలు, వ్యంగవ్యాసాలు, పుస్తకాలకు పీఠికలు, పుస్తకాలపై విమర్శలు అన్నీ రాశారు. దీంతోపాటు అనేక చిత్రాల్లో పాటలు రాశారు. అభ్యుదయ రచయితల సంఘం(అరసం) వ్యవస్థాపకుల్లో ఆరుద్ర ఒకరు. ప్రముఖ కవి శ్రీశ్రీకి ఆరుద్ర మేనల్లుడు. ఆ క్రమంలో ఆరుద్ర కవితాధోరణిలో శ్రీశ్రీ ప్రభావం కొంతవరకూ ఉందని అంటారు. ఆరుద్ర సతీమణి రామలక్ష్మి సైతం రచయిత్రి కావడం విశేషం. తెలుగు లోకానికి అనేక సాహితీ సేవలు అందించిన ఆరుద్ర 1998 జూన్ 4న మరణించారు.

● మీకు తెలుసా?

ఈతాకు చాపలు... ఎప్పుడైనా చూశారా?







పిల్లలూ! మనింటికి ఎవరైనా చుట్టాలు వస్తే కుర్చీల మీద, సోఫాల మీద కూర్చోబెడతాం. వారికేం కావాలో అడుగుతాం. అయితే గతంలో ఇంటికెవరైనా వస్తే ఈతాకు చాపలు పరిచి కూర్చోబెట్టేవారన్న విషయం మీకు తెలుసా? ప్రస్తుతం మార్కెట్లో ప్లాస్టిక్ చాపలు విరివిగా దొరుకుతున్నాయి. అయితే గతంలో ఈతాకు చాపల్నే జనం ఎక్కువగా వాడేవారు. పాత రోజుల్లో పల్లెలతో పాటు పట్టణాల్లోనూ ప్రతి ఇంట్లో ఒక చాప ఉండేది.

ఈత చాపల్ని అల్లడం ఒక ప్రత్యేకమైన సాంప్రదాయ కళ. ఇది అందరికీ ఒంటబట్టేది కాదు. దీన్ని కొందరు కులవృత్తిగా చేస్తుంటారు. ముందుగా ఈత చెట్ల నుంచి కొమ్మలను తీసుకొచ్చి వాటిని ఎండబెడతారు. ఆ తర్వాత ఆకులను వొలిచి కట్టలు కడతారు. ఈ ఆకులతో పొడవుగా ఒక వరుసలో అల్లకాన్ని చేస్తారు. దీన్ని పట్టీ అంటారు. అనంతరం పొడవుగా ఉన్న పట్టీని చాప సైజు ప్రకారం కట్ చేసి 16 పట్టీలను ఒక చోట చేర్చి చాప తయారుచేస్తారు. ఓ వ్యక్తి రోజంతా అల్లితే ఓ చాప తయారవుతుంది. ఒక్కో చాప రూ.80 చొప్పున వ్యాపారులు కొని మార్కెట్లో అధిక ధరలకు అమ్ముతుంటారు. వేసవిలో ఈతచాపల మీద పడుకుంటే చల్లగా ఉంటుంది. ప్రశాంతంగా నిద్ర పడుతుంది. దీనివల్ల పర్యావరణానికి ఎటువంటి హానీ కలగదు. ప్రస్తుతం పల్లెల్లో ఏ కొద్దిమందో తప్ప ఎవరూ ఈ చాపలను ఇళ్లల్లో వాడటం లేదు. చింతపండు, బెల్లం వంటి వాటిని పార్సిల్ చేసేందుకు ఈతచాపలను ఉపయోగిస్తున్నారు.

● మన పుస్తకాలు

మాయ మంత్రాలతో నడిచే కథ



రచయిత్రి కెల్లీ బార్న్‌హిల్ 2016లో రాసిన పిల్లల పుస్తకం ఇది. లూనా అనే అమ్మాయి జాన్ మంత్రగత్తె వద్ద పెరిగింది. ఆమె ద్వారా లూనాకు పలు మంత్రశక్తులు వచ్చాయి. వాటిని ఎలా వాడాలో, వాటి ద్వారా ఏం చేయాలో ఆమె త్వరగా గుర్తించాలి. ఈ క్రమంలో లూనా ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొందనేది ఇందులోని కథ. మాయాలు, మంత్రాల కథలు ఇష్టపడేవారికి నచ్చే పుస్తకం ఇది.

నీతిని బోధిస్తూ... మంచిని పెంచే కథలు



ప్రముఖ రచయిత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ రాసిన పిల్లల కథల పుస్తకం ఇది. 1970లో ఆయన రచించిన 'కబుర్ల దేవత' కథ బాలానందం పుస్తకంలో ప్రచురితమైంది. అదే పేరుతో 2003లో ఈ పుస్తకం తీసుకొచ్చారు. ఈ పుస్తకానికిగానూ ఆయన కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కారం పొందారు. ఇందులోని కథలన్నీ చిన్నారులను అలరిస్తాయి. నీతిని బోధిస్తాయి.

● కథ

గుమ్మడి కాయల దొంగ




అనగనగా ఓ ఊళ్లో సోమయ్య అనే పిసినారి ఉండేవాడు. అతనికి ఇల్లు, పొలం, ఆస్తిపాస్తులు ఉన్నాయి. అయినా తన వద్ద ఏమీ లేనట్లుగా ప్రవర్తించేవాడు. ఇతరుల నుంచి ఏదైనా ఉచితంగా వస్తుందంటే తీసుకోవాలని ఆబగా చూసేవాడు. అతని ప్రవర్తనకు ఊరంతా తిట్టుకునేది. ఒకసారి సోమయ్యకు గుమ్మడికాయల పులుసు తినాలని ఆశగా అనిపించింది. అతని కన్ను పక్కింటి పెరటి మీద పడింది. అందులో గుమ్మడికాయలున్నాయని కనిపెట్టాడు. రాత్రి పూట ఎవరూ చూడకుండా, దుప్పటి కప్పుకొని వారి పెరట్లోకి వెళ్లి గుమ్మడికాయలు దొంగతనం చేసి తీసుకొచ్చాడు. ఈ విషయాన్ని ఆ ఇంటి వారు చీకట్లో గమనించాడు. అయినా ఏమీ అనకుండా ఊరుకున్నాడు.


సోమయ్య తన భార్య చేత గుమ్మడికాయ పులుసు చేయించుకొని తృప్తిగా తిన్నాడు. పక్కింటి వారు అతని గుమ్మడికాయల దొంగతనం విషయాన్ని ఊరంతా చెప్పారు. దీంతో అందరికీ సోమయ్య చేసిన పని తెలిసిపోయింది. దీంతో అతనికి 'గుమ్మడికాయల దొంగ సోమయ్య' అని పేరు పెట్టి నవ్వుకున్నారు. మెల్లగా ఆ విషయం చుట్టుపక్కల ఊళ్లకు పాకింది. ఎవరైనా సోమయ్య ఉన్న వీధి గురించి చెప్పాలంటే 'గుమ్మడికాయలు దొంగతనం చేసినాయన వీధి' అని చెప్పడం మొదలుపెట్టారు. అటుగా వెళ్లే వారు కూడా 'గుమ్మడికాయలు దొంగతనం చేసినాయన ఇల్లు' అని సోమయ్య ఇంటిని చూపించేవారు.

కొంతకాలానికి సోమయ్య మరణించాడు. ఆయన కొడుక్కి పిసినారితనం లేదు. అయినా కూడా జనం ఆయన్ని చూసి 'గుమ్మడికాయలు దొంగతనం చేసినాయన కొడుకు' అని పిలిచేవారు. తన తండ్రి చేసిన పనికి తాను ఇలాంటి పేరు తెచ్చుకోవడం ఆయనకు ఇబ్బందికరంగా ఉండేది. అయినా ఏమీ చేయలేక ఊరుకునేవాడు. కొన్నాళ్లకు ఆయన మరణించాడు. ఆయన కొడుకు విదేశాల్లో చదువుకొని తిరిగి వచ్చాడు. ఊళ్లో అందరూ అతణ్ని 'గుమ్మడికాయలు దొంగతనం చేసినాయన మనవడు' అని పిలవడం మొదలుపెట్టారు. ఇదంతా అతనికి అవమానంగా తోచింది. తన తాత చేసిన పని ఇంకా తనను వెంటాడుతుందని, దాన్ని మార్చాలని అతను భావించాడు.

ఆ తర్వాత రోజు నుంచి ఊరిలోని నిరుపేదలు, అనాథలకు తన ఇంట్లోనే భోజనం ఏర్పాటు చేశాడు. రోజూ ఆ పని చేస్తూ ఊరంతా పేరు తెచ్చుకున్నాడు. దీంతో 'గుమ్మడికాయలు దొంగతనం చేసినవారి ఇల్లు' అనే మాట పోయి, 'అందరికీ అన్నం పెట్టే ఇల్లు' అనే పేరు వచ్చింది. పెద్దలు చేసిన తప్పులు పిల్లల్నీ వెంటాడతాయని, అందుకే ఏం చేసినా ఆచితూచి చేయాలని అందరూ గుర్తించారు.

● మన సినిమా

మహావతార్ నరసింహా



హేయ్ కిడ్స్... మీరు ఇప్పటిదాకా ఎన్నో అడ్వెంచరస్, ఫన్నీ కామిక్ మూవీస్ చూసే ఉంటారు. కాకపోతే మన మైథాలజీకి సంబంధించిన సినిమాలు తక్కువగా చూసి ఉంటారు. మీరు మామూలుగా చూసే సినిమాలలో వచ్చే యూనిక్ థ్రిల్, అడ్వెంచర్, ఫన్ ఇప్పుడు నేను చెప్పబోయే మైథాలజీ మూవీలో కూడా ఉన్నాయి. కిడ్స్... ఆ మూవీ పేరే మహావతార్ నరసింహా. ఇది ఓ యానిమేటెడ్ ఫిల్మ్. మన పురాణాల్లో ఎన్నో మాజికల్ మూమెంట్స్ ఉన్నాయి. వాటన్నిటినీ ఇప్పుడు యానిమేటెడ్ ఫాంలో మన ముందుకు తీసుకువచ్చారు ఈ మూవీ మేకర్స్. ఈ మూవీలో ఫ్లయింగ్ వెహికల్స్‌తో పాటు, ఎన్నో టెర్రిఫిక్ సీక్వెన్సెస్ చాలా ఉన్నాయి. కావాలంటే ఈ మూవీ ట్రైలర్ చూసి తరువాత మూవీ చూడండి. నెట్ ఫ్లిక్స్‌లో తెలుగు వెర్షన్ కూడా ఉంది. ఈ మూవీ చూస్తే మీకు టు బెనిఫిట్స్ ఉన్నాయి. ఒకటి మీరు మూవీని బాగా ఎంజాయ్ చేస్తారు. రెండు మీకు పురాణ గాథలు కొంత తెలుస్తాయి. అయితే ఈ మూవీ చూసేటపుడు మాత్రం మీ పేరెంట్స్‌ను దగ్గర పెట్టుకుని చూడండి. యు విల్ లవ్ దిస్ మూవీ. వాచిట్.

– హరికృష్ణ ఇంటూరు

బిజినెస్ రీల్

ఈఎస్ఐసీ కిందకు 20.36 లక్షల మంది

జూలైలో 5 శాతం పెరిగిన సభ్యులు



న్యూఢిల్లీ: ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) నిర్వహించే సామాజిక భద్రతా పథకం (ఈఎస్ఐ) కిందకు జూలైలో కొత్తగా 20.36 లక్షల మంది సభ్యులు చేరారు. ఈ ఏడాది జూన్ నెలతో పోల్చి చూస్తే 5 శాతం వృద్ధి నమోదైంది. జూన్‌లో సభ్యుల చేరిక 19,37,314గా ఉంది. కార్మిక శాఖ ఈ వివరాలను విడుదల చేసింది. 31,146 సంస్థలు కొత్తగా ఈఎస్ఐ పథకం కింద నమోదు చేసుకున్నాయి. మొత్తం 20.36 లక్షల సభ్యుల్లో 9.85 లక్షల మంది (48 శాతం) వయసు 25 ఏళ్లలోపే ఉంది. నికర మహిళా సభ్యుల చేరిక 4.33 లక్షలుగా ఉంది. ఈఎస్ఐ పథకం కింద 88 మంది ట్రాన్స్‌జెండర్లు సైతం పేర్లను నమోదు చేసుకున్నారు.

ఫ్లిప్‌కార్ట్ 'ట్రస్ట్‌షీల్డ్' ప్రోగ్రాం



బెంగళూరు: భారీ గృహోపకరణాలు, మొబైల్స్, నిర్దిష్ట ఎలక్ట్రానిక్స్‌ని డెలివరీ చేసిన 30 రోజుల్లోగా, సదరు ఉత్పత్తికి ఏదైనా సమస్య వస్తే తానే స్వయంగా పరిష్కరించేలా ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ 'ట్రస్ట్ షీల్డ్ ప్రోగ్రాం'ను ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ప్రమాదవశాత్తూ ఉత్పత్తి దెబ్బతినడం, నీరు లాంటి ద్రవాలు చొరబడటం వంటి సమస్యలు తలెత్తితే నేరుగా ఫ్లిప్‌కార్ట్ యాప్‌లో ఫిర్యాదు చేస్తే, కంపెనీయే స్వయంగా రెండు రోజుల్లో పరిష్కరిస్తుంది. ఏసీలు, టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లలాంటి ఉత్పత్తులకు ఇది వర్తిస్తుంది.

ఆఫ్కన్స్ ఇన్‌ఫ్రా బోర్డులో ఫిరోజ్ మిస్త్రీ

నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎంపిక



న్యూఢిల్లీ: మౌలిక రంగ కంపెనీ ఆఫ్కన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ల బోర్డులో ఫిరోజ్ సైరస్ మిస్త్రీ చేరారు. టాటా గ్రూప్ మాజీ చైర్‌పర్సన్, దివంగత సైరస్ పి.మిస్త్రీ కుమారుడు 29ఏళ్ల ఫిరోజ్‌ను నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎంపిక చేసినట్లు ఆఫ్కన్స్ ఇన్‌ఫ్రా తాజాగా పేర్కొంది. తద్వారా గ్రూప్‌నకు కీలకమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కన్‌స్ట్రక్షన్ బిజినెస్‌లలో షాపూర్‌జీ పల్లోంజీ తదుపరి తరం కుటుంబీకులు మరింతగా పాలుపంచుకోనున్నట్లు సంకేతమిచ్చారు. కాగా.. స్వతంత్ర డైరెక్టర్‌గా వెటరన్ బ్యాంకర్ సంతోష్ బాలచంద్రన్ నాయర్‌ను నియమించుకున్నట్లు ఆఫ్కన్స్ వెల్లడించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-9-2025

విశాఖ	530-00
చిత్తూరు	558-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
LT	3,743.00	2.71
TATAMOTORS	673.95	1.45
ITC	405	1.22
EICHERMOT	7,035.00	0.7
RELIANCE	1,379.00	0.48

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	712	-3.88
M&M	3,400.00	-3.68
TATASTEEL	167.35	-2.92
ETERNAL	322.9	-2.81
BAJFINANCE	985	-2.74

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,441
ఎన్ఎస్ఈ	97,348
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,11,160
ఎఫ్ఐఐ	- 5,688
డీఐఐ	+ 5,843

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	65.60 (రాత్రి 11.30కు)	$ 64.98 (క్రితం ముగింపు)
బ్రెంట్	69.97 (రాత్రి 11.30కు)	$ 69.42 (క్రితం ముగింపు)

జీఎస్‌టీ కోతతో షాపింగ్ సందడి

తోడైన పండుగల డిమాండ్

- 25 శాతం పెరిగిన అమ్మకాలు
- ప్రీమియం కొనుగోళ్లకు ఆసక్తి
- రెడ్‌సీర్ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: జీఎస్‌టీ శ్లాబుల క్రమబద్ధీకరణతో నిత్యావసర వస్తువల దగ్గర్నుంచి ఖరీదైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల వరకు ధరలు దిగిరావడం పండుగల సమయంలో ఈ-కామర్స్ మార్కెట్లో కొనుగోళ్ల సందడి నెలకొంది. మెట్రోపాలిటన్, కీలక మార్కెట్లలో ఈ-కామర్స్ అమ్మకాలు 23-25 శాతం వరకు పెరిగినట్టు మార్కెట్ పరిశోధన సంస్థ రెడ్‌సీర్ నిర్వహించిన అధ్యయనంలో తెలిసింది. 32 అంగుళాలకు మించిన టీవీలు, ఫర్నిచర్, ఫ్యాషన్ ఉత్పత్తులపై రేట్ల తగ్గింపు ప్రయోజనాలను కంపెనీలు వినియోగదారులకు బదలాయించాయి. ధరలు చెప్పుకోతగ్గ స్థాయిలో దిగిరావడంతో సంప్రదాయ డిస్కౌంట్ తగ్గింపులకు పరిమితం కాకుండా, తమ ఆకాంక్షలకు అనుగుణంగా ఖరీదైన కొనుగోళ్లకు వినియోగదారులు మొగ్గు చూపిస్తున్నట్టు రెడ్‌సీర్ నివేదిక తెలిపింది. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో విచక్షణారహిత కొనుగోళ్లకు జీఎస్‌టీ సంస్కరణలు ప్రేరణనిచ్చినట్టు పేర్కొంది.

8 శాతం తగ్గిన టీవీ ధరలు

పెద్ద సైజు టీవీలపై జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడంతో వీటి విక్రయ ధరలు 6-8 శాతం వరకు తగ్గినట్టు, ప్రీమియం మోడళ్లకు డిమాండ్ పెరిగినట్టు రెడ్‌సీర్ నివేదిక తెలిపింది. ఫ్యాషన్ వస్త్రాలపై (రూ.2,500లోపు ఉన్నవి) జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించడంతో మధ్య శ్రేణి ధరల దుస్తుల అమ్మకాలు పెరిగినట్టు పేర్కొంది. ఫర్నిచర్‌పైనా జీఎస్‌టీ 5 శాతానికి దిగి రావడంతో వినియోగదారులు తమ షాపింగ్ కార్టుల్లో వీటికీ చోటిస్తున్నట్టు వెల్లడించింది. జీఎస్‌టీలో 12 శాతం , 28 శాతం శ్లాబులను ఎత్తివేసి వాటిల్లోని ఉత్పత్తులను 5 శాతం, 18 శాతం కిందకు తీసుకురావడం తెలిసిందే. పొగాకు ఉత్పత్తులు, విలాస వస్తువులు కొన్నింటిపై మాత్రం 40 శాతం జీఎస్‌టీని ప్రతిపాదించారు. కొత్త రేట్లు ఈ నెల 22 నుంచి అమల్లోకి వచ్చాయి.



అనూహ్య డిమాండ్..

"మొదటి రెండు రోజులు అమ్మకాలు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 23-25 శాతం వరకు పెరిగాయి. జీఎస్‌టీ 2.0కి, పండుగల డిమాండ్ తోడైంది. ప్రీమియం స్మార్ట్‌ఫోన్లు, టీవీల కొనుగోళ్లు పెరిగాయి. డిమాండ్ బలంగా ఉందని యూజర్ల అభిప్రాయాల ఆధారంగా తెలుస్తోంది. కొనుగోలుకు ఒకేసారి ఎక్కువ మంది ఆసక్తి చూపించడంతో కొన్ని యాప్‌లు క్రాష్ కావడం, నిదానించడం కనిపించింది. ఫ్లాష్ డీల్స్‌కు తోడు ముందస్తు డిస్కౌంట్లను సొంతం చేసుకునేందుకు యూజర్లు ఆసక్తి చూపించారు" అని రెడ్‌సీర్ నివేదిక తెలిపింది. అమెజాన్ ఈ నెల 23 నుంచి గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ అమ్మకాలు ప్రారంభించగా, మొదటి రెండు రోజుల్లోనే 38 కోట్ల కస్టమర్లు తమ ప్లాట్‌ఫామ్‌ను సందర్శించినట్టు ప్రకటించింది. 70 శాతం డిమాండ్ టాప్-9 పట్టణాలకు వెలుపలి నుంచే ఉన్నట్టు పేర్కొంది. స్మార్ట్‌ఫోన్లు, గృహోపకరణాలు, ఫ్యాషన్, సౌందర్య ఉత్పత్తులు, క్యూఎల్ఈడీ, మినీ ఎల్ఈడీ టీవీలు, అత్యాధునిక వాషింగ్ మెషిన్లు, ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్లకు డిమాండ్ బలంగా ఉన్నట్టు తెలిపింది. టైర్ 2, 3 పట్టణాలకు చెందిన చిన్న, మధ్యస్థాయి సంస్థల అమ్మకాలు (అమెజాన్ ద్వారా) మూడు రెట్లు పెరిగినట్టు అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ సౌరభ్ శ్రీవాస్తవ తెలిపారు. మరో ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ పేరుతో విక్రయాలు మొదలు పెట్టగా, మొదటి 48 గంటల్లో 21 శాతం అధికంగా యూజర్లు తమ ప్లాట్‌ఫామ్‌కు విచ్చేసినట్టు ప్రకటించింది. మొబైల్స్, టీవీలు, రిఫ్రిజిరేటర్లకు డిమాండ్ 26 శాతం పెరిగినట్టు తెలిపింది. మెట్రోలతోపాటు ఇండోర్, సూరత్, వారణాసి తదితర పట్టణాల నుంచి సైతం డిమాండ్ కనిపించినట్టు పేర్కొంది.

వెండి.. రికార్డుల మోత!

ఢిల్లీ మార్కెట్లో కిలో ధర రూ.1,41,900
రూ.330 పెరిగిన పసిడి



న్యూఢిల్లీ: వెండి ఎప్పటికప్పుడు కొత్త రికార్డులను నమోదు చేస్తోంది. శుక్రవారం ఢిల్లీ మార్కెట్లో కిలోకి రూ.1,900 పెరిగి రూ.1,41,900 స్థాయికి చేరింది. ఇది మరో నూతన గరిష్ట స్థాయి కావడం గమనార్హం. పండుగల సీజన్ నేపథ్యంలో స్టాకిస్టుల నుంచి డిమాండ్ కనిపించినట్టు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. భౌతిక మార్కెట్లో పెట్టుబడులకు బలమైన డిమాండ్ ఉన్నట్టు పేర్కొంది. గురువారం ఢిల్లీ మార్కెట్లో వెండి రూ.1,40,000 వద్ద ముగిసింది. మరోవైపు పసిడి 20 గ్రాములకు రూ.330 లాభపడి 1,17,700కు చేరింది. అంతర్జాతీయంగా చూస్తే స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు పెద్దగా మార్పు లేకుండా 3,745 డాలర్ల వద్ద, పసిడి ఔన్స్‌కు 0.35 శాతం తగ్గి 45 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి. అంతర్జాతీయంగా బలహీన సంకేతాలు నెలకొన్నప్పటికీ పండుగల కొనుగోళ్లకు తోడు, దేశీ డిమాండ్ స్థిరంగా కొనసాగడం ధరలకు మద్దతుగా నిలిచినట్టు ట్రేడర్లు తెలిపారు.

సోఫా సెగ్మెంట్లో 20 శాతం వాటా లక్ష్యం

సెంచురీ మ్యాట్రెసెస్ ఈడీ ఉత్తమ్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సెంచురీ మ్యాట్రెసెస్ సంస్థ తాజాగా సోఫాల సెగ్మెంట్లోకి ప్రవేశించింది. ప్రస్తుతం దేశీయంగా ఈ మార్కెట్ సుమారు రూ. 50,000 కోట్లుగా ఉండగా, అందులో 10 శాతమే సంఘటితంగా ఉందని కంపెనీ ఈడీ ఉత్తమ్ మలానీ తెలిపారు. వచ్చే మూడేళ్లలో సంఘటిత రంగంలో దాదాపు 20 శాతం వాటాను లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. సోఫాల తయారీ కోసం సుమారు రూ. 35 కోట్లతో హైదరాబాద్‌లో యూనిట్ ఏర్పాటు చేశామని ఉత్తమ్ తెలిపారు. కొత్త విభాగంతో 20 శాతం ఆదాయ వృద్ధి అంచనా వేస్తున్నట్లు వివరించారు. శుక్రవారం బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, సంస్థ ప్రచారకర్త పీవీ సింధుతో కలిసి కొత్త సోఫాల శ్రేణిని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. వీటి ధరలు సుమారు రూ. 19,195 నుంచి ప్రారంభమవుతాయి. ప్రస్తుతం ఏటా 10 లక్షల మ్యాట్రెస్‌లు, 20,000 టన్నుల పాలీయూరెథీన్ ఫోమ్ ఉత్పత్తి సామర్థ్యంతో తమకు ఆరు ప్లాంట్లు ఉన్నట్లు ఉత్తమ్ తెలిపారు. జీఎస్‌టీ, ఐటీ శ్లాబుల తగ్గింపుతో ప్రజల చేతిలో మరికాస్త నిధులు మిగిలే అవకాశాలున్న నేపథ్యంలో పండుగ సీజన్‌లో కొనుగోళ్లు మెరుగ్గా ఉంటాయని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. తమకు దేశవ్యాప్తంగా 5,000, తెలంగాణలో 500 రిటైలర్లు ఉన్నట్లు వివరించారు.

కొత్త శాఖల్లేవు.. స్థిరీకరణకు ప్రాధాన్యం

స్టాండర్డ్ చార్టర్డ్ సీఈవో పీడీ సింగ్



ముంబై: భారత్‌లో ప్రస్తుతమున్న 100 శాఖలకు అదనంగా కార్యకలాపాల విస్తరణ యోచన లేదని స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ ఇండియా సీఈవో పీడీ సింగ్ ప్రకటించారు. పలు విదేశీ బ్యాంకులు భారత్‌లో తమ కార్యకలాపాల స్థిరీకరణకు ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో.. స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ మాత్రం పెద్ద శాఖల రూపంలో తమ స్థానాన్ని బలోపేతం చేసుకుంటుందన్నారు. తద్వారా కస్టమర్ల అవసరాలను సంతృప్తికర స్థాయిలో తీర్చగలమని చెప్పారు. కోల్‌కతా, చెన్నైలో పెద్ద శాఖలను తెరవడాన్ని ప్రస్తావించారు. ప్రయారిటీ బ్యాంకింగ్ సెంటర్లు ప్రస్తుతం ఏడు ఉండగా, వీటిని 21కి పెంచుకోవాలని అనుకుంటున్నట్టు చెప్పారు. ఒకే కస్టమర్‌కు ఒకటికి మించిన ఉత్పత్తులు, సేవలను అందించనున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ కార్యకలాపాలకు మద్దతుగా చెన్నై, బెంగళూరులో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను (జీసీసీలు) స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ నిర్వహిస్తూ, 24వేల మందికి ఉపాధి కల్పిస్తుండడం గమనార్హం. ఇవి మరింత వృద్ధి చెందనున్నట్టు సింగ్ చెప్పారు. ఫారెక్స్ సెటిల్‌మెంట్లలో తమకు 8 శాతం వాటా ఉందన్నారు. రూపాయి ఇన్వాయిసింగ్‌కు డిమాండ్ పెరుగుతోందని.. మధ్య ప్రాచ్యంలో వాణిజ్యానికి రూపాయి మారకంలో చెల్లింపుల అమలు విస్తరిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ రుణాల్లో 10 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రకటించారు.

వారసత్వ ప్రదేశాలకు యువతరం ఓటు

- ప్రీమియం వసతులకు ప్రాధాన్యం
- నూర్‌మహల్ ప్యాలస్ సర్వే వెల్లడి



న్యూఢిల్లీ: యువతరం (18-24 ఏళ్లు) చారిత్రక ప్రాశస్త్యం, గొప్ప వారసత్వం కలిగిన ప్రదేశాలను చూసి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రీమియం వసతులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆతిథ్య సేవల సంస్థ నూర్‌మహల్ ప్యాలెస్ సర్వే ఈ విషయాలను వెల్లడించింది. సంప్రదాయ పర్యాటక ప్రదేశాల కంటే గొప్ప చారిత్రక, సాంస్కృతిక వైభవం కలిగిన ప్రదేశాలను చూడడానికి వారు ఆసక్తి చూపిస్తున్నారు. ఢిల్లీ, ముంబై, జైపూర్, కర్నాల్, కోల్‌కతాలో 2,000 మందిని సర్వే చేసి ఈ వివరాలను నూర్‌మహల్ ప్యాలెస్ విడుదల చేసింది. గొప్ప చారిత్రక, సాంస్కృతిక వారసత్వం కలిగిన ప్రాపర్టీల్లో బస చేయాలని అనుకుంటున్నట్టు సర్వేలో 53 శాతం మంది చెప్పారు. వినూత్నమైన చరిత్ర, నిర్మాణ నైపుణ్యం (ఆర్కిటెక్చర్), వ్యక్తిగత సేవలకు ప్రాధాన్యం దృష్ట్యా తాము ఖరీదైన వారసత్వ ప్రాపర్టీలను ఎంపిక చేసుకుంటున్నట్టు వారు చెప్పారు. "యువత కేవలం లగ్జరీనే కోరుకోవడం లేదు. చారిత్రక వైభవంతో అనుసంధానాన్ని కోరుకుంటున్నారు. ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందిస్తూనే.. చరిత్ర, సంస్కృతితో అనుసంధానమయ్యే అనుభవాన్ని అందించడం పట్ల గర్విస్తున్నాం" అని నూర్‌మహల్ ప్యాలెస్ ఈడీ రూప్ ప్రతాప్ చౌదరి తెలిపారు.

టాటా కన్సూమర్ పెట్టుబడులు

- ఫుడ్ ప్రాసెసింగ్‌పై దృష్టి
- ఐదేళ్లలో రూ. 2,000 కోట్లు



న్యూఢిల్లీ: ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలో ఎఫ్ఎంసీజీ దిగ్గజం టాటా కన్సూమర్ ప్రొడక్ట్స్(టీసీపీఎల్) పెట్టుబడులకు సిద్ధపడుతోంది. రానున్న ఐదేళ్లలో రూ. 2,000 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు ప్రణాళికలు వేసింది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందాన్ని(ఎంవోయూ) కుదుర్చుకుంది. పెట్టుబడుల కోసం ఏర్పాటు చేసిన వరల్డ్ ఫుడ్ ఇండియా కార్యక్రమం సందర్భంగా టాటా గ్రూప్ దిగ్గజం తాజా వివరాలు తెలియజేసింది. పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన 2025 వరల్డ్ ఫుడ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖతో నాన్ బైండింగ్ ఎంవోయూ కుదుర్చుకున్నట్లు టీసీపీఎల్ పేర్కొంది. ఐదేళ్ల కాలంలో రూ. 2,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. అయితే ఒక్కో ప్రాజెక్టుపై ఆర్థికపరమైన మూల్యాంకనం చేపట్టడంతోపాటు.. సంబంధిత కార్పొరేట్, చట్టబద్ధ అనుమతులు లభించాక మాత్రమే ప్రతిపాదిత పెట్టుబడులకు తెరతీసే వీలున్నట్లు తెలియజేసింది. వెరసి తదుపరి దశలో ప్రతిపాదనల్లో మార్పులకు అవకాశమున్నట్లు తెలియజేసింది. కాగా.. నిబంధనలు, ప్రతిపాదనలు తుది దశకు చేరితే.. అవసరానికి అనుగుణంగా సంబంధిత వివరాలను వెల్లడించనున్నట్లు తెలియజేసింది. టాటా టీ, టెట్లీ, టాటా సాల్ట్, హిమాలయన్ వాటర్, టాటా సంపన్న్, టాటా గ్లూకో ప్లస్ తదితర సుప్రసిద్ధ బ్రాండ్లను కలిగి ఉంది. గ్రూప్ కంపెనీ టాటా కెమికల్స్ నుంచి కన్సూమర్ ప్రొడక్టుల బిజినెస్‌ను టాటా గ్లోబల్ బెవరేజెస్‌లో విలీనం చేయడం ద్వారా కంపెనీ ఎఫ్ఎంసీజీ దిగ్గజంగా ఆవిర్భవించింది. గతేడాది(2024-25) రూ. 17,618 కోట్ల ఆదాయం సాధించింది.

ఫుడ్ ప్రాసెసింగ్ శాఖతో గోద్రెజ్ ఆగ్రోవెట్ ఒప్పందం



న్యూఢిల్లీ: ఫుడ్ ప్రాసెసింగ్ శాఖతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు గోద్రెజ్ ఆగ్రోవెట్ వెల్లడించింది. దీని ప్రకారం తయారీ, ప్రాసెసింగ్, రీసెర్చ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రూ. 960 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపింది. వరల్డ్ ఫుడ్ ఇండియా 2025 కార్యక్రమం సందర్భంగా ఎంవోయూపై సంతకాలు చేసినట్లు గోద్రెజ్ ఆగ్రోవెట్ సీఈవో సునీల్ కటారియా తెలిపారు. ఆయిల్ పామ్, పెట్ ఫుడ్ వ్యాపారాలపై ప్రధాన ఫోకస్‌తో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, త్రిపుర, అస్సాం, మహారాష్ట్రవ్యాప్తంగా ఈ పెట్టుబడులు ఉంటాయి. భారత అగ్రి-ఫుడ్ వ్యవస్థను పటిష్టం చేయాలన్న నిబద్ధతకు ఈ ఎంవోయూ నిదర్శనమని ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ శాఖ కార్యదర్శి అవినాష్ జోషి తెలిపారు.

మళ్లీ ఐపీవోల హవా

నిధుల సమీకరణకు క్యూ

- 4 పబ్లిక్ ఇష్యూలు రెడీ
- 11 కంపెనీల లిస్టింగ్
- 16 ఎస్ఎంఈ ఐపీవోలు
- 16 ఎస్ఎంఈల లిస్టింగ్

వచ్చే వారం (సెప్టెంబర్ 29-అక్టోబర్ 3) మరోసారి ప్రైమరీ మార్కెట్లు కళకళలాడనున్నాయి. ఓవైపు అటు మెయిన్ బోర్డ్, ఇటు ఎస్ఎంఈ విభాగాలలో పబ్లిక్ ఇష్యూలు ప్రారంభంకానుండగా.. మరోపక్క ఇదేస్థాయిలో పెద్ద, చిన్న కంపెనీలు లిస్టింగ్‌తో సందడి చేయనున్నాయి. వెరసి పెద్ద,చిన్న కలిపి 20 కంపెనీల ఐపీవోలకు తెరలేవనుంది. ఇదే సమయంలో 27 కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీలలో ఖాతా తెరవనున్నాయి. వెరసి వచ్చే వారం ఐపీవో హవా కొనసాగనుంది. వివరాలు చూద్దాం..

\- సాక్షి, బిజినెస్ డెస్క్



రానున్న సోమవారం(29) నుంచి శుక్రవారం(అక్టోబర్ 3) వరకూ ప్రైమరీ మార్కెట్లు కళకళలాడనున్నాయి. ఇటీవల జోరందుకున్న పబ్లిక్ ఇష్యూలు మరింతగా వెల్లువెత్తనున్నాయి. మొత్తం 20 కంపెనీలు నిధుల సమీకరణకు క్యూ కట్టనుండగా.. 27 కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టకానున్నాయి. మెయిన్ బోర్డులో 4 కంపెనీలు ఐపీవోకు రానున్నాయి. ఇష్యూలు పూర్తి చేసుకోవడం ద్వారా మరో 11 కంపెనీలు లిస్టకానున్నాయి. ఇక చిన్న, మధ్య తరహా సంస్థల(ఎస్ఎంఈ) విభాగంలో 16 కంపెనీలు పబ్లిక్ ఇష్యూకి తెరతీయనున్నాయి. మరో 16 కంపెనీలలో ట్రేడింగ్‌కు తెరలేవనుంది.

ప్రధాన కంపెనీలలో ట్రేడింగ్

మెయిన్ బోర్డులో సోమవారం(29న) అట్లాంటా ఎలక్ట్రికల్స్, గణేశ్ కన్సూమర్ ప్రొడక్ట్స్ ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో లిస్టకానున్నాయి. ఈ బాటలో శేషసాయి టెక్నాలజీస్, సోలార్‌వరల్డ్ ఎనర్జీ సొల్యూషన్స్, జారో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్, ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ కౌంటర్లలో మంగళవారం(30న) ట్రేడింగ్ ప్రారంభంకానుంది. బుధవారం(అక్టోబర్ 1న) ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ వెంచర్స్, జైన్ రిసోర్స్ రీసైక్లింగ్ లిస్టకానున్నాయి. విజయదశమి పండుగ సందర్భంగా మార్కెట్లకు గురువారం(2న) సెలవుకాగా.. శుక్రవారం(3న) జినకుశల్ ఇండస్ట్రీస్, ట్రుఆల్ట్ బయోఎనర్జీ షేర్లలో ట్రేడింగ్ మొదలుకానుంది.

మెయిన్‌బోర్డులో షురూ

సోమవారం గ్లోటిస్ లిమిటెడ్(రూ. 307 కోట్ల సమీకరణ), ఫ్యాబ్‌టెక్ టెక్నాలజీస్(రూ. 230 కోట్లు), ఓమ్ ఫ్రైట్ ఫార్వార్డర్స్(రూ. 122 కోట్లు) ఐపీవోలు ప్రారంభంకానుండగా.. మంగళవారం అడ్వాన్స్ ఆగ్రోలైఫ్(రూ. 193 కోట్లు) ఇష్యూ మొదలుకానుంది.

పారిజాత్ ఇండస్ట్రీస్ రెడీ

ఆగ్రోకెమికల్ కంపెనీ పారిజాత్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 160 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 2.04 కోట్ల షేర్లను కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులలో రూ. 122 కోట్లు రుణ చెల్లింపులకు వినియోగించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. కంపెనీ ప్రధానంగా ఆగ్రోకెమికల్స్ అభివృద్ధి, తయారీ, పంపిణీ నిర్వహిస్తోంది. ఆసియా, యూరప్‌సహా 65 దేశాలలో కార్యకలాపాలు విస్తరించింది. మ్యాన్‌కైండ్ అగ్రిటెక్, ర్యాలీస్ ఇండియా, ఇఫ్కో ఎంసీ క్రాప్ సైన్స్, కోరమాండల్ ఇంటర్నేషనల్, బేయర్ క్రాప్‌సైన్స్, ధనుకా అగ్రిటెక్ తదితరాల దిగ్గజాలు కంపెనీ క్లయింట్ల జాబితాలో చేరాయి. హర్యానాలోని అంబాలాలో రెండు, గుజరాత్ వడోదరాలో ఒకటి చొప్పున మూడు తయారీ యూనిట్లను కలిగి ఉంది. వీటి ద్వారా ఫార్ములేషన్ ప్రొడక్టులను తయారు చేస్తోంది. సుమారు 512 ప్రొడక్ట్ రిజిస్ట్రేషన్లను కలిగి ఉంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ. 1,045 కోట్ల ఆదాయం, రూ. 54 కోట్ల నికర లాభం ఆర్జించింది.

లిస్టింగ్‌కు డియోన్ ఎనర్జీ.. రూ. 150 కోట్లపై కన్ను

పునరుత్పాదక ఇంధన(రెనెవబుల్ ఎనర్జీ) సొల్యూషన్ల కంపెనీ డియోన్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. దీనిలో భాగంగా రూ. 150 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. తద్వారా రూ. 150 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇష్యూ నిధుల్లో రూ. 100 కోట్లు కంపెనీ దీర్ఘకాలిక వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు వినియోగించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. 2020లో ఏర్పాటైన కంపెనీ ఎండ్‌టుఎండ్ రెనెవబుల్ ఎనర్జీ సొల్యూషన్లను సమకూర్చుతోంది. టర్న్‌కీ ప్రాతిపదికన సోలార్ ఎనర్జీ ప్రాజెక్టులకు ఈపీసీ తదితర సర్వీసులు అందిస్తోంది. ఈ బాటలో క్లయింట్ల కోసం ఇండిపెండెంట్ సోలార్ ఈపీసీ ప్రాజెక్టులను ఎగ్జిక్యూట్ చేస్తోంది. 2025 మార్చికల్లా 140.29 ఎండబ్ల్యూడీసీ, 118.8 ఎండబ్ల్యూఏసీ సామర్థ్యంగల 78 సోలార్ ప్రాజెక్టులను పూర్తి చేసింది. గతేడాది(2024-25) రూ. 299 కోట్ల ఆదాయం, రూ. 26 కోట్ల నికర లాభం ఆర్జించింది.

జోరుగా హుషారుగా..

కంపెనీ పేరు	ధరల శ్రేణి	ఇష్యూ తేదీ
గ్లోటిస్ లిమిటెడ్	120-129	29-01
ఫ్యాబ్‌టెక్ టెక్నాలజీస్	181-191	29-01
ఓమ్ ఫ్రైట్ ఫార్వార్డర్స్	128-135	29-03
అడ్వాన్స్ ఆగ్రోలైఫ్	95-100	30-03
ఎస్ఎంఈలు(ఎన్ఎస్ఈ)		
శుబ హోటల్స్	105-111	29-01
విజయ్‌పీడీ స్యూటికల్	35---	29-01
షీల్ బయోటెక్	59-63	30-03
మునీష్ ఫోర్జ్	91-96	30-03
బీఏజీ కన్వెర్జెన్స్	82-87	30-03
గ్రీన్‌లీఫ్ ఎన్విరో	136---	30-06

(ధరల శ్రేణి రూ.లలో- ఇష్యూల ముగింపు అక్టోబర్) (బీఎస్ఈలో మరో 10 ఎస్ఎంఈల ఇష్యూలు షురూ)

ఎస్ఎంఈ ఇష్యూల స్పీడ్

సోమవారం ఎస్ఎంఈ విభాగంలో చిరహరిత్, సోధానీ క్యాపిటల్, విజయ్ పీడీ స్యూటికల్, ఓమ్ మెటలాజిక్, శుబ హోటల్స్, ధిల్లాన్ ఫ్రైట్ క్యారియర్ ఐపీవోలకు తెరలేవనుంది. మంగళవారం శ్లోకా డైస్, షిప్‌వేవ్స్ ఆన్‌లైన్, గ్రీన్‌లీఫ్ ఎన్విరోటెక్, వాల్‌ప్లాస్ట్ టెక్నాలజీస్, బీఏజీ కన్వెర్జెన్స్, జెలియో ఈమొబిలిటీ, షీల్ బయోటెక్, ఇన్ఫినిటీ ఇన్ఫోవే, మునీష్ ఫోర్జ్, సన్‌స్కై లాజిస్టిక్స్ ఇష్యూలు ప్రారంభంకానున్నాయి. ఇక ప్రైమ్ కేబుల్ ఇండస్ట్రీస్(29న), భారత్‌రోహన్ ఎయిర్‌బోన్ ఇన్నోవేషన్స్, ఆప్టస్ ఫార్మా, ట్రూ కలర్స్, ఎన్ఎస్‌బీ బీపీవో సొల్యూషన్స్, ఎకోలైన్ ఎగ్జిమ్, మ్యాట్రిక్స్ జియో(30న), సిస్టమాటిక్ ఇండస్ట్రీస్, జస్టో రియల్‌ఫిన్‌టెక్, ప్రరూహ్ టెక్నాలజీస్, గురునానక్ అగ్రికల్చర్, సాల్వెక్స్ ఎడిబుల్స్(అక్టోబర్ 1న) ఎన్ఎస్ఈ ఎమర్జ్, బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌లపై వేరువేరుగా లిస్ట్ కానున్నాయి. ఈ బాటలో 3న టెల్గే ప్రాజెక్ట్స్, ఇయర్‌కార్ట్, గుజరాత్ పీనట్స్ అండ్ అగ్రి ప్రొడక్ట్స్, చాటర్‌బాక్స్ టెక్నాలజీస్, భవిక్ ఎంటర్‌ప్రైజెస్ లిస్టకానున్నాయి.

ఒకే జట్టులో అర్జున్, గుకేశ్ హంపి, హారిక

భారత గ్రాండ్‌మాస్టర్లను దక్కించుకున్న పీబీజీ అలాస్కాన్ నైట్స్, ముంబా మాస్టర్స్

ముగిసిన గ్లోబల్ చెస్ లీగ్ ప్లేయర్ల డ్రాఫ్టింగ్

డిసెంబర్ 13 నుంచి 21 వరకు ముంబైలో ఈవెంట్





ముంబై: ప్రపంచ చదరంగంలోని మేటి ప్లేయర్లు ఒకే వేదికపై వచ్చి ఎత్తుకు పైఎత్తులు వేసేందుకు సిద్ధమయ్యారు. టెక్ మహీంద్ర, అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) సంయుక్త ఆధ్వర్యంలో జరుగనున్న గ్లోబల్ చెస్ లీగ్ (జీసీఎల్) మూడో సీజన్‌కు సంబంధించి ఆటగాళ్ల డ్రాఫ్టింగ్ పూర్తయింది. భారత్ నుంచి తొమ్మిది మంది గ్రాండ్‌మాస్టర్లు ఆయా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారు. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్, ప్రపంచ ర్యాంకర్ దొమ్మరాజు గుకేశ్... ప్రపంచ ఐదో ర్యాంకర్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఒకే జట్టు తరఫున బరిలోకి దిగనున్నారు. గుకేశ్, అర్జున్‌లను పీబీజీ అలాస్కాన్ నైట్స్ జట్టు సొంతం చేసుకుంది. భారత స్టార్ మహిళా గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక కూడా ఒకే జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రపంచ మహిళల ర్యాపిడ్ ఫార్మాట్ చాంపియన్, ప్రపంచ ఐదో ర్యాంకర్ కోనేరు హంపి, ప్రపంచ 19వ ర్యాంకర్, హైదరాబాద్‌కు చెందిన హారికను అప్‌గ్రాడ్ ముంబా మాస్టర్స్ జట్టు దక్కించుకుంది. డిసెంబర్ 13 నుంచి 24వ తేదీ వరకు జరిగే ఈ మెగా లీగ్‌కు ముంబై ఆతిథ్యమిస్తుంది. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ గ్యాంజెస్ గ్రాండ్ మాస్టర్స్ జట్టు తరఫున కొనసాగుతుండగా... భారత నంబర్‌వన్ ప్రజ్ఞానంద అల్పైన్ ఎస్‌జీ పైపర్స్ జట్టుకు ఆడనున్నాడు. మొత్తం ఆరు జట్ల మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టోర్నీ జరుగుతుంది. గేమ్‌లను ర్యాపిడ్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. ఒక్కో జట్టులో ఆరుగురు ప్లేయర్లు ఉండగా... అందులో ఇద్దరు మహిళా క్రీడాకారిణులున్నారు.

గ్లోబల్ చెస్ లీగ్ మూడో సీజన్ జట్ల వివరాలు

అమెరికన్ గాంబిట్స్: హికారు నకమురా (అమెరికా), రిచర్డ్ రాపోర్ట్ (హంగేరి), వ్లాదిస్లావ్ ఆర్టెమియెవ్ (రష్యా), బీబీసారా అసయుబయేవా (కజకిస్తాన్), టియోడోరా ఇంజాక్ (సెర్బియా), వొలోడార్ ముర్జిన్ (రష్యా).

అల్పైన్ ఎస్‌జీ పైపర్స్: ఫాబియానో కరువానా (అమెరికా), ప్రజ్ఞానంద (భారత్), అనీశ్ గిరి (నెదర్లాండ్స్), హు ఇఫాన్ (చైనా), నినో బత్సియాష్‌విలి (జార్జియా), లియోన్ మెన్‌డోంకా (భారత్).

గ్యాంజెస్ గ్రాండ్‌మాస్టర్స్: విశ్వనాథన్ ఆనంద్ (భారత్), జవోఖిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్), విన్సెంట్ కీమెర్ (జర్మనీ), స్టవ్‌రూలా సొలాకిడూ (గ్రీస్), పొలీనా షువలోవా (రష్యా), రౌనక్ సాధ్వాని (భారత్).

అప్‌గ్రాడ్ ముంబా మాస్టర్స్: మాక్సిమి వాచియెర్ లాగ్రెవ్ (ఫ్రాన్స్), షఖ్రియార్ మమెద్యరోవ్ (అజర్‌బైజాన్), వెస్లీ సో (అమెరికా), కోనేరు హంపి (భారత్), ద్రోణవల్లి హారిక (భారత్), బర్దియా దానేశ్వర్ (ఇరాన్).

పీబీజీ అలాస్కాన్ నైట్స్: దొమ్మరాజు గుకేశ్ (భారత్), ఇరిగేశి అర్జున్ (భారత్), లీనియర్ డొమింగెజ్ (అమెరికా), సారాసాదత్ ఖాడెమ్ (స్పెయిన్), కాటరీనా లాగ్నో (రష్యా), డేనియల్ దర్ధా (బెల్జియం).

త్రివేణి కాంటినెంటల్ కింగ్స్: అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్), యి వె (చైనా), విదిత్ సంతోష్ గుజరాతి (భారత్), అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్), జు జినెర్ (చైనా), మార్క్ ఆండ్రియా మౌరిజి (ఫ్రాన్స్).



జొనాథన్ 'పసిడి' గురి

న్యూఢిల్లీ: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచ కప్ టోర్నీలో రెండో రోజు భారత్‌కు రెండు పతకాలు లభించాయి. జూనియర్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో జొనాథన్ గావిన్ ఆంటోనీ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకోగా... జూనియర్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో రష్మిక సెహగల్ రజత పతకాన్ని దక్కించుకుంది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో



జరిగిన ఫైనల్లో జొనాథన్ 244.8 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచాడు. అరిగి లుకా (ఇటలీ; 236.3 పాయింట్లు) రజతం, లుకాస్ సాంచెజ్ (స్పెయిన్; 215.1 పాయింట్లు) కాంస్యం గెల్చుకున్నారు. భారత్‌కే చెందిన చిరాగ్ శర్మ 115.6 పాయింట్లతో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. అంతకుముందు 21 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో జొనాథన్ 586 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో, చిరాగ్ శర్మ 578 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో నిలిచారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో భారత్ నుంచి ముగ్గురు రష్మిక సెహగల్, వన్షిక, మోహిని సింగ్ బరిలోకి దిగారు. రష్మిక 236.1 పాయింట్లతో రెండో స్థానంలో రజత పతకాన్ని సొంతం చేసుకుంది. వన్షిక 174.2 పాయింట్లతో ఐదో స్థానంలో, మోహిని 153.7 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచారు. రెండో రోజు పోటీలు ముగిశాక భారత్ 2 స్వర్ణాలు, 3 రజతాలు, 2 కాంస్యాలతో కలిపి ఏడు పతకాలతో టాప్ ర్యాంక్‌లో ఉంది.

ఫైనల్లో అనిరుధ్ జోడీ



సాక్షి, హైదరాబాద్: జింగ్‌షాన్ ఓపెన్ ఏటీపీ-100 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లో నిష్క్రమించగా... హైదరాబాద్‌కే చెందిన అనిరుధ్ చంద్రశేఖర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. చైనాలో ఈ టోర్నీ జరుగుతోంది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో అనిరుధ్ చంద్రశేఖర్ (భారత్)-రీసీ స్టాల్డర్ (అమెరికా) ద్వయం 4-6, 7-5, 10-4తో 'సూపర్ టైబ్రేక్'లో నథానియల్ లామోన్స్ (అమెరికా)-జీన్ జూలియన్ రోజర్ (నెదర్లాండ్స్) జంటపై గెలుపొందగా... రిత్విక్-అర్జున్ ఖడే (భారత్) ద్వయం 4-6, 4-6తో సుంగ్ హావో హువాంగ్ (చైనీస్ తైపీ)-యుసింగ్ పార్క్ (దక్షిణ కొరియా) జోడీ చేతిలో ఓడిపోయింది.

లలిత్ గేమ్ 'డ్రా'

సాక్షి, గుంటూరు: జాతీయ సీనియర్ చెస్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్ ఎంఆర్ లలిత్ బాబు ఖాతాలో వరుసగా రెండో 'డ్రా' చేరింది. విజ్ఞాన్ యూనివర్సిటీలో జరుగుతున్న ఈ టోర్నీలో లలిత్ బాబు తొలి నాలుగు గేముల్లో గెలుపొందాడు. దీపన్



చక్రవర్తి (రైల్వేస్)తో శుక్రవారం జరిగిన ఆరో రౌండ్ గేమ్‌ను 35 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. సూర్యశేఖర గంగూలీ (పెట్రోలియం)తో గురువారం జరిగిన ఐదో రౌండ్ గేమ్‌ను లలిత్ 30 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ఆరో రౌండ్ తర్వాత లలిత్ బాబు ఐదు పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నాడు.





క్రికెటర్ల నుంచి స్ఫూర్తి పొందా: బోల్ట్

ముంబై: క్రికెటర్లు మైదానంలో చూపే అంకితభావం... ఆట కోసం వారు కష్టపడే తీరు చూసి ఎంతగానో స్ఫూర్తి పొందినట్లు స్ప్రింట్ దిగ్గజం ఉసేన్ బోల్ట్ పేర్కొన్నాడు. క్రికెటర్లు గ్రౌండ్‌లో తమ సర్వస్వాన్ని అంకితం చేయడం... అథ్లెటిక్స్‌లో తాను రాణించేందుకు ప్రేరణనిచ్చిందని ఈ 'జమైకా చిరుత' వెల్లడించాడు. సుదీర్ఘకాలం పాటు పరుగుకు పర్యాయపదంగా నిలిచిన బోల్ట్ 8 ఒలింపిక్ స్వర్ణాలు, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 11 పతకాలు సాధించాడు. శుక్రవారం ముంబైలోని జమునాబాయి నర్సీ క్యాంపస్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బోల్ట్ పాల్గొన్నాడు. ఈ కార్యక్రమంలో క్రీడా రంగ ప్రముఖులతో పాటు బాలీవుడ్ తారలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోల్ట్ మాట్లాడుతూ... 'నేను చిన్నప్పుడు క్రికెట్‌కు వీరాభిమానిని. క్రికెట్ ఎదుగుదలను చూశాను. క్రికెటర్ల ప్రతిభను, వారు పనిచేసే తీరును, వారు తమను తాము మలుచుకునే విధానం అథ్లెటిక్స్‌లో నాకు ఎంతగానో ప్రేరణనిచ్చాయి' అని అన్నాడు. మైకెల్ హోల్డింగ్, కోట్నీ వాల్ష్, క్రిస్ గేల్ వంటి పలువురు ప్రఖ్యాత క్రికెటర్లు కూడా జమైకన్‌లే కాగా... వారి ప్రభావం తనపై అధికంగా ఉన్నట్లు బోల్ట్ పేర్కొన్నాడు. విజయానికి దగ్గరి దారులు ఉండవన్న బోల్ట్ కష్టపడితే తప్పక ఫలితం వస్తుందని అన్నాడు. 'ప్రతి పనికి కష్టపడాల్సిందే. క్రీడల్లో అంకితభావం కూడా అవసరం. ట్రాక్ అండ్ ఫీల్డ్ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే దానిపై ఎక్కువ కష్టపడ్డా. ఏ రంగంలోనైనా అగ్రస్థానానికి చేరడం అంత సులభం కాదు. పరిస్థితులు పరీక్షిస్తున్నప్పుడు కఠిన సమయాలను దాటుకుంటూ ప్రపంచంలో అత్యుత్తమ అథ్లెట్‌గా నన్ను నేను మలుచుకునేందుకు పట్టుదల, అంకితభావంతో కృషి చేశా. అందుకు తగ్గ ప్రతిఫలం సాధించా' అని 39 ఏళ్ల బోల్ట్ అన్నాడు. పురుషుల 100 మీటర్ల పరుగులో ప్రపంచ రికార్డు (9.58 సెకన్లు) నెలకొల్పిన బోల్ట్... గతంలోనూ పలు సందర్భాల్లో తనకు క్రికెట్ మీద ఉన్న ఇష్టాన్ని వెల్లడించాడు.

భారత పర్యటనకు షామార్ జోసెఫ్ దూరం

అతడి స్థానంలో జొహాన్ లైన్ ఎంపిక



న్యూఢిల్లీ: వచ్చే నెలలో భారత్‌తో జరిగే టెస్టు సిరీస్‌కు వెస్టిండీస్ పేసర్ షామార్ జోసెఫ్ దూరమయ్యాడు. గాయం కారణంగా అతడు భారత పర్యటన నుంచి తప్పుకున్నాడు. దీంతో అతడి స్థానంలో ఆల్‌రౌండర్ జొహాన్ లైన్‌ను విండీస్ క్రికెట్ బోర్డు భారత టూర్‌కు ఎంపిక చేసింది. ఈ పర్యటనలో భాగంగా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండు టెస్టు మ్యాచ్‌లు జరగనున్నాయి. 26 ఏళ్ల షామార్ జోసెఫ్ గాయంపై విండీస్ బోర్డు స్పష్టత ఇవ్వలేదు. 'గాయం కారణంగా జోసెఫ్ భారత్‌తో సిరీస్‌కు దూరమయ్యాడు. బంగ్లాదేశ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్ వరకు అతడు కోలుకోవచ్చు. అతడి స్థానాన్ని జొహాన్ లైన్ భర్తీ చేస్తాడు' అని విండీస్ బోర్డు శుక్రవారం సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించింది. జోసెఫ్ దూరం కావడం విండీస్‌కు ఎదురుదెబ్బ కానుంది. ఇటీవలి కాలంలో నిలకడగా రాణిస్తున్న అతడు... జాతీయ జట్టు తరఫున 11 టెస్టు మ్యాచ్‌లాడి 51 వికెట్లు పడగొట్టాడు. సగటు 21.66 కాగా... ఎకానమీ 3 కంటే తక్కువే. ఇక బార్బడోస్‌కు చెందిన 22 ఏళ్ల జొహాన్... పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా 19 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. అందులో 495 పరుగులు చేయడంతో పాటు 66 వికెట్లు పడగొట్టాడు.

యువ భారత్ క్లీన్‌స్వీప్

మూడో వన్డేలోనూ ఓడిన ఆస్ట్రేలియా అండర్-19 జట్టు

మెరిసిన వేదాంత్, రాహుల్, ఖిలాన్



బ్రిస్బేన్: ఆస్ట్రేలియా పర్యటనలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత అండర్-19 జట్టు వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన చివరి పోరులో ఆయుశ్ మాత్రే సారథ్యంలోని భారత అండర్-19 జట్టు 167 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా అండర్-19 జట్టును చిత్తు చేసింది. తద్వారా 3-0తో సిరీస్ కైవసం చేసుకుంది. తొలి వన్డేలో 7 వికెట్లతో నెగ్గిన యువ భారత్, రెండో మ్యాచ్‌లో 51 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత అండర్-19 జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 280 పరుగులు చేసింది. వేదాంత్ త్రివేది (92 బంతుల్లో 86; 8 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... రాహుల్ కుమార్ (84 బంతుల్లో 62; 6 ఫోర్లు) హాఫ్ సెంచరీ సాధించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 99 పరుగులు చేయడంతో యువ భారత్ మంచి స్కోరు చేయగలిగింది. గత మ్యాచ్‌లో సిక్స్‌లతో విజృంభించిన ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (20 బంతుల్లో 16; 2 సిక్స్‌లు) ఎక్కువసేపు నిలవలేకపోగా... విహాన్ మల్హోత్రా (52 బంతుల్లో 40; 6 ఫోర్లు) రాణించాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో విల్ బైరామ్, బార్డస్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా జట్టు పూర్తిగా తడబడింది. భారత బౌలింగ్‌ను ఎదుర్కోలేక 28.3 ఓవర్లలో 113 పరుగులకే ఆలౌటైంది. అలెక్స్ టర్నర్ (59 బంతుల్లో 32; 3 ఫోర్లు), కెప్టెన్ విల్ మలాజుక్ (15), టామ్ హొగన్ (28) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. యువ భారత బౌలర్లలో లెఫ్టార్మ్ స్పిన్నర్ ఖిలాన్ పటేల్ 4, ఉధవ్ మోహన్ మూడు వికెట్లు పడగొట్టారు. ఇరు జట్ల మధ్య మంగళవారం నుంచి బ్రిస్బేన్‌లోనే తొలి యూత్ టెస్టు ప్రారంభం కానుంది.

భారత్ నుంచి భారీ బృందం

ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీకి జట్ల ప్రకటన

న్యూఢిల్లీ: వచ్చే నెలలో చైనాలోని చెంగ్డూ నగరంలో జరిగే ఆసియా అండర్-15, అండర్-17 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్లను ప్రకటించారు. రెండు వయో విభాగాల్లో కలిపి భారత్ నుంచి భారీ బృందం బరిలోకి దిగనుంది. ఆసియా అండర్-15 చాంపియన్ తన్వీ పత్రి... మాజీ విజేత బోర్నిల్ చాంగ్మాయ్‌లపై భారత్ మరోసారి ఆశలు పెట్టుకుంది. అశ్విని గుప్తా స్మారక ఆలిండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో కనబరిచిన ప్రదర్శన ఆధారంగా ఈ జట్ల ఎంపిక జరిగింది. **భారత అండర్-15 జట్టు:** పుష్కర్ సాయి, వజీర్ సింగ్, ప్రభు ధ్యాని, దక్షణ్, అన్వీ రాథోడ్, షైనా మణిముత్తు, షరాయు రంజానే, హంసిని చదరం, స్వయంద్యుతి ఘోష్, శౌర్య సింగ్ రాణా, వివాన్ బిష్త్, నిమ్మగడ్డ చిన్మయ్‌కృష్ణ, సాయారా షెలార్, విభవ, రక్ష, సమ్మెట్ల హేమంత్ శ్రీ, అర్జున్, నయోనిక. **భారత అండర్-17 జట్టు:** బోర్నిల్ ఆకాశ్ చాంగ్మాయ్, జగ్‌షేర్ సింగ్ ఖంగురా, హార్దిక్ దివ్యాంశ్, నిశ్చల్ చంద్, తన్వీ పత్రి, శాంతిప్రియ హజారికా, లక్ష్య రాజేశ్, దీక్ష, తిప్పన చరణ్ రామ్, హరికృష్ణ వీరం రెడ్డి, పవన్, పునీత్, దీపక్‌రాజ్ అదితి, వృద్ధి, అకియా శెట్టి, సుహీనా, జంగ్‌జీత్ సింగ్ కజ్లా, జననిక.

ముంబై ఇండియన్స్ మహిళల జట్టు హెడ్ కోచ్‌గా లీసా కైట్లీ



ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వచ్చే సీజన్‌లో కొత్త హెడ్ కోచ్ ఆధ్వర్యంలో ముంబై ఇండియన్స్ జట్టు బరిలోకి దిగనుంది. వచ్చే సీజన్ కోసం ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ లీసా కైట్లీని హెడ్ కోచ్‌గా నియమిస్తున్నట్లు గురువారం ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ యజమాని నీతా అంబానీ ప్రకటించింది. 1997, 2005 వన్డే వరల్డ్‌కప్ టైటిల్స్ నెగ్గిన ఆస్ట్రేలియా జట్టులో లీసా సభ్యురాలిగా ఉంది. 54 ఏళ్ల లీసా ఆస్ట్రేలియా జట్టుకు 9 టెస్టుల్లో, 82 వన్డేల్లో, ఒక టి20 మ్యాచ్‌లో ప్రాతినిధ్యం వహించింది. మహిళల క్రికెట్ కోచింగ్‌లో లీసాకు మంచి పేరుంది. గతంలో ఆమె ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జాతీయ జట్లతోపాటు పలు టి20 ఫ్రాంచైజీ జట్లకు కోచ్‌గా వ్యవహరించింది. డబ్ల్యూపీఎల్ గత మూడు సీజన్‌లలో రెండుసార్లు ముంబై ఇండియన్స్ విజేతగా నిలిచింది.

చండీగఢ్ వైమానిక కేంద్రంలో వీడ్కోలు సందర్భంగా మిగ్‌లకు జల వందనం



థ్యాంక్యూ మిగ్!

భారత వైమానిక దళం నుంచి మిగ్-21 యుద్ధ విమానాలకు శుక్రవారం ఘనంగా వీడ్కోలు చెప్పిన సందర్భంగా ఆ ఫైటర్‌జెట్‌తో తమ అనుభవాలను ఇలా పంచుకున్నారు.

నడపడం నల్లేరు మీద నడక కాదు

తొలిసారి మన దగ్గరకు వచ్చిన విమానం మిగ్-21, టైప్-74. దానికి అప్పట్లో శిక్షణ విమానాలు లేవు. తొలిసారి ఒంటరిగా విమానాన్ని నడిపే ప్రక్రియ మిగ్-21తోనే మొదలైంది. ఈ విమానానికి సిమ్యులేటర్ లేకపోవడమే కాకుండా, మొత్తం కాక్‌పిట్‌లో ఏదీ ఆంగ్లంలో రాసి లేదు, అంతా రష్యన్ భాషలో ఉండేదని చెప్పారు. ఈ పాత ఎయిర్ వారియర్, వేగం కొలత యూనిట్ కూడా హఠాత్తుగా 'నాట్స్' నుండి 'కిమీ/గంట'కి మారిపోయేది. పైలట్లు 'నాట్స్'కు అలవాటు పడటంతో.. విమానం నడపడం ఒక సవాలుగా మారేది. ఈ విమానాన్ని తొలిసారి నడిపినపుడు ఎక్కువగా దారి తప్పిపోతారు, తిరిగి వచ్చే వరకు, దాన్ని ఎలా నిర్వహించాలో మీకు తెలియదు.

– ఏవై టిప్నిస్, ఎయిర్ చీఫ్ మార్షల్, మాజీ భారతీయ వాయుసేనాధిపతి,

శవపేటికతో పోలిక సరికాదు

ప్రమాదాలతో ముడిపడిన ఏ విమానాన్ని అయినా 'ఎగిరే శవపేటిక' వంటి పదాలతో వర్ణించడం సరికాదు. అలాంటి పదాలు వాడటం వల్ల, ఆ విమానాల్లో ప్రయాణిస్తున్న పైలట్ల కుటుంబ సభ్యుల మనోధైర్యం దెబ్బతింటుంది,

– పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక మాజీ పైలట్

నమ్మకమైన సహచరుడు

ఆరు దశాబ్దాలుగా మిగ్-21 భారతీయ వాయుసేనకు వెన్నెముకగా' ఉంది. యుద్ధంలో, శాంతి సమయంలో ఒక చిహ్నంగా, నమ్మకమైన సహచరుడిగా, తరతరాల ఫైటర్ పైలట్లకు ఒక పరీక్ష కేంద్రంగా వ్యవహరించింది.

– నితిన్ సాతే, రిటైర్డ్ ఎయిర్ కమోడోర్



మిగ్ పోస్టల్ కవర్‌పై సంతకం చేస్తున్న రాజ్‌నాథ్



మంత్రి రాజ్‌నాథ్, త్రివిధ దళాధిపతులు, సీఏఎస్‌లతో గ్రూప్ ఫొటో

అన్ని సైనిక చర్యల్లోనూ మేటి

1965, 1971 యుద్ధాల్లో అత్యంత అధునాతన ఫైటర్‌గా ఉన్న ఈ విమానం, భారతదేశం చేపట్టిన అన్ని సైనిక చర్యలలో ముందుంది. ఆపరేషన్ సిందూర్‌లో కూడా సత్తా చాటింది, ఇది పాత తరం ఫైటర్ అయినప్పటికీ, ఆపరేషనల్ రెడీనెస్ ప్లాట్‌ఫాం విధులు నిర్వహించింది.

– నంద రాజేందర్, స్క్వాడ్రన్ నంబర్ 23 కమాండింగ్ ఆఫీసర్, గ్రూప్ కెప్టెన్



టేకాఫ్ తీసుకుంటున్న మిగ్ యుద్ధ విమానాలు



సూర్యకిరణ్ విమానాల 'త్రివర్ణ' విన్యాసాలు

ఎన్నికల తర్వాత 'సోనార్ బంగ్లా'కు పునర్వైభవం

సాకారం చేయాలని దుర్గామాతను ప్రార్థించా

- కోల్‌కతాలో కేంద్రహోం మంత్రి అమిత్ షా వ్యాఖ్య
- బీజేపీ పాలిత రాష్ట్రాల సంగతేంటన్న టీఎంసీ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో 2026 అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రం కోల్పోయిన 'సోనార్ బంగ్లా'(బంగారు బెంగాల్)పునర్వైభవాన్ని సాకారం చేయాలని దుర్గామాతను కోరుకున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. రాష్ట్రం మరోసారి సురక్షితంగా, సుసంపన్నంగా మారాలని, నోబెల్ గ్రహీత విశ్వకవి రవీంద్రనాథ్ కల సాకారం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఉత్తర కోల్‌కతాలోని సంతోష్‌మిత్ర స్క్వేర్‌లో ఏర్పాటైన దుర్గా పూజ మంటపాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. 'వచ్చే అసెంబ్లీ ఎన్నికల అనంతరం బంగారు బెంగాల్ కలను సాకారం చేసే ప్రభుత్వం ఏర్పాటు కావాలని దుర్గా మాతను కోరుకున్నా. మరోసారి మన బెంగాల్ శాంతియుతం, సుసంపన్నం, సురక్షితంగా రూపుదిద్దుకుంది. విశ్వకవి రవీంద్రుడు కన్న కలలు సాకారమయ్యేలా రాష్ట్రాన్ని నిర్మించుకుందాం'అని ఆయన పిలుపునిచ్చారు. దుర్గా పూజ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, దేశ వాసులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిది రోజుల నవరాత్రి వేడుకలు బెంగాల్, భారత్‌లోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అందరికీ ముఖ్యమైనవే. బెంగాల్‌లో ఈ గొప్ప సంప్రదాయాన్ని యావత్ ప్రపంచం ఎంతో ఆనందంతో చూస్తోంది. తొమ్మిది రోజుల పాటు, బెంగాల్‌లోని ప్రతి ఒక్కరూ శక్తి ఆరాధనకు తమను తాము అంకితం చేసుకుంటారు'అని ఆయన అన్నారు. 'దుర్గా పూజ పండుగ బెంగాల్‌ను కొత్త శిఖరాలకు నడిపించాలి, రాష్ట్రం అభివృద్ధి చెంది, మన నేత నరేంద్ర మోదీ ఊహించిన అభివృద్ధి చెందిన భారతదేశం కలను మనం సాకారం చేసుకోగలగాలి'అని అమిత్ షా చెప్పారు. 'పండగ వేళ రాష్ట్రంలో వర్షాలకు సంబంధించిన ఘటనల్లో 10మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం విచారకరం. వారికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నాను'అని ఆయన అన్నారు. అనంతరం అమిత్ షా సాల్ట్‌లేక్ ప్రాంతంలో బీజేపీ అనుబంధ సంస్థ ఏర్పాటు చేసిన దుర్గా పూజ మంటపాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సంఘ సంస్కర్త ఈశ్వర చంద్ర విద్యాసాగర్ 205వ జయంతి సందర్భంగా నివాళులర్పించారు.



అమిత్ షా వ్యాఖ్యలపై మండిపడ్డ టీఎంసీ

ఎన్నికల తర్వాత సోనార్ బంగ్లా సాకారం కావాలన్న హోం మంత్రి వ్యాఖ్యలపై టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ మండిపడ్డారు. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. 'అమిత్ షా సోనార్ బంగ్లాను గురించి మాట్లాడుతున్నారా? సోనార్ బిహార్, సోనార్ గుజరాత్, సోనార్ మహారాష్ట్ర లేక యూపీ సాకారమయ్యాయా? నిధులన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలకే ఇస్తున్నారు కదా?'అని అభిషేక్ వ్యాఖ్యానించారు.

'ముందుగా మాకు రావాల్సిన రూ.2 లక్షల కోట్ల నిధుల విషయం అడగండి. నేను అబద్ధమాడుతున్నానని అమిత్ షా అంటే, వాస్తవాలు, గణాంకాలతో వస్తా, చర్చ ఎక్కడైనా రెడీ'అని సవాల్ విసిరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన రూ.2 లక్షల కోట్ల నిధులను నిలిపేసి, రాష్ట్రానికి చెందిన మహనీయులను నిర్లక్ష్యం చేసిందన్నారు. కోల్‌కతాలోని విద్యాసాగర్ కళాశాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న ఈశ్వర చంద్ర విద్యాసాగర్ విగ్రహం 2019లో బీజేపీ ర్యాలీ సమయంలో విరిగిపోగా ఆ పార్టీ నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు.

భారతీయ డాక్టర్‌కు 14 ఏళ్ల జైలు

న్యూయార్క్: హెల్త్‌కేర్ సేవలను దుర్వినియోగం చేసిన కేసులో అమెరికాలో భారత సంతతి వైద్యుడికి అక్కడి కోర్టు 14 సంవత్సరాల (168 నెలలు) జైలు శిక్ష విధించింది. 4 మిలియన్ డాలర్ల జరిమానా కూడా విధించింది. పెన్సిల్వేనియాలోని బెన్‌సాలెమ్‌లో ఉంటున్న నీల్ కే ఆనంద్ (48) నకిలీ మెడికేయిమ్ బిల్లుల ద్వారా కోట్లలో అక్రమాలకు పాల్పడ్డారని ఈ ఏడాది ఏప్రిల్‌లోనే కోర్టు ఆయనను దోషిగా తేల్చింది. నకిలీ బిల్లులు సృష్టించి అమెరికా ప్రభుత్వ సిబ్బంది విభాగం (ఓపీఎం), ఇండిపెండెన్స్ బ్లూ క్రాస్ (ఐబీసీ), ఆంథెమ్ సంస్థల నుంచి ఆనంద్ దాదాపు 2.4 మిలియన్ డాలర్ల రీయింబర్స్‌మెంట్ పొందాడు. ఈ విషయం బయటపడటంతో అమెరికా న్యాయ శాఖ ఆయనపై దర్యాప్తు ప్రారంభించింది. ఆనంద్ మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు తేల్చింది.

'ఐ లవ్ మహ్మద్' ర్యాలీ వివాదం

బరేలీలో పోలీసులతో స్థానికుల ఘర్షణ

బరేలీ: 'ఐ లవ్ మహ్మద్'కార్యక్రమానికి మద్దతుగా చేపట్టిన కార్యక్రమాన్ని వాయిదా వేస్తూ ఇత్తెహాద్-ఇ-మిల్లత్ కౌన్సిల్ చీఫ్, మత పెద్ద తౌకీర్ రజా ఖాన్ చేసిన ప్రకటన యూపీలో బరేలీలో శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. ఒక మసీదు వెలుపల పెద్ద సంఖ్యలో గుమికూడిన జనం పోలీసులతో ఘర్షణకు దిగారు. ఇందుకు కారకులుగా గుర్తించిన డజను మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఏదేమైనా ర్యాలీని నిర్వహిస్తామంటూ గురువారం ప్రకటించిన రజా ఖాన్.. అధికారులు అనుమతి ఇవ్వనందున ర్యాలీని రద్దు చేస్తున్నట్లు శుక్రవారం ప్రార్థనల అనంతరం ప్రకటించారు. దీంతో, 'ఐ లవ్ మహ్మద్ అని రాసిన పోస్టర్లను చేబూనిన జనం పెద్ద సంఖ్యలో కొత్వాలీ ఏరియాలోని రజా ఖాన్ నివాసం, మసీదు వద్ద గుమికూడారు. ప్రదర్శనను వాయిదా వేయడంపై ఆగ్రహంతో ఇస్లామియా ఇంటర్ కాలేజీ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నాం. దీంతో రాళ్లు రువ్వుతూ, వాహనాలు, దుకాణాలపై దాడులకు పాల్పడ్డారు. వారిని చెదరగొట్టాం'అని పోలీసు అధికారులు తెలిపారు. పలువురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. విధ్వంసం సృష్టించేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇత్తెహాద్-ఇ-మిల్లత్ కౌన్సిల్‌ను అహ్మద్ రజా ఖాన్ ఏర్పాటు చేశారు. దక్షిణాసియాలో ఎక్కువ ప్రభావం కలిగిన సున్నీ ఇస్లాంలోని బెరేల్వీ వర్గాన్ని స్థాపించింది ఈయనే. ఈయన వారసుడే తౌకీర్ రజా ఖాన్. కాగా, 'ఐ లవ్ మహ్మద్'నినాదంలో ఎలాంటి తప్పూ లేదని ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు.

ఎన్డీయేకు బుద్ధి చెప్పండి

బిహార్‌లో ఎన్నికల ర్యాలీలో ప్రియాంకా గాంధీ

పట్నా: బిహార్‌లో తాయిలాల ఎర చూపి ఓట్లను కొనేందుకు ప్రయత్నిస్తున్న ఎన్డీయే ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల తగు రీతిలో బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె పట్నాలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన మహిళా సంవాద్ కార్యక్రమంలో మాట్లాడారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వానికి కేవలం ప్రజల ఓట్లపైనే దృష్టి ఉందన్నారు. ప్రజలకు గౌరవమర్యాదలను తమ కాంగ్రెస్ పార్టీ కోరుకుంటోందన్నారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, సీఎం నితీశ్ కుమార్‌ల నిజ స్వరూపాన్ని మహిళలు తెలుసుకోవాలన్నారు. ఎదుటి వారి ఉద్దేశాలను కనిపెట్టే శక్తి మహిళలకు ఉందంటూ ఆమె, తమ కూతుళ్లకు పెళ్లి సంబంధాలు కుదిర్చే సమయంలో వారు ఇదే నైపుణ్యాన్ని వాడుతారంటూ చమత్కరించారు. మోదీ, షా, నితీశ్‌లకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తగు రీతిలో గుణపాఠం చెప్పాలని కోరారు. ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజనలో భాగంగా రాష్ట్రంలోని 75 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.7,500 కోట్లను జమ చేయడంపై ఆమె పైవిధంగా స్పందించారు. ఎన్నికలుండబట్టే ప్రభుత్వం రూ.10 వేలు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని విమర్శించారు. అనంతరం మోతీహారీలో సోలోగా జరిగిన మొట్టమొదటి ఎన్నికల ర్యాలీలో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా తన అన్న రాహుల్ గాంధీని నిజమైన దేశభక్తుడంటూ ప్రశంసలు కురిపించారు.

మైక్రోసాఫ్ట్ క్లౌడ్, ఏఐ సేవలు ఇజ్రాయెల్‌కు బంద్

వాషింగ్టన్: గాజాలో విధ్వంసం సృష్టిస్తున్న ఇజ్రాయెల్ మిలిటరీకి మైక్రోసాఫ్ట్ సంస్థ షాకిచ్చింది. ఇజ్రాయెల్ రక్షణ శాఖకు తన క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సేవలను నిలిపివేసినట్లు మైక్రోసాఫ్ట్ ప్రెసిడెంట్ బ్రాడ్ స్మిత్ ప్రకటించారు. పాలస్తీనా పౌరులపై మూకుమ్మడిగా నిఘా పెట్టేందుకు ఇజ్రాయెల్ మిలిటరీ మైక్రోసాఫ్ట్‌కు చెందిన అజూర్ ప్లాట్‌ఫామ్‌ను వాడుకుంటోందని ఈ ఏడాది ఫిబ్రవరిలో అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ), ది గార్డియన్ వార్తా సంస్థలు బయటపెట్టాయి. గాజా, వెస్ట్ బ్యాంక్ తదితర ప్రాంతాల్లో పాలస్తీనా పౌరుల ఫోన్‌కాల్స్, మొబైల్ మెసేజ్‌లను ఇజ్రాయెల్ రక్షణ, నిఘా సంస్థలు భారీగా సేకరించేందుకు మైక్రోసాఫ్ట్ సేవలను వాడుకుంటున్నాయని ఏపీ పరిశోధన విభాగం బట్టబయలు చేసింది. ఇందుకోసం ఇజ్రాయెల్ మిలిటరీలోని సైబర్ వార్‌ఫేర్ విభాగం యూనిట్ 8200 మైక్రోసాఫ్ట్ అజూర్ ప్లాట్‌ఫామ్‌లో అనేక అకౌంట్లు తెరిచిందని పేర్కొంది.

యెమెన్ రాజధానిపై ఇజ్రాయెల్ దాడులు

9 మంది మృతి, 150 మందికిపైగా గాయాలు

ఏడెన్: యెమెన్ రాజధాని సనాలోని హౌతీ రెబల్స్ స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానికదాడులకు దిగింది. గురువారం మధ్యాహ్నం జరిగిన రెండు దాడుల్లో 9 మంది చనిపోయారని హౌతీలు ప్రకటించారు. బుధవారం ఇజ్రాయెల్‌పై హౌతీలు జరిపిన డ్రోన్ దాడుల్లో ఐలట్ నగరం 22 మంది గాయపడ్డారు. దీనికి ప్రతీకారంగానే ఇజ్రాయెల్ వైమానిక దాడులకు తెరతీసిందని భావిస్తున్నారు. సనాపై జరిగిన దాడుల్లో నలుగురు చిన్నారులు, ఇద్దరు మహిళలు, ముగ్గురు వృద్ధులు సహా 9 మంది చనిపోయారని హౌతీలు తెలిపారు. క్షతగాత్రుల్లో 59 మంది చిన్నారులు, 35 మంది మహిళలు, 80 మంది వృద్ధులు ఉన్నారని చెప్పారు.

కాంగ్రెస్ హెడ్డాఫీసులో మన్మోహన్ సింగ్ పేరుతో లైబ్రరీ



న్యూఢిల్లీ: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ పేరుతో ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో 1,200 పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటైంది. దీనిని శుక్రవారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియా గాంధీ ప్రారంభించారు. కార్యక్రమంలో మన్మోహన్ సతీమణి గురుశరణ్ కౌర్, ఇతర కుటుంబ సభ్యులతోపాటు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. లైబ్రరీలో మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభ్‌భాయ్ పటేల్, ఇందిరాగాంధీ తదితరులకు సంబంధించిన గ్రంథాలతోపాటు 'ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ కాంగ్రెస్', పార్టీ మేనిఫెస్టోలు ఉన్నాయి. ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో డాక్టర్ మన్మోహన్ సింగ్ రీసెర్చ్ సెంటర్ అండ్ లైబ్రరీ మన్మోహన్ సింగ్ 93వ జయంతినాడు ప్రారంభమైందని రాహుల్ గాంధీ ఎక్స్‌లో తెలిపారు. గ్రంథాలయంలో రాజ్యాంగాన్ని రూపకల్పన చేసిన రాజ్యాంగ సభ సభ్యులతో కూడిన అరుదైన చిత్రం ప్రధాన ఆకర్షణగా ఉంది. ప్రముఖ స్వాతంత్ర్య యోధుల జీవిత చరిత్రలు, ప్రసంగాలు, ఎంపిక చేసిన గ్రంథాలు ఉన్నాయి.

ఛత్తీస్‌గఢ్ స్టీల్ ప్లాంట్‌లో విషాదం

నిర్మాణం కూలి ఆరుగురు మృతి

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లోని ప్రైవేట్ ఉక్కు కర్మాగారంలో శుక్రవారం ఓ నిర్మాణం కూలిన ఘటనలో ఆరుగురు చనిపోయారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. నిర్మాణం పైకప్పు కూలి, శిథిలాల కింద చిక్కుకుని మరికొందరు ఉన్నట్లు భావిస్తున్నారు. సిల్తారా ప్రాంతంలో ఉన్న గోదావరి పవర్ అండ్ ఇస్పాత్ లిమిటెడ్‌లో ఈ ప్రమాదం జరిగినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు వేగంగా సాగుతున్నాయన్నారు.

గ్రీన్ కాకర్స్‌కు షరతులతో సుప్రీం అనుమతి

న్యూఢిల్లీ: గుర్తింపు పొందిన ఉత్పత్తిదారులు మాత్రమే గ్రీన్ కాకర్స్‌ను తయారు చేసేందుకు సుప్రీంకోర్టు అనుమతి మంజూరు చేసింది. అయితే, ఢిల్లీ-దేశ రాజధాని ప్రాంతంలో చేపట్టే క్రాకర్స్ విక్రయాలకు ముందస్తు అనుమతి తప్పనిసరని తెలిపింది. ఢిల్లీ-దేశ రాజధాని ప్రాంతంలో బాణసంచా తయారీపై పూర్తి స్థాయి నిషేధంపై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ధర్మాసనం సమీక్ష చేపట్టింది. ఈ విషయంలో తుది నిర్ణయం తీసుకునేముందు, ఢిల్లీ ప్రభుత్వం, ఉత్పత్తిదారులు, విక్రేతలతో సంప్రదింపులు జరపాలని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖను ఆదేశించింది. అప్పటిలోగా నీరి(నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)తోపాటు పెసో(పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ) ధ్రువీకరించిన గ్రీన్ క్రాకర్ల సర్టిఫికేషన్ ఉన్న తయారీదారులను తయారీకి అనుమతిస్తున్నాం. అయితే, కోర్టు తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు నిషేధిత ప్రాంతాలలో బాణసంచాను విక్రయించబోమని తయారీదారులు హామీ ఇవ్వాలి'అని ధర్మాసనం స్పష్టం చేసింది.

సాటానిక్ వెర్సెస్‌పై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: ప్రముఖ రచయిత సల్మాన్ రష్దీ వివాదాస్పద నవల 'సాటానిక్ వెర్సెస్'పై నిషేధం విధించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఢిల్లీ హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వేసినట్లుగా భావిస్తున్నామంటూ జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం కొట్టివేస్తున్నట్లు తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు దైవదూషణగా భావించడంతో 1988లో శాంతి భద్రత సమస్యలు తలెత్తుతాయని భావించిన కేంద్రంలోని అప్పటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం సాటానిక్ వెర్సెస్ నవల దిగుమతిపై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. అయితే, ఈ నవల బహిరంగ మార్కెట్‌లో లభ్యమవుతోందంటూ ముంబైకి చెందిన ముగ్గురు వ్యక్తులు లాయర్ చాంద్ ఖురేషి ద్వారా పిటిషన్ వేశారు. పలు దేశాల్లో ఈ నవలపై నిషేధం ఉందని వారు పేర్కొన్నారు.

వారిని బంగ్లాదేశ్‌కి పంపడం చట్ట విరుద్ధం

కేంద్ర ప్రభుత్వాన్ని తప్పుబట్టిన కలకత్తా హైకోర్టు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని బీర్భూమ్ జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు, వారి కుటుంబాలను అక్రమ వలసదారులనే ఆరోపణలపై బంగ్లాదేశ్‌కి పంపించడం చట్ట విరుద్ధమని కలకత్తా హైకోర్టు పేర్కొంది. సొనాలి బీబీ, స్వీటీ బీబీ అనే మహిళలు వారి ముగ్గురు చిన్నారులు సహా నలుగురు కుటుంబ సభ్యులను నెల రోజుల్లోగా తిరిగి దేశంలోకి తీసుకురావాలని ఆదేశించింది. ఈ విషయంలో తాత్కాలిక స్టే ఇవ్వాలంటూ కేంద్రం చేసిన వినతిని జస్టిస్ తపబ్రత చక్రవర్తి సారథ్యంలోని ధర్మాసనం తోసిపుచ్చింది. మురరాయ్ ప్రాంతంలో ఉంటున్న 9 నెలల గర్భవతి అయిన తన కుమార్తె సొనాలి, ఆమె భర్త డానిష్ షేక్, వారి ఐదేళ్ల కుమారుడిని ఢిల్లీలో నిర్బంధించి, అనంతరం బంగ్లాదేశ్‌కు పంపించారంటూ భోదు షేక్ అనే వ్యక్తి, తన సోదరి స్వీటీ బీబీ, ఆమె ఇద్దరు పిల్లలను ఢిల్లీ పోలీసులు నిర్బంధించి, జూన్ 27న బంగ్లాదేశ్‌కు పంపించారంటూ అమీర్ ఖాన్ అనే వ్యక్తి వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్లపై ధర్మాసనంపై ఆదేశాలను జారీ చేసింది.

మా ఆదేశాలను పాటించకపోవడం ధిక్కారమే

మధ్యప్రదేశ్‌లో కస్టోడియల్ మరణంపై సుప్రీం

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి శుక్రవారం సుప్రీంకోర్టు చివాట్లు పెట్టింది. 'మా ఆదేశాలను వెంటనే అమలు చేయండి, లేదా ఎలా అమలు చేయించాలో మాకు తెలుసు'అంటూ వ్యాఖ్యానించింది. లాకప్ మరణానికి బాధ్యులైన ఇద్దరు పోలీసు అధికారులు తప్పించుకుపోయారంటూ మధ్యప్రదేశ్ తెలపడంపై ఈ మేరకు ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ ఉత్తర్వుల అమల్లో పురోగతి కనిపించకుంటే, సంబంధిత అధికారులు 'కాంటెప్ట్ ఆఫ్ కోర్ట్స్ యాక్ట్'ప్రకారం ధిక్కారం ఆరోపణలను ఎదుర్కోవాల్సి ఉంటుందంటూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ మహదేవన్‌ల ధర్మాసనం తీవ్ర హెచ్చరికలు చేసింది. మే 15వ తేదీన సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాల మేరకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడం లేదని, కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించడం లేదంటూ మృతుడి తల్లి వేసిన పిటిషన్‌పై ధర్మాసనం పై ఆదేశాలను జారీ చేసింది. అక్టోబర్ 7వతేదీలోగా తమ ఉత్తర్వులను తుచ తప్పక అమలు చేసి, నివేదిక అందించాలని స్పష్టం చేసింది. లేకుంటే ధిక్కారంగా పరిగణిస్తామని, ఇదే చివరి అవకాశమని దర్యాప్తు అధికారికి ధర్మాసనం తేల్చిచెప్పింది.

కట్టా రామచంద్రారెడ్డి మృతదేహాన్ని భద్రపర్చండి

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన మావోయిస్ట్ నేత కట్టా రామచంద్రారెడ్డి మృతదేహాన్ని భద్రపర్చాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. నారాయణపూర్ జిల్లాలో చోటుచేసుకున్న ఆ ఎన్‌కౌంటర్ బూటకమంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మసీహ్‌ల ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. బూటకపు ఎన్‌కౌంటర్‌లో నారాయణరెడ్డిని చంపేశారని, దీనిపై విచారణ జరిపించాలంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు నిర్ణయం ప్రకటించే వరకు నారాయణరెడ్డి మృతదేహాన్ని దహనం, ఖననం చేయరాదని స్పష్టం చేసింది. దసరా సెలవుల అనంతరం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టాలని హైకోర్టును ధర్మాసనం కోరింది. తన తండ్రిని చిత్రహింసలు పెట్టి, చంపేసి పోలీసులు ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించారని, మృతదేహాన్ని దహనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ రామచంద్రారెడ్డి కుమారుడు రాజా చంద్ర వేసిన పిటిషన్‌పై ధర్మాసనం పై ఆదేశాలను జారీ చేసింది.

2,417 మంది భారతీయుల డిపోర్ట్

న్యూఢిల్లీ: అమెరికాలో సరైన ధ్రువపత్రాలు లేకుండా నివసిస్తున్న 2,417 మంది భారతీయులను ఆ దేశం తిప్పి పంపినట్లు భారత విదేశాంగశాఖ ప్రకటించింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు వీరంతా దఫదఫాలుగా స్వదేశం చేరుకున్నారని శుక్రవారం విదేశాంగశాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ వెల్లడించారు. అక్రమ వలసలను భారత్ వ్యతిరేకిస్తుందని తెలిపారు. అదే సమయంలో సక్రమమైన వలసలను ప్రోత్సహిస్తుందని చెప్పారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడయ్యాక ఆ దేశంలోని అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఎక్కడికక్కడ అరెస్టులు చేసి వారి సొంత దేశాలకు బలవంతంగా పంపేస్తున్నారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా భారతీయులను కూడా పంపారు.

పంజాబ్ నుంచి రాజ్యసభకు కేజ్రీవాల్?

సాక్షి, న్యూఢిల్లీ: ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ పంజాబ్ నుంచి రాజ్యసభకు పోటీలో ఉంటారని మళ్లీ ఊహాగానాలు మొదలయ్యాయి. ఆప్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఉండి, ఇటీవలి ఉప ఎన్నికలో లుధియానా వెస్ట్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో గెలుపొందిన అరోరా స్థానంలో కేజ్రీవాల్ పోటీలో ఉంటారన్న చర్చ జరుగుతోంది. రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో ఈ అంశం తెరపైకి వచ్చింది. ఖాళీగా ఉన్న రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 24న ఓటింగ్ కాగా, నామినేషన్ల దాఖలుకు అక్టోబర్ 13 ఆఖరు తేదీ. రాజ్యసభకు వెళితే జాతీయ అంశాలపై ఎన్డీయేను ఢీకొట్టడంతో పాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేయగలరన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కుటుంబ ప్రయోజనాలే ఆయన లక్ష్యం

లాలు ప్రసాద్‌పై సీఎం నితీశ్ కుమార్ ధ్వజం

పట్నా: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల వేళ ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్‌పై సీఎం నితీశ్ కుమార్ విమర్శలు కురిపించారు. లాలుకు తన వారసత్వ రాజకీయాలు, కుటుంబ ప్రయోజనాలే తప్ప మరో లక్ష్యం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన పథకం ప్రారంభం సందర్భంగా నితీశ్ మాట్లాడారు. 'రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి, మహిళా సాధికారితకు ఎన్డీయే ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోంది. గత ప్రభుత్వం, 2005కు ముందు రాష్ట్ర మహిళల కోసం చేసిందేమీ లేదు. లాలు ప్రసాద్‌ను తొలగిస్తే, ఆయన భార్య రబ్రీదేవి సీఎం పదవి చేపడతారనే విషయం అప్పట్లో ముందుగానే అందరికీ తెలిసిపోయింది. ఆయన తన కుటుంబ లాభమే సర్వస్వం. మా ప్రభుత్వం మాత్రం రాష్ట్రంలోని ప్రజలందరి కోసం పనిచేస్తుంది'అని చెప్పారు. 2005 తర్వాతే రాష్ట్రంలో విద్య, ఆరోగ్యం సహా అన్ని రంగాల్లో అద్భుతమైన అభివృద్ధి జరిగిందన్నారు. దాణా కుంభకోణంలో సీబీఐ చార్జిషీట్ వేయడంతో 1997లో లాలు సీఎం పదవికి రాజీనామా చేయడం, ఆయన భార్య రబ్రీదేవి సీఎంగా బాధ్యతలు చేపట్టడం తెల్సిందే.

ప్రాథమిక హక్కుల పరిరక్షణ కర్త సుప్రీంకోర్టు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

వ్యక్తిగత స్వేచ్ఛలు, హక్కులు

ప్రకరణ-28

విద్యాలయాల్లో మత బోధన నిషేధం

ప్రకరణ 28(1): ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడిచే ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రత్యేక మత బోధన నిషేధం.

ప్రకరణ 28(2): పై నిబంధనకు కొన్ని మినహాయింపులిచ్చారు. ప్రభుత్వం నిర్వహించే దేవాదాయ, ధర్మాదాయ సంస్థల్లో ప్రత్యేక మత బోధన చేయవచ్చు.

ప్రకరణ 28(3): ప్రభుత్వ గుర్తింపు ఉన్న, ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందే విద్యాసంస్థల్లో ఒక వ్యక్తి ఐచ్ఛికంగా మత ప్రార్థనలు/బోధనల్లో పాల్గొనవచ్చు. అయితే పాల్గొనమని ఒత్తిడి చేయరాదు. ఆ వ్యక్తి మైనర్ అయితే తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి అనుమతి తీసుకోవాలి.

ప్రకరణలు-29, 30

విద్యా, సాంస్కృతిక పరమైన హక్కులు

ప్రకరణ 29(1): భారతదేశంలో నివసిస్తున్న ప్రజలకు ప్రత్యేక భాష, లిపి, సంస్కృతి ఉంటే.. వాటిని పరిరక్షించుకుని, పెంపొందించుకునే స్వేచ్ఛ వారికి ఉంటుంది.

ప్రకరణ 29(2): ప్రభుత్వం నిర్వహిస్తోన్న లేదా ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందుతున్న సంస్థల్లో ప్రవేశానికి మతం, జాతి, కులం, భాషా ప్రాతిపదికన వివక్ష చూపరాదు.

ప్రకరణ 30(1): మైనారిటీ వర్గాలవారు, ప్రత్యేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకొని, నిర్వహించుకోవచ్చు.

ప్రకరణ 30(1)(ఎ): మైనారిటీలు నిర్వహిస్తున్న విద్యాసంస్థలు, వాటి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే, వారికి ప్రత్యేక నష్టపరిహారం చెల్లించాలి. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ క్లాజును చేర్చారు.

ప్రకరణ 30(2): ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించే సమయంలో విద్యాసంస్థల పట్ల వివక్ష చూపరాదు. అల్ప సంఖ్యాక వర్గాల వారు నడిపే సంస్థలు, అధిక సంఖ్యాక వర్గాల వారు నడిపే సంస్థలను సమ దృష్టితో చూడాలి.

వివరణ:

- ఆర్టికల్ 29, 30లలో 'మైనారిటీ' పదాన్ని ప్రస్తావించారు. కానీ ఈ పదాన్ని రాజ్యాంగంలో ఎక్కడా నిర్వచించలేదు.
- మైనారిటీల వర్గీకరణకు రాష్ట్రాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దేశంలో రెండు రకాల మైనారిటీ వర్గాలున్నాయి. అవి మతపరమైన, భాషాపరమైన మైనారిటీ వర్గాలు.
- హిందువులు మినహా మిగతా వారంతా మతపరమైన మైనారిటీలే. భాషాపరమైన మైనారిటీలు రాష్ట్రాల వారీగా మారుతుంటారు. ఉదాహరణకు.. తెలంగాణలో కన్నడిగులు, గుజరాతీలు, మరాఠీలు భాషాపరంగా మైనారిటీలు.

సుప్రీంకోర్టు తీర్పులు

కేరళ విద్య పాఠ్యాంశాల సవరణ బిల్లు (1958) కేసు: కేరళ ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవ, కమ్యూనిస్టు భావాలున్న పాఠ్యాంశాలను చేర్చారు. దీంతో ఈ బిల్లును సుప్రీంకోర్టు సలహా పరిధికి నివేదించారు. పాఠ్యాంశాల్లో తీవ్రవాద భావజాలాన్ని చేర్చడం చెల్లదని సుప్రీంకోర్టు తెలిపింది.

డి.ఎ.వి. కాలేజ్ v/s స్టేట్ ఆఫ్ పంజాబ్ (1971) కేసు: విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లో పంజాబీ మాత్రమే బోధన భాషగా ఉండాలని నిర్ణయించారు. అయితే ఇది చెల్లుబాటు కాదని సుప్రీంకోర్టు తీర్పుచెప్పింది.

అల్‌సెయింట్స్ v/s గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (1980) కేసు: మైనారిటీ విద్యాసంస్థల నిర్వహణలో ప్రభుత్వం జోక్యం చేసుకోరాదని ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

టి.ఎం.ఎ.పాయ్ v/s స్టేట్ ఆఫ్ కర్ణాటక (2003) కేసు: మైనారిటీ విద్యా సంస్థల విషయంలో ప్రభుత్వం ఏ సందర్భంలో జోక్యం చేసుకోవచ్చో, జోక్యం చేసుకోరాదో వివరణ ఇస్తూ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. అవి..

- మైనారిటీ స్థాయిని నిర్ణయించడానికి రాష్ట్రాన్ని మాత్రమే యూనిట్‌గా తీసుకోవాలి.
- మైనారిటీ అనే పదంలో భాషాపరమైన, మతపరమైన మైనారిటీలు ఉండవచ్చు.
- బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు, వారిపై పాలనా నియంత్రణ సంబంధిత హక్కులు మేనేజ్‌మేంట్‌కే ఉంటాయి. ప్రభుత్వ ధనసహాయం పొందని మైనారిటీ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే అధికారం ప్రభుత్వానికి లేదు. అయితే క్యాపిటేషన్ ఫీజులను ప్రభుత్వం నియంత్రించవచ్చు.

ప్రకరణ - 31

ఆస్తిహక్కు

పార్లమెంటు ఆస్తి హక్కుకు సంబంధించి అనేక సవరణలు, చట్టాలు చేసింది. 1951లో మొదటి రాజ్యాంగ సవరణ, 1964లో 17వ రాజ్యాంగ సవరణ, 1971లో 24వ రాజ్యాంగ సవరణ చేశారు. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. దాన్ని 12వ భాగంలో ప్రకరణ 300-ఎలో రాజ్యాంగ పరమైన హక్కుగా (Constitutional Rights) చేర్చారు. 1979 జూన్ 20 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. అలాగే ఆస్తి హక్కుకు సంబంధించి నూతన నిబంధనలను కూడా చేర్చారు.

ప్రకరణ 31(ఎ): ప్రభుత్వం ఆస్తిని స్వాధీనం చేసుకున్నప్పుడు వర్తించే కొన్ని మినహాయింపులను ఈ ప్రకరణలో పేర్కొన్నారు. భూ సంస్కరణల అమలు కోసం చట్టాలు చేసినప్పుడు.. అవి 14, 19 ప్రకరణలకు వ్యతిరేకమనే కారణంతో న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు.

ప్రకరణ 31(బి): కొన్ని చట్టాల వర్తింపునకు మినహాయింపులు. వీటిని 9వ షెడ్యూల్డ్‌లో ప్రస్తావించారు. ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉన్నాయన్న కారణంతో ఇలాంటి చట్టాలను న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు. 9వ షెడ్యూల్డ్‌లో పేర్కొన్న అంశాలు సాధారణంగా న్యాయ సమీక్షకు గురికావు. కానీ 'రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో న్యాయ సమీక్ష అంతర్భాగం. దాన్ని పరిమితం చేసే అధికారం పార్లమెంటుకు లేదు' అని కేశవానంద భారతి కేసు(1973)లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

2007లో ఐ.ఆర్. కొహెల్హో v/s తమిళనాడు కేసులో 'న్యాయ సమీక్ష రాజ్యాంగ మౌలిక నిర్మాణంలోకి వస్తుంది. కాబట్టి 1973 తర్వాత 9వ షెడ్యూల్డ్‌లో చేర్చిన అంశాలు న్యాయ సమీక్షకు గురవుతాయి' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

ప్రకరణ 31(సి): ఆదేశిక సూత్రాల అమలు కోసం ప్రాథమిక హక్కులపై, ముఖ్యంగా ఆస్తి హక్కుపై కొన్ని పరిమితులు విధించవచ్చు. ఈ పరిమితులు రాజ్యాంగ విరుద్ధమంటూ న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీల్లేదు.

ఆదేశిక సూత్రాల్లోని ప్రకరణ 39లో ఉన్న క్లాజు బి, సిలో సామ్యవాద తరహా సమాజ స్థాపన గురించి పేర్కొన్నారు. ఈ విషయమై రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు కొన్ని పరిమితులు విధిస్తే, అవి ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమని న్యాయస్థానంలో ప్రశ్నించలేం.

వివరణ:

ప్రకరణ 31(ఎ), 31(బి), 31(సి)లు ఆస్తి హక్కుపై పరిమితికి సంబంధించినవి. ఇవి ఎలాంటి ప్రాథమిక హక్కులను ప్రసాదించవు. 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కు ప్రకరణ 31ను తొలగించారు. కానీ వీటిని మాత్రం కొనసాగించారు.

ప్రకరణ - 32

రాజ్యాంగ పరిహార హక్కు (Right to Constitutional Remedies)

ప్రాథమిక హక్కుల్లో ఇది అత్యంత ముఖ్యమైంది. మూడో భాగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగినా/ఆ హక్కులను



పరిమితం చేసినా/అమలు చేయకపోయినా, బాధితులు నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగిన రాజ్యాంగ పరిహారాలను పొందవచ్చు. మొదటి ఆరు ప్రాథమిక హక్కుల అమలు ఈ నిబంధన పైనే ఆధారపడి ఉంటుంది. హక్కులను గుర్తించడంతోపాటు, వాటి అమలుకు హామీ ఉన్నప్పుడే వాటికి విలువ ఉంటుంది. అమలు కాని హక్కులు వ్యర్థం.

ప్రాథమిక హక్కుల పరిరక్షణకు నిబంధన 32(4) హామీ ఇస్తోంది. అందుకే అంబేద్కర్ రాజ్యాంగ పరిహార హక్కును రాజ్యాంగ ఆత్మగా, హృదయంగా వర్ణించారు.

ప్రకరణ 32(1): ఒక వ్యక్తి ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు లేదా అవి అమలు కానప్పుడు ఆ వ్యక్తి నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగిన పరిహారం పొందవచ్చు.

ప్రకరణ 32(2): హక్కులను కాపాడటానికి ప్రత్యేక ఆదేశాలైన హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, కో-వారెంటో, సెర్షియరీ లాంటి రిట్లను సుప్రీంకోర్టు జారీ చేసేందుకు ఈ భాగం వీలు కల్పిస్తుంది.

ప్రకరణ 32(3): సుప్రీంకోర్టు అధికారాలకు విఘాతం కలగకుండా, ఇతర న్యాయస్థానాల (స్థానిక కోర్టులు, జిల్లా కోర్టులు)కు కూడా రిట్లు జారీచేసే అధికారాన్ని పార్లమెంటు చట్టం ద్వారా కల్పించవచ్చు.

ప్రకరణ 32(4): రాజ్యాంగంలో ఇతరత్రా అనుమతించిన విధంగా తప్ప ఈ ప్రకరణ ద్వారా గుర్తించిన హక్కులు రద్దు కావు.

వివరణ:

రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో రాజ్యాంగ పరిహార హక్కు అంతర్భాగమని 1981లో ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

రిట్లు-పరిధి-పరిమితులు

ప్రాథమిక హక్కుల పరిరక్షణకు జారీచేసే ప్రత్యేక ఆదేశాలను న్యాయశాస్త్ర పరిభాషలో రిట్లు (Writs) అంటారు. రిట్లు జారీ చేసే పద్ధతిని బ్రిటన్ రాజ్యాంగం నుంచి గ్రహించారు. నిబంధన 32 ప్రకారం సుప్రీంకోర్టుకు, నిబంధన 226 ప్రకారం రాష్ట్ర హైకోర్టులకు రిట్లు జారీ చేసే అధికారాన్ని కల్పించారు. పార్లమెంటు ప్రత్యేక చట్టం ద్వారా ఈ అధికారాన్ని జిల్లా న్యాయస్థానాలకు కల్పించవచ్చు. ఇప్పటి దాకా పార్లమెంటు అలాంటి చట్టాలను రూపొందించలేదు. కాబట్టి సుప్రీంకోర్టు, హైకోర్టులకు మాత్రమే రిట్లు జారీ చేసే అధికారం ఉంది. రిట్ల జారీ విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టు మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి.

హైకోర్టులు జారీ చేసే రిట్ అత్యవసర పరిస్థితుల్లో రద్దవుతుంది. ప్రకరణ 226 విషయ పరిధి తక్కువ. కానీ సుప్రీంకోర్టు జారీ చేసే రిట్ అత్యవసర పరిస్థితుల్లో రద్దు కాదు. ప్రకరణ 32 విషయ పరిధి విస్తృతమైంది.

ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీంకోర్టుకు ప్రత్యేకమైన, ప్రాథమిక విచారణ పరిధి ఉంటుంది (Primary and Original). అందుకే సుప్రీం కోర్టును **ప్రాథమిక హక్కుల పరిరక్షణ కర్త** అంటారు.

ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీంకోర్టు, హైకోర్టులకు ఉమ్మడి పరిధి ఉంటుంది. అంటే పౌరులు ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ప్రకరణ 32 ప్రకారం నేరుగా సుప్రీంకోర్టును లేదా ప్రకరణ 226 ప్రకారం హైకోర్టును ఆశ్రయించవచ్చు.

సాధారణంగా హైకోర్టు ద్వారా తగిన రక్షణ, ఉపశమనం లభిస్తుందని పౌరులు భావిస్తే, మొదట హైకోర్టును ఆశ్రయించాలని కనుభాయ్ బ్రహ్మ భట్ v/s గుజరాత్ (1972) కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

వివిధ రిట్లు-అర్థం-పరిధి-ప్రాముఖ్యత

హెబియస్ కార్పస్ (Hebeas Corpus)

ఈ పదం లాటిన్ భాష నుంచి వచ్చింది. హెబియస్ అంటే 'Have', కార్పస్ అంటే 'Body' అని అర్థం. ఒక వ్యక్తిని భౌతికంగా కోర్టు ముందు హాజరుపర్చడమని దీనికి అర్థం. ఇది పురాతన రిట్. నిబంధన 19-22 వరకు పొందుపరచిన వ్యక్తిగత స్వేచ్ఛలకు భంగం కలిగినప్పుడు ఈ రిట్ జారీ చేస్తారు. అరెస్టయిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప న్యాయస్థానంలో హాజరుపరచాలి. లేని పక్షంలో ఈ రిట్ దాఖలు చేస్తే వెంటనే ఆ వ్యక్తిని న్యాయస్థానం ముందు హాజరుపరచాలని కోర్టు ఆదేశిస్తుంది.

వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణతోపాటు చట్టబద్ధత లేకుండా ఏ వ్యక్తిని నిర్బంధించకుండా, శిక్షించకుండా కాపాడటం ఈ రిట్ ప్రధాన ఉద్దేశం. ఈ రిట్‌ను ప్రభుత్వ సంస్థలకు, ప్రైవేట్ వ్యక్తులకు కూడా జారీ చేయవచ్చు.

మూడో వ్యక్తికి కూడా ఇందులో జోక్యం చేసుకునే హక్కు (లోకస్ స్టాండై) ఉంటుంది. బాధితుల తరఫున సామాజిక స్పృహ ఉన్న సంస్థ/వ్యక్తి ఈ రిట్ దాఖలు చేయవచ్చు. అందుకే దీన్ని ఉదారమైన రిట్ అని, వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణ సాధనమని అంటారు.

మినహాయింపులు:

పార్లమెంటు స్వాధికారాలకు భంగం కలిగించిన కారణంతో వ్యక్తిని నిర్బంధించినప్పుడు, కోర్టు ద్వారా నేరారోపణ నిరూపితమై జైలు శిక్ష అనుభవిస్తున్నప్పుడు ఇది వర్తించదు.

మాండమస్ (Mandamus)

భాషాపరంగా మాండమస్ అంటే ఆదేశం అని అర్థం. సుప్రీం కోర్టు లేదా హైకోర్టు జారీచేసే అత్యున్నత ఆదేశంగా దీన్ని చెప్పవచ్చు. ప్రభుత్వాధికారి/సంస్థ తమ చట్టబద్ధమైన విధులను నిర్వర్తించనప్పుడు వాటిని నిర్వర్తించమని న్యాయస్థానం ఇచ్చే ఆదేశం.

ప్రభుత్వాధికారులు, సంస్థలు తమ విధులను చట్టబద్ధంగా నిర్వర్తించనప్పుడు ప్రజల హక్కులకు భంగం వాటిల్లుతుంది. అలాంటి సందర్భాల్లో వారు సక్రమంగా విధులు నిర్వర్తించడానికి ఈ రిట్ జారీ చేస్తారు. పబ్లిక్ సంస్థలు, క్వాజి పబ్లిక్ (Quasi-Public), జ్యుడీషియల్ సంస్థలు, క్వాజి జ్యుడీషియల్ సంస్థలకు వ్యతిరేకంగా ఈ రిట్ జారీ చేయవచ్చు.

మినహాయింపులు:

రాష్ట్రపతి, గవర్నర్లకు ఈ రిట్ వర్తించదు. వీరు తమ అధికారాలు, విధులను నిర్వర్తించనప్పుడు వాటిని నిర్వర్తించమని ఏ కోర్టు ఆదేశించలేదు.

ప్రైవేట్ వ్యక్తులు, ప్రైవేటు సంస్థలకు వ్యతిరేకంగా ఈ రిట్ జారీచేయడానికి వీల్లేదు.


మాండమస్ రిట్‌ను అంతిమ ప్రత్యామ్నాయంగా మాత్రమే జారీచేస్తారు. అంటే పరిపాలనాపరమైన ప్రత్యామ్నాయాల ద్వారా పౌరులు న్యాయాన్ని పొందలేనప్పుడు ఈ రిట్ ద్వారా ఉపశమనం పొందవచ్చు. ఈ రిట్ జారీ అనేది కోర్టు విచక్షణపై ఆధారపడి ఉంటుంది.

అధికారులు తప్పనిసరిగా నిర్వర్తించాల్సిన విధులకే ఇది వర్తిస్తుంది. విచక్షణా (Discretion) పూర్వకమైన విధులకు వర్తించదు

'ప్రిన్సిపియా ఆఫ్ మేథమెటికా' పుస్తకాన్ని రాసింది?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
ఫిజికల్ సైన్స్ మెథడాలజీ

1. సైన్స్ ఏ భాషా పదం?
ఎ) ఇంగ్లిష్ బి) లాటిన్
సి) ఫ్రెంచ్ డి) గ్రీకు
2. పాదరసం ద్రవ రూపంలో ఉన్న లోహం. ఇది ఒక..?
ఎ) భావన బి) సాధారణీకరణం
సి) యదార్థం డి) ప్రాకల్పన
3. పరమాణువులు సంయోగం చెంది అణువులు ఏర్పడతాయి. ఇది ఒక..?
ఎ) యదార్థం బి) భావన
సి) పరికల్పన డి) సత్యం
4. పరస్పర సంబంధం కలిగి.. సత్యాల సంబంధాన్ని నియమబద్ధం చేసేది..?
ఎ) యదార్థం బి) భావన
సి) పరికల్పన డి) సాధారణీకరణం
5. ఎత్తైన పర్వతాలపై నీరు తక్కువ ఉష్ణోగ్రత వద్ద మరగవచ్చు. ఇది ఒక..?
ఎ) నల్ ప్రాకల్పన బి) ప్రశ్నా ప్రాకల్పన
సి) ప్రాసక్తి ప్రాకల్పన
డి) ప్రకటనాత్మక ప్రాకల్పన
6. ఆమోదించిన సిద్ధాంతం ఒక..?
ఎ) నియమం బి) సూత్రం
సి) యదార్థం డి) పరికల్పన
7. కింది వాటిలో విజ్ఞాన శాస్త్రంలో ద్రవ్యాత్మక నిర్మాణం కానిది?
ఎ) యదార్థం బి) భావన
సి) శాస్త్రజ్ఞులు పరిస్థితులను వివరించడం
డి) సిద్ధాంతం
8. విజ్ఞాన శాస్త్రాన్ని ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ఎలా నిర్వచించింది?
ఎ) భౌతిక ప్రపంచాన్ని, ప్రకృతి నియమాలను పరిశీలించడం
బి) అనుభవాత్మక పరిశీలనలు - అన్వేషణ
సి) విజ్ఞానశాస్త్రం అంటే మాపకం
డి) వ్యవస్థీకృతమైన సాధారణ జ్ఞానం
9. విజ్ఞానశాస్త్రం అంటే ఒక మాపకం.. అని చెప్పింది?
ఎ) కార్ల్ పియర్‌సన్ బి) అర్హీనియస్
సి) జేమ్స్ బికోనెంట్ డి) ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ
10. విషయాత్మక విశ్వంలో సామ్యం ఉందని విజ్ఞాన శాస్త్రం భావించడం ఒక..?
ఎ) యదార్థం బి) భావన
సి) పరికల్పన డి) మూల భావన
11. ఒక విద్యార్థి నాలుగు ఆమ్లాలను రుచి చూసిన అనంతరం.. అవి పుల్లగా ఉంటాయని చెప్పాడు. ఇది ఒక..?
ఎ) యదార్థం బి) సాధారణీకరణం
సి) భావన డి) పరికల్పన
12. శాస్త్రీయ ఫలితాలను సమర్థవంతంగా వివరించేవి..?
ఎ) యదార్థం బి) భావనలు
సి) ప్రాగుక్తీకరణలు డి) సిద్ధాంతాలు
13. శాస్త్రజ్ఞులకి ఉండే ప్రత్యేక లక్షణాలను ఎలా పిలుస్తారు?
ఎ) శాస్త్రీయ పద్ధతి బి) శాస్త్రీయ వైఖరి
సి) పై రెండూ డి) ఏదీకాదు
14. ఒక విద్యార్థి ఏ నిర్ణయాన్ని అంత్య నిర్ణయంగా అంగీకరించకపోవడం.. ఒక ?
ఎ) శాస్త్రీయ పద్ధతి బి) శాస్త్రీయ వైఖరి
సి) శాస్త్ర లక్షణం డి) పైవన్నీ
15. కాంతి ఏడు రంగుల మిశ్రమం. ఇది ఏ రకమైన ప్రాకల్పన?
ఎ) శూన్య ప్రాకల్పన బి) ప్రశ్నా ప్రాకల్పన
సి) ప్రాగుక్త ప్రాకల్పన
డి) ప్రకటనాత్మక ప్రాకల్పన
16. విజ్ఞానశాస్త్ర అభ్యాసకుడు సత్యశీలుడు.. ఎందుకంటే శాస్త్ర స్వభావం ఒక?
ఎ) క్రమశిక్షణ బి) సౌందర్యాన్వేషణ
సి) ధనార్జన డి) సత్యాన్వేషణ
17. సార్వత్రికంగా రుజువు చేసే ప్రవచనం.. ఒక?
ఎ) ప్రాకల్పన బి) నియమం
సి) ప్రయోగం డి) సాధారణీకరణం
18. జ్ఞాన సముపార్జనకు దోహదం చేసేది?
ఎ) తర్కం బి) స్పందన
సి) కంఠస్థం డి) అధికారత్వం
19. సాధారణీకరించిన ఊహ లేదా ఆలోచనే ఒక..?
ఎ) యదార్థం బి) సిద్ధాంతం
సి) సూత్రం డి) భావన
20. శాస్త్ర ప్రక్రియ నిర్మాణంలో ఇమడని కృత్యం?
ఎ) ప్రశ్నించడం బి) పరిశీలించడం
సి) నమ్మడం డి) ఊహించడం
21. జ్యోతిష్య శాస్త్రాన్ని అభివృద్ధి చేసింది?
ఎ) ఈజిప్షియన్లు బి) బాబిలోనియన్లు
సి) మెసపటోనియన్లు డి) పైవేవీ కాదు
22. 365 రోజుల క్యాలెండర్‌ను తయారు చేసింది?
ఎ) ఈజిప్షియన్లు బి) బాబిలోనియన్లు
సి) హోమోసేపియన్లు డి) ఇండియన్స్
23. నవీన విజ్ఞాన శాస్త్ర పితామహుడు?
ఎ) గెలీలియో బి) న్యూటన్
సి) నీల్స్ బోర్ డి) ఐన్‌స్టీన్
24. విశ్లేషణాత్మక త్రాసును అభివృద్ధి చేసింది?
ఎ) అరిస్టాటిల్ బి) గెలీలియో
సి) లెవోయిజర్ డి) న్యూటన్
25. 'ప్రిన్సిపియా ఆఫ్ మేథమెటికా' పుస్తకాన్ని రాసింది?
ఎ) ఐన్‌స్టీన్ బి) గెలీలియో
సి) న్యూటన్ డి) ఫారడే
26. ఖగోళ శాస్త్రానికి పునాది వేసిన గ్రంథం?
ఎ) గణితం బి) విజ్ఞానశాస్త్రం
సి) ఆర్యభట్టీయం డి) లీలావతి గణితం
27. రెటీనా, హెర్నియా, సిజేరియన్‌ల గురించి తెలిపే గ్రంథం?
ఎ) చరక సంహిత బి) రుగ్వేదం
సి) సుశ్రుత సంహిత డి) అన్నీ
28. రసరత్నాకర గ్రంథాన్ని రాసింది?
ఎ) ఐన్‌స్టీన్ బి) నాగార్జునుడు
సి) న్యూటన్ డి) నీల్స్ బోర్
29. భారతదేశంలో నూతన విద్యా విధాన పితామహుడు?
ఎ) ఛార్లెస్ గ్రాంట్ బి) గెలీలియో
సి) కొఠారి డి) న్యూటన్
30. సెకండరీ విద్యా కమిషన్ అధ్యక్షుడు?
ఎ) సర్వేపల్లి రాధాకృష్ణన్ బి) మొదలియార్
సి) కొఠారి డి) ఛార్లెస్ గ్రాంట్
31. ఎన్‌సీఈఆర్‌టీని ప్రారంభించిన సంవత్సరం?
ఎ) 1961 బి) 1962
సి) 1963 డి) 1964
32. జీవశాస్త్ర పితామహుడు?
ఎ) న్యూటన్ బి) డార్విన్
సి) అరిస్టాటిల్ డి) గెలీలియో
33. కణాల బ్రేనియన్ చలనం గురించి తెలిపింది?
ఎ) చార్లెస్ హెచ్‌టిన్స్ బి) ఐన్‌స్టీన్
సి) న్యూటన్ డి) గెలీలియో
34. 'π' విలువను కనుగొన్న శాస్త్రవేత్త?
ఎ) ఐన్‌స్టీన్ బి) గెలీలియో
సి) ఆర్యభట్ట డి) న్యూటన్
35. సిద్ధాంత శిరోమణి గ్రంథాన్ని రాసింది?
ఎ) ఆర్యభట్ట బి) భాస్కరాచార్యుడు
సి) లీలావతి డి) మహావీర
36. 1954లో భారతరత్న బిరుదు పొందిన శాస్త్రవేత్త?
ఎ) న్యూటన్
బి) సుబ్రహ్మణ్యం చంద్రశేఖర్
సి) సి.వి.రామన్ డి) ఐన్‌స్టీన్
37. నాడీ గమనాన్ని తెలిపే పరికరం?
ఎ) ఆడో మీటర్ బి) స్ఫిగ్మో మీటర్
సి) పల్స్ మీటర్ డి) పైవేవీ కావు
38. 'ఆన్ ది నేచర్ ఆఫ్ కామెంట్స్' పుస్తక రచయిత?
ఎ) న్యూటన్ బి) గెలీలియో
సి) ఫారడే డి) హైగెన్స్




39. 'అనాటమీ అండ్ ఫిజియాలజీ' అనే గ్రంథాన్ని రాసింది?
ఎ) గెలీలియో బి) న్యూటన్
సి) లెవోయిజర్ డి) హైగెన్స్
40. 'ఆటమ్స్ ఫర్ పీస్' అవార్డ్ పొందిన శాస్త్రవేత్త?
ఎ) నీల్స్ బోర్ బి) హైగెన్స్
సి) న్యూటన్ డి) రూథర్ ఫర్డ్
41. విద్యుత్ ప్రవాహం వల్ల జరిగే రసాయనిక మార్పులను అధ్యయనం చేసేది?
ఎ) ఎలక్ట్రాలసిస్ బి) హైడ్రాలసిస్
సి) ఎలక్ట్రో కెమిస్ట్రీ డి) పైవన్నీ
42. అన్‌సర్టెనిటీ ప్రిన్సిపల్‌ను తెలియజేసింది?
ఎ) హైసెన్ బర్గ్ బి) హైగెన్స్
సి) న్యూటన్ డి) ఫారడే
43. ప్రయోగాత్మక విజ్ఞాన శాస్త్రానికి ఆద్యుడు?
ఎ) గెలీలియో బి) విలియం హార్వే
సి) న్యూటన్ డి) రోజర్ బేకన్
44. జ్ఞానం మరింత జ్ఞాన సముపార్జన కోసం.. అనే భావాన్ని అభివృద్ధి పర్చిన విలువ ఏది?
ఎ) ఉపయోగిత విలువ
బి) వృత్తి విలువ సి) బౌద్ధిక విలువ
డి) క్రమశిక్షణ విలువ
45. విజ్ఞానశాస్త్రం విద్యార్థుల్లో అవగాహన, బుద్ధి వికాసం, బుద్ధి కుశలత, సత్యాన్వేషణ కలిగిస్తే.. అది ఏ విలువ?
ఎ) బౌద్ధిక విలువ బి) వృత్తి విలువ
సి) నైతిక విలువ డి) క్రమశిక్షణ విలువ
46. విజ్ఞాన శాస్త్రాన్ని అధ్యయనం చేస్తే.. విద్యార్థి శాస్త్ర స్వభావాన్ని కలిగి ఉండడం ఒక?
ఎ) నైతిక విలువ బి) వృత్తి విలువ
సి) శాస్త్రీయ వైఖరి- అభివృద్ధి విలువ
డి) సాంస్కృతిక విలువ
47. సత్యాన్వేషణలో శాస్త్రీయ పద్ధతిని ఉపయోగించడం వల్ల విద్యార్థిలో పెంపొందే విలువ?
ఎ) బౌద్ధిక విలువ
బి) నైతిక విలువ
సి) క్రమశిక్షణ విలువ
డి) సౌందర్యాత్మక విలువ
48. భావనలు సత్యం లేదా అసత్యం అని నిరూపించలేని పక్షంలో అవి ఎలా మిగిలిపోతాయి?
ఎ) నియమాలుగా బి) సూత్రాలుగా
సి) సాధారణీకరణాలుగా
డి) సిద్ధాంతాలుగా
49. సాంస్కృతిక వారసత్వాన్ని నూతన తరాలకు అందించటం, సాంస్కృతిక అభివృద్ధికి విజ్ఞాన శాస్త్రం సహాయం చేయటం ఒక..?
ఎ) నైతిక విలువ
బి) సౌందర్యాత్మక విలువ
సి) సాంస్కృతిక విలువ
డి) క్రమశిక్షణ విలువ
50. ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న సెల్‌ఫోన్. విజ్ఞానశాస్త్రం ఏ విలువ అవుతుంది?
ఎ) వృత్తి విలువ
బి) సాంస్కృతిక విలువ
సి)ఉపయోగిత విలువ
డి) క్రమశిక్షణ విలువ
51. ఒక ఉపాధ్యాయుడు ప్రతిరోజు ఒక విద్యార్థికి బొమ్మలు గీయమని చెబుతున్నాడు. దీని ద్వారా నెరవేరే ఉద్దేశం?
ఎ) జ్ఞాన సముపార్జన
బి) నైపుణ్య, సామర్థ్యాల అభివృద్ధి
సి) శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ
డి) శాస్త్రీయ వైఖరుల అభివృద్ధి
52. ఒక ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో అనుకూలమైన అలవాట్లు పెంపొందించడంలో నెరవేరే సామర్థ్యం?
ఎ) స్వీయ నిశ్చయం చేయగలగడం
బి) నైపుణ్యాల అభివృద్ధి
సి) శాస్త్రీయ వైఖరుల అభివృద్ధి
డి) భావి జీవితానికి భూమిక
53. విద్యుదయస్కాంత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త?
ఎ) న్యూటన్ బి) మాక్స్‌వెల్
సి) మాక్స్ ప్లాంక్ డి) హైగెన్స్
54. సౌర గడియారాన్ని తొలుత తయారు చేసినవారు?
ఎ) మెసపటోనియన్లు
బి) బాబిలోనియన్లు
సి) ఈజిప్షియన్లు డి) గ్రీకులు
55. అణుశాస్త్ర పితామహుడు?
ఎ) డాల్టన్ బి) న్యూటన్
సి) నీల్స్ బోర్ డి) హైగెన్స్
56. జాన్ డాల్టన్ రాసిన పుస్తకాలు..?
ఎ) న్యూ సిస్టమ్ ఆఫ్ కెమికల్ ఫిలాసఫీ
బి) కలర్ బ్లైండ్‌నెస్
సి) పరమాణు సిద్ధాంతం డి) పైవన్నీ
57. ఫారడే సిద్ధాంతాన్ని గణిత రూపంలో మార్చిన శాస్త్రవేత్త?
ఎ) మాక్స్‌వెల్ బి) మాక్స్ ప్లాంక్
సి) ఫ్లెమింగ్ డి) ఐన్‌స్టీన్
58. 'ది లాస్ ఆఫ్ మోషన్' గ్రంథ రచయిత?
ఎ) న్యూటన్ బి) గెలీలియో
సి) ఫారడే డి) కోపర్నికస్

సమాధానాలు

1)ఎ	2)సి	3)బి	4)డి	5)సి
6)ఎ	7)సి	8)సి	9)డి	10)డి
11)బి	12)డి	13)బి	14)బి	15)డి
16)డి	17)బి	18)సి	19)డి	20)సి
21)బి	22)ఎ	23)ఎ	24)సి	25)సి
26)సి	27)సి	28)బి	29)ఎ	30)బి
31)ఎ	32)సి	33)సి	34)బి	35)బి
36)సి	37)సి	38)బి	39)సి	40)ఎ
41)సి	42)ఎ	43)డి	44)సి	45)ఎ
46)సి	47)సి	48)డి	49)సి	50)సి
51)బి	52)ఎ	53)బి	54)సి	55)ఎ
56)డి	57)ఎ	58)బి		

బీహార్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?



భారతదేశ ప్రధాన నదీ వ్యవస్థ

భారతదేశంలో నదీ వ్యవస్థను ప్రధానంగా రెండు రకాలుగా విభజించవచ్చు. అవి:
1) జీవ నదీ వ్యవస్థ
2) వర్షాధార నదీ వ్యవస్థ

ఈ రెండు నదీ వ్యవస్థల వల్ల భారతదేశానికి వ్యవసాయపరంగా, పారిశ్రామికంగా, రవాణా పరంగా చాలా ప్రయోజనాలున్నాయి.

జీవ నదీ వ్యవస్థ

వీటినే హిమాలయన్ నదులు అని కూడా అంటారు. సంవత్సరం పొడవునా నీటి ప్రవాహం ఉన్న నదులను 'జీవనదులు' అంటారు. వర్షాకాలంలోని వర్షపు నీరు, ఇతర కాలాల్లో పర్వత శిఖరాల్లోని మంచు కరగడం వల్ల ఈ నదులు ఎల్లప్పుడూ ప్రవహిస్తూ ఉంటాయి. హిమాలయ నదులైన గంగా, సింధూ, బ్రహ్మపుత్ర, వీటి ఉపనదులు జీవ నదులుగా ఉన్నాయి.

- **సింధూనది:** ఇది 'టిబెట్' హిమాలయాల్లోని 'మానస సరోవరం' పశ్చిమ వైపున 5180 మీ. ఎత్తయిన కైలాస శిఖరాల్లో జన్మిస్తోంది. టిబెట్, భారత్, పాకిస్థాన్‌లో ప్రవహిస్తోంది. దీని మొత్తం పొడవు 2880 కి.మీ. భారతదేశంలో 709 కి.మీ. దూరం ప్రయాణిస్తుంది. ఈ నది భారతదేశంలో జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది. ఈ రాష్ట్రం నుంచి పాకిస్థాన్‌లోకి ప్రవేశించి, ఆ దేశంలో ఉత్తర, దక్షిణాలుగా ప్రవహిస్తోంది. చివరకు పాకిస్థాన్‌లోని 'కరాచి' వద్ద అరేబియా సముద్రంలో కలుస్తోంది. జమ్మూ-కాశ్మీర్‌లో ప్రధానంగా లడక్, బలిస్థాన్ ప్రాంతాల ద్వారా ప్రవహిస్తోంది. దీని ఉపనదులు సట్లెజ్, జీలం, చినాబ్, బియాస్, రావి. వీటిలో అతి పెద్ద ఉపనది సట్లెజ్.
- **గంగా:** ఇది భారతదేశంలో ప్రవహిస్తున్న నదుల్లో అత్యంత పొడవైంది. ఉత్తరాఖండ్ హిమాలయాల్లో గంగోత్రి హిమానీనదం వద్ద జన్మిస్తున్న అలకనంద, భగీరథ అనే రెండు పాయలు కొంత దూరం ప్రవహించి 'దేవ ప్రయాగ' వద్ద కలిసి 'గంగానది' ఏర్పడుతోంది. దీని మొత్తం పొడవు 2525 కి.మీ. దీని పరీవాహక ప్రాంతం సుమారు 8,61,404 చ.కి.మీ. విస్తరించి ఉంది.

ఈ నది భారతదేశంలో ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తూ బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించి బంగాళాఖాతంలో కలుస్తోంది. దీన్ని బంగ్లాదేశ్‌లో 'పద్మా నది' అని, బ్రహ్మపుత్రా నదితో కలిసిన తర్వాత 'మేఘన' అని పిలుస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో నిర్మించిన ఫరక్కా బ్యారేజీ ద్వారా దీని నీటిని హుగ్లీనదికి మళ్లిస్తున్నారు. దీని ప్రధాన ఉప నదులు- యమున, కోసీ, రామ్‌గంగా, గోమతి, బాగ్రా, గండక్, మహానందా, సోన్. దక్షిణ దిశ నుంచి వచ్చి గంగానదిలో కలిసే ఏకైక ఉపనది సోన్. మిగితావన్నీ హిమాలయాల నుంచి వచ్చి గంగానదిలో కలుస్తున్నాయి.

- **యమునా:** ఇది గంగానది ఉపనదులన్నింటిలో పెద్దది. ఇది 'యమునోత్రి' హిమానీనదం వద్ద పుట్టి 'అలహాబాద్' దగ్గర గంగానదితో కలుస్తుంది. చంబల్, బెట్వా, కెన్ దీని ఉపనదులు.
- **బ్రహ్మపుత్ర:** ఇది టిబెట్ హిమాలయాల్లోని 'మానస సరోవరం' తూర్పు వైపున జన్మిస్తోంది. టిబెట్, భారత్, బంగ్లాదేశ్ ద్వారా 2900 కి.మీ. దూరం ప్రయాణించి బంగాళాఖాతంలో కలుస్తోంది.

ఈ నది భారత్‌లో అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రవేశించిన వెంటనే 'షియాంగ్' అనే నదితో కలిసి కొంత దూరం ప్రయాణించి 'దిహంగ్' అనే ప్రదేశం వద్ద దిహంగ్, లోహిత నదులతో కలుస్తోంది. అసోంలో 'తీస్తా' ఉపనదిని కలుపుకొని బంగ్లాదేశ్‌లో ప్రవేశిస్తోంది.
చివరగా గంగానదితో కలిసి బంగాళాఖాతంలో కలుస్తోంది. ఈ నదిని వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలుస్తున్నారు. టిబెట్‌లో – సాంగ్‌పో లేదా త్సాంగ్‌పో అని పిలుస్తున్నారు. 'స్వచ్ఛమైన' అని దీని అర్థం. అరుణాచల్ ప్రదేశ్‌లో 'దిహంగ్' అని, బంగ్లాదేశ్‌లో 'జమునా' అని పిలుస్తున్నారు.

మగవారి పేరుతో పిలుస్తున్న భారతదేశ ఏకైక నది బ్రహ్మపుత్ర. దీని ఉపనదులు తీస్తా, షియాంగ్, దిహంగ్, లోహిత. గంగా, బ్రహ్మపుత్ర నదులు సముద్రంలో కలిసేచోట ప్రపంచంలో కెల్లా అతి పెద్దదైన 'సుందర్‌బన్ డెల్టా'ను ఏర్పరుస్తున్నాయి.

వర్షాధార నదీ వ్యవస్థ

వర్షాకాలం మాత్రమే నీటి ప్రవాహం కలిగి ఉండటం వల్ల వీటిని 'వర్షాధారిత నదులు' అంటారు. వీటినే 'ద్వీపకల్ప నదులు' అని కూడా అంటారు. వీటిని రెండు రకాలుగా విభజించవచ్చు.

పశ్చిమం వైపునకు ప్రవహిస్తున్న నదులు: సబర్మతి, నర్మదా, తపతి, మహి మొదలైనవి.

- **నర్మదానది:** ఇది పశ్చిమం దిశగా ప్రవహిస్తున్న నదుల్లో అతి పొడవైంది. ఇది మధ్యప్రదేశ్‌లోని 'అమర్‌కంటక్' ప్రాంతంలో పుట్టి వింధ్య, సాత్పుర పర్వత శ్రేణుల మధ్య 1312 కి.మీ. ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తోంది. భారతదేశంలో 'పగులు లోయ'లో ప్రవహిస్తున్న అతి పొడవైన నది నర్మద.

దీని ప్రధాన ఉపనదులు షార్, బర్హానర్, బుంజర్, షక్కర్, కోలర్, బుర్నా, హీరాన్. ఈ నది ప్రవాహ మార్గంలో రెండు ప్రధాన జలపాతాలున్నాయి. అవి: కపిల ధారా, ధూన్‌ధర్. దీని పరీవాహ ప్రాంతం అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో (87 శాతం), మిగి లింది మహారాష్ట్ర, గుజరాత్‌లో ఉంది.

- **తపతి:** ఇది పశ్చిమం దిశగా ప్రవహిస్తున్న వాటిలో రెండో అతిపెద్ద నది. ఇది మధ్యప్రదేశ్‌లోని 'బిటువల్' జిల్లాలోని 'ముల్తాయి' వద్ద పుట్టి 724 కి.మీ. పొడవున సాత్పురా – అజంతా పర్వత శ్రేణుల మధ్య ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తోంది. పూర్ణానది, గిర్ణా, బోరి, కీప్ర, సిప్రా, సుకీ, అమరావతి దీని ఉపనదులు.

తూర్పు వైపునకు ప్రవహిస్తున్న నదులు: వీటిలో ముఖ్యమైనవి గోదావరి, కృష్ణా, మహానది, కావేరి, పెన్నా.

ద్వీపకల్ప పీఠభూమి తూర్పువైపునకు వాలి ఉండటంతో దీనిలోని నదులు అధికభాగం తూర్పుదిశగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తున్నాయి.

- **గోదావరి:** భారతదేశంలో గంగానది తర్వాత రెండో అతిపెద్ద నది గోదావరి. ఇది దక్షిణ భారతదేశంలో అతిపెద్ద నది. దీన్ని 'దక్షిణ గంగా', 'దక్షిణ గంగోత్రి', 'వృద్ధ గంగా' అని కూడా అంటారు. ఈ నది మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల్లో 'నాసిక్ త్రయంబకం' వద్ద జన్మిస్తోంది. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ద్వారా సుమారు 1465 కి.మీ. ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. మంజీరా, మానేరు, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, సీలేరు, వార్ధా మొదలైనవి దీని ఉపనదులు. ఇది నిర్మల్ జిల్లాలోని 'బాసర' వద్ద తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది.
- **కృష్ణానది:** ఇది మహారాష్ట్రలో పశ్చిమ కనుమల్లోని 'మహాబలేశ్వరం' వద్ద పుట్టి మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రవహిస్తోంది. 1440 కి.మీ. ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. ఇది దక్షిణ భారతదేశంలో రెండో అతిపెద్దనది. ఈ నది నారాయణపేట జిల్లాలోని మక్తల్ మండలం 'తంగడి' వద్ద తెలంగాణ రాష్ట్రం లో ప్రవేశించి ఆంధ్రప్రదేశ్‌లోని హంసలదీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. తుంగభద్ర, కోయన, పాలేరు, దిండి, మూసీ, భీమా, మున్నేరు, ఘటప్రభ మొదలైనవి దీని ఉపనదులు.
- **కావేరి:** ఇది కర్ణాటకలోని 'కూర్గ్' జిల్లాలో 'బ్రహ్మగిరి' కొండల్లో జన్మించి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ద్వారా సుమారు 805 కి.మీ. పొడవున ప్రవహిస్తోంది. తమిళనాడులోని కావేరి పట్టణం ప్రాంతంలో బంగాళాఖాతంలో కలుస్తోంది. హేమావతి, లోకపావని, షింషా, అర్కావతి, లక్ష్మణ తీర్థ, భవాని మొదలైనవి దీని ఉపనదులు. ఇది తమిళనాడులో అతి ప్రధానమైన నది.
- **పెన్నా:** ఇది కర్ణాటకలోని మైసూరు వద్ద 'నంది దుర్గ' కొండల్లో పుట్టి అనంతపురం జిల్లా హిందూపురం వద్ద ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశిస్తోంది. నెల్లూరు జిల్లాలోని 'ఊటుకూరు' వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. జయమంగళి, చిత్రావతి, కుందేరు, పాపాఘ్ని, చెయ్యేరు, సగిలేరు దీని ఉపనదులు.
- **మహానది:** ఇది మధ్యప్రదేశ్‌లో పుట్టి ఒడిశా ద్వారా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. దీని పొడవు 857 కి.మీ. దీని ఉపనదులు- మండ్, షియోనాథ్, లేవ్, ఇబ్, హస్‌డియో..

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో అత్యంత పొడవైన నది ఏది?
   1) గంగా 2) నర్మదా
   3) కృష్ణా 4) గోదావరి
2. భారతదేశంలోకి బ్రహ్మపుత్ర నది మొదట ఎక్కడ ప్రవేశిస్తుంది?
   1) అరుణాచల్ ప్రదేశ్
   2) త్రిపుర 3) అస్సాం
   4) మేఘాలయ
3. దక్షిణ గంగా అని ఏ నదికి పేరు?
   1) కృష్ణా 2) గోదావరి
   3) తుంగభద్ర 4) పెన్నా
4. ఏ నదీ సమూహం టిబెట్‌లో ప్రారంభ మూలాన్ని కలిగి ఉంది?
   1) బ్రహ్మపుత్ర, గంగా, సట్లెజ్
   2) గంగా, సట్లెజ్, యమున
   3) చినాబ్, రావి, సట్లెజ్
   4) బ్రహ్మపుత్ర, ఇండస్, సట్లెజ్
5. సాత్పురా, వింధ్య శ్రేణుల మధ్య ప్రవహించే నది ఏది?
   1) నర్మద 2) గండక్
   3) తపతి 4) గోదావరి
6. బంగ్లాదేశ్‌లో గంగానదిని ఏమని పిలుస్తారు?
   1) సుభ్ర 2) భగీరథి
   3) రూప్ నారాయణ్
   4) పద్మ

సమాధానాలు

1) 1; 2) 1; 3) 2; 4) 4;
5) 1; 6) 4.

మాదిరి ప్రశ్నలు

1. కొంకణ్ తీరం ఏ రాష్ట్రంలో విస్తరించి ఉంది?
   1) కర్ణాటక 2) తమిళనాడు
   3) కేరళ 4) మహారాష్ట్ర
2. అత్యధిక సంఖ్యలో సరస్సులు, లాగూన్‌లను కలిగి ఉన్న తీర ప్రాంతం ఏది?
   1) కేరళ తీరం 2) తమిళనాడు తీరం
   3) ఒడిశా తీరం 4) గుజరాత్ తీరం
3. అష్టముడి సరస్సు ఏ రాష్ట్రంలో ఉంది?
   1) తమిళనాడు 2) కేరళ
   3) పశ్చిమ బెంగాల్ 4) మణిపూర్
4. శ్రీహరికోటలోని 'సతీష్‌ధావన్' రాకెట్ ప్రయోగ కేంద్రం ఏ సరస్సులో విస్తరించి ఉంది?
   1) చిలుకా సరస్సు 2) కొల్లేరు సరస్సు
   3) పులికాట్ సరస్సు
   4) వెంబనాడ్ సరస్సు
5. పగులులోయ ద్వారా ప్రవహిస్తున్న నది?
   1) గంగా 2) నర్మదా
   3) బ్రహ్మపుత్ర 4) గోదావరి
6. టిబెట్‌లో 'త్సాంగ్‌పో' అని ఏ నదిని పిలుస్తారు?
   1) సింధూ 2) బ్రహ్మపుత్ర
   3) గంగా 4) గండక్
7. గంగానది ఉపనదుల్లో ఉత్తరానికి ప్రవహించేది?
   1) కోసి 2) ఘాగ్ర
   3) సోన్ 4) గండక్
8. కిందివాటిలో పశ్చిమానికి ప్రవహించే నది?
   1) గోదావరి 2) చంబల్
   3) మహానది 4) నర్మదా
9. ఒడిశా రాష్ట్రంలో డెల్టాను ఏర్పరిచే నది?
   1) సువర్ణరేఖ 2) మహానది
   3) కావేరి 4) నర్మదా
10. బెంగాల్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
    1) కోసి 2) హుగ్లీ
    3) దామోదర్ నది 4) గంగానది
11. బీహార్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
    1) దామోదర్ 2) కోసి
    3) బ్రహ్మపుత్ర 4) వైతరణి
12. కృష్ణా – గోదావరి నదుల మధ్య విస్తరించిన సరస్సు ఏది?
    1) పులికాట్ 2) కొల్లేరు
    3) చిలుకా 4) అష్టముడి
13. గంగానది ఉపనదుల్లో కెల్లా అతిపెద్దది?
    1) చంబల్ 2) ఘాగ్ర
    3) కోసి 4) యమునా
14. కపిలధార జలపాతం ఏ నదిపై ఉంది?
    1) యమునా 2) నర్మదా
    3) గోదావరి 4) కావేరి
15. అలకనంద, భాగీరథిలు ఎక్కడ కలుస్తాయి?
    1) రుద్ర ప్రయాగ్ 2) దేవ ప్రయాగ్
    3) రిషికేష్ 4) ప్రయాగ్
16. నర్మదా నది ఎక్కువ భాగం ఏ రాష్ట్రం ద్వారా ప్రవహిస్తుంది?
    1) రాజస్థాన్ 2) గుజరాత్
    3) మధ్యప్రదేశ్ 4) మహారాష్ట్ర

సమాధానాలు

1) 4; 2) 1; 3) 2; 4) 3;
5) 2; 6) 2; 7) 3; 8) 4;
9) 2; 10) 3; 11) 2; 12) 2;
13) 4; 14) 2; 15) 2; 16) 3.

The scheme has fallen out due to..



BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. 1-10): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/phrase in each case and mark your answer.

Though most of us know him _____ (1) for his inventions, Thomas Alva Edison was first and _____ (2) a telegraph operator. Born humbly in Ohio, U.S.in 1847, he was the seventh _____ (3) last child of Samuel Ogden Edison. At the _____ (4) age of nineteen he moved to Kentucky, where he worked in night shifts. He was _____ (5) with a lead-acid battery when he spilled Sulfuric acid onto the floor it ran between the floorboards and onto his boss's desk below. The next morning Edison was ____ (6). He was ___ (7) about reading and experimenting. One of his mentors during those early years was a fellow telegrapher and inventor named Franklin Leonard Pope, who allowed the ____(8) youth to live and work in the basement of his home. The invention that first gained him notice was the phonograph in 1877. This ___ (9) was so unexpected by the public at large as to appear almost ___ (10).

1. (1) except (2) best (3) hardly (4) greatly (5) sometimes
2. (1) previous (2) only (3) foremost (4) above (5) lastly
3. (1) between (2) before (3) with (4) and (5) of
4. (1) elder (2) early (3) delicate (4) old (5) tough
5. (1) set (2) establish (3) working (4) shared (5) purchase
6. (1) fired (2) send (3) showed (4) followed (5) take
7. (1) fame (2) character (3) passionate (4) defeat (5) poor
8. (1) poverty (2) worry (3) problem (4) conflict (5) impoverished
9. (1) accomplishment (2) well (3) fine (4) leading (5) excellent
10. (1) partly (2) wisely (3) rarely (4) magical (5) almost

*Directions (Q. 11-20): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.*

The joy of discovery is a very real **incentive** to research, despite the rareness of its realization. It is on error to suppose that the scientist is unemotional, or could succeed if he were. The error has arisen through a misconception. The absolute necessity that a scientist's findings shall not be changed from **objective** truth in response to emotional urges of any kind does not result in his becoming a particularly unemotional person: whether a discoverer or anyone else is pleased with a discovery has no effect on its validity. 'I have been working like a madman at Drosera' wrote Darwin to Sir J.D. Hooker in reference to his study of insectivorous plants and a few days later, to the geologist, Lyell 'at the present moment I care more about Drosera that the origin of all the species in the world---- I am **frightened** and **astounded** at my results'. Kropotkin once wrote, 'There are not many joys in human life equal to the **joy** of the sudden birth of a generalization --He who has once in this life experienced this joy of scientific creation will never forget it.'

11. The author of the passage counters the misconception that a scientist is unemotional by pointing out that
    1) the objectivity of a scientist cannot make emotional compromises
    2) even such a great scientist as Darwin cared so much for Drosera
    3) he has capacity to react to emotional appeals made by others
    4) he considers scientific discovery equal to the joy of creation
    5) he has no capacity to react to emotional appeals made by others
12. In this passage the author tells us that scientific research leads one to
    1) rare discoveries
    2) success, sometimes
    3) sure success
    4) finding the objective truth
    5) funding rarity
13. Darwin's letter to Lyell reveals to us that he
    1) attached greater importance to his discovery of insectivorous pants than to his discovery of the origin of the species
    2) used to get deeply involved in whatever research, big or small, he had on hand at a given point of time
    3) was rather uncertain about his success in his research on insectivorous plants
    4) was worried that insectivorous plants would destroy all species of insects
    5) was sure of success
14. The findings of scientific researchers
    1) are universally welcome
    2) result in robbing the researcher of all emotions
    3) are objective in nature
    4) have universal validity
    5) no relation to present
15. Kropotkin says about the unforgettable experience
    1) joy of scientific creation
    2) remember the experience
    3) sorrows of human life
    4) generalized observations
    5) astounding facts

*Directions (Q. 16-18): Choose the word which is MOST SIMILAR in meaning to the word printed in **bold** as used in the passage.*

16. **ASTOUNDED**
    1) amazed 2) scared
    3) rescued 4) worked
    5) furnished
17. **JOY**
    1) ecstasy 2) wander
    3) murmur 4) jump 5) leap
18. **INCENTIVE**
    1) enticement 2) enjoyment
    3) overwhelm 4) spurious
    5) engulf

*Directions (Q. 19-20): Choose the word which is MOST OPPOSITE in meaning to the word printed in **bold** as used in the passage.*

19. **OBJECTIVE**
    1) purpose 2) subjective
    3) change 4) bonus
    5) increment
20. **FRIGHTENED**
    1) ghastly 2) beastly
    3) horrified 4) courageous
    5) happy

Directions (Q. 21-25): Each question below has two blanks, each blank indicating that something has been omitted. Choose the set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

21. Scientists fear that many birds ----- heading towards a unisex existence that would ----- to extinction.
    1) is… make 2) are.. making
    3) is… moving 4) are…lead
    5) were…leading
22. Using ------ from government survey, he found ------ support for his line of reasoning.
    1) data… strong 2) date…much
    3) doubt…many
    4) dates…very 5) date…meek
23. Science consists of ------, Art consists of ------.
    1) naming…pleading
    2) knowing…doing
    3) doing… pleasing
    4) creation…erosion
    5) evolution…inspection
24. Technology is important but what is of great ---------- is the capturing of tacit knowledge.
    1) important 2) import
    3) improvement 4) importance
    5) importantly
25. The ------ of the hour is to evolve measures to tackle the issue.
    1) time 2) moment 3) need
    4) pride 5) speed

Directions (Q. 26-30): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

26. There is a misconception (1)/that freedom means(2)/to be doing (3)/your own thing.(4)/No error (5)
27. Shakespeare was (1)/ better than any poet(2)/of his days (3)/ according to critics. (4)/ No error (5)
28. I ordered for a cup of tea (1)/ but the bearer (2)/brought it only (3)/ at the end of the tea-session. (4)/ No error (5)
29. Lack of honesty(1)/ is sometimes labeled as(2)/tact public relations (3)/or politics. (4)/ No error (5)
30. in the aftermath of the September 11th (1)/ the American president's speech was (2)/ broadcasted and televised (3)/ all over the world. (4)/ No error (5)

Directions (Q. 31-35): Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase printed in bold in the sentence to make it grammatically correct? If the sentence is correct as it is given and no correction is required, mark (5) as the answer.

31. The minister **hit out** at his critics and categorically denied his involvement in the scam.
    1) hit up 2) hit back
    3) hit upon 4) hit around
    5) no correction
32. He can **strike out** a friendship even with complete strangers.
    1) strike up 2) strike at
    3) strike on 4) strike back
    5) no correction
33. I prefer listening to soft music to help me **wind over** after a stressful day.
    1) wind up 2) wind down
    3) wind off 4) wind of
    5) no correction
34. The scheme has **fallen out** due to paucity of funds.
    1) fallen through 2) fallen over
    3) fallen apart 4) fallen back
    5) no correction
35. Over the years several extremists **laid up** their arms and joined the mainstream.
    1) laid out 2) laid upon
    3) laid by 4) laid down
    5) no correction

KEY

1) 2; 2) 3; 3) 4; 4) 3; 5) 3;
6) 1; 7) 3; 8) 5; 9) 1; 10) 4;
11) 1; 12) 4; 13) 1; 14) 3; 15) 1;
16) 1; 17) 1; 18) 1; 19) 2; 20) 4;
21) 4; 22) 1; 23) 2; 24) 4; 25) 3;
26) 3; 27) 2; 28) 1; 29) 2; 30) 3;
31) 2; 32) 1; 33) 2; 34) 1; 35) 4.